నవంబరు 2010

రూ. 10/-

విపుల

విశ్వకథా వేదిక



✦ కథకుల ఫైల్ లో వేలూరివారి గన్నేరు.. 10

✦ టాల్‌స్టాయ్ కథ అన్నాచెల్లెళ్ళు.. 30

పెద్దలు చదవాల్సిన

లైఫ్

దాదాపు ముప్పయ్యేళ్లకు పైగా కమిషనర్‌గా పనిచేసిన పరంధామయ్య పదిరోజుల క్రితమే రిటైరయ్యాడు. రిటైరయిన తర్వాత అతనికి కాలం స్తంభించింది. పైగా.. భార్య పార్వతి మౌనం అతనికి మింగుడు పడడంలేదు.

“ఏమోయ్! ఎప్పుడూ నీపని నీదేనా..? కాసేపలా కబుర్లాడుకో వచ్చుగా..! బోరుగా ఉంది!”

“ఇది.. మరీ బావుంది. దాదాపు ముప్పయ్యేళ్లు.. ఇప్పుడు మీరెలాగో నేనూ అలాగే గడిపాను. మీ బిజీ షెడ్యూల్‌లో కనీసం కాసేపన్నా నాకు చోటేలేదు. కొత్తగా ఈరోజు నాకు కబుర్లేముంటాయి? ” గట్టిగా కాకపోయినా తీక్షణంగానే ఉన్నాయి ఆమె మాటలు.



పరంధామయ్య గుండెల్లో అలజడి. నిజమే.. ఇన్నేళ్ల తన నిర్లక్ష్యం ఆమెకు అలాంటి భావాన్నే మిగిల్చింది. ఆయనలో భావపరంపర.. ‘ఇక నాకంటూ ఉండే ప్రతీక్షణం ఆమెదే..’ గట్టిగా ఊపిరి పీల్చుకుని అనుకున్నాడు పరంధామయ్య.

‘అరె నేనేనా ఆయనతో అలా మాట్లాడింది..? పనిపట్ల ఆయన కున్న అంకితభావమేగా ఆయనకూ, కుటుంబానికీ ఇంత సంతృప్తినిచ్చింది. గతం అనవసరం. ఇపుడిక ఆయనకంతా తీరికేగా? నా క్షణాలన్నీ ఇక ఆయన క్షణాలే!’ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది పార్వతి.

నిజంగా.. జీవితం.. ఎంత మధురం!!

– పద్మినీ ప్రియదర్శిని,
గుంటూరు

ఆనాటి రాత్రి

ఓ సాహితీమిత్రుడి వివాహానికి పర్లాకిమిడి బయలుదేరాను. మరునాడు తెల్లవారుఝామున పెళ్లి. రాత్రి ఎనిమిది గంటలకు విశాఖపట్నంలో బస్సు బయలుదేరింది. పాతపట్నం దాటిన తరువాత పెద్ద కుదుపుతో బస్సు ఆగింది. నిద్రలో జోగుతున్న వాళ్లంతా ఒక్కసారిగా వులిక్కిపడి లేచారు. డ్రైవరు, కండక్టరు అప్పటికే బస్సు దిగిపోయారు. టైర్ పంచరయిందని ఎవరో అంటున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. బస్సులోని జనంతో బాటు నేనూ బస్సు దిగి పచార్లు మొదలుపెట్టాను. పాడ్యమినాటి చంద్రుడు అప్పుడప్పుడూ మబ్బుల చాటు నుంచి తొంగి చూస్తున్నాడు. కాస్త దూరం నుంచి వేణుగానం వంటి సుమధురగానం వినిపిస్తోంది. సంగీతంపట్ల నాకున్న ఆసక్తితో ఆ వైపుగా నడిచాను. దబ్బపండువంటి శరీరఛాయతో తెల్లని పంచె-లాల్చీతో రోడ్డు పక్కనున్న కల్వర్టు గోడపై కూర్చుని ఆయన చిన్నగా పాడుకుంటున్నాడు. ఆయన మధుర గానం విని పులకించిపోయాను. నన్ను నేను పరిచయం చేసుకుని పక్కన కూర్చున్నాను. కరుణశ్రీ పుష్పవిలాపంతో పాటు ఎన్నో మంచి పాటలు కోరి పాడించుకున్నాను. ఆకాశవాణిలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌ని గనుక ఆయనకు తప్పకుండా ఆకాశవాణిలో పాడే అవకాశం ఇస్తానని ప్రామిస్ చేశాను. ఓ గంట తరువాత బస్సు బయలుదేరే సూచనగా డ్రైవర్ హారన్ మోగిస్తున్నాడు. ఆయన దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాను.



నేను తిరిగి విశాఖపట్నం చేరుకున్న వారంరోజులకు ఆయన చిరునామాకు ఉత్తరం రాశాను. నా ఉత్తరం అందిన మూడోరోజునే వాళ్లబ్బాయి నుంచి ఉత్తరం వచ్చింది. ‘మా నాన్నగారి పేరున అలాంటి ఉత్తరం రాశారేమిటి? మీరు తెలిసే రాశారా? తెలియక రాశారా? ఆయనపోయి అప్పుడే ఆరునెలలు కావస్తోంది’

– అంగర కృష్ణారావు,
విశాఖపట్నం

కార్డు కథలు

దొండూ దొండే

బజారు చేసి అలసిపోయి వచ్చిన ఏకాంబరం చేతిలోని సంచిని భార్య కాంతానికి అందిస్తూ "చూడు కాంతం! నువ్వు తెమ్మన్న సామాన్లన్నీ తెచ్చాను, షేవింగ్‌సెట్ మాత్రం దొరకలేదు" అన్నాడు.

"షేవింగ్‌సెట్ ఎక్కడ చెప్పాను? సేమియాలు తెమ్మంటే.. మీ మతిమరుపుతో మిగిలిన సామాన్లు కూడా అలాగే తెచ్చివుంటారు" అని సంచి అందుకుని ఆత్రుతగా చూసింది.



"మీకు ఏది చెప్పినా ఇంతే! మీ మతిమరుపుతో నన్ను కాల్చుకుతింటున్నారు. అల్లం తెమ్మని చెబితే బెల్లం తెచ్చారు. ఉప్పు తెమ్మంటే పప్పు తెచ్చారు. పచ్చడికని కొబ్బరికాయ తెమ్మంటే కొబ్బరినూనె తెచ్చారు. మావాళ్లు ఈ మతిమరుపు మేళానికి కట్టబెట్టి నా గొంతు కోశారు. పైసో, పరకో పొదుపు చేద్దామన్నా మీ మతిమరుపుతో దుబారా అవుతోంది" అని ఒంటికాలిపై లేచింది.

ఇంతలో ధడేల్.. ధడేల్‌మని శబ్దం రావడంతో.. శబ్దం వచ్చిన వంట గదివైపు పరిగెత్తాడు ఏకాంబరం.

"ఏమండీ! ఏమైంది? " అని అడిగింది కాంతం.

"ఏమవుతుంది? ఎప్పుడూ ఎదుటివారిని ఆడిపోసుకోవడమే కానీ, నీ మతిమరుపు గురించి ఆలోచించవు. నేను బజారుకు బయలుదేరినప్పుడు పెట్టిన కుక్కర్ ఇంతవరకు ఆపకపోతే ఊరుకుంటుందా? అది పేలిన శబ్దమే అది. నీ మతిమరుపుతో బంగారంలాంటి కుక్కర్‌ను పాడుచేశావు. టీవీ చూడటం, కూరగాయలవాళ్లతో బేరమాడటంలో అసలు విషయం మర్చిపోతావు. నీతో వేగలేకపోతున్నాను" అని విరుచుకుపడ్డాడు వచ్చిన అవకాశం జారవిడుచుకోకూడదని..

–చప్ప నాగేశ్వరరావు, పాములవలస

అంకెల నడుమ

బట్టలు మార్చుకోబోతూ పాంటుజేబులో చెయ్యిపెడితే అయిదొందల రూపాయల నోటు తగిలింది. తీసి టేబుల్ మీద పెట్టి, పడగ్గదిలోకి వెళ్లి కొత్త పాంటు, షర్టు వేసుకుని హాల్లోకి వచ్చేసరికి టేబుల్ మీద పెట్టిన



నోటు కనబడలేదు.

అప్పుడే సోఫాకవర్లు మారుస్తున్న పనికుర్రాణ్ణి పిలిచి "టేబుల్ మీద అయిదొందల నోటు పెట్టాను చూశావా?" అనడిగేను.

"చూసేనన్సార్! గాలికెగిరి కిందపడితే తీసి ఆ పుస్తకం మధ్యలో పెట్టాను" అంటూ టేబుల్ మీదున్న పుస్తకం కేసి చూపించాడు.

"ఏ పేజీల మధ్య పెట్టావో గుర్తుందా?"

"ఉంది సార్. 153-154 పేజీల మధ్య" అన్నాడు.

"అబద్ధం. తియ్ నోటుని" అని గద్దించేసరికి చొక్కా చేతి మడతల్లో దాచిపెట్టిన నోటు బైటకి తీశాడు.

"పుస్తకం తెరిచి చూడకుండానే ఎలా కనిపెట్టారండీ వాడే తీశాడని?" అడిగింది నా భార్య ఆశ్చర్యంగా.

"సింపుల్! ఏ పుస్తకంలో అయినా సరే, బేసి సంఖ్యల మధ్య పెట్టగలమే గాని, బేసి-సరి సంఖ్యల పేజీ నడుమ ఏదీ పెట్టడం సాధ్యపడదు" అని సోదాహరణంగా వివరించాను.

–జి.చిరంజీవి, చెన్నై

సున్నా విలువ

సూపర్‌వైజర్ రహీం అందరిలాంటి ఇంజనీర్ కాదు. ఏ పని చేసినా ఏదో ఓ తప్పు అనాలోచితంగా చేయడం, చేసిన ప్రతిసారీ దొరికిపోవడం, దొరికిపోయిన ప్రతిసారీ అదేమంత పెద్ద తప్పు కాదంటూ వితండవాదం చేయడం అతని స్వభావం. ఓమారు కడపలో కొత్తగా నిర్మిస్తున్న భవనం తాలూకు పార్ట్ బిల్లు తయారుచేసి, ఎం.బుక్కు జతచేసి, ఇ.ఇ.కి పంపాడు. బిల్లు అందుకున్న మూడోరోజు రహీంని ఉన్నపళంగా పిల్చుకురమ్మని కబురుపెట్టాడు ఇ.ఇ. అటెండర్ ద్వారా.



ఇ.ఇ.గదిలోకి ప్రవేశించి మంద్ర స్వరంతో “గుడ్‌మార్నింగ్ సర్!” అన్నాడు, రహీం. తలెత్తి రహీం ముఖంలోకి చూశాడు ఇ.ఇ.

“గాడిద గుడ్డు మార్నింగ్ కాదూ! ఏ యూనివర్శిటీ నీకు డిప్లొమా ఇచ్చింది? మా యు.డి.సి. యుగంధర్ చాకులాంటి వాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే నువ్వు నేనూ.. ఇద్దరం- ఇళ్లకి వెళ్లేవాళ్లం! టోటలింగ్‌లో ఎంత పెద్ద తప్పు కమిట్ చేశావ్? ”

“ఏమయింది సార్? ” ఇ.ఇ. చెబుతున్నదేమిటో అర్థంగాక వెనక్కి జరిగాడు రహీం.

“ఇటు చూడు! రూఫ్ శ్లాబు నిమిత్తం కట్టిన ఇనుప ఊచలు పొడవు నాలుగు లక్షల అడుగులుగా రికార్డు చేశావ్. టోటల్ తప్పుపడింది. అసలు పొడవు నలభైవేల అడుగులే! రావల్సినదానికన్నా కాంట్రాక్టరికి ఇరవై లక్షల రూపాయలు అధికంగా వచ్చేటట్టు పథకం వేశావ్!” ఎం.బుక్కుని రహీంకేసి విసురుతూ, కోపంగా అన్నాడు ఇ.ఇ.

ఎం.బుక్కు తెరిచి అందులో తను రికార్డు చేసిన ఇనుప ఊచల కొలతలు, కూడికలు మరోమారు క్యాలిక్యులేటర్ సాయంతో చెక్ చేసుకున్న రహీం “నిజమే సార్! పొరపాటున నలభైవేల అడుగులు ఉండవల్సింది, నాలుగు లక్షల అడుగులుగా రికార్డ్ చేశాను. ఒక్క సున్నే కద్సార్ ఎక్కువ పడింది” అదేమంత తప్పు కాదన్నట్లు తప్పించుకోజూశాడు రహీం.

“ఆ సున్నా పుణ్యమే నువ్వీనాడు నా ముందు నుంచున్నావ్. నీకు జస్ట్ 5 మార్కులొచ్చి వుంటాయ్ పరీక్షలో. దానిపక్క సున్నా చేర్చి, 50 మార్కులుగా మార్చి నువ్వు పాస్ అయ్యేటట్టు చేసివుంటాడు, ఎవరో దయగల ప్రొఫెసర్. చెంపలేసుకొని తప్పు ఒప్పుకోకుండా, వాదిస్తున్నావా? గెట్ లాస్ట్” ఇ.ఇ. బ్లాస్ట్ చేసి వదిలేశాడు రహీంని.

– ఎం.సి.ఆంజనేయులు,
హైదరాబాద్

రుద్రభూమి

ఆ ఊళ్లో పంచభూతాలను, పంచభక్ష్యాలను సరిసమానంగా పంచుకుంటూ హాయిగా జీవిస్తున్నారందరూ. కొంత కాలం తర్వాత పల్లెకి 'పడమటి' వైపున్న పట్నంనుండి వచ్చాడో మోతుబరి. వస్తూనే



తన వెలుగు, జిలుగుల ఆహార్యంతో, డాబూ దర్పం ఒలకబోస్తూ అందర్నీ ఆకర్షించాడు. ఊరికి మధ్యలో పెద్దగోతిని తవ్వనారంభించాడు.

ఎందుకని అడిగిన వారితో 'తవ్వుకుంటూ పోతే అవనికావల మరో ఆకాశముందనీ, దాన్నందుకోడానిక'నీ చెప్పేవాడు.

క్రమేపి ఊళ్లో అతన్ని చూసి కొందరు, కొందర్ని చూసి ఇంకొందరు నేలని తవ్వడం మొదలుపెట్టారు. గోతులు.. గోతులు.. ఊరంతా గోతులు.

క్రమంగా గోతుల లోతుకి అనులోమానుపాతంగా వారిమధ్య దూరం పెరగసాగింది. చీకటి ముసురుకోసాగింది. గాలాడక ఊపిరి ఆగిపోసాగింది. అయినా తవ్వకాలు ఆగడం లేదు. అగుపించే ఆకాశానికి దూరంగా.. అందని ఆకాశంవైపుకి. కొందరికి తప్పు చేస్తున్నామన్పించినా తిరిగి రాలేక ఆ గోతుల్లోనే అలా తవ్వుతూనే తనువులు చాలిస్తున్నారు.

అందరికీ భిన్నంగా ఒకడు కేవలం 'ఆరడుగుల' నేలని మాత్రమే తవ్వుకుని అందులోనే జీవించసాగాడు.. పంచభూతాలకు చేరువగా..

– మల్లారెడ్డి మురళీ మోహన్,

అంబాలా, హర్యానా

నేటి మహిళ

అప్పుడే ఆఫీసు నుండి రూమ్‌కి వచ్చాడు వివేక్. వచ్చీరావడంతోనే సిగరెట్ వెలిగించాడు. ఇంతలో కుంభవృష్టి మొదలైంది. తలుపు కొట్టిన సవ్వడికి లేచి వెళ్లి తలుపు తెరిచాడు.



ఎదురుగా అప్సరస!

"ఎక్స్‌క్యూజ్ మి సర్! యూనివర్సిటీకి వెళుతుంటే వర్షం పట్టుకుంది. మీ రూమ్‌లో ఆశ్రయమిస్తే, వాన తగ్గిన తర్వాత వెళ్లిపోతాను ప్లీజ్!" అంది.

"వై నాట్! లోనికి రండి!" అన్నాడు వివేక్ కళ్లతోనే ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ.

"మీరు ఏం చేస్తూంటారు? మీ క్వాలిఫికేషన్ ఏమిటి? " అంది రూం కలియచూస్తూ.

"నాపేరు వివేక్! నేను ఇంటర్మీడియట్ చదివాను. క్లర్కుగా ఉద్యోగం చేస్తున్నాను" అన్నాడు వివేక్.

"నా పేరు జాస్మిన్. ఎమ్.బి.ఏ. చేస్తున్నాను" అంటూ పరిచయం చేసుకుంది జాస్మిన్.

ఇంతలో వర్షం తగ్గి, ఆమె వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన పదినిముషాలకు సెల్ రింగయింది. రిసీవ్ చేసుకున్నాడు వివేక్.

"హలో! వివేక్‌గారూ! నేను దీపికను. మీరు రేపు పెళ్లిచూపులకు రానక్కరలేదు. మీ సంబంధం కాన్సిల్ చేసుకుంటున్నాను. ఇంటర్ చదివి పి.జి. అని చెప్పారు. క్లర్కు ఉద్యోగం చేస్తూ ఆఫీసరని చెప్పారు. స్మోకింగ్, డ్రింకింగ్‌కు బానిస. మీ రూంలో ఆ ఛాయలు కన్పించాయి. జాస్మిన్ పేరుతో మీ రూంకి వచ్చాను. అసలు రంగు తెలిసింది. గుడ్‌బై! ఎందుకంటే నేను నేటి మహిళను" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది దీపిక.

అవాక్కయ్యాడు వివేక్.

–**జి. మేరీ కృపాబాయి,** మచిలీపట్నం

ఈ తృప్తి చాలు

ఆఫీసులో ఆయా రాజమ్మను చూస్తే తేడాగా వుండి అడగకుండా వుండలేకపోయాను.

"ఏం చెప్పనమ్మా! మా వాడికి మంచి ర్యాంకుతో ఇంజనీరింగు సీటు వచ్చింది. కడుపు కట్టుకొని పైసాపైసా కూడబెట్టాను. ఫ్రీ సీటు కానీ మా ఆయన ఒప్పుకోటం లేదు. వాళ్ళ ఆఫీసులో ప్యూనుగా చేరమంటున్నారు. నా సంపాదనంతా దాచి ఆయనకే యిచ్చాను. ఏం చేయాలో తోచక చివరకు పి.ఎఫ్.లోను తీసుకొని వాడ్ని అన్నయ్య దగ్గరకు పంపాను. ఆయన రాత్రి నానా గొడవచేసి, చిత్రహింసపెట్టాడు. అయితే అయింది. వాడికోసం ఎంత బాధయినా భరిస్తాను. ఆ తృప్తి చాలు"



'హుఁ! నేనూ వున్నాను.. ఎందుకు? ఆడబిడ్డ అనుకోకుండా ఇల్లుకొనటం, కొడుకు అమెరికా వెళ్లటం, కూతురికి మంచి సంబంధం కుదరటం.. అన్నీ నాలుగు నెలల్లో జరిగి ఆమె ఆర్థిక ఇబ్బందుల్లో వుందని తెలిసింది. పొలం అమ్మిన డబ్బుంది కదా సాయం చేద్దామ'ంటే ఆయన ఎగిరిపడ్డారు. 'చేయవలసిన దాని కన్నా ఎక్కువే చేశాను. ఒక్క పైసా కూడా ఇవ్వను. అయినా పెద్ద సంబంధం కోసం ఎగబడక తగినది చూసుకోవాలి' అంటూ కామెంట్.

ఆయన అనుమతి లేందే ఏమీ చేయలేను. నిన్నటి నుండి బుర్ర బద్దలవుతుంటే ఇప్పుడు కాస్త ధైర్యం వచ్చింది. వెంటనే పి.ఎఫ్. అప్లికేషను కోసం పెన్ను, పేపరు తీశాను. గొడవపడితే ఒక నెల.. ఒక సంవత్సరం.. అంతేగా.. ఈ తృప్తి చాలు.

– పి.శారద
గగన్‌మహల్ కాలనీ, హైదరాబాద్

ఇచ్చి పుచ్చుకోవడం!

ఆఫీసు నుంచి తిరిగొచ్చిన శ్రీకాంత్ దుస్తులు మార్చుకుంటుండగా తను తొడుక్కున్న బనియను చాలాచోట్ల చిరిగిపోయి కనిపించింది. పిసినారితనంతో ఇంతకాలం నెట్టుకొచ్చాడు. ఇప్పుడు కొత్తబనియను కొనాలని నిశ్చయానికొచ్చాడు.



క్లాక్-టవర్ దగ్గరున్న కొట్టుకెళ్ళి ఇరవై రూపాయల్లో చౌకబారు బనియను కొన్నాడు. దారి లో చూడాలనిపించి, బనియన్ను కవర్లోంచి తీశాడు. అందులో రెండు కనిపించాయి. షాపువాడు పొరపాటున రెండు బనియన్లు పెట్టేశాడు. శ్రీకాంత్ దీర్ఘాలోచనలో పడ్డాడు. మనసు సంబరపడింది- నయమే, ఒకటికి రెండొచ్చాయి. అంతరాత్మ మాత్రం హెచ్చ రించింది 'ఈ జన్మలో ఒకవేళ దుకాణదారుని ఇరవై రూపాయలు ముంచితే, వచ్చే జన్మలో అతని రుణం తీర్చుకోవడానికి ఏం పాట్లు పడాల్సివస్తుందో? ఏదోరూపంగా బదులు తీర్చాల్సిందే' అని..

ఆ భయం కలగ్గానే శ్రీకాంత్ పొరపాటున వచ్చిన రెండో బనియను తిరిగిచ్చేయాలని వెనుదిరిగాడు. అయితే, కొంచెం దూరం వెళ్లగానే, శ్రీకాంత్ మనసులో మరో ఆలోచన కలిగింది.

'బహుశా ఆ దుకాణుదారే గత జన్మలో నా దగ్గర ఇరవై రూపాయలు ఎలాగో కొట్టేసి ఉంటాడు. ఆ లెక్క సరిపోవడానికి దేవుడు ఇప్పుడు వాడితో ఈ పొరపాటు చేయించినట్టుంది. ఇది పూర్వజన్మ రుణమే కావచ్చు. ఇప్పుడు తీరుంటుంది. ఇందులో ఆందోళన చెందాల్సిన..'

ఆ తలంపు మనసులో మెదలగానే నిశ్చింతగా ఇంటికి తిరుగుముఖం పట్టాడు.

– *కృష్ణశర్మ(డోగ్రీకథ) ఖూషాలూ (అనువాదం)*

ఎంత మారిపోయాడో!

అతనో పదవీ విరమణ చేసిన ఉద్యోగి, ఉద్యోగ కుటుంబ ధర్మాల్ని అరమరికలు లేకుండా చేసిన పెద్దమనిషి. కానీ నేడు మనో



వేదనకు గురై మంచాన పడ్డాడు. రెండు పూటలా కాసిన్ని మెతుకులు తప్ప తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కూడా పెట్టని కన్నకొడుకుని నిందించలేక, నిందించకుండా ఉండలేక మథనపడసాగాడు.

'పెళ్ళాం వచ్చిన తర్వాత ఎంత మారిపోయాడో, ఇలాంటి కొడుకునా నేను కన్నది' అనుకుంటూ.. కంటతడిని పంటిబిగిన దాచేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. కానీ ఎంత కాలమనీ దాచుకోగలడు? ఒకరోజు కన్నీళ్ల పర్యంతం కాక తప్పలేదు. ఎందకంటే అతనికి ఆ రోజే తెలిసింది. తాను షుగర్ వ్యాధిగ్రస్తుడనని.. వైద్యుని సలహాతో కొడుకు తన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడని..

–యం.యస్.రాజు,

రామకృష్ణాపురం, విజయవాడ

విన్యాసాలు

"మా తాత పంచాయితీ మెంబరు నుంచి ప్రెసిడెంటు దాకా ఎదిగాడు! మరి నాన్న ఊరి ప్రెసిడెంటు నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్‌దాకా ఎదిగాడు! నేను ఎమ్మెల్యే నుంచి మినిస్టరు.. ఇంకా ఇంకా ఎదిగి తీరుతాను! ఆ అధికారం మా రక్తంలో, మా వశంలో వుంది!" అంటూ ఎన్నికల ప్రచారంలో తొడ గొట్టి, మీసం మెలేసి మరీ చెప్పాడు యువకిషోరం! అధికారం తన తాత సొత్తయిన మనుమడు.



"మళ్లా తొడగొట్టు!"

"మళ్లా మీసం తిప్పు"... అంటూ చుట్టూచేరే తైనాతీగాళ్లంతా మురిసిపోతున్నారు.

★ ★ ★

"మా తాత గ్లాసు సారాకి, పదినోటుకి.. ఓటేశాడు! మరి మా నాన్న నిబ్బు బ్రాందీకి, యాభై నోటుకి.. ఓటేశాడు! నేను ఆఫ్ బాటిల్‌కి, వందనోటుకి.. లేదు! లేదు!! ఇంకా.. ఇంకా.. ఎదిగిపోతాను. ఓటు విలువ పెంచేత్తాను. మందు ప్రమాణకంగా ఓటేయ్యడం మా వంశంలోనే వుంది! మా రక్తం నిండా వుంది!" అంటూ బారు బల్ల మీద నిలబడి ఓ చేత్తో బాటిలు ఎత్తి తొడగొట్టి మరీ చెప్పాడు.. మందు వారసత్వం పుణికి పుచ్చుకున్న దేవదాసు.

చుట్టూ వున్న 'మందుభాగ్యు'లంతా ఆనందంగా మళ్లీ మళ్లీ తొడగొట్టించుకుని కిక్‌లో మునిగిపోతున్నారు.

ఏలుబడి రక్తం! పాలుబడీ రక్తం!! ఇదే గత అరవై ఏళ్లుగా కొనసాగుతున్న రాజకీయ విన్యాసం!

– వి.వి.సుబ్బరాజు, కోలంక, యానాం

కార్డు కథలు

మెట్లు

"మీ ఇంట్లో మీకిష్టమైన చోటు? " విలేఖరి అడిగాడు రాజుని. ప్రముఖ వ్యాపారవేత్త అతను.

"సొంతిల్లు" అన్న ఫీచర్ కోసం చేస్తున్న ఇంటర్వ్యూ అది.

"మెట్లు"

రాజు సమాధానం విచిత్రంగా అనిపించింది విలేఖరికి.. "ఎందుకని..? " కొర్రీ సంధించాడు.



"జీవితంలో ఒక్కో మెట్టూ ఎక్కి పైకి వచ్చినవాణ్ణి. మెట్లు ఎక్కుతున్నప్పుడు, అదంతా మనసులో మెదిలి, ఎంతో తృప్తిగా ఆనందంగా వుంటుంది" అన్నాడు రాజు.

"మరి, భయపడే చోటు? " ఇంటిని అంతా ఓసారి పరికిస్తూ అడిగాడు విలేఖరి.

"మెట్లే"

ఉలిక్కిపడ్డాడు విలేఖరి. "అదేంటి సార్! ఇందాక మెట్లే ఇష్టమైన చోటన్నారు. ఇప్పుడు? .."

"నేనేం జోక్ చెయ్యడం లేదు. మెట్లు ఎక్కడానికే కాదు, దిగడానికీ వాడతాం. ఇప్పుడున్న స్థితి నుండి ఎక్కడ దిగజారిపోతానోనన్న భయం, ఆ మెట్లు దిగుతున్నప్పుడు మనసులో మెదిలి, దిగులేస్తూ వుంటుంది, అపుడపుడు.."

అదీసంగతి. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా, మెట్ల మీంచి జారిపడ్డం సహజం కదా! వెలుగు వెంటే నీడ! దేన్ని మాత్రం విస్మరించగలం జీవితంలో..

–ఎస్. హనుమంతరావు

రామంతాపూర్, హైదరాబాద్

కార్డు కథలు

ముందుచూపు

మా అపార్ట్‌మెంట్‌లో పనిమనుషులందరూ పెరిగిన ధరలకి అనుగుణంగా ఇంటిని బట్టి ఏభై, వంద జీతం పెంచాలని అల్టిమేటం ఇచ్చారు. పెంచకపోతే మానేస్తాం అని మూకుమ్మడిగా చెప్పేశారు. ధరల పెరుగుదలతో మాలాంటివారమే తల్లకిందులవుతున్నప్పుడు వాళ్ల కోరిక కాదన లేక సరే అన్నారు.



మా పనిమనిషి మాత్రం పాపం ఏం అడగనేలేదు. ఆశ్చర్యంగా నేనే అడిగా.

"అమ్మా! నాకేం జీతం పెంచొద్దు. రోజూ వెళ్లేటప్పుడు ఓ దోసెడు బియ్యం ఇవ్వండి చాలు" అంది.

ఇదేం కోరిక "ముష్టి దోసెడు బియ్యంతో ఏం చేస్తావు? " అన్నా ఆశ్చర్యంగా

"నాలుగిళ్లలో నాలుగు దోసెళ్లు.. నా ముగ్గురు పిల్లలకి ఇంత గంజన్నా తాగడానికి సరిపోతాయమ్మా! మీరు డబ్బిచ్చినా నా తాగుబోతు మొగుడు ఉంచడు. తన్ని లాక్కుపోతాడు. పస్తులుండకుండా గంజినీళ్లన్నా తాగుతాం" అంది.

మొదట ఆమె తెలివితక్కువతనానికి జాలి అనిపించినా ఆలోచిస్తే.. రోజుకి దోసెడు, ముప్పైరోజులకి ముప్పైదోసెళ్ల చొప్పున రెండు కేజీల బియ్యం అవుతాయి. కనీసం అరవై రూపాయల ధర ఉంటుంది. నాలుగిళ్లకి నాలుగు అరవైరూపాయిలు పెరిగినట్లే. ఢోకా లేకుండా గంజి తాగొచ్చు రోజూ.. మెచ్చుకోలుగాచూశా ఆమె ముందు చూపుకి..

–డి.కామేశ్వరి.

హిమాయత్‌నగర్, హైదరాబాద్

కథకాని కార్డు కథ

1935లో జరిగిన ఉదంతం. సుబ్బారావు, శివరావు ప్రాణస్నేహితులు, లోభత్వానికి ప్రతీకలు. ఎప్పుడైనా కలుసుకుంటే విరామం లేకుండా కబుర్లు. కానీ వచ్చిన ఇబ్బంది ఏమిటంటే.. సుబ్బారావుది నెల్లూరు, శివరావుది పొదిలి. ఇట్టే పోయి, అట్టే వచ్చే దూరం కాదు, అరవై మైళ్లు.



ఆ దూరాన్ని జయించగల ఆయుధం అప్పట్లో కానీ ధర ఉన్న పోస్టుకార్డు. సుబ్బారావు శివరావుకు కార్డులో ఒకవైపే ఇరికించి.. ఇరికించి బోలెడు సంగతులు రాసే వాడు.


ఆ కార్డు పొదిలి చేరుకున్నాక, శివరావు వెనుక వైపు ఖాళీజాగాలో జవాబు రాసి సుబ్బారావుకు రీడైరెక్టు చేసేవాడు.


తర్వాత శివరావు సుబ్బారావుకు జాబు రాసేవాడు. మరు టపాలో శివరావుకు రీడైరెక్టు అయిన కార్డు అందేది.


పొదిలి పోస్టుమాస్టారు జరుగుతున్న ఈ వ్యవహారాన్ని పసికట్టి పై అధికారులకు రిపోర్టు ఇచ్చేడు.


ఇకపై ఇలాంటి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపితే, మీకు తపాలా సౌకర్యాలను పూర్తిగా నిలిపివేస్తామన్నారు. దాంతో ఇద్దరూ దారికి వచ్చేరు.


– కాసుఖేల నరసింహారావు,
కోడంబాకం, చెన్నై



నెలజీతం పోసి....
కొన్న బ్యాంకులన్నీ....
మా పక్కింటి "మెజీషియన్"....
మాయం చేసేశాడు సార్!!........
S.I



రండి! లక్ష్మణరావ్ గారూ! మీకోసం
చాలా కాలం నుండి ఎదురు-
చూస్తున్నా!



ఇక్కడే "బాంబులు"....



ఈ చిచ్చుబుడ్లు కొనడానికి మీ దగ్గర అప్పు తీసుకోకుండా వుండాల్సింది సుబ్బారావ్‌గారూ!



ఏంటండీ అది.. వత్తి అంటించి...
విసిరేసేదానికి... అంత
రిస్క్ తీసుకున్నారు..?



ఈ ఇంట్లో నేనూ..నా భార్య ఇద్దరమే..!
కుఁవా...! కుఁవా...!
ఆగండాగండి.. నా భార్య ప్రసవించినట్లుంది ముగ్గరని రాస్కోండి!



ఎవరింట్లో ఏం జరుగుతుందో ఏమీ
తెలియటం లేదు! అందుకనే పని
మనిషిని పెట్టుకున్నాను!



ఈ ఫ్లై ఓవర్
మొన్ననే కట్టిన
కారణంగా.. దీపావళి
మందులు కాల్చడం
నిషేధించబడినది



బాబూ ఇందాకట్నుంచి నాతో నువ్వేదో మాట్లాడుతున్నావ్...
నాకసలే బ్రహ్మ చెముడు.
BUS STOP
నేను మీతో ఏం
మాట్లాడ్డం లేదు
నెమరుస్తున్నా!
Amar


Ramprasad
మన అల్లుడు అసాధ్యుడండీ...
రాకెట్ మీదే కుటుంబాన్నంతా
దింపుతున్నాడు...!!


మరందుకే పండగపూట...
పనిపిల్లకి ఓ పది రూపాయలు
పడేయమంటు


మీరు బంధువులు మీరూ టపాకాయలు కాల్చటం మొదలెడితే, నేను లోపలికెళ్ళి నా మందు గుండు సంగతి చూసుకుంటా
V.R. Prasad


బ్యాగ్‌లో టూత్ పేస్ట్ ఉందీ...
మరి అంత గట్టిగా పట్టుకోవద్దంటే
విన్నారా!
Amar


బుజ్జిగాడు సిగిరెట్ బాంబులు తెచ్చాడు... చూసుకొని తాగండి
ఢాం
వి. రామకృష్ణ



★ అక్టోబరు సంచికలోని తెలుగు కథ 'ఛాయ' ఆలోచింప చేసింది. 'ఛాయ ఛాయగానే మిగిలిపోయింద'న్న ముగింపు వాక్యమూ బాగుంది. రాజకీయాల అసలు రూపును ఒరియా అనువాద కథ' వైకుంఠపాళి' కళ్లకు కట్టించింది. 'కైమేలియా' ద్వారా జపాన్ ప్రజల నమ్మకాల్ని వివరంగా తెలుసుకోగలిగాం. 'కథకుల ఫైల్'లో 'సుగాలీ కుటుంబం' చదివాక వారి బాధలన్నీ కళ్లముందు మెదిలాయి. కార్డుకథల్లో 'అమ్మా! పాలియ్యవా..' చదివినంతసేపూ మనసంతా కరుణతో నిండింది.

ఓ సూచన: ప్రతినెలా మీరు ప్రచురించే కార్డుకథల సంఖ్యను పెంచితే బాగుంటుంది.

– *కె.ఆర్. పప్పు*, అమలాపురం

★ కిషన్‌రెడ్డిగారి 'పరామర్శ' నచ్చింది.

– *ఆశాలత*, న్యూజెర్సీ (ఈ-మెయిల్)

★ కథలన్నీ బాగున్నాయి. అన్నిటికన్నా స్పందింపచేసిన కథ 'కళాకారుడెవ్వరు'. ఈ ఉర్దూ కథ అసలైన కళాకారుడిని జనం ముందు నిలబెట్టింది. మల్లాదివారు అనువదించిన ఇజ్రాయిల్ కథ 'ఓ తండ్రి కథ' చాలా బాగుంది. వైద్యరంగంపై అవగాహన పెంచేలా ఉంది 'దత్తపుత్రుడు' హిందీ కథ. 'బంధుత్వాలు' తమిళ కథ కూడా ఆకట్టుకుంది. తెలుగు కథల్లో 'ఎర్రకోక' ముగింపు గుండెల్ని పిండేసింది. 'ఎవరిది తప్పు?' తెలుగు భాషాభిమానాన్ని చాటింది. ప్రకృతి వైపరీత్యానికి గురయ్యే బక్కరైతుల జీవిత చిత్రణే 'ఏతమేసి తోడినా..' కథ

– *మంచాళ శ్రీలక్ష్మి*, విశాఖ

★ మరిన్ని వైవిధ్య అంశాలతో మనసును దోచుకుంది అక్టోబరు 'విపుల'. నాదో సలహా: కార్డుకథల్లా ఇక పేజీ కథల్ని కూడా రచయితల నుంచి ఆహ్వానించి ప్రచురించండి.

– *కె.బి. కృష్ణ*, కాకినాడ

★ కాళీమాత ముఖచిత్రంతో సంచికను వెలువరించడం సమయోచితం. కథలన్నీ ఆణిముత్యాలే. మానవ సంబంధాలతో పాటు వివిధ సామాజిక సమస్యల్ని చిత్రించిన కథలవి. ముఖ్యంగా 'ఛాయ' కథలోని రెండు ప్రధాన స్త్రీ పాత్రలూ ఓర్పు, ఓదార్పులకు సూచికలు. 'సుగాలీ కుటుంబం' నాటి వాస్తవాల సమాహారంగా ఉంది. జోక్స్ బాగున్నాయి.

– *యు. చిట్టిబాబు*, న్యూ పాల్వంచ

★ తెలుగు కథల్లో తలమానికం 'ఏతమేసి తోడినా'. మట్టిమనిషి ఎదుర్కొనే విషమ పరిస్థితుల్ని సహజసిద్ధంగా చిత్రించారు రచయిత ఎం. వెంకటేశ్వరరావు. 'ఎర్రకోక' కథ సహజత్వానికి అతి దగ్గరగా ఉంది. చక్కని రచనా శిల్పంతో 'ఛాయ' కథ సాగింది. సంభాషణలన్నీ భావగర్భితంగా ఉన్నాయి.

– *రమణమూర్తి*, కాకినాడ

★ కార్టూన్లు.. పత్రికకు కొత్తశోభ కలిగించాయి.

– *సుభాష్‌చంద్ర బోస్*, శ్రీకాకుళం

★ కథలన్నీ చాలా బాగున్నాయి. ముఖ్యంగా మునిసుందరం 'తప్పెవరిది', మంత్రవాది 'ఛాయ', 'కథకుల ఫైల్'లో దీక్షితుల వారి 'సుగాలీ కుటుంబం' కథలు సంచికకే హైలైట్‌గా వున్నాయి.

–*పాయసం సుబ్రహ్మణ్యా మహర్షి*, నెల్లూరు.

మీ అభిప్రాయాల్ని e-mail : vipula.chatura@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

రచయితలకు, అనువాదకులకు, కార్టూనిస్టులకు
సూచనలు

★ ఇతివృత్తంలో నూతనత్వం, రచనా సంవిధానంలో వైవిధ్యం గల తెలుగు కథలనూ, అనువాద కథలనూ 'విపుల' ఆహ్వానిస్తున్నది. హాస్య వ్యంగ్య రచనలకు ప్రత్యేక ప్రాధాన్యత. ప్రచురించే ప్రతి తెలుగు కథకు రూ. 500/- పారితోషికం ఉంటుంది.

★ ప్రచురించిన అనువాద కథకు పారితోషికంగా మూల రచయితకు రూ. 250, అనువాదకునకు రూ. 350 లభిస్తుంది. అనువాద కథలు పంపే వారు ఆయా మూల భాషా రచయితల నుండి లిఖితపూర్వక అనుమతి పొంది కథతోపాటే అనుమతి పత్రం కూడా జతపర్చాలి. మొదటి షీటు లోనే 1. మూలభాష 2. ఆ భాషలో ఆ కథ పేరు 3. రచయిత పేరు, చిరునామా 4. ఆ కథను ప్రచురించిన పత్రిక లేదా సంకలనం పేరు, తేదీ 5. ప్రచురణకర్తల చిరునామా 6. అనువాదకుని చిరునామా తెలియజేయాలి.

★ అనువాదకులు మూల రచయిత అనుమతి పొందలేని సందర్భాలలో పై వివరాలు తెలిపితే మేమే అనుమతి పొందగలం.

★ అనువాదానికి ఎన్నుకునే కథలు సమకాలీన రచయితలవే అయితే బాగుంటుంది. తెలుగు పాఠకులకు సుపరిచితులయిన ప్రసిద్ధుల కథలు పంపవద్దని మనవి.

★ పేజీకి ఒకవైపునే రాయాలి. జిరాక్స్ ప్రతులు పరిశీలించబడవు.

★ ప్రతి రచనకు తగిన స్టాంపులు అంటించి స్వంత చిరునామా గల కవరు జతపరచాలి. అలా జతపరచని రచనలు (ఎంపిక కాని సందర్భంలో) తిప్పి పంపడం సాధ్యం కాదు. పోస్టులో రచనలు పోయినా మా బాధ్యత ఉండదు. రచనలు ఈ -మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

★ కార్టూన్లు 5×10.5 సెం.మీ. సైజుకు తగ్గించడానికి అనువయిన సైజులో డ్రాయింగ్ పేపరుపై ఇండియన్ ఇంక్‌తో వేసి పంపాలి. కాప్షన్ స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి. చుట్టూ బార్డర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రచురించిన కార్టూన్‌కి రూ. 40 చొప్పున పారితోషికం ఉంటుంది.

విపుల

'ఈనాడు' కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఈ మెయిల్ : vipula.chatura@gmail.com



రచయితలకు సూచనలు



నవ్యనవలా వేదిక 'చతుర'కు రచనలు పంపేవారు ఈ కింది సూచనల్ని గమనించాలి.

★ చతురకు నవలలు పంపేవారు సామాజిక సమస్యలపై దృష్టి పెట్టాలి. హాస్య, వ్యంగ్య తదితర ఏ ఇతివృత్తమైనా ఎంచుకోవచ్చు. ఏ మాండలికమైనా రాయొచ్చు. వైవిధ్య కథా వస్తువులకు ప్రాధాన్యం ఉంటుంది. నవ్యతకే పెద్దపీట.

★ బొమ్మలు, వివిధ శీర్షికలు, ప్రకటనలు పోను 'చతుర' నవల అచ్చులో 80-85 పేజీలు ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రచయితలు తమ నవలల్ని అచ్చులో 85 పేజీలు మించకుండా రాసి పంపాలి.

★ ఒక పాత 'చతుర' సంచిక తీసుకుని అందులో ఉన్న నవలలో ఒకటి లేదా రెండు పూర్తి పేజీలను తమ దస్తూరితో రాసి చూసుకుని ఆ మేరకు తమ నవల రాతప్రతి ఎన్ని పేజీలలో రాయవచ్చో అంచనాకు రావడం సులభం. ఏదేమైనా అచ్చులో 80-85 పేజీలకు మించకుండా లేదా తక్కువ కాకుండా ప్లాన్ చేసుకుని పంపడం మంచి పద్ధతి.

★ ప్రచురణకు స్వీకరించని నవలలు/రచనలు తిప్పిపంపేందుకు వీలుగా స్టాంపులు అంటించిన సొంత చిరునామాగల కవరు జతపరచడం మరువకండి. రాతప్రతులు పోస్ట్‌లో పోతే 'చతుర' బాధ్యత వహించబోదు.

★ స్టాంపులు అంటించిన సొంత చిరునామాగల కవర్లు జతపరచని వారి రచనలు తిరస్కారానికి గురైతే ట్రాష్‌లోకి వెళ్లిపోతాయి. వాటి గురించి ఉత్తరప్రత్యుత్తరాలకు తావులేదు.

★ సాధారణంగా నవలలు కార్యాలయానికి అందిన 4 - 8 వారాలలోగా పరిశీలించి ప్రచురణార్హమైతే ఆ విషయం తెలియపరుస్తాం. కాకుంటే తిప్పిపంపడం జరుగుతుంది.

★ ప్రచురితమైన ప్రతి నవలకు రూ. 6000/- పారితోషికం ఉంటుంది. నవల ఏ నెలలో ప్రచురిస్తే ఆ నెల మొదటి వారంలోనే పై మొత్తానికి రచయితకు చెక్కు అందుతుంది.

★ 'కొత్తగాలి' శీర్షికకు చిరుకవితలు పంపేవారు నాలుగు/ఐదు పంక్తులు మించకుండా పంపాలి. స్పార్క్‌కే మార్కు అన్న విషయం గుర్తించాలి.

చతుర


చిరునామా : ఎడిటర్, చతుర, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్-500082
ఈ మెయిల్ : vipula.chatura@gmail.com

ఆఫ్రో-అమెరికన్ కథ

-టైరోన్ డాకిన్స్

మనుషులతో సంబంధం

అనువాదం : మల్లాది



తాతయ్య నాతో ఎప్పుడూ అనేవారు "టైరోన్! నువ్వు మనుషులతో సంబంధాలు కలిగి ఉండటం నేర్చుకోవాలి. అది నువ్వు సరిగ్గా చేయడంలేదు"

ఆయన అసలా నిర్ణయానికి ఎలా వచ్చారో నాకు అర్థంకాలేదు. నాకు చాలా మంది మనుషులతో సంబంధం ఉంది. అది ఆయన చూస్తున్నారు కూడా. అయితే మా తాతయ్యమీద గౌరవంతో నేనెన్నడూ ఆ విషయంమీద ఆయనతో వాదించలేదు.

ఓ రోజు నేను కాలేజీలో ఆఖరి క్లాసులో ఉండగా వైబ్రేషన్ మోడ్‌లో ఉన్న నా సెల్‌ఫోన్ వైబ్రేట్ అయింది. చూస్తే అది మా అమ్మనించి. ఎమర్జన్సీ అయితే కానీ, ఆ టైంలో నాకు ఇంటినించి ఫోన్‌రాదు. అదేమిటో కొంతవరకు ఊహించగలిగాను. బహుశా మా తాతయ్యని హాస్పిటల్‌లో చేర్చి ఉంటారు. ఆయనకి ఈమధ్య ఒంట్లో బావుండటం లేదు.

క్లాస్ అవగానే అమ్మకి ఫోన్‌చేశాను.

"వెంటనే బయలుదేరి రా, తాతయ్య పోయారు." అమ్మ కంఠం దుఃఖంగా వినిపించింది.

నాకది షాక్. "ఎలా పోయారు? " అని అడిగాను.

"కేన్సర్"

"కేన్సర్? అది ఒక్కరోజు వచ్చే జబ్బు కాదు. నాకు ఇంతదాకా చెప్పలేదే? " అని అడిగాను బాధగా.

"తాతయ్య ఎవరికీ చెప్పవద్దన్నారు. ముఖ్యంగా దూరంగా ఉండి చదువుకునే నీకు చెప్పద్దన్నారు"

వెంటనే నేను గ్రేహౌండ్ బస్‌లో బయలుదేరాను. చికాగో నుంచి మా ఊరికి నాలుగు గంటల ప్రయాణం. నాకు ఊహ తెలిశాక, మా కుటుంబంలో మరణం సంభవించడం ఇదే మొదటిసారి. నాకు మనసంతా బాధగా ఉంది. మా తాతయ్యతో గడిపిన అనేక సంఘటనలు గుర్తుకువచ్చాయి. ఎనభై తొమ్మిదేళ్ళ ఆయననించి నేను చాలా నేర్చుకున్నానని అనుకుంటున్నాను.

నేను వెళ్ళేసరికే మా తాతయ్య శవపేటిక చర్చిలో ఉంది. అక్కడ నుంచి మర్నాడు సిమెట్రీకి తీసుకు వెళ్ళారు. నల్ల సూట్స్‌లో, గౌన్లలో అక్కడికి వచ్చిన వారంతా నాకు తెలిసినవారే. నా గురించి, చదువు గురించి వారు అడిగారు.

అక్కడున్న వారిలో ఓ ముసలాయన మాత్రం నాకు తెలీదు. ఆయనో రైతని దుస్తులనిబట్టి తెలిసిపోతోంది. చాలా పాత సూట్‌ని ఆయన ఇస్త్రీ చేసుకుని వేసుకువచ్చాడని ఇట్టే తెలిసిపోతోంది. పాత బూట్లని ఈరోజే పాలిష్ చేసుకున్నాడని కూడా ఊహించాను. ఆయన జుట్టు అప్పుడే కురిసిన మంచు రంగులో ఉంది. ఆయన వయసు యాభై- అరవై మధ్య ఉండచ్చని అనిపించింది. నేనాయన వంక పదేపదే చూడటం గమనించి ఆయన నా దగ్గరకి వచ్చాడు. "నా పేరు పాల్" అని చెప్పాడు.

"హలో మిష్టర్ పాల్, హౌ ఆర్ యు? " ఆయనతో కరచాలనం చేస్తూ అన్నాను.

"మీ తాతగారు కదా ఆయన? " ఆ నల్ల వ్యక్తి అడిగాడు శవపేటిక వైపు తలెగరేసి.

"అవును" జవాబు చెప్పాను.

"మీ తాతయ్యతో నాకు అరవైఏళ్ళ క్రితం ఓ రోజు పరిచయం అయింది. ఆ రోజు ఆయనతో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అప్పట్లో నాకు ఆయన పేరు కూడా తెలీదు. నాకు అప్పుడు ఏడెనిమిదేళ్ళుండచ్చు"

ఆయన చెప్పేది విన్నాక నాకు ఆశ్చర్యం వేసింది. ఆయనకి, తాతయ్యకి అట్టే సంబంధం లేకపోయినా ఫ్యూనరల్‌కి దేనికి వచ్చినట్లు?

ఆయన కొనసాగించాడు "ఆ రోజు నేను, మా అమ్మ, చెల్లాయ్ సేన్ ఏంటోనియో నించి హ్యూస్టన్‌కి వస్తున్నాం. మా అమ్మమ్మ మేరేజ్ ఏనివర్సరీకి హాజరై వెనక్కి వస్తున్నాం. ఆగస్టు నెల కాబట్టి ఎండ దంచేస్తోంది. అకస్మాత్తుగా హ్యూస్టన్‌కి కొద్దిదూరంలో మా అమ్మ పాత షెవీ కారు ఆగిపోయింది. దిగి అమ్మ దాన్ని బాగుచేయడానికి ప్రయత్నించింది కానీ

అది ఆమెవల్ల కాలేదు. చిన్న పిల్లవాడ్ని కాబట్టి నాకు ఎటూ రాదది. కారులో కూర్చుంటే వేడి. బయట కూడా వేడి. పిల్లలం ఇద్దరం ఆ ఆగస్టు వేడిని భరించలేకపోయాం"

అతను చెప్పేది ఆసక్తిగా వినసాగాను.

"చివరకి గంటన్నర తర్వాత ఓ కారు మమ్మల్ని చూసి ఆగింది. దాన్లో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. అతను తెల్లజాతి మనిషి. ఆ రోజుల్లో మేం తెల్లజాతి వారితో ఎలాంటి సంబంధం కలిగి ఉండేవాళ్ళం కాదు. వాళ్ళు ఓ వైపు ఉంటే, మేం ఇంకోవైపు ఉండేవాళ్ళం. ఒకరితో మరొకరు కలిసేవారం కాదు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పేరు ఇంకా వినని రోజుల గురించే నేను ఇప్పుడు మాట్లాడేది. మాకు సివిల్ రైట్స్ ఉండేవి కావు.

ఆయన కారు మా పక్కన ఆపి కారులోంచి అడిగాడు 'సహాయం ఏదైనా కావాలా?' అని. మామూలుగా అయితే అమ్మ 'అక్కర్లేదు' అని ముభావంగా చెప్పి ఉండేది కానీ అప్పటికే నేను, చెల్లాయ్ 'దాహం' అని గొడవచేస్తున్నాం. ఆయన సహాయం తీసుకోవడం మినహా, మా అమ్మ ఏమీ చేయలేని స్థితి అది. ఆయన కారు దిగి మా వైపు వస్తూంటే నాకు భయంవేసింది. తరచూ తెల్లవాళ్లు నన్ను కొట్టడం నాకు అనుభవమే. మా అమ్మని, మా చెల్లాయ్‌ని నేను ఆయన్నించి రక్షించడానికి తయారుగా ఉన్నాను. మా షెవీని రిపేర్ చేయడానికి కాసేపు ప్రయత్నించాడు కానీ ఆయన వల్ల అది కాలేదు.

"సారీ! దీన్ని నేను రిపేర్ చేయలేను. మిమ్మల్ని, మీ పిల్లల్ని మీ ఇంటి దగ్గర దింపుతాను. నా కారెక్కండి" ఆహ్వానించాడా యువకుడు.

తెల్లవాళ్ల కారు ఎక్కడం అన్న ఆలోచనే నాకు, అమ్మకి భయాన్ని కలిగించింది. ఆ రోజుల్లో బస్సుల్లో నల్లవాళ్లు వెనక సీట్లలోనే కూర్చోవాలి. ఖాళీగా ఉన్నా ముందున్న తెల్లవాళ్ళ సీట్లలో మేం కూర్చోకూడదు. మా అమ్మకి ఆ కారు ఎక్కడం ఇష్టంలేదు. కానీ ఎండాకాలం మధ్యాహ్నం దాహంతో అలమటించే ఇద్దరు పిల్లలున్న మా అమ్మకి.. గత్యంతరం లేకపోయింది. మమ్మల్ని ఆయన కారు వెనక సీట్లో కూర్చోబెట్టి తనూ కూర్చుంది. దాదాపు అరగంటకి పైగా, నలభై మైళ్లదూరం ఆ కారు ప్రయాణించేప్పుడు మేమంతా బిక్కుబిక్కుమంటూ మౌనంగా ఒకరి చేతులని మరొకరం పట్టుకుని కూర్చున్నాం. మమ్మల్ని ఇంటిదగ్గర ఆయన దింపాడు. అమ్మ ఎదురు చూసినట్లుగా డబ్బు అడగలేదు. అమ్మ ఇవ్వబోయినా నిరాకరించి అన్నాడు "మీ కారు రిపేరుకి అవసరం అవుతుంది, ఉంచండి"

ఆ రాత్రి మా నాన్న ఇంటికి వచ్చాక జరిగిందంతా అమ్మ చెప్తే.. నాన్న మండిపడ్డాడు. తెల్లవాళ్ళ కారు ఎక్కినందుకు అమ్మని విపరీతంగా కొట్టాడు. ఆ సంగతి మేం ఎవరితో చెప్పినా మమ్మల్నీ కొడతానని.. మా నాన్న నాతో, చెల్లాయ్‌తో గట్టిగా చెప్పాడు. నీకు తెలీదేమో కానీ, ఆ రోజుల్లో తెల్లవారు తాగే పబ్లిక్ పంపుల్లోంచి మేం నీళ్ళు తాగకూడదనే నియమం ఉండేది. తెల్లవాళ్ళు వెళ్ళే చర్చిలోకి నల్లవాళ్ళకి ప్రవేశం ఉండేదికాదు. దేవుడిముందే వర్ణ వివక్షని పాటించిన రోజుల గురించే నేను చెప్పేది. అన్నట్లు, మాకు స్కూల్స్ కూడా వేరే ఉండేవి"

అతను చెప్పేది నేను ఆశ్చర్యంగా వింటూండిపోయాను. ఈరోజుకీ నల్లవాళ్ళ కాలనీలు ప్రతీ ఊళ్ళో సెపరేట్‌గా ఉన్నాయని నాకు తెలుసు. సాధారణంగా తెల్లవారు అక్కడ నివసించరు. అమెరికాలో పేదరికం నల్లవారిలోనే అధికం అని కూడా నాకు తెలుసు.

"అప్పట్లో యువకుడైన మీ తాతయ్య ఓ దేవుడిలా ప్రవర్తించాడు. నల్లవాళ్ళని తెల్లవాళ్ళు తమ కారులో ఎక్కించుకోవడం దేవుడు తప్ప మనుషులు చేసే పనికాదు. ఆయన మా రంగుని కాక మా బాధని చూశాడా మధ్యాహ్నం" అంటూ అతను చెప్పడం ఆపాడు కాసేపు.

"దినపత్రికల్లో ముందుగా మరణవార్తలని చూసే వయసు నాది. ఎందుకంటే మన మిత్రుల పేర్లు అక్కడ కనబడతాయి. ఇవాళ ఉదయం దినపత్రికలో మీ తాతయ్య మరణానికి సంబంధించిన ప్రకటనని చదివాను. ఇన్నేళ్ళయినా దాన్ని వెంటనే గుర్తుపట్టగలిగాను. నా మనసులో ముద్రించి ఉన్న ఆనాటి మీ తాతయ్య మొహం పెద్దగా మారలేదు కాబట్టి గుర్తుపట్టాను. ఆయన పేరు కూడా నాకు తెలీదు. ఒకవేళ ఆ రోజు మా అమ్మకి చెప్పినా నాకు గుర్తులేదు. నా కృతజ్ఞతలని తెలియచేయడానికి నూటయాభై మైళ్ళనించి ఇక్కడికి వచ్చాను. మా నాన్నకి ఇప్పుడు నేను చేసిన పని తెలిస్తే ఆయన నన్ను కొట్టాలనుకుంటాడు. కానీ కాలం మారింది. నా మొదటి కోడలు శ్వేతజాతి యువతి. నా రెండో కొడుకు లాయర్. అతని భాగస్వామి కూడా అమెరికనే. నేను మరణించాక బహుశా మీ తాతయ్యని కలిసి కృతజ్ఞత తెలియచేసుకుంటాను!"

నాతో కరచాలనం చేసి, తడిగా ఉన్న తన కళ్ళని తుడుచుకున్నాడతను. నడిచి దూరంగా పార్క్ చేసిన తన కారు వైపు వెళ్ళిపోయాడు. నా కళ్ళు కూడా తడయ్యాయని వేరే చెప్పక్కర్లేదు. శవపేటికలో ఉన్న మా తాతయ్యమీద నాకున్న గౌరవం రెట్టింపైంది.

'నువ్వు మనుషులతో ఎక్కువ సంబంధం కలిగి ఉండాలి' అన్న మా తాతయ్య మాటలు నాకు ఇప్పుడు పూర్తిగా అర్థమయ్యాయి.

V

తెలుగు కథ



వడగళ్ల వాన

- శ్రీగంగ

ఈ మహానగరంలో సొంత ఇల్లు ఉండటం ఒక పెద్ద అదృష్టం. జానెడు ఖాళీ స్థలం కనబడితే దానిలో ఒక పెద్ద స్తంభం పాతేసి, దానికో హోర్డింగ్ పెట్టేసి, వ్యాపార నిమిత్తం వాడుకుని డబ్బు చేసుకునే తత్వం ఎక్కువగా ఉన్న ఈ నగరంలో అపార్ట్‌మెంట్‌లు కాక ఇండిపెండెంటు ఇల్లు ఉండటం మరింత అదృష్టం.

మా మావగారి బ్యాంకు ఉద్యోగం పుణ్యమా అని మాకు ఈ అదృష్టం పట్టింది. ఆయన ఎప్పుడో కొని ఉంచిన స్థలంలో ఒక డాబా ఇల్లు కట్టించారు. అదెప్పుడో ఇరవయ్యేళ్ళ కిందటి మాట. అప్పట్లో ఈ ఏరియా నగరానికి కాస్త దూరంగా ఉండేది. కానీ ఇప్పుడో, ఇది నగరంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల్లో మేటిగా ఉంది.

మా ఆయన వాళ్ళింట్లో ఒక్కడే సంతానం. అందుకే అత్తమామలతో పాటు ఈ ఇంట్లో మేమంతా ఉంటున్నాం.

మా మావగారికి డాబా ఇల్లంటే ఎంతో ఇష్టం. వాళ్ళ ఊరిలో ఆయన చదువుకునేటప్పుడు ఆ ఊరి ప్రెసిడెంటుకి మాత్రమే డాబా ఇల్లు ఉండేదట. ఆయన మనసులో ఆ డాబా ఇల్లు ఎంత బలమైన ప్రభావం చూపిందో మరి. బ్యాంక్ హౌసింగ్ సొసైటీ వాళ్ళ దగ్గర తీసుకున్న ఇంటిస్థలంలో డాబా ఇల్లే కట్టించుకున్నారు.

అందరూ అద్దెలకోసం పోర్షన్లు వేసి, పై అంతస్తులు లేపినా ఆయన మాత్రం ఆ డాబాను అలాగే ఉంచేశారు.

ఇంటి చుట్టూ ఖాళీస్థలం విడిచిపెట్టి, జామ, దానిమ్మ, కొబ్బరిచెట్లు నాటించారు. ఇంటివెనుక మా బెడ్‌రూమ్‌కి ఆనుకుని బయటి నుంచి మెట్లు ఉంటాయి. పెరటివైపు అరటి చెట్లు, తులసికోట సరేసరి.

అందుకే మా ఇల్లంటే నాకే కాదు, ఈ చుట్టుపక్కల చాలా మందికి ఇష్టం. అందరూ నా అదృష్టానికి కాస్తంత అసూయ పడుతూ, అది కాస్తా అప్పుడప్పుడూ బయటికీ వ్యక్తపరుస్తుంటారు.

అన్నీ బాగానే ఉన్నాయి కానీ మా అత్తగారి చాదస్తంతోనే నాకు అప్పుడప్పుడు ఇబ్బందులు. మాకు వశిష్ట ఒక్కడే సంతానం. వాడికి ఎనిమిదోయేడు. ఇంటి దగ్గరలోనే వాడి స్కూలు. అత్తగారి గురించి చెప్తూ మళ్ళీ వశిష్ట గురించి చెబుతున్నానేమిటా అనుకుంటున్నారా? అసలు విషయం వాళ్ళిద్దరితోనే ముడిపడి ఉంది మరి.

వశిష్టను చూస్తే మా అత్తగారికి, చిన్నప్పటి మా వారిని చూసినట్లుందట. అందుకే ఎప్పుడూ వాడితోనే ఆమెకు కాలక్షేపం. పొద్దున్న లేచింది మొదలు వాడిని వెంటేసుకుని తిరుగుతూ ఉంటుంది. సాయంత్రాలు వాడిని తీసుకుని వాహ్యాళికి వెళ్లటం, దారిలో వాడికి చిరుతిండి కొనటం, తన చిన్ననాటి కబుర్లు చెప్పడం లాంటివి చేస్తూ, వాడిని ఓ ఇరవై ముప్ఫై ఏళ్ళ వెనక్కి తీసుకుపోతుంది.

ఆమధ్య వాడు చాక్లెట్లు ఎక్కువ తింటుంటే, శేఖర్ నన్ను కసురుకున్నాడు, “సీతా! వాడికెందుకు చెప్పవు, చాక్లెట్లు తింటే పళ్ళు పాడవుతాయని” అంటూ.

ఆ విషయం వశిష్టకు చెప్తే, పక్కనే ఉన్న మా అత్తగారు అందుకని, “ఒరే కన్నా, మా చిన్నప్పుడు ఇవన్నీ తినేవాళ్ళం కాము. చక్కగా మినపసున్ని, జంతికలు, కజ్జికాయలు తినేవాళ్ళం. మీ నాన్నకు కూడా అవే ఇష్టం. అందుకని నువ్వు ఈ మాయదారి చాక్లెట్లు మానేసి, అలాంటివి అమ్మనడిగి చేయించుకుని తినాలి” అని ఉద్బోధ చేసింది.

వశిష్టకు మా అత్తగారికి మధ్య ఉండే సామరస్యంతోటి మావాడికి ఆమె ఎంత చెప్తే అంత. ఆ తర్వాత నా వెంటపడ్డాడు, “అమ్మా బుజ్జికాయలు, మంత్రాలు చెయ్యి” అని.

అవేమిటో అర్థంకాక జుత్తుపీక్కున్నాను. మా అత్తగారే ఆదుకున్నారు. “వాడికి, జంతికలు, కజ్జికాయలు కావాలిట”

‘పోనీ కొనుక్కుందాం, అమ్మకు చెయ్యటం వస్తుందా ఏమిటీ? సిటీలో పెరిగిన పిల్ల’ అంటే ‘ఆ పిల్లకు నువ్వు నేర్పు అంటున్నాడు’ బుగ్గల్లో నవ్వు దాచి మాటల్లో లేని విచారం కనబరుస్తూ.. అంది.

ఇద్దరం కలిసి కుస్తీపడితే గాని కజ్జికాయలు, జంతికలు అనుకున్న షేపుకి రాలేదు. అవి వాడు తినలేక వదిలేస్తే మేమే తిని మరికాస్త బరువు పెరిగాం.

ఇంకోసారి వర్షం పడుతున్నపుడు ఇంద్రధనుస్సు గురించి చెప్పింది వశిష్టకి. దాని రంగులు, అది ఆకాశంలో ఒక చివర నుంచి మరో చివర దాకా విస్తరించిపోవటం అన్నీ కళ్ళకు కట్టినట్లు వివరించేసింది. ఇంకేముంది వర్షం పడితే చాలు వశిష్ట బయటకుపోయి వెతికేవాడు ఇంద్రధనుస్సు కోసం.

శేఖర్ వాడిని పిలిచి “వశీ, వర్షంలో ఇంద్రధనుస్సు రాదు. వర్షం ఆగినాక వస్తుంది. పైగా కాస్త ఎండ కూడా ఉండాలి” అని సైన్సు రీజనింగు చెప్తే, వర్షం తగ్గాక బయటకు పరిగెత్తేవాడు. ఎన్నిసార్లు బురదలో పడ్డాడో, ఆకాశంలోకి చూస్తూ నడవడం వల్ల..

అనుకోకుండా ఒకసారి మేమంతా కార్లో నాగార్జునసాగర్‌కి వెళ్ళాం. దారిలో ఆగినప్పుడు, చిన్నజల్లు పడింది. ఆకాశంలో అందంగా ఇంద్రధనుస్సు ప్రత్యక్షమయింది. అది చూపిస్తే వశిష్టకు ఎంత సంతోషం కలిగిందో! ఆ రోజంతా ఇంద్రధనుస్సు కబుర్లే! ‘దాని పైకి ఎక్కి దేవలోకం వెళ్ళొచ్చు’ అని మా అత్తగారు చెప్తే ‘పద వెళ్ళొద్దాం’ అని గొడవ పెట్టాడు.

“అవన్నీ కథలు రా. ప్రతీదీ నమ్మేస్తే ఎలా? ” అని వాడిని ఆవిడే ఊరుకోబెట్టింది. నావల్ల అవుతుందా, ఏమిటి?

కానీ ఇప్పుడు వచ్చిన సమస్య వీటన్నిటి కంటే పెద్దది. దీనివల్ల పాపం వాడు వర్షంలో తిరిగి జలుబు, జ్వరం కూడా తెచ్చుకున్నాడు.

ఆ మధ్య బాగా వర్షాలు పడుతుండటంతో మా అత్తగారి ఆలోచనలు తమ చిన్నప్పటి వాన కథల్లోకి వెళ్లిపోయాయి.

ఉరుములు వస్తే ‘అర్జునా, ఫల్గుణా’ అనాలని, లేకపోతే మన నెత్తిన పిడుగు పడుతుందని, మెరుపులు వచ్చేటప్పుడు డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరి నిలువుటద్దం పైన దుప్పటి కప్పి ఉంచాలని, లేకపోతే ఆ అద్దంలో మెరుపు మెరిసి మనుషులు కాలిపోతారని.. ఎన్నో వింత వింత విషయాలు చెప్తుండేది. అంతవరకూ బాగానే ఉంది. కానీ అసలు సమస్య ‘వడగళ్ళవాన’ దగ్గర వచ్చింది.

ఆమె చిన్నప్పుడు పెద్ద పెద్ద నిమ్మకాయలంత వడగళ్ల వాన పడిందట. అవి ఏరుకుని చెంబులో వేసుకుని, వాటిని ఇంట్లోకి

తీసుకెళ్ళి అందరికీ చూపిస్తే వాళ్ళు మెచ్చుకున్నారని, వాళ్లకి ఆ వడగళ్ళు పెడితే అవి తిని 'అబ్బ జివ్వుమంటున్నాయి, చల్లగా' అంటూ సరదాపడ్డారని, తనకు గుర్తున్నవీ, లేనివీ వాడికి ఒక కథలా చెప్పేసింది.

అప్పటినుంచి ఉడుముపట్టు పట్టుకున్నాడు వశిష్ట. తను కూడా వడగళ్ళు ఏరుతానని వర్షం వచ్చినప్పుడల్లా ఒక గ్లాసు తీసుకుని ఒకటే పరుగు. రెండుసార్లు అలా తడిసి వాడు జలుబు తెచ్చుకున్నాక, నా గోల పడలేక మా అత్తగారు వాడి వెంట, కలెక్టరు వెంట బిళ్ళ బంట్రోతులా గొడుగు పట్టుకుని సాయం వెళ్ళేది.

వడగళ్ళు వాన పడటం ఏమన్నా సామాన్య విషయమా, ఏమిటి? వరసగా వర్షాలు పడుతుంటే రోజూ వడగళ్ళ కోసం వశిష్ట అన్వేషణ సాగిస్తున్నాడు. జలుబు కాస్తా జ్వరంలోకి దించింది.

వడగళ్ళ నుంచి వాడి ఆలోచన మరల్చడానికి నేను, మా అత్తగారు, అన్ని రకాల ప్రయత్నాలూ చేశాం. కానీ ఫలించలేదు.

'పట్టణాలలో వానలు వేరనీ, పల్లెటూళ్లలో వానలు వేరనీ, అందుకే వడగళ్ళు పల్లెల్లోనే పడతాయ'ని చెప్పాం.

"ఎక్కడైనా ఒకటే చందమామ ఉంటుందన్నావుగా" అని ఒక లా పాయింటు లాగాడు.





వాడికి అన్నం తినిపించేటప్పుడు మరి మా అత్తగారు 'ఒక ముద్ద చందమామది, ఒక ముద్ద వాళ్ల తాతయ్యది' అని పేరు పేరునా ఒక్కో ముద్ద తినిపిస్తుంది. ఓసారి ఊరెళ్ళినప్పుడు 'అక్కడ చందమామ వేరేది కదా, నాకు మన ఇంటి దగ్గరి చందమామే కావాలని' వాడు పేచీపెడితే, 'అవి రెండూ ఒకటేరా' అని ఆవిడే చెప్పింది.

మరి ఇప్పుడు వాన విషయంలో మాట మారిస్తే వింటాడా?

ఇదికాదు సంగతి, శేఖర్ అయితే సైన్సు రీజనింగుతో చెప్తాడని, శేఖర్‌ని బతిమాలాను, "నువ్వే చెప్పాలి, వశిష్ట మా మాట వినటం లేదు. ఇలాగే వదిలేస్తే, వాడి హెల్త్ పాడైపోతుంది" అన్నాను.

ఆ రోజు ఆయన వశిష్టను దగ్గర కూర్చోపెట్టుకుని అసలు మబ్బులు ఎలా పుడతాయి? మబ్బుల్లో నీళ్ళు ఏ రూపంలో ఉంటాయి? అప్పుడప్పుడు వడగళ్ళు లాంటి ఐస్ గడ్డలు ఎలా తయారవుతాయి? అనే విషయాలు చిన్న చిన్న మాటలలో విపులంగా చెప్పాడు.

అంతా విన్నాక వాడిలో పట్టుదల మరి కాస్త పెరిగింది. 'ఆకాశంలో తయారయ్యే ఐసు గడ్డల్ని' ఎలాగైనా పట్టిచూడాలని గట్టిగా అనుకొన్నాడు వెధవ!

ఇంక వాడిని వడగళ్ళ ఆలోచన నుంచి మరల్చలేమని అర్థం అయిపోయింది, మా అందరికీ. చేసేది లేక చేతులు ఎత్తి ఆ వానదేవునికి మొక్కుకున్నాను. 'వాన కురవటమన్నా ఆపెయ్ లేదా వడగళ్ళ వానన్నా కురిపించు దేవా' అని.

నా ప్రార్థన ఆ దేవుడు విన్నట్లున్నాడు. వానలు ఆగిపోయాయి. పాపం వశిష్ట మాత్రం మబ్బు పడితే ఆకాశం వంక ఆశగా చూస్తుండేవాడు. మెల్లగా వాడే మరిచిపోతాడులే అనుకున్నాం.

మళ్ళీ వర్షాకాలం వచ్చే సమయానికి

మేమందరం వడగళ్ళ వాన గురించి మరిచిపోయాం గానీ వశిష్ట మళ్లీ వడగళ్ల కోసం వానలో వెతుకులాట మొదలుపెట్టాడు. ఇదేం ప్రమాదానికి దారి తీస్తుందో అని భయంవేసింది.

శేఖర్‌కి చాలా చెప్పి చూశాను. "వశిష్ట మళ్లీ వడగళ్ల కోసం వెతుకుతున్నాడు. వాడికి ఏదో ఒకటి చెప్పి మార్చు" అని.

"సీతా! నేను చెప్పినా, నువ్వు చెప్పినా వాడు వినడు" అన్నాడు శేఖర్.

నిజమే, వాడు ఎవరు చెప్పినా వినడు. అలవాటు ప్రకారం మళ్లీ వానదేవుడికి ప్రార్ధనాపూర్వక నమస్కారం చేశాను.

ఆరోజు ఆదివారం. కొంతకాలంగా వానదేవుడు నా పక్షాన ఉన్నట్లే కనిపించాడు. కానీ ఆ రోజు మళ్లీ జోరుగా వర్షం కురిపించాడు.

ఎప్పటిలాగే గ్లాసు తీసుకుని వడగళ్ల కోసం వెతుకుతూ వెళ్లాడు, వశిష్ట. పాపం అత్తయ్యా కూడ గొడుగు తీసుకుని తన డ్యూటీ చేయడానికి వెళ్లారు, వాడివెంట.

ఇంతలో కారుపైన ఏదో పడి 'ఠాప్' మని శబ్దం వచ్చింది. ఏమిటా అని వరండాలోకి వచ్చి చూశాను. మరోసారి 'ఠాప్ ఠాప్' మని శబ్దాలు వచ్చాయి. కారు పైనుంచి ఏవో జారి కిందపడ్డాయి.

వాటిని చూసి, మా అత్తగారు "ఒరే కన్నా, ఇవి చూడు" అని గొడుగు పక్కన పడేసి కిందకు ఒంగి వాటిని తీసుకుని, ఎంతో సంబరంతో వాడికి చూపింది.

వాడు ఆమె చేతిలోంచి వాటిని లాక్కుని చూసి "ఇదేనా వడగండ" అన్నాడు.

"పోరా, పిచ్చిసన్నాసీ! వడగండ కాదురా, వడగళ్ళు! నీ పట్టుదలకు మెచ్చి వానదేవుడు కురిపిస్తున్నాడురా" అంది.

ఇంకా ఠాప్, ఠాప్‌మని శబ్దాలు, ఆగి ఆగి వినపడ్డాయి. మామ్మ, మనవడు ఇద్దరూ చిన్న పిల్లల్లా ఆ వడగళ్ళను ఏరి గ్లాసులో వేసుకున్నారు.

నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. అసలు నాపై నాకు భలే అనుమానం వచ్చేసింది. ఏదో రోజువారీ పూజలు చేస్తాను గానీ నాలో ఇంత శక్తి నిగూఢంగా ఉందా అనిపించింది.

లేకపోతే, దేవుడు నా కోరిక ఇంత తొందరగా తీర్చడమేమిటి అనిపించింది. ఒళ్లు పులకరించిపోయింది.

వశిష్ట ముఖంలో గెంతులేస్తున్న సంతోషం చూసి చాలా ముచ్చట వేసింది. వాణ్ణి కుర్చీలో కూర్చోబెట్టి తల తుడిచాను.

అంతలో అత్తగారు గ్లాసులో నుంచి ఒక గడ్డ తీసుకుని నోట్లో వేసుకుని "అబ్బ జివ్వుమంటోందిరా" అని మరొకటి తీసి వాడి నోట్లో కూడా వేసింది.

"మట్టిలో పడినవి నోట్లో వేసుకుంటారా ఎవరైనా! ఊసెయ్యి" అని వాడి నెత్తిన మొట్టికాయ వేశా. వాడు వడగళ్ళు చప్పరిస్తూ నాకు దొరక్కుండా పరిగెత్తాడు.

పోనీలే, ఈ వడగళ్ళ కథ సుఖాంతమైంది అని సంతోషించాను. ఇక మా అత్తగారు ఏ కొత్త ఉపద్రవం తేకుండా ఉంటే బాగుంటుందని మనసులోనే దేవుడికి మొక్కుకున్నాను.

వడగళ్ళు సాధించిన ఆనందంతో మర్నాడు స్కూలుకి త్వరగా తయారై వెళ్లాడు వశిష్ట. శేఖర్ మాత్రం ఇంకా ముసుగుతన్ని పడుకున్నాడు. ఆఫీసుకి డుమ్మా కొడతాడేమో అనుకుంటూ, టీ చేసి ఇద్దామని కిచెన్ లోనికి వెళ్లాను. బెడ్ రూమ్‌లో నుంచి 'హాఛ్' అని గట్టిగా తుమ్ము వినిపించింది.

డాబా మీద ఆకులు అవీ శుభ్రం చేసి లోపలికి వస్తున్న రాములమ్మ నన్ను చూసి "అమ్మా ఇవి డాబా మీదున్నాయి" అని ఇచ్చింది.

అవి చూడగానే నాకు హఠాత్తుగా జ్ఞానోదయమయింది, ఫ్రిజ్‌లో ఐస్ చేయటానికి వాడే ప్లాస్టిక్ బాక్సులు అవి.

టీ తీసుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి శేఖర్ ముసుగు తీశాను. జ్వరం కూడా వచ్చినట్లుంది నలతగా కనిపించాడు.

"లేచి టీ తీసుకో, అయినా ఎందుకిలా చేశావు? వశిష్ట కోసం వడగళ్ళు నువ్వే కురిపించావు. ఇలాగైతే వాడికి బాగా మొండితనం అలవాటవుతుంది కదా!" అన్నాను.

టీ అందుకుని, నాకంతా అర్ధమయిందని తెలిసి, చిన్నగా నవ్వాడు శేఖర్ "చూడు, సీతా! చిన్నప్పుడు మనకు కలిగిన అనుభూతులు జీవితాంతం టానిక్ లాగా పనిచేసి మనకు బలాన్నిస్తాయి. ప్రకృతిలోని అందాల్ని అద్భుతాలుగా భావించే శక్తి బాల్యంలోనే ఉంటుంది. ఆ జిజ్ఞాసతో అందాన్ని ఆస్వాదించి మధురానుభూతులను మూటకట్టుకోగలిగే వాళ్ళ బాల్యం వారినీ ఎప్పటికీ ఎంతో సంతోషంగా ఉంచుతుంది.

చిన్నప్పుడు నేనోసారి పెరట్లో ఒక మొగ్గను చూశాను. అప్పుడు మా అమ్మ తులసికోట దగ్గర పూలతో పూజ చేసుకుంటుంది. ఆ మొగ్గే అటువంటి పువ్వుగా మారిందన్న ఆలోచన నాలో ఎలా వచ్చిందో మరి, వచ్చింది! ఇక ఆ మొగ్గను చూస్తూ కూర్చున్నా, అది ఎలా పువ్వు అవుతుందో చూద్దామని. తూర్పున వెలుగురేఖలు ప్రసరిస్తూ ఉంటే, ఆ కిరణాలు మూసిన ఆ రేకుల తలుపులు తడితే అందులోని పూబాల ఒకటొకటిగా ఆ రేకులను తెరిచి బాలభానుణ్ణి పలకరించినట్లుగా ఆ మొగ్గ విరిసింది.

ఇన్నేళ్ళయినా ఆ దృశ్యం నా మనసులో నిన్ననో మొన్ననో జరిగినంత తాజాగా ఉంది.

మరోసారి స్కూల్లో పిల్లలు సీతాకోకచిలుకలను పట్టి ఆడుతుంటే, ఒక మొక్క మొదట్లో రెక్కలు విరిగి పడిఉన్న సీతాకోకచిలుక ఒకటి కనిపించింది. కొనప్రాణంతో ఉంది అది. దాన్ని జాగ్రత్తగా చేతిలోకి తీసుకున్నాను. అది గిలగిలా కొట్టుకుంటుంటే గమనించాను. ఒక చీమ దాని పొట్టను కుట్టేస్తోంది. ఆ చీమను లాగేసి ఆ సీతాకోకచిలుకను ఒక పేపర్‌పై పెట్టి ఉంచాను. కొంచెంసేపటికి దానికి ఓపిక వచ్చి ఎగిరిపోయింది. ఆ రోజు నాలో ఎన్ని అనుభూతులు మెదిలాయో! ఇప్పటికీ అవి నా మనసును కదిలిస్తూనే ఉంటాయి. వశిష్టకు ఉన్న జిజ్ఞాసను పెంచాలని అందుకే ప్రయత్నిస్తుంటాను.

చిన్నపిల్లల్లో కొత్త విషయాలపైన సహజంగా ఆసక్తి ఉంటుంది. దానివల్లే వాళ్లు టీవీలో వచ్చే ప్రోగ్రామ్స్ పట్ల ఆకర్షితులవుతారు. వారి దృష్టిని, ఆసక్తిని ప్రకృతి పరిశీలనపైకి మళ్ళిస్తే వాళ్ళు ప్రకృతి ప్రేమికులవుతారు. పర్యావరణ పరిరక్షణ వాళ్ళకు సహజంగా అబ్బుతుంది. భావి ప్రపంచం ఇలాంటి చిన్నారుల చేతుల్లో మరింత అందంగా ఉంటుంది కదా" మెరుస్తున్న కళ్ళతో అన్నాడు శేఖర్.

శేఖర్ చెప్పింది విన్నాక తను చేసిన పని మంచిది కాదేమో అన్న అపోహ పోయింది. తన బాల్యంలో తాను పొందిన ఆనందానుభూతులను వశిష్టకు కూడా ఇవ్వాలని తాపత్రయపడుతున్నాడని అర్ధమయింది.

నాకు కూడా ప్రతి పూవును, ప్రతి రెమ్మను అద్భుతంగా దర్శించే శక్తి ఉంటే ఎంత బాగుంటుంది అనిపించింది. V

కన్నడ కథ

-శ్రీధర రాయసం

రాజీ

అనువాదం : కృష్ణమూర్తి కలుమంగి

ఆ రోజు హోమం జరుగుతోంది. మంత్రఘోషలతో పాటు నా ఇంటిని పొగ కూడా ఆవరించింది.

అబ్బాయి వినోద్ చదువుల్లో చురుకైన వాడు. బతుక్కి మలుపునిచ్చే ఇంటర్ పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకున్నాడు.



దానికితోడు సి.ఇ.టి (కర్ణాటకలో ఎమ్సెట్‌కు సమం)లో వృత్తి శిక్షణ పొందడానికి అన్ని అర్హతలున్నవాడు. ర్యాంక్ సంపాదించి చాలా ఆనందంగా ఉన్నాడు. ఇంట్లో కూడా అందరూ సంతోషసాగరంలో ఓలలాడుతున్నాం. అబ్బాయి ప్యాసయ్యాడన్న ఆనందంలో నేను మొక్కుకున్న మొక్కుబడి కోసమే ఇలా దేవతారాధన ఏర్పాటుచేశాను. వంశోద్ధారకుని భవిష్యత్తు నాకు ముఖ్యం కదా.

నా భార్య లలితకు కూడా.. ఉన్న ఒక్క అబ్బాయీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. అందుకే సన్నిహితుల్ని దేవతారాధనకీ భోజనానికీ ఆహ్వానించాం.

నేను సహజసిద్ధంగా ఉండే 'కావాలి', 'వద్దు' అనే కోరికను మాత్రమే దేవుడి ముందుంచి ప్రార్థించలేదు. 'అంతా నీ కృపే, సకలం నీకు తెలిసిందే' అని ప్రార్థించాను. ఫలితం దక్కింది..

"వినోద్! ఇక ఏం చదవాలనుకుంటున్నావ్? " అని ఆసక్తితో ప్రశ్నించాను.

వాడు సహజంగా అందరిలాగా "నాన్నా! ఇంజనీరింగ్ చదువుతాను. చాలా తక్కువ టైంలో కోర్సు ముగించి సంపాదన కూడా మొదలెట్టవచ్చు" అని తన అభిప్రాయం బయటపెట్టాడు.

"అందరూ ఇంజనీరింగ్, మెడికల్ అంటే ఎలా? ఐ.ఎ.ఎస్. చదువుకో. దేశంలోని అన్నిచోట్లా పనిచేసి, సమాజసేవ చేయవచ్చు కదా. పైగా మా కంటి ఎదురుగా నువ్వు వుండడం మాకూ సంతోషమే కదా? " అన్నాను.

"లేదు నాన్నా, ఇంజనీరింగ్ చదివి ఎక్కువ డబ్బులు సంపాదిస్తాను. మీరు పడుతున్న శ్రమను తప్పిస్తాను, అప్పుల భారాన్ని దించుతాను" అని వినోద్ తన నిర్ణయాన్ని తెలిపాడు.

నేనూ, లలితా "నీ ఇష్టం" అని వాడి అభిప్రాయాన్ని ఒప్పుకొన్నాం.. రాజీపడ్డాం!

బెంగుళూరులో మంచి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు దక్కించుకుని వినోద్ సంతోషంతో ఉన్నాడు. మేమూ ఆనందంలో పాలుపంచుకున్నాం.



కాలేజీ సీటు పొందిన వినోద్ నెలఖర్చుల, హాస్టల్ ఖర్చుల లిస్ట్‌ను మా ముందుంచినప్పుడు.. ఉన్నట్టుండి నా మనస్సును చీకటి ఆవరించింది. ఉద్యోగ విరమణ అంచుల్లో ఉన్న నేను ఆ డబ్బును ఎలా జోడించాలా అని ఆలోచించడం ప్రారంభించాను. ఆప్త స్నేహితుడూ సహోద్యోగీ అయిన నాగరాజుకు నా పరిస్థితిని వివరించాను.

"గోవిందరావ్! ఎందుకంత దిగులుపడ్తావ్? ప్రావిడెంట్ ఫండ్ లోన్‌కు అప్లై చెయ్, శాంక్షన్ అవుతుంది. రిటైరయ్యాక, బాకీవున్న అప్పుని పట్టుకుని మిగిలిన డబ్బులిస్తారు" అని నాగరాజు సలహా ఇచ్చాడు.

అది కూడా సరైన పనేనని పీఎఫ్ లోన్‌కి అప్లైచేశాను. శాంక్షన్ చేయించుకుని అబ్బాయి ఖర్చులకు అడ్జెస్ట్ చేసినప్పుడు, ఏదో లోకాన్ని గెలిచినంత అనుభూతి పొందాను.

ఇన్నేళ్లూ విలువలతో పనిచేసి శభాష్ అనిపించుకున్నాను. కాకపోతే ఇప్పుడు చేసిన అప్పుమొత్తం జ్ఞాపకానికి వస్తోంది, బాధిస్తోంది. లలితతో చెప్పినప్పుడు "అబ్బాయి చదువు కానివ్వండి, సంపాదించి అన్ని అప్పులూ తీరుస్తాడు. మీరెందుకు ఆలోచిస్తారు? " అంది. ఆమె ధైర్యాన్ని మనసులోనే మెచ్చుకున్నాను.

వినోద్ బెంగుళూరులో ఇంజనీరింగ్ కోర్స్‌లో చేరినప్పుడు, ఇంట్లో లలితా నేనూ

ఇద్దరమే. కొన్నిసార్లు మాటలు దీర్ఘమైతే, మరికొన్నిసార్లు అంతా మౌనం. చదువుపై ధ్యాస వుంచమని లలిత వినోద్‌కు చెప్పినప్పుడల్లా, ఆమె ఆతృత చూసి మనసులోనే నవ్వుకునేవాడ్ని. వినోద్ త్వరగా చదువు ముగించి, ఉద్యోగంలో చేరి, అప్పులు తీర్చి. మా ఇద్దర్నీ చూసుకోవాలన్న ఆమె అభిలాష, కోరిక చూసి ఆశ్చర్యపడేవాడ్ని. అబ్బాయి చదువుల గురించి ఆమెలాగే నాకూ ఆసక్తి వున్నా, బయటికి చూపే ప్రయత్నంచేయలేదు.

రిటైర్‌మెంట్ రోజులు సమీపిస్తున్నకొద్దీ.. నాలో సమాజసేవ, దేవతారాధన పెరగసాగింది. నిత్యం సేవ, ఆరాధనలతో మనసును తేలికపరుచుకునేవాడ్ని. 'వర్క్ ఈజ్ వర్షిప్' అని నమ్మినవాడ్ని. తోటి వుద్యోగులు "మీరొక్కరూ విలువలున్నవారైతే చాలా? సమాజమేమైనా ఉద్ధరిస్తుందా? " అని గేలిచేసేవారు. చిరునవ్వుతో మౌనం వహించేవాడ్ని. మళ్ళీ మాటలు పెంచడానికి ప్రయత్నించకుండా వాళ్ళు వూరుకునేవారు. ఆ అవస్థలు చూసి నేనూ జాలిపడేవాడిని. నాకు నేనుగా విలువలతో వుండేందుకు ప్రయత్నిస్తున్నా, కొందరి హాస్యాలు నా మనస్సును గుచ్చి గాయంచేసేవి. అవి నన్నెంతగానో నొప్పించినప్పుడు, ఇక చావుని ఆహ్వానిద్దామనే ఆలోచించాను..

చీకటిని పారదోలేందుకు దీపముంటుంది, అలాగే జ్ఞానమూ వుండాలని ఆలోచించేవాడ్ని. మనసులో ఎన్నో ఆలోచనలు వస్తుండేవి. మౌనంగా ఉండడమే ఉత్తమ మార్గమనుకుని, చావు యోచనని దూరంగా వుంచాను. వంశోద్ధారకుడి గురించిన ఆలోచన ఒక వైపైతే, మరోవైపు తోటి వుద్యోగుల సూటిపోటి మాటలు! ఆ మాటలే ఎక్కువగా నా మనసును నొప్పించేవి. అయినా దృఢనిశ్చయంతో ఉండేవాడ్ని. రిటైర్ అయ్యేవరకూ విలువలతో వుండడానికే ప్రయత్నించాను.

రిటైర్‌మెంట్ రోజు రానేవచ్చింది. నా పనికి అదే చివరిరోజు. ఆఫీసుతో ఉన్న సంబంధం వీడ్కోలు సభతో ముగిసింది. ఇన్నాళ్ళూ నన్ను నొప్పించిన నా తోటి వుద్యోగులు కూడా ఇప్పుడు మంచిమాటలే చెప్పి పూలదండ వేసి, చిరు కానుకతో నన్ను ఇంటికి పంపించారు.

పెన్షన్ కోసం తిరిగిన తర్వాత, అన్ని అప్పులూ తీర్చాక.. రెండున్నర లక్షల పైకం చేతికి అందింది. అది చాలా పెద్ద మొత్తంగా అనిపించింది. పెన్షన్ ఫిక్స్ అయినప్పుడు, పెద్ద బరువు దించుకున్నట్టు అన్పించింది. వచ్చిన డబ్బును బ్యాంకులో పెట్టి బాండ్లు తీసుకుని సంతోషంగా వున్నప్పుడు, వినోద్ నుంచి వుత్తరం వచ్చింది. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం పరీక్ష ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యానన్న తియ్యని కబురు రాశాడు.

"హమ్మయ్య, దేవుడు కరుణించాడు. ఇక మన కష్టాలన్నీ తీరతాయ"ంటూ సంతోషపడింది లలిత. "వినోద్ ఇక్కడికి రానీ, అన్ని విషయాలూ తెలుసుకుందాం" అని నేననగానే, లలిత సరేనని తలూపింది.

నా మనసులో ఎన్నో ఆలోచనలు కదులుతున్నాయి. 'వినోద్ వస్తాడు, మంచి వుద్యోగం సంపాదించి మా అప్పులన్నీ తీర్చేస్తాడు' అనే నా ఆలోచనకు నేనే సిగ్గుపడ్డాను. బయటినుంచి తెచ్చిన వడ్డీ అప్పులన్నీ తీర్చేసి సుఖంగా వుండొచ్చని ఆశించాను. నా ఆశ పరిగెత్తే గుర్రం లాంటిది. లలిత కూడా 'అబ్బాయి పెద్ద ఇంజనీరై, చేతినిండా జీతం తీసుకుని కుటుంబాన్ని చూసుకుంటాడు' అని ఎదురుచూస్తోంది. క్షణాల్ని లెక్కపెడుతోంది.

వినోద్ వూరినుంచి ఇంటికి వచ్చినప్పుడు, మా ఇద్దరి సంతోషానికీ ఎల్లలు లేవు. లలిత వాడికిష్టమైన వంటలు చేసి పెట్టింది. అందరం భోంచేసి ఇంటిముందున్న అరుగుమీద వచ్చి కూర్చున్నాం. "ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నావా? " అని అబ్బాయిని అడిగాను. లలిత కూడా వాడు చెప్పే సమాధానం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

"లేదు నాన్నా! ఉద్యోగానికి ప్రయత్నించను. నేను చదువు కొనసాగించడానికే నిశ్చయించుకున్నాను. ఎం.బి.ఎ. చేస్తే ఇంకా ఎక్కువ జీతాలొస్తాయి. మిమ్మల్ని రుణవిముక్తుల్ని చేస్తాను, ఆనందం కలిగిస్తాను" అంటూ కొత్త విషయాన్ని చెప్పాడు.

"డబ్బుకోసం ఏం చేస్తావ్?" అని ప్రశ్నించాను.

"మీ పెన్షన్ డబ్బులు ఇచ్చేయండి. కోర్సు ముగిసిన తర్వాత, ఉద్యోగం సంపాదించి అన్ని డబ్బులూ తిరిగిచ్చేస్తాను. అప్పు, వడ్డీ అన్నీ తీర్చేస్తాను" అని అబ్బాయి సమాధానం!

విన్న లలిత విస్మయం చెందింది. "బ్యాంక్‌నుంచి అప్పుతీసుకుని చదువులు కొనసాగించవచ్చు కదా. పెన్షన్ డబ్బులు మాత్రం ఇవ్వం" అని నా తరపున ఆమె చెప్పినప్పుడు, వినోద్ ముఖం గంభీరంగా మారింది. "డబ్బు ఒక్కటే ప్రధానం కాదు, కొడుకు భవిష్యత్తు గురించి ఆలోచించరాదా" అంటూ మాకు చెప్పసాగాడు. చదువుపై వాడికున్న ఉత్సాహం, అప్పు తీర్చే పట్టుదల నాలో విశ్వాసాన్ని నింపింది. లలిత కాదన్నా, నేనే తుది నిర్ణయం తీసుకుని బ్యాంకులోని డబ్బుని విత్‌డ్రా చేసి వినోద్ ఎం.బి.ఎ. లో చేరడానికి ఇచ్చాను. వాడు ఆనందించాడు.

నేను రాజీ పడ్డాను. లలిత నా మాటలతో ఉపశమించింది.

నా అప్పుల వడ్డీ రోజురోజుకూ ఎక్కువవుతోంది. దానికితోడు వినోద్ ఉన్నత చదువుకి అయ్యే ఖర్చుల గురించి సతమతమయ్యేవాడిని. నా మనసులోని ఆందోళనలు లలితకు అర్థమవుతుండేవి, కానీ అసహాయురాలు.

అప్పులవాళ్ల బాధ తట్టుకోలేకపోయాను. నా మర్యాద కాపాడుకోడానికి ఇల్లు అమ్మాను. వచ్చిన డబ్బును అప్పులవాళ్లకిచ్చి వాళ్ల నోరు మూయించాను. అద్దె ఇంట్లో ఉండటం మాత్రం కష్టమనిపించింది. 'వినోద్ ఎప్పుడు ఎం.బి.ఎ. కోర్సు పూర్తిచేస్తాడో, మమ్మల్ని ఎప్పటికి రుణవిముక్తుల్ని చేస్తాడో' అనుకుంటూ రోజులు లెక్కపెట్టేవాణ్ణి.

దేవుడు దయామయుడు. వినోద్ ఎం.బి.ఎ పరీక్షల్లో మంచి ర్యాంకు తెచ్చుకున్నాడు. వాడి విద్యార్హతల మేరకు పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

'ఇంకేం.. గోవిందరావు, లలిత గెలిచారు. అబ్బాయి సంపాదించి వాళ్లను బాగా చూసుకుంటాడు' అని ఇరుగుపొరుగు అనుకోవడం నా సంతోషాన్ని పెంచింది. చేతినిండా జీతం, ఉండటానికి బంగళా, కంపెనీ కారు.. వినోద్‌కు కొన్నాళ్లకే లభించాయి. నేనూ లలితా మహానందపడ్డాం. కంపెనీ నుంచి వినోద్‌కి మంచి సదుపాయాలు కలిగి, మమ్మల్ని ఈ బాధలనుండి దూరంచేస్తాడన్న ఆశతో గోపురాన్ని కట్టాం! బంగళాలో మేమిద్దరం నివసించడానికి వినోద్ ఏర్పాట్లు చేసినప్పుడు మా సంతోషానికి అవధులు లేవు.

వినోద్ పెళ్లి ప్రస్తావనతో నా పేర ఉత్తరాలు రాసాగాయి. జాతకాలు, ఫొటోలు కుప్పలుగా వచ్చాయి. ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల తాపత్రయం వాటిలో కనిపించింది. వినోద్‌కు వస్తున్న జీతం, ఉన్న బంగళా, కారు అన్నీ వాళ్లని ఆకర్షించాయి. అప్పు తీర్చే ప్రస్తావన అబ్బాయిముందు చేయాలని ప్రయత్నిస్తూ, ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్నాను.

ఓ అందమైన అమ్మాయి ఫొటో, జాతకం వినోద్‌కు చూపించాం. సమ్మతించాడు. అమ్మాయిని చూసి మెచ్చుకున్నాడు. ఓ సుముహూర్తంలో వాడి పెళ్లి జరిపించినప్పుడు, అందర్లోనూ సంతోషమే.

వినోద్, వాడి భార్య రత్న నవదంపతులుగా హనీమూన్ ముగించుకొని వచ్చినప్పుడు, లలిత సంతోషంగా వారిని ఆహ్వానించింది.

లలిత ఆశ, కోరిక తీరిందా అన్నట్లు సంవత్సరం తిరక్కుండానే రత్న మగబిడ్డను ప్రసవించింది. మనవడిని చూస్తూ లలిత అన్ని దుఃఖాలూ మరవడానికి ప్రయత్నించేది. పుట్టింటివారిచ్చిన బంగారపు చైను, గాజులు మార్పించి బంగారు మొలతాడు, గాజులు, గొలుసు చేయించి మురిసిపోయింది.

బోసిపోయిన లలిత మెడ, చేతులు చూసి "ఇకముందు ఏం చేస్తావు?" అని అడిగాను.

"మీరున్నారు కదా!" అని చిరునవ్వుతో బదులిచ్చింది.

మనవడి ఆటపాటల సంతోషంలో మేం మునిగివున్నప్పుడు "అమెరికాకు డిప్యుటేషన్ పని వచ్చింది. కొన్ని సంవత్సరాలు వుండి ఇంకా డబ్బు సంపాదించి తిరిగి వస్తాను" అన్నాడు వినోద్.

నేను చలించిపోయాను. "ఇక్కడే ఉండడానికి వీలుపడదా?" అని ప్రశ్నించాను.

‘డబ్బుల వర్షం’ అంటూ ఎన్నో మాటలు చెప్పి మా అనుమతి కోరాడు.

మేం రాజీపడ్డాం!

వినోద్, రత్న, మనవడు విదేశాలకు వెళ్లినప్పుడు ఇల్లంతా బోసిపోయింది. ఇంట్లో అన్ని సదుపాయాలూ వున్నా, బిడ్డ బహుదూరంగా వెళ్ళిపోవడమంటే జీవిత సంబంధాలను తెంచివేసినట్లే అనిపించింది. ‘డబ్బు ముందు సంబంధం అనేది చిన్నదిగా మారిందా? ’ అనుకున్నాను.

ఇంట్లో మళ్ళీ మౌనం ఆవరించింది. లలితా నేనూ మళ్ళీ ఒంటరిగా మిగిలాం. మాటలు తక్కువై, మౌనమే ప్రధానమై, చివరికి నిశ్శబ్దమే పైచేయి సాధించింది!

రోజులు గడుస్తున్నాయి. వినోద్ ఫోన్ ద్వారా మా యోగక్షేమాలు అడిగేవాడు. డబ్బుపై ప్రేమ పెరిగింది వాడికి. ఎక్కువ డబ్బు ఆర్జించి శ్రీమంతుడైపోతున్నాడు. ‘కానీ మానవత్వాన్ని మరిచిపోతున్నాడా? తల్లిదండ్రులంటే ఉదాసీనత చూపిస్తున్నాడా? ’ అనిపించసాగింది.

విదేశానికి ఎగిరిపోయిన వినోద్ దంపతుల్ని, మనవడిని చూడాలని లలిత ఆరాటపడుతోంది. ‘ముందు నీ ఆరోగ్యం చూసుకో. ప్రశాంతంగా ఉండు’ అని చెప్పేవాడ్ని. వంశోద్ధారకుడైన అబ్బాయిని చూడాలన్న ఆతృతతో ఆమె క్రమంగా కృశించసాగింది. ఓ రోజు తెల్లవారుజామున నేను వాకింగ్ ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చేటప్పటికే, గుండెలో నొప్పిగా వుందని చెప్పింది. వెంటనే ఆమెను డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి చెకప్ చేయించాను. గుండె జబ్బు అని తేలింది. ‘బైపాస్ సర్జరీ చేయాల’ని డాక్టర్ అన్నప్పుడు మానసికంగా కుంగిపోయాను.

వినోద్‌కు విషయం తెలిపినప్పుడు ‘స్వదేశానికి రావడానికి లీవు దొరకద’న్నాడు! ‘సెలవు కూడా సమస్య’ అని చెప్తూ, ఆపరేషన్‌కు డబ్బు మాత్రం పంపించాడు.

లలితకు బైపాస్ సర్జరీ చేయించాను. ‘ఆపరేషన్ సక్సెస్ అయింది కదా’ అనుకుని ఊపిరిపీల్చుకున్నాను. ఇంటికి తీసుకొచ్చినప్పుడు, లలిత మునుపటి వ్యధతోనే ఉంది. అబ్బాయిని చూడాలన్న కోరికతో మరింత కృశించసాగింది. ఓ రోజు వున్నట్టుండి శాశ్వత నిద్రలోకి జారిపోయింది!

తల్లి చావు వార్త విన్న వినోద్ ఇ-మెయిల్ ద్వారా.. తను రాలేనని తెలిపాడు! దుఃఖాన్ని వ్యక్తపరిచాడు.

లలిత అంత్యక్రియలు జరిపించాను. అపర కర్మలు పూర్తిచేసే బాధ్యతనీ తీర్చుకున్నాను. ఇన్నాళ్లూ బతుకులో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్న నేను ఇప్పుడు ‘యోగా’కి దగ్గరయ్యాను. శాంతి కలగడం ఆరంభమయ్యింది.

వినోద్‌నుంచి కవరు వచ్చింది. నా అగచాట్లను గ్రహించి రాసినట్లుంది అందులో. హైటెక్ వృద్ధాశ్రమంలో చేరమని సలహా ఇస్తూ, డబ్బు పంపించాడు. ఒంటరి జీవితం గడిపేకంటే అక్కడ చేరడమే అనుకూలంగా వుంటుందని భావించి, మళ్ళీ నేనే రాజీపడ్డాను!

ఇంటి వస్తువులను అమ్మి అప్పులు తీర్చాను. విశాల పరిసరాల్లో ఉన్న ‘మమతాశ్రమం’లో చేరాను. ఆ వృద్ధాశ్రమంలో భోజనం, ఔషధాలు అందిస్తూ నన్ను బాగా చూసుకునేవారు. ఆ ఆశ్రమం శాంతినీ సంతృప్తినీ ఇచ్చింది. ఆశ్రమ ఖర్చులు భరిస్తానని వినోద్ ఒప్పుకోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించినా, నా అదృష్టంగానే భావించాను.

లలిత జ్ఞాపకాలు నన్ను వెంటాడేవి.

ఆశ్రమవాసులతో స్నేహం, తోడు దొరికిన అనుభూతి.. అన్నీ నాకు సంతోషాన్ని కలిగించాయి. వృద్ధాప్య బాధలను ఓర్చుకోగలుగుతున్నాను. వృద్ధాప్యంలో బిడ్డలు, మనవళ్ళతో కలిసి ఉండటానికి ..పూర్వజన్మ పుణ్యమేదో అవసరమని నా అంతరాత్మ చెప్తూండేది.

పిల్లలు విదేశాలకు ఎగిరిపోవడం ఎక్కువై, వృద్ధాశ్రమాల్లో చేరుతున్నారు తల్లిదండ్రులు. ఇక బెంగుళూరులో మరిన్ని వృద్ధాశ్రమాలు వస్తాయనేది కూడా నా మనసును కల్లోలం చేసింది.

నా కథంతా విన్న ఓ వృద్ధుడు గట్టిగా నవ్వుతూ ‘ఇదంతా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల ప్రభావం’ అన్నపుడు.. నిజమేనన్నట్లు తలూపాను.

అది వరమో, శాపమో అర్థంకాలేదు.

ఆశ్రమం గంట మోగి, ప్రార్థనకు వేళయ్యిందని నన్ను హెచ్చరించింది. ప్రార్థన ముగించుకుని బయటి ఆవరణలోకి వచ్చినప్పుడు, వినోద్‌ని చూసి దిగ్భ్రాంతిచెందాను. నన్ను కలవాలని భార్యాబిడ్డతో సహా వేచి ఉన్నాడు.

ముందు నాకు మాటలు పెగల్లేదు. కొద్ది క్షణాలకు తేరుకుని అడిగాను “ఏరా వినోద్! ఉన్నట్టుండి స్వదేశానికి వచ్చావ్? నీ తల్లి చనిపోయినప్పుడు దొరకని సమయం, వీసా ఇప్పుడు దొరికాయా? ”

వాడు ఏడుస్తూ నా కాళ్ళమీద పడ్డాడు. “క్షమించు నాన్నా! తల్లి రుణం తీర్చకుండా తప్పుచేశాను. డబ్బే ప్రధానమనుకుని బాంధవ్యాన్ని కాలరాశాను. విదేశమే స్వర్గమనుకుని, ఇక్కడి మిమ్మల్ని చిన్నచూపు చూశాను. అక్కడ నా పక్కింటి భారతీయుడు తన తల్లిదండ్రులను పోగొట్టుకున్నప్పుడు.. వాళ్ళ అంతిమ సంస్కారాల కోసం ఎంత పాటుపడ్డాడో! ఆ శ్రమ వివరించడానికి నా దగ్గర మాటల్లేవు. ఆ దృశ్యం నా మనస్సులో గాఢంగా నిలిచిపోయింది. చివరికి తండ్రినైనా దక్కించుకోవాలని నిర్ణయించుకుని కంపెనీపనికి రాజీనామా ఇచ్చి వచ్చేశాను. అనుభవం, విద్యార్హతలు వున్న నాకు ఇక్కడ వుద్యోగం తప్పక దొరుకుతుంది. నువ్వు మాత్రం వృద్ధాశ్రమంలో ఉండకు. నా దగ్గర ఉండడానికి వచ్చేయ్.. ఇంట్లో మనవడిని ఆడిస్తూ హాయిగా వుండొచ్చు ..” అంటూ దీనంగా వేడుకున్నాడు.

ఆశ్రమవాసుల నుంచి దూరంగా వెళ్ళడానికి నా మనసొప్పలేదు. వినోద్‌తో అన్నాను “ఆశ్రమం దరిదాపుల్లో ఇల్లు తీసుకో. అప్పుడు ప్రతిరోజూ నేను ఈ ఆశ్రమవాసులను కలుస్తూ ఉండొచ్చు”.

అందుకు వినోద్ సంతోషంగా ఒప్పుకొన్నాడు. ఆశ్రమం దగ్గర్లోనే ఇల్లు అద్దెకు తీసుకుని, తను ఓ కంపెనీలో వుద్యోగం సంపాదించుకున్నాడు.

జీవితం పొడవునా నేను రాజీలు పడ్డాను. వినోద్ కూడా చేతులు కలిపి, తనూ రాజీ అయ్యాడన్నమాట. V

రష్యన్ కథ

-టాల్‌స్టాయ్

అన్నాచెల్లెళ్ళు

అనువాదం : డాక్టర్ కంజుల కోటిరెడ్డి

మూడు స్తంభాల షిప్ 'అవర్ లేడీ ఆఫ్ విండ్స్'.. అది. కెప్టెన్, పద్నాలుగుమంది సిబ్బందితో సహా హవ్‌రె నుంచి అనేక దేశాలు దాటి చివరకు మార్సెల్లిస్ చేరింది. రేవులోని సుంకపు అధికార్లతో వ్యవహారాలన్నీ పూర్తిచేసుకున్న తరువాత, కెప్టెన్.. సగం మంది నావికులకు ఆ రాత్రి బయట గడిపేందుకు అనుమతించాడు.

అది వేసవికాలం రాత్రి, మార్సెల్లిస్ రోడ్లమీద లైట్లన్నీ వెలుగుతున్నాయి. నావికులకు నాలుగు నెలలు భూ సంబంధ స్పర్శే లేదు. సిటీ విషయాలు తెలియని వీరంతా విదేశీయుల్లానే బజార్లలో నడుస్తున్నారు. సిటీ రాత్రి అందాలు చూస్తూ దేనికోసమో వెతుకుతున్నట్లనిపిస్తోంది. నాలుగు నెలలుగా స్త్రీ సంపర్కం లేనందున వారి కోర్కెలు వురకలేస్తున్నాయి.

నావికులలో పొడగరి, కండలు తిరిగిన వాడు, తెలివైన సిలెస్‌టిన్ డుక్లోస్ మిగతా వారికి గైడ్‌గా వున్నాడు. అతనికి అనువైన ప్రదేశాలు ఏవిటో తెలుసు, ఇతర నావికుల్లా తగాదాలు పడేవాడు కాదు; ఒకవేళ తగాదా అంటూ వస్తే స్నేహితులకు అండగా నిలిచేవాడు.

నావికులు చీకటి బజారుల్లోకి వచ్చారు. తలుపులమీద లాంతర్లు పెట్టిన చిన్న సందుల్లోకి వాళ్ళందర్నీ తీసుకువెళ్లాడు డుక్లోస్. ఆడుతూ పాడుతూ సరదాగా అతని వెంట నడిచారు వారంతా. లాంతర్ల గ్లాసులమీద బజార్ల నెంబర్లు పెయింట్ చేసివున్నాయి. ఇరుకైన తలుపులముందు పేము కుర్చీలమీద విలాసంగా కూర్చున్న అమ్మాయిలు.. విటులను వలలో వేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

ఒక తలుపు వద్ద చిన్న స్కర్ట్ వేసుకున్నావిడ "ఏం కుర్రాళ్లూ! లోపలికి రాగూడదా?' అంది. కానీ డుక్లోస్ అటువైపు వెళ్ళొద్దని మిత్రులను వారించి మరోవైపుకి దారితీశాడు.

★ ★ ★

పబ్‌లోని హాలులో నావికులందరూ కూర్చున్నారు. అక్కడ రూల్ ప్రకారం ఎవరైనా రాత్రంతా ఒక్క స్త్రీతోనే గడపాలి. నావికులు, స్త్రీలు కలసి మద్యంతాగి పై అంతస్తులోని బెడ్‌రూమ్స్‌కి వెళ్లారు. ఇక రాత్రంతా తాగటం, తందనాల కార్యక్రమమే.

వారికి తినటానికి, తాగటానికి హద్దులేకుండాపోయింది. ఆరునెల్ల జీతం నాలుగుగంటల చీకటి రాత్రికి సరిపోయింది. రాత్రి పదకొండు గంటలవరకు తాగి తాగి కళ్లు ఎర్రబడి వారేమి మాట్లాడుతున్నారో వారికే తెలియకుండా



పోయింది. ప్రతి నావికుని ఒడిలో ఒక స్త్రీ. మద్యం, పాటలు, అరుపులు, చప్పట్లు, ఈలల మధ్య ఎవరి ఆనందంలో వారు మునిగిపోయారు.

డుక్లోస్ మోకాళ్లమీద ఎర్రని చెంపలతో బొద్దుగా వున్న ఓ యువతి కూర్చుంది. ఇతరులకంటే తక్కువేమీ తాగకపోయినా, గాళ్ ఫ్రెండ్స్‌తో మాట్లాడే విధానంలో పొరపాటు లేకుండా జాగ్రత్తపడతాడు డుక్లోస్. నవ్వుతూ ఆమెని అడిగాడు "సరే, అంతా బాగుంది.. నువ్వెప్పటినుంచి వున్నావిక్కడ? "

"ఆరు నెలలు" అందామె.

"ఈ పనంటే నీకిష్టమేనా? "

కొంచెమాలోచించి సమాధానమిచ్చింది "అలవాటయ్యింది, ఎలాగో ఒకలాగు బతకాలి కదా. కూలిపని, ఇతరుల పని కంటే ఇదే మేలు"

"నువ్వీ ప్రాంతపుదానివి కాదుగదూ, అవునా? " అన్నాడు.

తలూపిందామె.

"దూరప్రాంతం నుంచొచ్చావా? "

అవునంది.

"ఎక్కడనుంచి? "

గుర్తు తెచ్చుకుంటున్నట్లు ఒక సెకండ్ ఆలోచించి "సెర్‌పిగ్నాన్ నుండి" అంది.

"సరే, సరే" అంటూ కొంతసేపు మౌనం పాటించాడు డుక్లోస్ .

"మీరెవరు, నావికులా? " అడిగిందామె.

"అవును, మేము నావికులం"

"చాలా దూరం ప్రయాణం చేశారా? "

"అవును, చాలా దూరం. అంతేకాదు, అన్నిరకాల దేశాలు చూశాం"

"ప్రపంచమంతా తిరిగారా? "

"ఒకసారి గాదు, రెండుసార్లు."

ఏదో గుర్తు చేసుకున్నట్లు శూన్యంలోకి చూసి అందామె- "మీరు చాలా షిప్స్‌ని చూశారనుకుంటాను? "

"నువ్వేం ఆలోచిస్తున్నావు? "

"అదృష్టవశాత్తు 'అవర్ లేడీ ఆఫ్ విండ్స్'ని చూశారా? అసలా పేరుతో షిప్ ఉందా? " అడిగిందామె.

తన షిప్ పేరు ఆమె చెప్పినందున డుక్లోస్‌కి ఆశ్చర్యమేసింది. "అవును. గత వారం ఆ షిప్‌ని చూశాం" జోక్ చేద్దామని అలా అన్నాడు.

"నిజమా? " తెల్లబోయి అందామె.

"అవును, నిజం."

"మీరు అబద్ధం చెప్పటం లేదుగదా? "

"భగవంతుని సాక్షిగా"

"సెలెస్‌టిన్ డుక్లోస్ అనే పేరుగల వ్యక్తిని కలిశారా? "ఆదుర్దాగా అడిగిందామె.

"సెలెస్‌టిన్ డుక్లోస్? " ఉలికిపాటుతో, కొంత భయంతో రెండుసార్లు అన్నాడు. 'నా పేరెలా తెలిసిందా' అని తనలో తనే ఆశ్చర్యపోయాడు. ఆమెందుకో భయపడినట్లనిపించింది. "నీకెలా తెలుసాయన? " అన్నాడు డుక్లోస్.

"లేదు, నాకు తెలియదు. ఇక్కడొకావిడ ఉంది, ఆవిడకు తెలుసు"

"ఎవరామె? ఈ ఇంట్లోనా? "

"కాదు. ఈ చుట్టుపక్కల"

"చుట్టుపక్కలంటే? "

"దూరంగాదు"

"ఎవరామె? "

"నాలాంటి స్త్రీ"

"అతనితో ఆమెకు పనేంటి? "

"నాకేం తెలుసు? బహుశా వారిద్దరు ఒకే ఊరివారై ఉంటారు"

నేరుగా ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకున్నారు.

"నేనామెను చూడాలి"

"ఎందుకు? ఆమెకేమైనా చెప్పాలా? "

"సెలెస్‌టిన్ డుక్లోస్‌ని చూశానని చెప్పాలని"

"మీరు చూశారా? ఆయన బతికే ఉన్నాడా? ఆరోగ్యంగా ఉన్నాడా? " ఎంతో ఆత్రంగా అంది.

"అవును. ఆరోగ్యంగా ఉన్నాడు. అయినా నీకెందుకు? "

ఏదో గుర్తుతెచ్చుకున్నట్లుగా కొంతసేపాగి శాంతంగా అంది, "'అవర్ లేడీ ఆఫ్ విండ్స్' ఇప్పుడెక్కడికెళ్లింది? "

"ఎక్కడికా? మార్సెల్లిస్"

"నిజమా? " గావుకేక పెట్టింది.

"అవును, నిజం"

"డుక్లోస్ మీకు తెలుసా? "

"ముందే చెప్పాగా తెలుసని"

కొంచెం ఆలోచనలో పడిందామె.

"అతనితో పనేంటి? " అన్నాడు డుక్లోస్.

"మీరతన్ని కలిస్తే చెప్పండి... వద్దు, చెప్పకపోతేనే మంచిదనుకుంటాను"

"ఏంటి? "

"ఏం లేదు, ఏం లేదు"

అదుర్దా ఎక్కువయి ఆమెవైపు చూశాడు డుక్లోస్. "నీకతను తెలుసనుకుంటాను. తెలియదా? "

"లేదు. తెలియదు"

"తెలియకపోతే అతన్ని గురించి ఎందుకు అడుగుతున్నావ్? "

సమాధానం చెప్పక అతని కాళ్లమీద నుండి దూకి పబ్ మేడమ్ వద్దకు వెళ్లింది. నిమ్మకాయ తీసుకొని, రెండుముక్కలు చేసి గ్లాసులోకి పిండి నీళ్లు కలిపి డుక్లోస్‌కి ఇచ్చి తాగమంది. మళ్ళీ అతని ఒడిలోనే కూర్చుందా యువతి.

"ఎందుకు తాగాలి? " గ్లాస్‌ని ఆమె నుండి తీసుకుంటూ అడిగాడు డుక్లోస్.

"ఆల్కహాల్‌ని విరుస్తుంది. తక్కువ తాగాల్సింది మీరు. కొద్దిసేపట్లో చెబుతా, ముందు తాగండి"

తాగి చొక్కా చేతులతో మూతి తుడుచుకొని అన్నాడు "ఇప్పుడు చెప్పు నీ కథ, వింటాను"

"నన్ను చూశావని అతనికి చెప్పవు గదూ? నానుండి విన్నానని కూడా" అంది.

"సరే, చెప్పను."

"దేవునిమీద ప్రమాణం చేసి చెప్పు"

ప్రమాణం చేశాడు.

"ప్రమాణం చేశారా? "

"చేశాను."

"అయితే అతనికి చెప్పండి. అతని తల్లి, తండ్రి, తమ్ముడు అంతా చనిపోయారని. ఒక నెలలోనే వారందరికి జబ్బుచేసి చనిపోయారని"

డుక్లోస్ గుండె వేగంగా కొట్టుకుంది. చాలాసేపు మౌనంగా ఉన్నాడు. ఏం మాట్లాడాలో తెలియలేదు. "నీకిదంతా నిజంగా తెలుసా? " చివరకు అడిగాడు.

"నిజంగానే తెలుసు."

"ఎవరు చెప్పారు నీకు? "

చేతుల్ని డుక్లోస్ మెడచుట్టూ వేసి నేరుగా అతని కళ్లలోకి చూసి అంది "దేవుని మీద ప్రమాణం చెయ్యి, ఈ సీక్రెట్ ఎవ్వరికి చెప్పనని"

"దేవుని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను."

"నేను ఆయన చెల్లెల్ని"

"ఫ్రాన్‌కోస్‌వా? " అని గావుకేక పెట్టాడు.

కన్నార్పకుండా డుక్లోస్ వైపు చూస్తూ అతికష్టంమీద అంది" నువ్వా సిలెస్‌టిన్? "

వారిద్దరిలో కదలిక లేదు. ఒకరి కళ్లలోకి ఒకరు చూస్తూ మంచుగడ్డలా అయ్యారు.

"ఇదేలా? " తన మాటలు తనకే వినిపించనట్లుగా అన్నాడు డుక్లోస్.

చెల్లెలి కంటినిండా నీళ్లు నిండగా అంది "అవును. వారు ముగ్గురూ ఒక నెలలోనే చనిపోయారు. నేనేమి చెయ్యను? ఒంటరినయ్యాను. మందులకు, డాక్టర్ బిల్లులకు, ఉత్తర క్రియలకు నా వద్ద ఒక్క పెన్నీ కూడా లేదు. భూకామందు కుంటి కషెన్ నీకు గుర్తున్నాడనుకుంటాను. అతని వద్ద పనికి చేరాను. నాకప్పుడు పదిహేనేళ్లే. ను

వ్వెళ్లినప్పుడు నాకు నిండా పధ్నాలుగేళ్లు కూడా లేవు. నేను కషెన్‌తో పాపం చేశాను- స్త్రీలం, మేము మూర్ఖులం. కొన్నాళ్లొక బాడుగింట్లో అతని ఉంపుడుగత్తెగా ఉన్నాను. తరువాత నన్నొదిలేశాడు; మూడురోజులేమీ తినలేదు నేను. ఎవరూ నన్నాదరించలేదు. ఇక ఇక్కడికొచ్చాను, అందరిలాగే" ఆమె కళ్లనీళ్లు ఏకధాటిగా కారి చెంపలమీదుగా నోటిలోకి జారాయి.

"అయ్యో.. ఎంత ఘోరమైన పని చేశాం మనం" తీవ్రమైన బాధతో అన్నాడు డుక్లోస్.

"నువ్వు చనిపోయావనుకున్నాను" పీల గొంతుతో అంది. "నేనీపాపం కోరుకున్నాననుకున్నావా? "

"నువ్వు నన్నెందుకు గుర్తుపట్టలేదు? "

"తెలియదు! అది నా తప్పుగాదు!" వాదిస్తూ పెద్దగా ఏడ్చింది.

"నేను నిన్ను గుర్తుపట్టగలననుకున్నావా? నేను నిన్ను వదలివెళ్లినప్పుడు ఇలా లేవు. కానీ నువ్వు నన్నెందుకు గుర్తుపట్టలేదు? " ఉద్వేగంతో అడిగాడు డుక్లోస్.

నిరాశతో తలపట్టుకొని అంది చెల్లెలు "చూడు.. ఇక్కడెంతో మందిని చూస్తాను నేను. వారంతా ఒకటిగానే కనబడతారు".

గుండెకి తగిలిన గాయంతో గావుకేక పెట్టాలనుకున్నాడు డుక్లోస్. దెబ్బలుతిన్న చిన్న పిల్లవాడిలా భోరున ఏడ్వాలనుకున్నాడు. లేచి నిలబడి ఆమె తలను తన చేతుల్లోకి తీసుకొని ముఖంలోకి పరీక్షగా చూశాడు.

క్రమంగా గుర్తుపట్టాడు- సంతోషం ఉట్టిపడుతున్న (అప్పటి) చిన్నమ్మాయి ముఖం. అవే కళ్లు- తాను వదలేసినప్పుడు చివరగా మూసిన కళ్లు, "అవును, నువ్వు తప్పక నా ఫ్రాంకోస్‌వే, నా చెల్లెలివే" అని గొణిగాడు. ఎక్కిళ్లుపెడుతూ ఏడ్చాడు.

ఆమె తలనొదలి టేబుల్‌ని పిడికిలితో గట్టిగా కొట్టగానే, గ్లాసులన్నీ కిందపడిపోయి ముక్కలయ్యాయి. వెర్రిగా అరిచాడతను.

స్నేహితులంతా రెప్పవేయకుండా చూశారు డుక్లోస్‌ని. "చూడండి, పూర్తిగా మత్తులో ఉన్నాడతను" ఒకడన్నాడు.

"అరవొద్దు" అన్నాడింకొకడు.

"ఏయ్ డుక్లోస్! ఎందుకు గోల చేస్తావ్? పైకి వెళ్దాంరా" అంటూ ఒకచేత్తో అతని చొక్కా చేతిని, రెండో చేత్తో అతని మోకాళ్లమీద కూర్చొన్నామెను కౌగలించుకున్నాడొకడు.

డుక్లోస్ ఒక్కసారి శ్వాస ఆపి, కన్నార్పకుండా స్నేహితులవైపు చూశాడు. పెల్లుబికిన కోపంతో పిడికిలి బిగించి చెల్లెల్ని కౌగిలించుకున్నవాడి వైపు అతి వేగంగా వెళ్లాడు.

వేరుచేసి వాడిని చావబాదుతూ ఆగ్రహంతో అన్నాడు "వొదిలెయ్, ఆమెనొదిలెయ్. ఆమె నా చెల్లెలని తెలియదా? వారంతా ఎవరో ఒకరి చెల్లెళ్లు, అక్కలు. ఫ్రాంకోస్‌ని చూడు ఆమే.. చెల్లెలే.. హ- హ- హ!"

డుక్లోస్ నిజంగా ఏడుస్తున్నా, నవ్వుతున్నట్లనిపించింది. శరీరం పట్టుతప్పిపోగా చివరికి కిందపడ్డాడు. ముఖం నేలవైపుగా ఉంచాడు. కాళ్లతో, చేతుల్తో నేలను తంతూ దొర్లాడాడు.


అరిచి అరిచి గొంతు పూడింది. చనిపోతున్నాడా అన్నట్లు గురకకూడా పుట్టింది.

"అతన్ని మంచంమీద పడుకోబెడదాం. బయటకువెళ్తే పోలీసులు పట్టుకుంటారు" స్నేహితుడొకడన్నాడు.

డుక్లోస్‌ని పైకి తీసుకెళ్లి ఫ్రాంకోస్ బెడ్‌రూంలో పడుకోబెట్టారు మిత్రులు.

(టాల్‌స్టాయ్ శతవర్ధంతి సందర్భంగా 'విపుల' పాఠకులకు ఈ కథ ప్రత్యేక కానుక. ప్రత్యేక వ్యాసం ఈనెల చతురలో)

తెలుగు కథ



- అరుణశర్మ

స్వాతి ముత్యాలు

“పెళ్లి అనేది ఏడు జన్మల సంబంధం. అది అనురాగం, అనుబంధాల కోసమో, రుణానుబంధాలతోనో రిలేట్ అయి వుంటుందిట” అంటూ పాప తన చేతిలో వున్న పకోడీల ప్లేటును టీపాయి మీద పెట్టి, మామ్మ పక్కన సోఫాలో కూర్చుంది.

“ఈ జన్మ బాంధవ్యాన్ని బట్టి, అది వారి ఎన్నో జన్మ సంబంధమో చెప్పవచ్చుట తెలుసా? ” అంది మళ్లీ.

ఆదివారం మధ్యాహ్నం తీరిగ్గా కూర్చుని మాట్లాడుతున్నా, ఆమె ముఖంలో సీరియస్‌నెస్ ఉండటం చూసి “అయితే తగవులాడుకొనే, విడిపోయే భార్యాభర్తలు మొదటి జన్మవాళ్లా, ఏడోజన్మ వాళ్లా? ” వెక్కిరిస్తున్నట్టన్నాడు అనిరుధ్.

అతని మాటకి జవాబు చెప్పకుండా

"పెళ్లి అనేది ఏడు జన్మల సంబంధం, అవునా? ఏం మామ్మా! నువ్వు చెప్పు" బుంగమూతి పెట్టి అడిగింది.

"ఏం మామ్మా! నువ్వు చెప్పు" పాపని అనుకరించాడు.

"ఊ!! అనీ" సాగదీసింది.

"అనీ ఏమిటి? నా పేరు అనిరుధ్"

"చాల్లే గొప్ప"

"పోనీ 'హనీ' అంటే సరిపోతుంది"

"ష్!! మామ్మ!" కళ్లు గుండ్రంగా తిప్పింది.

"ఇలా ఏదో ఒక టాపిక్‌మీద డిస్కషన్ చేస్తే కానీ నీకు తోచదా" పక్క సోఫాలో కూర్చున్న అనిరుధ్ మళ్లీ భార్యని రెచ్చకొడుతూ అన్నాడు.. ఆమె తెచ్చిన ప్లేట్లో ఉన్న ఒక పకోడి తీసుకుంటూ..

"ప్రతి జీవీ.. మరో జీవి కోసమో, ఒక పెద్ద పనో లేదా చిన్న పనో చేసేందుకో ఈ లోకంలో పుడతారనుకుంటా!"

ఈమధ్య పెళ్లయిన కొత్త జంట అది. వాళ్ల వాదులాట ముచ్చటగా వింటున్నాను. కానీ పాప మాటలు నా మనస్సును మా పెద్దక్క జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లాయి.

★ ★ ★

గురజాడవారి గిరీశానికి బాపూ తన బొమ్మతో ఒక రూపాన్ని యిచ్చారు. అలాగే కె. విశ్వనాథ్‌గారి స్వాతిముత్యం సినిమాలో కూడా. అందులో కమల్‌హాసన్ క్యారెక్టర్నీ చూశాక మా బావ రామశాస్త్రి ఏమిటో మాకు తెలిసింది.

అమ్మ భాషలో తన పిల్లలు 'ఆణిముత్యాల'యితే, అందులో 'స్వాతిముత్యం' లాంటిది మా పెద్దక్క సుబ్బులు.

ఊహ సరిగా తెలియనప్పుడు చేసిన పెళ్లి. తెలిసీ తెలియని వయస్సులో నాన్న ఈ అమాయకుడికి ఇచ్చి తన జీవితం అన్యాయం చేశాడని అప్పట్లో వాపోతూండేది. మా అమ్మకి ఆ పెళ్లి ఇష్టం లేకపోయినా, మేనల్లుడు, తండ్రిలేని అమాయకుడుకి తన అక్క కొడుకు అయిన రామశాస్త్రికి కూతుర్నిచ్చి సరైన నిర్ణయం చేశాననే అనుకున్నారు నాన్న, తనని పెంచిన తన అక్క రుణం తీర్చుకున్నానన్న సంతృప్తి కూడా వుండేది ఆయన్లో. వ్యాపారంలో కాస్త డబ్బు గడించగానే, సీతాలత్తయ్యకు చిన్న సొంత ఇల్లు ఏర్పరిచారు. అల్లుడికి చిరుద్యోగం ఇప్పించి ఒక పక్కన వుంచారు. అత్తయ్య కూతురు దేవికకు పెళ్లి అయింది. ఆ కుటుంబాన్ని ఒకదారిలో పెట్టి తనవంతు బాధ్యత తీర్చుకున్నారు నాన్న.

రామశాస్త్రి బావది భారీ శరీరం. ఒక కంపెనీలో క్యాష్‌బాక్స్‌కి కాపలా కూర్చునే పని. మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా ఆలింగనం చేసుకుని శివుడి నుంచి వరాన్ని పొందినట్టు.. ఆ బాక్స్ మీద ఈగ వాలనివ్వని ఆయన్ని ఆ కంపెనీవారు ఆయన ఉన్నంతకాలం పనిలో అట్టేపెట్టుకున్నారు. తక్కువ జీతమయినా, ఉద్యోగం పురుషలక్షణం అనే సూత్రాన్ని పాటించాడు రామశాస్త్రి బావ.

ఉద్యోగానికి వెళ్లే అల్లుడిని చూసింది అమ్మ. చెప్పిన మాట వినే మొగుడు, బంగారాల్లా పిల్లలు పుట్టడంతో పెద్దక్క విషయంలో అమ్మ కొంత ఊపిరి పీల్చుకుంది. గొప్ప సంబంధాలని చేసిన మిగిలిన ముగ్గురు ఆడపిల్లల్లో.. తాగుబోతు భర్తతో ఒకరున్నారు. క్యాంపులంటూ ఇల్లు పట్టకుండా తిరిగే మరొక అల్లుడు. అత్తవారింట్లో అవస్థపడుతున్న నాలుగో కూతుర్నయిన నేను. నా బాధలు వింటూన్న ఆమె, పెద్దకూతురి బతుకే కొంత మెరుగ్గా ఉందనుకునేది.

పిల్లలందర్లోకి ఎంతో తెలివైన పెద్దక్కకి పరిస్థితులు అర్థమవుతున్నాయి. తల్లి నగలు వేసుకొని, తండ్రితో కార్లో పెళ్లిళ్లకి, పేరంటాలకి వెళ్లటం చూసింది. పుట్టింటికి వచ్చిన చెల్లెళ్లు ..పెద్ద ఉద్యోగస్తులయిన

భర్తలతో సరదాగా సినిమాలకి వెళుతున్నప్పుడు చూసింది. తమ్ముడు భార్యమీద ఛలోక్తులు విసురుతూ ముచ్చట్లాడుతున్నప్పుడు చూసింది. తెల్లమొహం వేసుకుని అన్నం కంచం ముందుకూర్చునే భర్తను చూసే ఆమె దిగులుపడేది, తనకు జరిగిన అన్యాయానికి ఉక్రోషపడేది. చిరుదీపాల్లా పిల్లల్ని చూసినప్పుడు ఈ పిల్లలే తన జీవితానికి ఓ అర్థం, ఆనందం అనుకునేది.

★ ★ ★

'చదువురానివాడవని దిగులు చెందకు' పాట రేడియోలో వివిధభారతి కార్యక్రమంలో పెద్దగా వినిపిస్తోంది.

"పెద్దక్కా!" పిలుస్తూ లోపలికి వెళ్లాను

నా పిలుపు విని గబగబా కళ్లు తుడుచుకుంటూ వచ్చింది."సూర్యా! వచ్చావా! నేనే అమ్మావాళ్లింటికి వద్దామనుకుంటున్నా! బావ ఇప్పుడే షాపుకెళ్లారు"

"అవును సందుచివర ఎదురయ్యాడు"

తెల్లటి యిస్త్రీ ధోవతీ, తెల్లటి చొక్కా, ఉత్తరీయం వేసుకుని, కాళ్లీడుస్తూ వెళ్తున్న బావని తను పలకరించింది.

ఇంట్లో అడుగు పెట్టినపుడు, కొంగుతో కళ్లు తుడుచుకుంటున్న అక్క ముఖం గుర్తొచ్చి, "ఏమయిందక్కా? " అడిగాను.

"బావకెటూ చదువులేదు. పిల్లలు ముగ్గుర్నయినా బాగా చదివించాలే"! ముఖంలో ఒక పట్టుదల కనపడింది.

"ఇప్పుడేమయింది చదువుతున్నారుగా!"

"అవుననుకో! కృష్ణపండు సరిగా మాట వినడు, చదువుకోడు. అత్తయ్యా పోవటంతో అన్ని నేనే చూసుకోవాల్సి వస్తోందే, పిల్లల పనులు. బావ సంగతి తెలుసుగా!" అధైర్యంగా అంది.

రెండేళ్ల తరువాత పుట్టింటికి వచ్చిన నాకు, అక్కతో అమ్మతోనూ ఎన్నో కబుర్లు.. ఇంటికి వచ్చినా అక్కముఖం, అప్పుడప్పుడూ అమ్మ చెప్పే మా చిన్నతనపు రోజులు గుర్తొచ్చాయి.

★ ★ ★

వరుసగా ఆడపిల్లలవటంతో మగ పిల్లాడిమీద కాంక్షతో చిన్న సుబ్బులికి చొక్కాలు వేసేది మా అమ్మ అన్నపూర్ణమ్మ. ఆ చుట్టుపక్కల పిల్లలకి నాయకురాలు సుబ్బులక్కయ్య. ఇద్దరు చెల్లెళ్లని ఇంటి గుమ్మం ముందు కూర్చోబెట్టి, పెద్ద చెల్లెల్ని అంటే మా చిన్నక్కని మాత్రం చెయ్యిపుచ్చుకు ఆటలకి తీసుకువెళ్లేదట.

"బావా రా!" అత్తతోపాటు ఇంటికి వచ్చిన బావని ఆటలకి పిలిచింది ఏడేళ్ల సుబ్బులు. ముందుకు నడవబోయి దబ్బున పడ్డాడు రామశాస్త్రి.

"అయ్యయ్యో!!" బావ చొక్కా దులిపింది.

పిల్లలంతా నాలుగు స్తంభాలాట ఆడుతున్నారు. రామశాస్త్రికి ఆట ఎలా ఆడాలో సుబ్బులు నేర్పింది.

మళ్లీ మళ్లీ చెప్పింది "ఎంత చెప్పినా రాదేం? తెలియదా? " కసిరింది. తోటిపిల్లలంతా నవ్వటం మొదలుపెట్టారు.

"ఛీ.. నీతో నే ఆడను"

లోపలికి వచ్చిన సుబ్బుల్ని చూసి, సీతాలత్తయ్య "అమ్మా అన్నపూర్ణమ్మా! పిల్లకి ఆ మగరాయుడి బట్టలు మానేసి, పరికిణీ జాకెట్టు వెయ్యి. దానికి చదువులెందుకు? బడి మాన్పించవమ్మా, మా వాణ్ణి కట్టుకు కాపురం చెయ్యాలి కదా!" అందిట.

ఆడపడుచు మాటలు వినక తప్పలేదు అమ్మకి.

"నా స్నేహితులు నవ్వుతున్నారు. చొంగ కారుస్తూ, ఒక్క ఆట సరిగా ఆడని ఆ పిచ్చి బావని నే చేసుకోను" అని పెళ్లి అంటే తెలియని ఆ వయస్సులోనే ఏడ్చిందట అక్క.

తమ్ముడు పుట్టిన కొద్దికాలానికే అక్క పెళ్లయినా, ఆ తరువాత నాలుగు సంవత్సరాలకి కాపురానికి వెళ్లిందట.

అమ్మ ఒకసారి, 'బొమ్మలాంటి నా కూతుర్ని నీకిచ్చా' అందిట. అప్పట్నించి, అక్కని 'బొమ్మా' అని పిలిచేవాడు బావ.

అక్క తనవాడైన బావని తీర్చిదిద్దుకుంది, పెద్దరికం తెచ్చుకొని అన్ని బాధ్యతలు తనే తీసుకొని పిల్లల్ని పెంచింది.

తమ్ముడు విదేశాలెళ్లాక మిగిలిన ఆడపిల్లలం మాఊరికి దూరంగా ఉండటంతో, బాగా పెద్దవాళ్లయిన అమ్మా, నాన్నలకి అక్కే ఆధారమయింది. వారిని చివరిదాకా కనిపెట్టుకుంది.

★ ★ ★

తన పిల్లల్ని పెద్దచేసి, సరైన దారిలో పెట్టి, ఇక తన పని ముగిసిందన్నట్టు పెద్దక్క వెళ్లిపోయింది, నిండు ముత్తయిదువుగా! అమ్మవారిలా! ఆనాడు పెద్దక్క, మా బావని వదిలి వెళ్ళిందనే అనుకున్నాం!!

సాయంత్రం మొదట గుండెపోటు వచ్చి మళ్ళీ తెల్లవారుఝామున రెండోసారి గుండెపోటు రాగానే ప్రాణం పోయిందిట. పక్కవూళ్ళో వుండే అక్క పెద్దకొడుకు కృష్ణపండు ఆ రాత్రే చేరుకున్నాడు. హైదరాబాదులో ఉంటున్న నాకు, ఆఖరిచూపు దక్కినా చివరిగా మాట్లాడే అవకాశం మాత్రం రాలేదు. అక్క కూతురు రాజేశ్వరి, రెండో కొడుకు సోము దగ్గరే ఉండటంతో వచ్చారు. దూరంగా వున్న మా మూడో అక్క, విదేశాల్లో ఉన్న తమ్ముడు తప్ప, మిగిలిన బంధువులు, స్నేహితులు చుట్టుప

క్కల ఉండేవాళ్ళు వచ్చారు.

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం..

మధ్యాహ్నం శవాన్ని తీసుకెళ్ళేదాక, మనుషులతో కిటకిటలాడింది యింటిముందు. నాన్నవైపు పెద్ద ఆడపిల్ల అక్కయ్య, అటువైపు బావ పెద్ద మొగపిల్లాడు. బంధుప్రీతి వున్న అక్కయ్య అందరికి ఆసరాగా వుంటూ ఇటు బంధువుల్లో, అటు స్నేహితుల్లో అందరికి తల్లో నాలుకగా మెలిగి ఆకట్టుకునేది.

"నిన్న సాయంత్రం మాతో మార్కెట్‌కి వచ్చారమ్మగారు!" పక్కవాళ్ల వంటమనిషి పెద్దగా చెబుతోంది.

"అంతా ఇసిత్రం, పాణం ఎప్పుడు పోద్దో, కూసున్నోళ్ళు కూకున్నట్టే పోతుండారు!" పనిమనిషి విరక్తిగా అంది. "పార్వతిదేవల్లే పసుపుకుంకాలతో ఎల్లిపోయిందమ్మ" మధ్య మధ్య కళ్ళు తుడుచుకుంటూ చెబుతోంది.

"మార్కెట్ నుంచి వస్తూనే గుండె నెప్పన్నారు. వెంటనే డాక్టర్ వద్దకి తీసుకెళ్లాం" సోము భార్య వివరించింది.

ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు.

స్నానం చేశాడనుకుంటా.. మోచెయ్యిని మోకాలిమీద ఆన్చి, అరచెయ్యి తలమీద పెట్టుకుని వరండాలో గోడకి జారగిలపడి కూర్చున్నాడు బావ.

ఎలా తట్టుకుంటాడో? ఏమో?

"సూర్యా, ఎవరినన్నా బావ దగ్గర కూర్చోమను"

మోకాళ్ల నొప్పులున్న చిన్నక్క వసారాలో కుర్చీలో కూర్చుంది.

"కాసేపు పడుకో!" బావ దగ్గరగా వెళ్ళి చెప్పాను.

"బొమ్మ వెళ్ళిపోయింది" అన్నాడు నా వంక చూస్తూ. అంతలోకే "అన్నాలెప్పుడు పెడతారు? " అడిగాడు.

"పెడతారు! నువ్వు కాఫీ తాగుతావా? "

"ఇవ్వు! తొందరగా అన్నం పెడితే తిని పడుకుంటా"

"పాపం అంతకన్నా ఏం? చేస్తాడులే!!" జాలిగా అంది మా బావ పినతండ్రి భార్య.

భోజనాలయ్యాయి. అక్కడ ఉన్నవారంతా చీకటిపడగానే నేలమీదే తలా వొక మూల చోటుచేసుకుని పడుకున్నారు.

"చిన్నత్తయ్యగారూ కాస్త జరగండి" నా పక్కకొచ్చి పడుకుంది సోము భార్య. అంతలోకే తలెత్తి 'మామయ్యగారు పడుకున్నారా? ' అన్నట్లు చూసింది.

"అక్కయ్య చివరికి ఏమన్నా మాట్లాడిందా? " అడిగాను.

"ఆ.. ఎప్పుడూ.. దేవుడు నన్ను పుట్టించిందే మీ మామయ్యగారి కోసం.. అనేవారుగా. నిన్న మటుకు సైగలతో, కొంచెం మాట్లాడుతూ కన్పించారు. ఆయన్ని వదిలేసి వెళ్తాననిపిస్తోంది అన్నారు"

'బావమీద ఎంత ప్రేమ' అనుకున్నాను.

"ఆవిడ ఏదో అన్నారనుకున్నాం కానీ, మేమెవ్వరం హఠాత్తుగా యిలా అవుతుందనుకోలేదండీ" యింకా షాకునుంచి తేరుకోని ఆమె గొంతు జీరపోయింది. కాసేపు మళ్ళీ దుఃఖం ఆగలేదు మాకు.

★ ★ ★

తెల్లారింది.

"బావా!! బావా!!" దారికి అడ్డంగా నేలమీద పడుకున్న బావను చూస్తూ, చిన్నక్క కంగారుగా అరుస్తోంది.

అది విని సోము వచ్చి " నాన్నా" అని పిలిచి గట్టిగా భుజం తట్టాడు.

ఆ సాయంత్రమే ఊరికి చేరుకున్న.. మెడిసిన్ చదివే కృష్ణపండు కొడుకు.. రామశాస్త్రి బావ పల్స్ చూసి "ఎప్పుడో ప్రాణం పోయింద"ంటూ పెదవి విరిచాడు.

"దేవుడు నన్ను పుట్టించిందే బావ కోసం, ఈ జీవితం యింతే" పెద్దక్క మాటలు నా మదిలో మెదిలాయి, ఆ భార్యాభర్తలు ఒకరి వెంట మరొకరు! పెద్దక్క నిష్క్రమించటం మరపురాని దుర్ఘటన. నిశ్శబ్దంగా బావ మరుగవటం మరో ఆశ్చర్య ఘటన..

హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనలు.. సంవత్సరాలు గడిచినా, తలుచుకున్నప్పుడల్లా మనస్సును కదిలిస్తూనే వుంటాయి.

"మామ్మా! నువ్వు చెప్పనే లేదు. పెళ్లికి నిర్వచనం ఏమిటి? అది ఏడు జన్మల సంబంధం కదూ? ? " పాప మళ్ళీ అడిగింది.

ఆలోచనల్లోంచి బయటకు వచ్చిన నేను, "పెళ్ళనేది జన్మజన్మల బంధమే. అంతే కాదు, త్యాగం, సహనాలకి మరో పేరు. రెండు విభిన్న వ్యక్తిత్వాలు సమన్వయపరుచుకొని సాగించే సహజీవనం" అన్నాను.

'మ్యూచ్యువల్ అండర్ స్టాండింగ్' అనిరుధ్ నా మాటలకు మరికొంత చేర్చాడు.

"ఏమిటి సీరియస్‌గా మీ మాటలు? " అంటూ అబ్బాయి శ్రీధర్ వచ్చాడు.

"డాడీ! పెళ్లి ఏడు జన్మల సంబంధం కదూ!! పెళ్ళికి మరి మీరిచ్చే డెఫినిషన్ ఏంటి? " పాప అబ్బాయినడిగింది.

"మళ్ళీ మీ డాడీ దగ్గర మొదలు పెట్టావా? " ఆయన కూడా కూర్చోటానికి వీలుగా సోఫాలో పక్కకి జరుగుతూ అన్నాడు అనిరుధ్.

"పెళ్ళికి నా నిర్వచనమా!" పద్దెనిమిదేళ్ళకే పెళ్ళయిన కూతురికి సరదాగా వుండేట్టు చెప్పడానికి ఆలోచిస్తున్నాడు శ్రీధర్.

అంతలోకి మధ్యాహ్నం నిద్ర లేచి అటు వచ్చిన తాతగార్ని అడిగింది.

ఆయన ఒక్కక్షణం ఆగి "పెళ్ళి..వంశ వృద్ధికోసం ధార్మికంగా చేసే పాణిగ్రహణం" అన్నారు. పెళ్ళిలో చెప్పే వేద మంత్ర సారాన్ని ఒక్క మాటలో చెప్పి వరండాలో ఉన్న పడక్కుర్చీలో కూర్చోటానికి బయటకు వెళ్లారు.

"డాడీ.. మీరు? "

"ఏమో! మీ థియరీస్, ఎనాలసిస్‌లు నాకు తెలియవు. ఎన్ని జన్మల సంబంధమో అదీ తెలియదు. కానీ, అలిసిపోయి ఇంటికొచ్చిన భర్తకి వేడి కాఫీ అం దించే చల్లని చెయ్యి, చూపు" శ్రీధర్ చెప్పాడు నవ్వుతూ.

"అంతేనా? బీ సీరియస్ డాడీ!"

"ఆ కాఫీని ఆస్వాదించే మనస్సు, దాన్ని చెప్పే నేర్పునూ, సరేనా!" అన్నాడు మళ్ళీ.

ఇంతలోకి కోడలు కాఫీ కప్పులు తీసుకొచ్చి అబ్బాయికి, మాకు ఇచ్చింది.

"కాఫీ బావుందోయ్" శ్రీధర్ అన్నాడు భార్య వంక చూస్తూ.

"ఏమిటి? కొత్తగా మెచ్చుకుంటున్నారు? "

ఆమె అలా అనగానే ఫక్కున నవ్వాం.

"బావున్నాయి మీ నవ్వులు" అంటూ అర్థంకానట్టు మా అందరి వంకా ఒకసారి చూసి, వంటింట్లోకెళ్ళింది కోడలు. V

ఒరియా కథ

-దాస్ బెన్హర్

డ్రాయింగ్

అనువాదం : ఎ.వి.జనార్ధనరావు


స్థలం 'గాంధారీ విద్యాపీఠ్'. సమయం సాయంత్రం సుమారు నాలుగు గంటలు. చివరి పిరియడ్ జరుగుతోంది. పిల్లలందరూ ఇళ్లకు వెళ్లే ఆనందంతో ఉన్నారు. ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

అయితే ఆరో తరగతి బాలల్లో ఉత్సాహం స్థానే భయం ఉంది. ప్రతి ఒక్కరూ ఏదో పరిణామాన్ని శంకించి చలించిపోతున్నారు.

డ్రాయింగ్ పిరియడ్ అది. తమకు బొమ్మలు గీయడమంటే ఇష్టమున్నా లేకపోయినా పిల్లలందరూ ఈ పిరియడ్‌లో చాలా ఆనందంగా వుంటారు. బొమ్మలు ఎలా వేయాల్సిందీ దగ్గరుండి నేర్పించే డ్రాయింగ్ టీచరే అందుకు కారణం. ఆయన మొదట నల్లబోర్డుమీద బొమ్మ వేసేవాడు. తర్వాత పిల్లల్ని.. దానిని చూచి అదే విధంగా గీయమని కోరేవాడు. ఎవరైనా విద్యార్థులు బొమ్మలు వేయలేకపోతే డ్రాయింగ్ టీచర్ వారిని కోప్పడకుండా ప్రోత్సహించేవాడు. 'బొమ్మలు గీయడం చాలా సులభం. ప్రయత్నిస్తే, మీరు కూడా బాగానే వేయగలుగుతారు' అనేవాడు. ఈ ప్రేరణ విద్యార్థులను ఉత్సాహపరచి వారిని చిత్రలేఖనంలో సాధన చేయడానికి పురికొల్పేది. వేసిన బొమ్మ కింద 'వంకాయ' అని రాస్తేనే కానీ అది వంకాయ బొమ్మ అని తెలుసుకోలేని విధంగా ఎవరైనా విద్యార్థి బొమ్మ గీస్తే దానికిందే ఆ డ్రాయింగ్ టీచర్ స్వయంగా వంకాయ బొమ్మను సహజ సుందరంగా చిత్రించి చూపేవాడు. అప్పుడా అవకాశం వరించిన విద్యార్థి తనను చాలా అదృష్టవంతునిగా భావించుకొని ఆనందించేవాడు.

ఆ డ్రాయింగ్ టీచర్ పేరు మొహరానా. ఆయన ఎవరైనా విద్యార్థిని.. తప్పు చేశావని కోప్పడిన సందర్భం ఒక్కటి కూడా లేదు. ఎవరిమీదైనా బాగా కోపం వస్తే మహా అయితే, 'వెళ్లు, నీ కాగితంపై నేను ఎప్పటికీ బొమ్మే వేయను' అనేవాడు. ఎప్పుడూ నవ్వులు కురిపించేవాడు. అందువల్లే ఆయన పిల్లలందరికీ ప్రియతమ గురువయ్యాడు. అందుకే ఆయన పిరియడ్.. ఆఖరున ఉన్నప్పటికీ పిల్లలెవ్వరూ వెళ్లిపోరు.

అయితే ఆ రోజు ఆయన సెలవుమీద ఉన్నాడు. కాబట్టి ఆఖరు పిరియడ్‌లో తరగతిని పర్యవేక్షించడానికి ఇంగ్లీషు టీచర్ భోలానాథ్‌బాబును హెడ్మాస్టరు పంపించాడు. తమ తరగతి గదిలోకి భోలానాథ్ ప్రవేశించగానే పిల్లలందరూ హతాశులయ్యారు. ఎందుకంటే ఈయన చిర్రుబుర్రులాడతాడు. విద్యార్థులు తప్పు చేస్తే దండన తప్పదు. అలాంటి కఠిన స్వభావుడు భోలానాథ్. ఏ విద్యార్థి ఎంత చిన్న పొరపాటు చేసినా చెవులు మెలివేసేవాడు. ఎవరైనా విద్యార్థి రోడ్డుమీద తిరు



గుతుండగా చూస్తే మందలించేవాడు. విద్యార్థిని కొడుతున్నప్పుడు చెవులకూ బుగ్గలకూ చేతులు అడ్డుపెట్టుకుంటే, పొట్టమీద గిచ్చేవాడు. విద్యార్థి పొట్టను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తే, భోలానాథ్ అతని చెంపమీద పెద్ద దెబ్బ కొట్టేవాడు.

చదువుకు సంబంధించినంత వరకు భోలానాథ్ ఖరాఖండిగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవాడు. కాబట్టి విద్యార్థులు ఆయనంటే భయపడేవారు.

ఆఖరి పిరియడ్‌లో ఇళ్ళకు తిరిగివెళ్లడానికి ఆతృతగా, ఉత్సాహంగా ఉన్న ఆరో తరగతి పిల్లలకు.. భోలానాథ్ తమ తరగతిలోకి ప్రవేశించడంతో వెన్నులో వణుకు పుట్టింది. యమధర్మరాజు తమకు ఎదురు వచ్చినట్లనిపించింది వారికి.

కానీ ఆ సమయంలో భోలానాథ్ తన ధోరణికి భిన్నంగా ప్రవర్తించాడు. ఇంగ్లీషు పాఠానికి సంబంధించిన ఏ అంశాన్నీ అడగలేదు. సౌమ్యంగా " పిల్లకాయల్లారా! ఇది డ్రాయింగ్ పిరియడ్. మీ డ్రాయింగ్ టీచర్ సెలవుమీద ఉన్నాడు. మీరు మీ కాగితాలమీద బొమ్మలు వేసి నాకు చూపించండి' అన్నాడు.

ఈ మాటలు వినడంతో పిల్లల్లో ఆనందం ఉప్పొంగింది. భోలానాథ్ కొద్దిసేపు ఆలోచనలో పడ్డాడు. పిల్లలు బొమ్మ వేయడానికి అంశాన్ని నిర్దేశించడంలో ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. ఆయనకు నలభై సంవత్సరాల కిందటి తన చిన్ననాటి సంగతులు స్ఫురణకు వచ్చాయి. తాను డ్రాయింగ్‌లో ఫెయిల్ కావడం, అందువల్ల మెరిట్‌తో పరీక్ష పాస్ కాలేకపోవడం, ఈ వైఫల్యంవల్ల ఇంట్లో వాళ్లు తనను మందలించటం.. జ్ఞప్తికి వచ్చింది. "తెలివి హీనుడివి, బొమ్మలు వేయడం కూడా చేతకాదా? ఇక పాఠాలు ఏమి నేర్చుకుంటావురా" అని తన తండ్రి అప్పట్లో పెద్దగా కేకలేశాడు.

ఈ ఆలోచనలో నిమగ్నుడైవున్న భోలానాథ్ తేరుకొని.. పిల్లలు బొమ్మ వేయడానికివ్వాల్సిన అంశం గురించి యోచన చేశాడు. చివరకు "పిల్లలూ! మీరందరూ మీ తల్లిబొమ్మ వేయండి' అని ఆదేశించాడు.

వెంటనే పిల్లలందరూ ఆనందంగా తమ తల్లుల చిత్రాలు గీయడంలో నిమగ్నులయ్యారు. తర్వాత పదిహేను ఇరవై నిమిషాలకే తాము చిత్రించిన 'అమ్మ' బొమ్మలను టీచర్‌కు చూపించడం ప్రారంభించారు. అవి చిత్ర విచిత్రంగా ఉన్నాయి. ఒకరు ముఖాన్ని మాత్రమే వేస్తే, మరొకరు పెద్ద గుండుసున్నా పెట్టారు. దానికి చెవులు లేవు. కళ్ల స్థానంలో రెండు చుక్కలు పెట్టారు. ఒకడు సగం పేజీ ముఖంతోనే నింపేశాడు. నిటారుగా గీత గీయలేని ఒక బాలుడు తన బొమ్మలో చెవులను ముఖానికన్నా చాలా పెద్దవిగా చిత్రీకరించాడు.

మామూలుగా అయితే బొమ్మలు సరిగ్గా వేయలేకపోయిన పిల్లలను భోలానాథ్ కోప్పడటం జరగాలి.

కానీ విచిత్రమేమంటే ఆయన ఎవ్వరినీ ఏమీ అనలేదు. పైగా పిల్లలు గీసిన బొమ్మల కాగితాలను ఒక్కొక్కటిగా చాలా ఆసక్తితో పరిశీలించి చూశాడు.

పిల్లలు ఒకరి తర్వాత ఒకరు ఆయన దగ్గరికి వెళ్లి తాము చిత్రించిన బొమ్మలను చూపించి తిరిగి తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నారు. వారు ఇంటికి వెళ్లడానికి ఆఖరు గంట మోగడం కోసమే ఎదురు చూస్తున్నారు.

"నాకు బొమ్మ చూపించని వారెవరైనా వున్నారా? " అని అడిగాడు భోలానాథ్.

ఎవ్వరూ బదులుపలకలేదు.

అయితే నాలుగో వరసలో కూర్చున్న ఒక బాలుడు తన ముఖాన్ని చాటు చేసుకోవడానికి ప్రయత్నించాడు. వెంటనే ఆ బాలుణ్ణి ఉద్దేశించి "ఏయ్.. నువ్వు బొమ్మ నాకు చూపించలేదు కదూ" అని అతనిని తన వద్దకు రమ్మనమని సంజ్ఞ చేశాడాయన.

ఆ బాలుడు భయంభయంగా లేచి నుంచున్నాడు.

భోలానాథ్ గంభీర గళం, తీక్షణమైన చూపులంటే భయపడని పిల్లలెవరుంటారు? ఆయన కొట్టే దెబ్బల సంగతి అటుంచి, ఆయన ఒక్క మందలింపుకే పదకొండో తరగతి పిల్లలకు సైతం చెమటలు పడతాయి. ఇక ఈ ఆరో తరగతి బాలలపై ఆ ప్రభావం ఎలా వుండేదీ చెప్పనవసరం లేదు.

ఆ బాలుడు ఎంతో భయపడుతూ భోలానాథ్ దగ్గరికి వెళ్లాడు. ఆ బాబు దగ్గర పెన్సిలు లేకపోవడాన్ని ఆయన గమనించాడు. వెంటనే కోపోద్రిక్తుడై "అయితే నువ్వు పెన్సిలు కూడా తేలేదన్న మాట. వెధవా! ఇవాళ నీ పనిపడతా నుండు" అన్నాడు.

పాపం వీడికి దెబ్బలు తప్పవని పిల్లలందరూ బాధపడ్డారు.

ఆ పిల్లవాడు తన దగ్గరికి వచ్చినప్పుడు భోలానాథ్ ఆ చేతిలోని కాగితాన్ని లాక్కున్నాడు. వాడు వణికిపోయాడు.

దానిమీద ఒక్క గీత కూడా లేకపోవడం చూసిన ఆయనకు కోపం ప్రకోపించింది. ముక్కుపుటాలు బుసకొట్టాయి. కళ్లు నిప్పులు చెరిగాయి. బాలుని చెవులు పట్టుకొని బాగా మెలిపెట్టాడు. "వెధవా! బొమ్మ ఎందుకు వేయలేదో చెప్పు? ఇంత చిన్నతనంలోనే అంత నిర్లక్ష్యమా? నా మాటలు లక్ష్యపెట్టకుండా ఉండటానికి ఎంత ధైర్యం కావాలి! ఒక్క గీతైనా గీయకుండా దొంగ మాదిరి నక్కి నక్కి కూర్చుంటావా" అని ఆగ్రహించాడు.

ఈ మాటలంటూనే బాలుడిని లాగి కొట్టడానికి రెండో చేయిని పైకెత్తాడు.

ఆ అబ్బాయి ఆకులా వణికిపోయాడు. కళ్లనుంచి నీళ్లు ధారగా కారాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నాడు, "సర్, మా అమ్మలేదు.. చనిపోయింది. ఆమె చనిపోయినప్పుడు నేను పసివాడ్ని. 'అమ్మ' ఎలా ఉండేదో నాకు తెలియదు!"

పోలెండ్ కథ

-హెన్రిక్ సెన కీవిచ్

సంగీతకారుడు

అనువాదం : రోహిత్

ఎంతో దుర్బలంగా, బక్కగా ఈ లోకంలోకి వచ్చాడతను. మంచానికి అటూ ఇటూ నిలుచున్న ఇరుగుపొరుగు వాళ్లు ఆ తల్లీకొడుకుల్ని చూసి తలలూపారు. వాళ్లందరిలోనూ అనుభవజ్ఞురాలైన కమ్మరి భార్య తన పద్ధతిలో ఆ రోగిష్టి బాలుణ్ణి సముదాయించడం మొదలుపెట్టింది. "హాయిగా బజ్జోరా బాబూ! నేను కొవ్వొత్తి వెలిగించి నీకు కావాల్సినవన్నీ పూర్తి చేస్తా. పై లోకానికి వెళ్లడానికి నిన్ను సిద్ధంచేస్తా. ఎవరైనా పూజారిని పిలిపిస్తే నీ ఆఖరి క్రియల్ని చేసే విధానం చెబుతాడు"

"వీడికి వెంటనే ఆ పని చేయాలి. పూజారి వచ్చేదాకా ప్రాణంతో ఉంటాడో లేదో తెలీదు కదా, అందుకని. పని కాకుండా చనిపోతే భూతంగా మారి అలా తిరుగుతుంటాడేమో? " ఇంకొకామె అందుకుంది.

కొవ్వొత్తి వెలిగించి 'మంత్రజలాన్ని' శిశువుపై చల్లారు. "నీకు జాన్ అని పేరు పెడ్తాం. ఓ ఆత్మా! విడిచివెళ్లు. ఈ ప్రపంచాన్ని విడిచివెళ్లు, ఎక్కడ్నించి వచ్చావో అక్కడికే తిరిగి వెళ్లు" అన్నారు.

పూజారి వచ్చాడు, తన పని పూర్తిచేసి వెళ్లాడు.

తల్లి చావునుంచి తప్పించుకుంది. ఓ వారం తర్వాత తన పనిమీద తాను వెళ్లిపోయింది.

శిశువు జీవితం తాడుపైన ఊగిసలాడుతున్నట్లుంది. అతికష్టంపై ఊపిరి తీస్తూనే, వాడు అలా అలా పెరిగి పదేళ్లవాడయ్యాడు. ఎంతో బక్కపలచగా ఉన్నాడు. ఎండిన గడ్డిలాగా తలమీద వెంట్రుకలు, పైకి ఉబ్బుకొచ్చిన కళ్లు!

ఇప్పుడు చలికాలంలో పిల్లాడు కుంపటి వెనక ముడుచుకుని కూచున్నాడు. బలహీనమైన గొంతుతో "అమ్మా! ఆకలే" అని ఏడుస్తున్నాడు. ఇరుగు పొరుగులు అప్పుడే 'భవిష్యత్తు' చెప్పేశారు "మీవాడింక ఎక్కువ కాలం బతకడు. ఒకవేళ బతికినా తల్లికి మనశ్శాంతి ఉండదు. ఎందుకంటే శరీర కష్టం చేసే సత్తువే లేదు వాడికి"

జాన్‌కి సంగీతం అంటే చాలా ఇష్టం. ప్రతి వస్తువులోనూ వాడు సంగీతాన్ని వినగలడు. పెద్దయినకొద్దీ స్వరం, తాళంమీద ఎక్కువ ధ్యాసపెడుతున్నాడు. పశువుల్ని కాసేటప్పుడు, తోటివాళ్లతో అడవిలో రేగుపళ్లు ఏరుకునేటప్పుడు కూడా సంగీతం వినేవాడు. "అమ్మా! అక్కడ ఎంత మంచి సంగీతం విన్నానో! లల్లా.. లా.. లా.. అని మోగుతున్నాయా స్వరాలు!" అనేవాడు.

"అలాగా! అయితే నీకు ఇంకో స్వరం విన్పిస్తార్రా, కోతివెధవా! వీపు విమానం మోత మోగిస్తా" అంటూ కసురుకునేది తల్లి.

అయినా వాడు మాత్రం ఇంకా ఇంకా సంగీతం వినాలనే తహతహతో ఉండేవాడు. 'అడవిలో ఎంత చక్కటి సంగీతం వింటున్నాను! ఎంత సుందర దృశ్యాన్ని చూస్తున్నాను! చెట్ల ఆకులు, పక్షులు అన్నీ పాడుతున్నాయి. అడవంతా పాటలే ప్రతిధ్వనిస్తున్నాయి' అనుకునేవాడతను.



ఇరుగుపొరుగు వాళ్లంతా అతడికి "సంగీతకారుడు జెనకో" అని పేరు పెట్టారు. తల్లి వాణ్ణి తనతో ప్రార్థనా మందిరానికి తీసుకుని వెళ్లలేకపోయేది. అక్కడ బాజాల మోత విన్పడగానే వాడి కళ్లు చెమర్చేవి, వేరే లోకంలో విహరిస్తున్నట్లు ఉండేవాడు. వాడు ఓ పల్చటి కర్ర తీసుకుని దానికి గుర్రపు వెంట్రుకని తీగెలా చుట్టి మోగించేవాడు. అది అంత బాగా మోగకపోయినా 'టన్ టన్'మనే శబ్దం విన్పించేది. తెల్లారింది మొదలు రాత్రిదాకా దాన్ని అలా మోగిస్తూనే ఉండేవాడు.

పిల్లాడు రోజురోజుకీ బలహీనపడ్తున్నాడు. జుట్టు మాత్రం దట్టంగా పెరుగుతోంది. వాడికి తన వయొలిన్ అంటే ఎంతో ఇష్టం. కోటపైన ఓ సిపాయి తన ప్రేయసి కోసం సారంగి వాయించేవాడు. జెనకో దాన్ని వినటం కోసం, ఒక్కసారి కళ్లారా చూట్టంకోసం గోడపక్క నక్కి నక్కి దాగుండి వినేవాడు. ఆ సారంగిని ఒక్కసారి చూడాలని, తాకాలని ఎంతగానో తపించేవాడు.

ఓ సాయంత్రం ఎవరూ లేనప్పుడు సిపాయి తన ప్రేయసితో కల్సి ఎక్కడికో వెళ్లాడు. సరిగ్గా అప్పుడే జెనకో సగం తెరిచిన గది తలుపుగుండా ఆ సారంగిని రెప్ప వేయకుండా చూశాడు. పున్నమి రాత్రిలో అది సూదంటురాయిలా ఆకర్షించసాగింది వాణ్ణి. 'సాహసంచెయ్ జెనకో! అక్కడ ఎవరూ లేరు. ఒక్కసారి ముట్టుకో! దాన్ని తాకి నీ తపన తీర్చుకో' అని ఎవరో అంటున్నట్లు విన్పించింది.

అంతలో ఓ నల్లకాకి వాడి తలమీదుగా ఎగుర్తూ 'కావ్.. కావ్.. వద్దు జెనకో' అన్నట్లు తోచింది. ఎక్కడ్నించో బుల్‌బుల్ పక్షి 'పద పద, ఫర్వాలేదు' అన్నట్లు కూసింది.

ఎలాగైతేనేం.. జెనకో లోపలికి ప్రవేశించాడు, సారంగిపై తన తల ఆనించాడు.

"ఎవర్రా అక్కడ!?" ఓ మూలనించి కర్కశ కంఠం విన్పడింది. ఆ వెంటనే పిల్లాడి ఏడుపు, కుక్కల అరుపులు, జనాలు అటూ ఇటూ పరిగెత్తటం.. ఇల్లంతా గందరగోళం.

రెండ్రోజుల తర్వాత జనకో జడ్జిముందు నిలబడ్డాడు. వాణ్ణి చూసి అంతా ముక్కున వేలేసుకున్నారు. బలహీనంగా ఉండి, మురిగ్గా ఉండి, నోట్లో వేలేసుకుని నిలబడ్డ ఆ కుర్రాడు తెల్లబోయి చూస్తున్నాడు.

'కేవలం పదేళ్ల ఈ బాలుణ్ణి జైలుకి ఎలా పంపాలి? వాచ్‌మెన్‌కి అప్పగిస్తే సరి. నాలుగు కొరడా దెబ్బలు తగిలిస్తే, ఇంకెప్పుడూ ఇలాంటి వెధవ పనులు చేయడు' అనుకున్నాడు జడ్జి. "వీడికి నాలుగు కొరడా దెబ్బలు తగిలించు" అన్నాడు.

అంతే, వాడిని వాచ్‌మెన్ కుక్కపిల్లను ఈడ్చుకెళ్లినట్లు ఈడ్చు కెళ్లాడు. పాపం.. ఆ పసివాడు ఏమీ మాట్లాడలేదు. భయపడుతూ గజగజ వణకసాగాడు. ఓ పిట్టలా చూస్తుండిపోయాడు. నేలపై పడేసి కొట్టబోతుంటే 'అమ్మా' అని ఏడుపు లంకించుకున్నాడు. ప్రతి కొరడా దెబ్బకీ 'అమ్మా, అమ్మా' అని కేకలుపెడుతున్నాడు.

మరికొన్ని దెబ్బలు తగలటంతో, 'అమ్మా' అనటం కూడా ఆగిపోయింది!

విరిగిన సారంగిలా నేలపై పడిఉన్నాడా బాలుడు. అసలు వాడిలో ప్రాణం ఉందా లేదా అని అక్కడివారికి అన్పించసాగింది. ఆఖరికి వాడి తల్లి వచ్చి భుజాన వేసుకుని మోసుకుంటూ తీసుకుపోయింది.

ఆ మర్నాడు జెనకో నిద్రనుంచి లేవలేదు. కిటికీకి ఎదురుగా చెర్రీ చెట్టుమీదున్న పక్షి కువకువలాడింది. గాజుకిటికీ గుండా సూర్యకిరణాలు పడుతున్నాయి. రక్తహీనంగా పాలిపోయిన వాడిమొహంమీద పడి అవి మెరుస్తున్నాయి. పిల్లాడి ఆత్మ స్వర్గానికి వెళ్ళటానికి .. కిరణాల బాట వేస్తున్నట్లు ఉంది. ముళ్లబాటపై నడిచిన ఆ పసివాడి జీవితం.. ప్రాణంపోయిన తర్వాత.. ఆకాశమార్గంలో పయనిస్తున్నట్లుగా ఉంది.

సాయంత్రమయింది. పల్లెపడుచులు పాటలు పాడుతూ గడ్డిమోపులతో ఇళ్లకి తిరిగి వెళ్తున్నారు.

దగ్గరలోనే ప్రవహిస్తున్న నదినుంచి మంద్రస్థాయిలో సంగీతం విన్నాడు జెనకో. ఆఖరిసారిగా విన్పిస్తున్న ధ్వనులవి.

గుర్రానికి కప్పే వస్త్రంమీద.. వాడు తయారుచేసుకున్న కర్ర సారంగి పడి ఉంది!

తెల్లగా పాలిపోయిన వాడి పెదాల్నుంచి సన్నని ధ్వని 'అమ్మా!' అంటూ వెలువడింది.

"ఏంట్రా కన్నా!" వెక్కిళ్లతో అడిగింది తల్లి.

"అమ్మా! మరే, ఆ దేవుడు స్వర్గంలో నాకు అసలైన సారంగిని ఇస్తాడంటావా?"

"ఆ.. ఇస్తాడు నాయనా!" అంటున్న ఆమెకిక నోట్లోంచి మాట పెగల్లేదు. టేబుల్‌పై తలపెట్టుకుని భోరుమని ఏడ్చింది. తనకున్నదంతా ఎవరో కొల్లగొడుతున్నట్లు ఉందామె. మృత్యువు తన సర్వస్వాన్నీ దోచుకున్నట్లు అన్పిస్తోంది ఆ హృదయ విదారక రోదన!

ఒక్కసారి తల పైకెత్తి చూసింది. ఆ బుల్లి సంగీతకారుడి కళ్లు అలా తెరుచుకునే ఉన్నాయి. వాడి ప్రాణపక్షి ఎగిరిపోయింది!

"ఆ పరమాత్ముడు నీకు శాంతినిస్తాడు జెనకో! నా చిన్ని జెనకో.." అంటుంటే ఆమె దుఃఖం కట్టలుతెంచుకుంది.

★ ★ ★

"అబ్బ! ఇటలీ జనం.. కళాకారుల్నే కాదు, సంగీతకారుల్ని కూడా ప్రోత్సహిస్తారు కదూ" అనుకుంటోంది.. ఇటలీనుంచి తిరిగొచ్చిన కుటుంబం.

ఆ మాటల్ని జెనకో సమాధిమీద మొలిచిన మొక్కలు నిశ్శబ్దంగా అంతా ఆలకించాయి.

తెలుగుకథ

- ఈమని రమ

పరివర్తన

"ఏంటండీ.. ఎనిమిది దాటుతున్నా మీ అమ్మగారు ఇంకా లేవలేదు. ఎవరైనా వస్తే ఏమనుకుంటారు? పైగా పలకరించడానికి వచ్చేవాళ్ళు వస్తున్నారు కూడాను. మీరైనా వెళ్ళి లేపండి, బాగోదు కూడాను"

తను ఎంత నెమ్మదిగా చెబుతున్నా గొంతులోని కాఠిన్యం వినిపిస్తూనే వుంది కిరణ్‌కి. అతను అప్పుడే స్నానం చేద్దామని లేస్తున్నాడు. కిరణ్‌కి ఆశ్చర్యంగా అనిపించింది. ఎప్పుడూ ఆరు దాటకుండా లేచే అమ్మ ఇంకా లేవలేకపోవడమేంటని.

గేటు తీసిన చప్పుడైతే ఇద్దరం అటు చూశాం. రైసుమిల్లు రాజుగారు, భార్య వస్తున్నారు. నేను లోపలకెళ్ళి "అమ్మా! అమ్మా! లే.. చూడు.. ఎనిమిది దాటుతోంది. రాత్రి నిద్ర లేదా? ఆ రైస్‌మిల్ రాజుగారు వాళ్ళు వచ్చారు. నిన్ను పలకరించడానికి.." అని తట్టి లేపుతున్నాను.

"ఆc.. అంత లేటయ్యిందా? నిద్ర పట్టేసిందిరా" అంటూ లేచి మొహం కడుక్కొని ముందు గదిలోకి వచ్చి కూర్చుంది.

రాజుగారి భార్య లోపలికొచ్చి అమ్మ పక్కన కూర్చుని భుజం మీద చెయ్యేసి "మీకు రావలసిన కష్టం కాదమ్మా, ఎన్నో పూజలు చేసేవారు. ఏ నోము వదలకుండా చేసేవారు. పార్వతీదేవిలా వుండేవారు. ఏ రోజూ మానకుండా గుడికెళ్ళేవారు. అయినా ఏమిటో ఆ మాయదారి దేవుడు మీకు వైధవ్యాన్నిచ్చాడు. విషయం తెలిసిన వెంటనే వద్దామనుకున్నాం. కానీ చిన్నాడి దగ్గరికి లండన్ వెళ్ళాం. ఈ మధ్యే వచ్చాం. ఆ హడావిడిలో వుండిపోయి రాలేకపోయాం.. అక్కడ వాడు ఇల్లు కొనుక్కున్నాడులేండి.."

వరండాలో కూర్చున్న నాకామాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి. ఈలోగా రాజుగారు అన్నారు "పొలాల సంగతి ఏం చేద్దామనుకుంటున్నారు? ఏమైనా అనుకుంటున్నారా?"

ఈయన పొలం అమ్మకాలు మాట్లాడ్డానికొచ్చారా? పరామర్శించడానికి వచ్చారా? అర్థం కాలేదు. అయినా పైకి "ఇంకా అవేం ఆలోచించలేదండీ. షాక్‌లో వున్నాం కదా"

"అవున్లే పాపం రాఘవయ్యగారు ఎంత వొంట్లో బాగోపోయినా, సిటిలో నీ దగ్గర కూడా వుండకుండా చివరి రోజులు ఇక్కడే సొంతింట్లో గడపాలని ఆశపడ్డారు. మీరు అలాగే నిదానించి వున్నారనుకో. అయినా సిటీ హాస్పిటల్‌లో వుంటే ఇంకొన్ని రోజులు బతికేవారేమో? ఆయనేమో ఈ ఇల్లే ప్రాణంలా వుండేవారు. ఓ వయసొచ్చాక చాదస్తాలు వదులుకోవాలయ్యా. ఆయనకి టైమ్ అయిపోయింది. ఏం చేస్తాం?" అని.. "ఏదైనా అనుకుంటే నా చెవినెయ్యండి.." అని లేస్తుంటే శృతి కాఫీలు తెచ్చింది.

"అబ్బే వద్దమ్మాయి. ప్రకృతి వైద్యం మొదలుపెట్టాం. కాఫీ, టీలు మానేశాం" అని లోపలికి చూసి "ఏమేవ్.." అని పిల్చి మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

ఆవిడ కూడా బైటికి వచ్చి "నువ్వే మీ



అమ్మగారికి ధైర్యం చెప్పాలి బాబు! ఈ కష్టం ఎలా తట్టుకుంటారో? ఏమిటో? ” శృతి వైపోసారి చూసి వెళ్లిపోయింది.

చావింట్లో 'వెళ్తున్నామని చెప్పకూడదు కదా!' అనుకుని శృతి చేతిలోని కాఫీ తీసుకుని తాగుతూ లోపలికి చూస్తే అమ్మ మళ్ళీ లేచి వెళ్ళి గదిలో పడుకుంది.

శృతి అక్కడ బల్లమీద కూర్చుని అంది, “అసలు వీళ్లెందుకొచ్చారో అర్థం కాలేదు. ఆవిడేమో లండన్ కొడుకు గొప్పదనం చెప్పటమే సరిపోయింది. ఆయనేమో ఆస్తుల గురించి మాట్లాడ్డానికొచ్చినట్లుంది. అంతే కాని మనకి సానుభూతి చూపించడానికొచ్చినట్లు లేదు”

“ఇవన్నీ ఫార్మాలిటీస్ శృతి! నిజంగా నష్టం జరిగింది మనకి. వాళ్లకి బాధెందుకు చెప్పు.. ఇవన్నీ ఓ పద్ధతిగా పాటిస్తారు”

“సర్లెండి.. ఇంతకీ మనం ఎప్పుడు బయల్దేరుతున్నాం? వచ్చి అప్పుడే పదిహేనురోజులయింది. పిల్లలకి స్కూల్ పోతోంది. ఇక మనం బయల్దేరితే బావుంటుంది. మీ అమ్మగారిని కదపండి. అయినా ఏంటండి ఆవిడ? ఎప్పుడు చూసినా అలా వెళ్లి పడుకుంటున్నారు. ఓ మాట లేదు, మంతీ లేదు. ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారేమో? అని కూడా లేదు. మొన్నటికి మొన్న పిల్లలు ఆకలని ఏడిస్తే స్వీట్స్ తెప్పించాను. అవి డబ్బీలోంచి తీసుకుని తినేస్తున్నారు. ఆ సమయంలో ఏం అంటామని నేనేం మాట్లాడలేదు గానీ ఏదో తేడా మాత్రం వచ్చింది మీ అమ్మగారిలో..”

“సర్లేవే.. నాన్న పోయిన షాక్‌లో ఉండి వుంటుంది. నువ్వు మరీ గోరంతలు కొండంతలు చెయ్యకు” అని కసిరాను.

“బానే వుంది. మధ్యలో నాకేంటి? షాక్‌లో వుంటే ఏడవాలి. అన్నం మానెయ్యాలి. అంతేకాని ఇదేంటి పిల్లలకి తెచ్చినవి తినేస్తూ ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండడం కూడా షాకేనా? మరీ విపరీతం కాకపోతే సరే ఆ రిజర్వేషన్ సంగతేదో తొందరగా చూడండి” అని పనమ్మాయి పిలిస్తే లోపలికి వెళ్లిపోయింది.

నేను ఏ పని చేస్తున్నా అమ్మ గురించే ఆలోచిస్తున్నా. అమ్మ ప్రవర్తనలో ఈమధ్య చాలా మార్పొచ్చింది. నాన్న పోయి పదిహేనురోజులయింది. నాన్న పోయినప్పుడు కూడా అమ్మ పెద్దగా ఏం ఏడ్చెయ్యలేదు. ఏడిస్తేనే ప్రేమున్నట్టా? అంటే నేనేం చెప్పలేను. కార్యక్రమాలన్నీ అయిపోయినా అమ్మ నిర్లిప్తంగానే వుంది. ఇంటికి ఎవరైనా వస్తే వాళ్లని పట్టుకుని భోరున ఏడ్చెయ్యడం నాన్న గొప్పతనం చెప్పి వాళ్ళ సానుభూతిని పొందటం ఏం చెయ్యలేదు. మొదట్నించి అమ్మ గుంభనంగానే ఉండేది. ఇప్పుడూ అలాగే వుంది. నేను అమ్మ అలా వుండాలని కోరుకున్నానా? బ్రహ్మగారు వచ్చి పువ్వులు కావాలని, తెల్లచీర తేవాలి అన్నప్పుడు నా రక్తం ఉడికిపోయింది. లోపలికొచ్చి మామ్మ వాళ్లతో గట్టిగానే దెబ్బలాడాను. 'మామ్మా! ఇలాంటివన్నీ ఏం వద్దు. అమ్మ ఇబ్బంది పడకుండా ఏమైనా చెయ్యొచ్చుంటే చేయండి. లేకపోతే మీరింకేం అమ్మని బాధపెట్టొద్దు' అని.

“బావుందిరా! లోకంలో లేనిదేదో మాట్లాడుతున్నావ్. ఆడదయి పుట్టాక ఆ కష్టం ఏంటో తెలీదా? అన్నీ అనుభవించాల్సిందేరా? మీ నాన్న వున్నప్పుడు సకల సుఖాలు అనుభవించలా? ఇదీ అంతే. నా కొడుకే లేకపోయింతర్వాత దానికవన్నీ ఎందుకు? ఏం మీ అమ్మ దగ్గరకొచ్చేసరికి నీకు నొప్పి తెలుస్తోందా? చెట్టంత కొడుకు నాకు లేకపోయిం తర్వాత.. అవున్లే ఎంతైనా నా పేగు వేరు, మీ పేగు వేరు” అంటూ నానా గొడవ చేసింది.

నేను ఏం తగ్గలేదు. “నాకవన్నీ అనవసరం మామ్మా! మా అమ్మని బాధపెట్టే పన్లేం చెయ్యొద్దు. నే చూడలేను. ఇష్టం అయితే వుండండి. లేకపోతే వెళ్లిపోండి” అని నేను చాలా గట్టిగానే గొడవపడ్డాను. మా పెద్దమ్మ నాకు సపోర్ట్‌గా వచ్చింది.

“ఈ రోజుల్లో కూడా ఈ చాదస్తాలేంటి అత్తయ్యగారూ? అది బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఆ గాజులు, బొట్టు తీసేస్తుంది” అంటూ సామరస్యంగా పరిష్కారం చూపించింది.

నాకు భయపడో.. లేక బయటవాళ్ల ముందు గొడవెందుకనే ఏమో మామ్మ ఇంక నోరు విప్పలేదు.

కాని మా పెదనాన్న బాబయ్యలు, అత్తయ్యలు వూరుకోలేదు. బొట్టు తీసేసిన అమ్మ మొహాన్ని చూడ్డానికి ముహూర్తం పెట్టించి, చూడాలి అని మరో గొడవ.

“చూడరా కిరణ్! మాకూ తమ్ముడు పోయాడని బాధగానే ఉంది. వాడికి జరగాల్సిన సంస్కారాలన్నీ సవ్యంగా జరగనీ. రేపు ఇంట్లో ఎవరికైనా కాళ్ల నొప్పొచ్చినా, కంట్లో నొప్పొచ్చినా వాడికి జరగాల్సిన కర్మలన్నీ సరిగా చెయ్యలేదు కాబట్టే వాడిలా మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడనుకోవలసి వస్తుంది. ఇక నువ్వేం మాట్లాడకురా. వెళ్లి ఆ గదిలో అమ్మ కూర్చుంది, వెళ్లి చూసేసి జీలకర్ర నోట్లో వేసుకుని వచ్చేయ్. ఇది మనం మొదలుపెట్టలేదు. మనం ముగించడం లేదు” అని నా ప్రమేయం లేకుండానే నా చెయ్యి పట్టుకుని అమ్మ కూర్చున్న తూర్పు గదిలోకి తీసికెళ్లాడు.

నాకు మొదటిసారి నాన్న లేని లోటు తెలిసింది. నాన్నని దహనం చేసిన రోజు కూడా నేను ఏడవలేదు. బ్రహ్మగారు చెప్పినవన్ని తు.చ. తప్పకుండా పాటించి, ఇంటికొచ్చే బంధువుల్ని చూసుకుంటూ .. నాన్నకి దానాలు, ధర్మాలు చేస్తున్నప్పుడు ఇవన్నీ పద్ధతిగా చెయ్యాలి కదా అనిపించిందే తప్పితే మరే బాధ తెలియలేదు. కానీ ఇప్పుడు నే చూడని అమ్మ మొహమా? కానీ ఇలా చూడాల్సి వస్తుందని నేనెప్పుడు వూహించలేదు. అమ్మ ఏరోజూ పసుపు రాసుకోకుండా లేదు. స్నానం చేసి వచ్చిన వెంటనే దేవుడి దగ్గర కుంకం మెత్తుకునేది. నేనే ఓసారి అన్నా.

“అమ్మా! నీ పాదాలు ఏ రోజైనా పసుపు లేకుండా చూస్తానా? ” అని.

కానీ అప్పుడు తెలీలేదు? అదంత అనకూడని మాటని. అమ్మ నన్ను బాగా తిట్టింది.

“చదువుతున్నకొద్దీ మతి పోతోందేంట్రా? ఏం మాట్లాడకూడదో కూడా తెలీకుండా వున్నావా? ” అని.

అమ్మ అలా పసుపు రాసుకుని మెట్టెల పాదంతో సోఫాలో మధ్యాహ్నం అలా పడుకుంటే ఆ పాదాలే చూస్తూ వుండాలనిపించేది. ఇక గోరింటాకు పెట్టిన రోజైతే చెప్పనే అక్కరలేదు. ఏ రోజూ అమ్మ పాదాలు తాకకుండా ఏపనీ మొదలుపెట్టలేదు.

వూరు వెళ్ళేవాణ్నీ కాదు.

అమ్మే చెప్పింది "తండ్రి తర్వాతేరా. ముందర మీ నాన్న కాళ్లకి నమస్కారం చెయ్యి, ఆ తర్వాతే నేను" అని.

వాళ్ళిద్దరూ అలా పక్కన నించునప్పుడు ఒంగోని దండం పెట్టడం నాకు వచ్చేది కాదు. సాష్టాంగ నమస్కారం చెయ్యడమే. ఎవరైనా చూసి వెక్కిరింతగా నవ్వినా నేను పట్టించుకునే వాణ్ణి కాదు.

ఏంటిది? ఎక్కడ్నుంచి వస్తోంది ఈ మనుష్యులలో శాడిజం. ఓ మనిషిని ఓ గదిలో కూర్చోబెట్టి జూలో జంతువుని చూసినట్టు ఒక్కొక్కరే చూసి వెళ్ళడం. పైగా నాన్నకి బాగోనప్పుడు ఒక్కరు కూడా అమ్మకి సాయంగా వుండలేదు. ఇప్పుడు మాత్రం మా తమ్ముడు, మా వాడంటూ కాకిగోల. ఇక ఆ మనిషికేం ఫీలింగ్స్ వుండవా? ఎప్పుడు మారతారు వీళ్ళంతా?

లోపల్నించి శృతి గొంతు వినిపించింది "అత్తయ్యా! స్నానం చేసొస్తారా? టిఫెన్ చేద్దురుగాని" అని.

"ముందర టిఫిన్ పెట్టెయ్ శృతీ. తర్వాత చేస్తాలే స్నానం.." అమ్మ సమాధానం.

అమ్మకి ఇదో కొత్తకోణం, ఎప్పుడు స్నానం చేసిగాని కాఫీ తాగని అమ్మ మరీరోజెంటో కొత్తగా..

"కిరణ్! ఎంతసేపు కూర్చుంటావురా? లోపలికి రా.. ఎండపొడ తగుల్తుంది" అని అమ్మ లోపలకి పిలిస్తే వెళ్ళాను.

"ఏంట్రా? అంత ఆలోచిస్తున్నావు? అమ్మేంటి ఇలా మారిపోయిందనా? "

"ఛఛ.. అదేం కాదమ్మా! ఏదో ఆలోచిస్తూ ..అది సరేకాని ఈ రోజు రిజర్వేషన్ చేయిద్దామనుకుంటున్నాను. నువ్వూ బట్టలు సర్దేసుకో. మళ్ళా వచ్చేనెల వద్దాంలే"

"ఆc.. ఇంకో ముఖ్యమైన విషయం" అని ఇందాక రాజుగారన్న మాటలన్నీ చెప్పి..

"ఈ ఇంట్లో నాకే చాలా జ్ఞాపకాలు వున్నాయమ్మా. అలాంటిది నీకు ఇంకా వుండే వుంటాయి. నువ్వు మెట్టెలపాదంతో తిరిగిన ఇల్లు. నేను గిరిజ, అనంత, సుష్మా, మేమందరం పెరిగిన చోటు. అందుకని ఈ ఇల్లు, ఆ పొలాలు అలాగే వుంటాయి. కనీసం నా హయాంలోనైనా.." అని అమ్మ వంక చూశాను అమ్మేం అంటుందా? అని.

"ఆ మాటన్నావ్ చాలురా? నా కడుపు నిండినట్టుగా వుంది. కాస్సేపు నా దగ్గర కూర్చోరా! నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అంది.

నేను వెళ్లి అమ్మ దగ్గర గోడకి ఆనుకుని కూర్చున్నాను.

అమ్మ అంది "నీ దగ్గరికి వచ్చేయ్యమంటున్నావు? బావుంది. నీ దగ్గిరకి కాకపోతే నేనింక ఎవరి దగ్గిరికి వెళ్తాను చెప్పు. కానీ నాకు కొంచెం టైం ఇవ్వు"

నేను అమ్మ వంక ఆశ్చర్యంగా చూశాను. టైమ్ ఇవ్వటం ఏంటో అర్థంకాక. శృతి అక్కడే గడపదగ్గర కూర్చుని కూరలు తరుగుతూ నా వంక ఆశ్చర్యంగా చూసింది.

"నాన్న పోయినప్పుడు నువ్వు ఓ మాటన్నావు గుర్తుందా కిరణ్? 'ఎందుకమ్మా అలా ఉన్నావు? నాన్న మనల్ని మెంటల్‌గా ప్రిపేర్‌చేసేశారని' అప్పుడే కాదురా మీ నాన్న పెళ్లయ్యి నేను ఈ ఇంటికి కాపురానికి వచ్చిందగ్గర్నించి ప్రిపేర్ చేస్తూనే వచ్చారు అన్ని విషయాల్లోనూ.

మీ నాన్న నన్నెప్పుడూ భార్యగా చూడలేదు. ఓ పనిమనిషిగానే చూసేవారు. ఆయనకి కావలసినవన్నీ చేస్తూ, ఆయన అవసరాలు గమనిస్తూ చెప్పిన పనుల్ని చేసుకుపోతుండాలి. కూర్చుంటే భయం, మాట్లాడితే భయం, గట్టిగా నవ్వితే భయం. బైటికి వెళ్లి ఓ గంట లేటుగా వస్తే అనుమానం. పుట్టింటికి వెళ్లి ఓ రోజు ఆలస్యంగా వస్తే నానా గొడవ అయ్యేది. ఎక్కడికైనా సరే ఆయన్తో వెళ్లి, ఆయన్తో రావల్సిందే. అలా అని అది ప్రేమ కాదు, అనుమాన జాడ్యం.

గిరిజ పుట్టినపుడు పెట్టుపోతల్లో ఏదో తేడా వచ్చిందని మీ మామ్మ చెబితే దాన్ని ఈయన జీవితాంతం మోస్తూ వచ్చారు. నన్ను మా పుట్టింటికి పంపలేదు, ఎప్పుడైనా వాళ్లు రావడమే గానీ. నేను ఒక్కమాట మా వాళ్ళ గురించి మాట్లాడకూడదు. ప్రతీదీ ఆంక్షే.

ఏరోజూ నా ఇష్టాలు చెల్లలేదు. పెళ్ళయ్యిన తర్వాత నేను.. నేనేమిటో పూర్తిగా మర్చిపోయాను. ఆయనకేది ఇష్టం? ఆయనకెలా వుంటే ఇష్టం? ప్రతీది ఆయనకి నచ్చేవి జరిగేవి. నా అస్తిత్వం ఏమీలేదు.

ఆఫీసులో ఆయనకి ఎవరిమీదైనా కోపం వస్తే నా మీద చూపించి బీపీ తగ్గించుకునేవారు. ఆయనకి రోగం వచ్చి మంచంలో పడినా సరే ఆయన అహంకారం ఏమీ తగ్గలేదు. నోటమ్మట ఓ సానుభూతి మాట కూడా వచ్చేది కాదు. ఇదంతా నేను చచ్చినట్టు చెయ్యాలి. ఎవరికోసం చెయ్యదు అన్నట్టుండే ధోరణికి నిజంగానే విసిగిపోయానురా. ప్రేమతో చెయ్యడం వేరు. కొన్ని రోజులు రాత్రుళ్లు నిద్రే వుండేది కాదు. జీవితం మొత్తం ఆయనకి సేవలు చెయ్యడమే సరిపోయింది.

నీకు తెలీదురా కిరణ్! ఒక ఆడది ఇంట్లో ఎంత మానసిక ప్రశాంతతనిస్తుందో, ఇంట్లో అందరికీ టైమ్‌కన్నీ చేసిపెడుతూ వుంటే ఆ విలువ ఎంతటిదో ఎవరికీ అర్థంకాదు. ఎంతచేస్తే ఏమిటి 'గుర్తింపులేని దగ్గరితనం' మనల్ని బైటవాళ్ళు బాధపెడితే గట్టిగా సమాధానం చెప్తాం. కానీ ఇంట్లో నా అనుకున్న సొంత మనిషే మాటల ద్వారా తూట్లు పొడిచేస్తూ వుంటే ఎవరికి చెప్పుకోలేం. అలా అని ఏడ్వకూడదు, ఎప్పుడు నవ్వుతూ వుండాలి. అదెలా సాధ్యమో ఆయనకే తెలియాలి. ఈ నలభై సంవత్సరాల వైవాహిక జీవితంలో ఆయన నాతో ఎప్పుడైనా ప్రేమగా మాట్లాడరా? అంటే ఆలోచించాల్సిందే. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే నా మీద జాలిపుట్టడానికి, మీ

నాన్న మీద గౌరవం పోవడానికే కాదు. నీకు తెలియాలి. నా నిర్లిప్తత వెనకలా కార ణమేంటో? అమ్మ ఇలా ఎందుకు మారిపో యిందో? నేనిప్పుడు నీతో రాలేను"

"అది కాదమ్మా..."

"లేదు కిరణ్! నే చెప్పేది విను. ఇన్నాళ్ళూ మాట్లాడలేకపోయాను. నీ దగ్గ రైనా మాట్లాడనీ.."

అమ్మ వూపిరి తీసుకుని చెప్పసాగింది.

"నాకింకా వోపికుంది. నాకు నేను నచ్చిన ట్టుగా వుండాలని వుంది. ఏడు గంటలకు లేస్తానో? ఎనిమిదింటికి లేస్తానో? స్నానం చెయ్యకుండానే టిఫిన్ చేస్తానో? వంట చేస్తానో? కొన్నాళ్ళు నన్నొదిలెయ్యరా? ఇందులో దాయడానికేమీ లేదు. శృతిని నేనెప్పుడూ కోడలిగా చూడలేదు. అందుకే తను వుంటుండగానే అన్నీ చెప్పేను. నాకు సంబంధించినంతవరకు మీరిద్దరూ ఒకటే"

"మిమ్మల్నొక్కర్నీ, ఇక్కడ ఒంటరిగా వది లేసి ఎలా వెళ్తామత్తయ్యా? పోనీ నన్ను కొన్నాళ్ళు వుండమంటారా? "

శృతి గొంతులోని మార్పుకు నేనే ఆశ్చ ర్యపోయా?

"నేనెప్పుడూ ఒంటరిదాన్నే శృతీ. కాక పోతే అప్పుడు సమూహంలో ఒంటరితనం. ఇప్పుడలా కాదు. అయినా నాకు నచ్చిన ప్ర దేశాలు, పుణ్యక్షేత్రాలు చూడాలని వుంది"

"కానీ, మీరొక్కరూ.."

"నేనొక్కదాన్నీ కాదులే.. మొన్న మీ అమ్మగారొచ్చినప్పుడు అనుకున్నాం. ఇద్దరికీ డబ్బుకి లోటులేదు. కాస్త ఆరోగ్యంగానే వున్నాం. మా ఇద్దరికీ అన్నీ చూడాలన్న కోరికుంది. ఇప్పుడు మిమ్మల్ని మాతోపాటు తిరగమనడం భావ్యం కాదు. ఇప్పుడు మీరు బిజీ. మేం కాస్త రిలాక్స్ అయ్యే సమయం. అందుకే మేం వెళ్ళొస్తాం ఏమంటావురా? "

"తను ఏమనడానికి ఏముందత్తయ్యా! మీరు, అమ్మ వెళ్తానంటే మాకింకా హేపీ. అమ్మ కూడా బోర్‌గా వుంటోందంటోంది. కానీ చిన్న రిక్వెస్ట్.. మీరు ఎక్కడికెళ్ళినా సెల్‌ఫోన్, కొన్ని టాబ్లెట్స్.. ఇలాంటి చిన్న జాగ్రత్తలు తీసుకోండి" అంటూ శృతి ఏంటో మాట్లాడేస్తోంది.

నేను కిందకి జరిగి అమ్మ ఒళ్లో తలపెట్టు కుని పడుకున్నాను. అమ్మ జరిగిపోయిన జీవితం గురించి ఏడుస్తూ కూర్చోకుండా మిగిలిన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకుని తనకి నచ్చినట్టుగా వుండాలనుకుంటోంది. అమ్మలాగే అందరు ఆడవాళ్లూ వుండాలి. జరిగిపోయిన జీవితం గురించి ఏడుస్తూ కూర్చోకుండా.. భవిష్యత్తుని తనకు తానుగా మల్చుకోవడం.. అమ్మ అరచెయ్యి తీసుకుని నా నుదుటిమీద వుంచుకుని నేను నిశ్చిం తగా అమ్మ ఒళ్ళో పడుకున్నాను.

హిందీ కథ

-నిర్మల్ కుమార్

భగవంతుడి అన్న

అనువాదం : పాలకోడేటి కృష్ణమూర్తి

చలయ్యకి బాగా ముసలితనం వచ్చేసింది. నిజానికి సముద్రంలో చాలాదూరం ప్రయాణించడం, వల విసరడం, చేప చిక్కగానే లాగడం లాంటి పనులన్నీ వయోభారం వల్ల చాలా కష్టమవడంతో తరచుగా అర్ధరాత్రి మెలకువవచ్చి చటుక్కున లేచి కూచుంటాడు. రోజూ పడే శ్రమ గురించి తలచుకోగానే మనస్సు అలజడికి గురవుతుంది. ఇక నిద్రపట్టదు సరికదా, దగ్గు విపరీతంగా వస్తుంది.


అయినా వేకువజామునే నిద్రలేచి రోజూ తన నావమీద సముద్రజలాల్లోకి వెళ్లిపోతాడతను. చేస్తున్నప్పుడు పని కష్టమనిపించినా ఎలాగోలా పూర్తిచేస్తాడు. కానీ సాయంత్రం భుజాన వల వేసుకుని గుడిసెకు తిరిగి రాగానే, శరీరం అలసిపోవడంతో వెంటనే నిద్రపోవాలనిపిస్తుంది.

చలయ్య మనవడు అప్పన్.. అతన్ని తాగనిచ్చేవాడు కాదు. "ఇప్పుడు నీది తాగే వయస్సు కాదు. రాను రానూ ఒంట్లో సత్తువ తగ్గి ఈమాత్రం కూడా శరీరం నీకు సహకరించదు. నీ గురించి కాకపోయినా నా గురించి ఒక్కక్షణం ఆలోచించు. నీ అండ లేకుండా నేనెలా బతికేది? నా కష్టసుఖాలు ఎవరు చూస్తారు? " అని తన తల్లి బతికున్న రోజుల్లో పదే పదే అన్న మాటల్ని చూచాయగా విన్నందున, వాటినే తాతతో అనేవాడు. "చూడు తాతా! నేనింకా చిన్నవాడిని. ఒకవేళ ఏ అర్ధరాత్రో నా పడవ సముద్రంలో చిక్కుకుంటే, నక్షత్రాల పరిజ్ఞానం లేని నేను ఎలా బయటపడగలను? ఏదైనా పెద్దచేప.. వలతో పాటు నన్నుకూడా సముద్రంలోకి లాగడం లాంటి ఇబ్బందులొస్తే, బయటపడే ఉపాయాలు నాకు ఎవరు నేర్పుతారు? " అని పెద్ద పెద్ద మాటల్లాంటివి అంటూనే అప్పన్.. తన చిన్న చేతుల్ని మెడ చుట్టూతా వేసి, తాత ఒడిలో వాలిపోయేవాడు.

ఆ సమయంలో భగవంతుడు "చలయ్యా, నీ మీద చాలా బాధ్యత ఉంది. తల్లీ తండ్రీ లేని బిడ్డను ఓ రోజు మేం నీకు అప్పగించాం. వాడిని పెంచి పెద్ద చెయ్యి. ఏమంటావు? ఈ బాధ్యతని నిర్వహించగలవా? " అన్నట్లనిపించేది.

చలయ్య పీక్కుపోయిన ముఖంతో "అలాగే ప్రభూ. నీ ఆజ్ఞ కాదనే సాహసం నాకు లేదు. నాకున్న శక్తి ఏపాటిది? ఈ ముసలి శరీరంతో వీలున్నంతవరకు నా బాధ్యతని తప్పక నెరవేరుస్తాను. ఒకవేళ నేను మరణిస్తే మాత్రం నన్ను తప్పుపట్టకూడదు. అప్పుడు పిల్లవాడిని నువ్వే చూసుకోవాలి" అంటూ చెమ్మగిల్లిన కళ్ళతో అనేవాడు. రెండు చేతులూ జోడించి మనస్సులోనే దణ్ణం పెట్టుకునేవాడు చలయ్య. తాను మరణిస్తానన్న దిగులు కాదు కానీ, ఆ తర్వాత అప్పన్ వల తీసుకుని నావలో ఒంటరిగా సముద్రంలోకి వెళ్లడం ఊహించుకునే కుమిలికుమిలి ఏడ్చేవాడతను.

అప్పన్ ఏదో పసిగట్టినవాడిలా తాత చెంపల్ని నిమిరేవాడు. కన్నీటితో తాత



చెంపలు తడిసిపోవడం చూసి ఏమీ అనలేక తన లేత పెదవుల్ని ఆ చెంపలమీద ఉంచి అంటిపెట్టుకుని ఉండిపోయేవాడు. ఆ స్పర్శ ఎంతో సుఖంగా అనిపించి, తాను మళ్లీ బాల్యదశలోకి వెళ్లిపోయినట్లుగా భావించేవాడు చలయ్య. తనకు మరణం లేదని, అప్పన్‌లా పిల్లల్లో జీవించే వుంటానని అమాయక హృదయంతో అనుకునేవాడు. ఓ ఆశతో కూడిన విశ్వాసం అందులో గూడుకట్టుకునేది.

“అప్పన్ నా కొడుకు బిడ్డ. ఎలాగైతే నా కొడుకుని సముద్రంలో మునిగిపోయిన తర్వాత అప్పన్‌లో చూసుకుంటున్నానో.. అలాగే నన్నుకూడా అప్పన్ తన కొడుకులో చూసుకుంటాడు” అనుకుంటూ చలయ్య ఆలోచనల్లోకి జారిపోయేవాడు.

అప్పన్, చలయ్య ఇద్దరే ఉన్నప్పటికీ ఆ గుడిసె నిండుగా ఉండేది. తొమ్మిది సంవత్సరాల క్రితం చేపల్ని వేటాడ్డానికి సముద్రంలోకి వెళ్లిన చలయ్య ఒక్కగానొక్క కొడుకు శంకరన్ (అప్పన్ తండ్రి) తిరిగిరాలేదు. పెనుగాలి, తుపాను పరిస్థితుల కారణంగా సముద్రంలోకి వెళ్లిన జాలర్లందరూ మునిగిపోయారు. అప్పటికి అప్పన్ ఇంకా పుట్టలేదు. ఎనిమిది మాసాలు నిండిన తన తల్లి గర్భంలో ఉన్నాడు.

భర్త మరణం శరాఘాతంలా తగలడంతో విషాదంలో మునిగిపోయిన లక్ష్మి.. నవమాసాలూ నిండకుండానే అదే రాత్రి అప్పన్‌కి జన్మనిచ్చింది. సమయానికి ముందే పురుడు రావడంతో, అప్పన్ బలహీనంగా పుట్టాడు. భర్త గుర్తుగా పుట్టిన ఒక్కగానొక్క కొడుకనో ఏమో మరి.. అనేకుల సలహాలు తీసుకుని అప్పన్‌ని అతి జాగ్రత్తగా పెంచింది లక్ష్మి. మూడు సంవత్సరాల క్రితం ఆమెకూడా ఈ లోకం విడిచి వెళ్లిపోయింది. లక్ష్మి ప్రసూతి సమయంలో బాగా రక్తం పోయింది. సంపాది

స్తున్నది పొట్టకే సరిపోవటంలేదు. ఇంకా మందులకెక్కడినుంచి వస్తుంది? అయినా ఓ పక్క అనారోగ్యంతో వున్నప్పటికీ, యవ్వనం కారణంగా లక్ష్మి.. చేపల్ని వేటాడ్డంలో అవసరానికి మించిన బలం ఉపయోగించేది. ఆ రోజు చలయ్యకి జ్వరం. పైగా ముసిలాడు. ఏమయిందో ఏమో .. లక్ష్మి తను అన్నం తిని వాళ్లిద్దరికి పెట్టి పడుకుంది, మూసిన కన్ను తెరవనే లేదు!

మట్టి, గడ్డితో కప్పిఉన్న గుడిసెపైన వ్యాపించిన ఆనపపాదులా ఉండేవాడు అప్పన్! మోగే అతని నవ్వు, పక్క గుడిసెల్లోని ట్రాన్సిస్టర్‌లోంచి వినబడే పాటలు చలయ్యకి సుఖానుభూతినందించేవి. గుడిసె ఓ భవంతిలా అనిపించేది. చుట్టూ పెద్ద పూలతోట, పండ్లతోట ఉన్నట్టుండేది. ఆ నందనవనానికి తానే యజమానిగా భావించేవాడు చలయ్య.

కానీ గ్రామపెద్ద ముఖియా.. చలయ్యపై కోపగించేవాడు. దుబాయ్‌నుంచి వచ్చి సముద్రంలో లంగరువేసి ఆగివున్న నౌకల్లోంచి.. వస్తువులు తేవల్సిందిగా పురమాయించేవాడు. మిగిలిన జాలర్లందరూ ముఖియా చెప్పడంతోటే ఆ నౌకల్లోంచి వస్తువుల్ని దొంగతనంగా చేపల గుట్టలకింద దాచి పడవలో తీసుకొచ్చేవారు. అందుకు ముఖియా వాళ్ళకి కొంత వాటా ఇచ్చేవాడు.

కానీ చలయ్య ఆ పని చేయడానికి అంగీకరించకుండా చేతులు జోడించి అన్నాడు “నేను జీవిత చరమాంకంలో ఉన్నాను.. నా ‘పరలోకం’ భ్రష్టుపట్టిపోతుంది. నేను ఆ ఉచ్చులో ఇరుక్కుంటే అప్పన్ జీవితం ఛిన్నాభిన్నమైపోతుంది. దొంగ సొత్తు నాకవసరం లేదు. నేనూ నా మనవడూ ఊరూరూ తిరిగి ఎండు చేపలు అమ్ముకునైనా బతుకీడుస్తాం. కడుపుకోసం ఏదోటి చెయ్యాలిగా. కానీ ఇటువంటి పనులు చెయ్యం. మా మానాన మమ్మల్ని బతకనివ్వండి”.

ముఖియా చలయ్యని రెండు చెంపదెబ్బలు కొట్టాడు. బలహీనంగా ఉన్న అతను ఆ దెబ్బలకి విలవిలాడిపోతుండగా ముఖియా మళ్లీ బలంగా ఓ తన్ను తన్నాడు. అది చాలాకాలం చలయ్య నరనరాల్లో నిండిపోయింది.

తాతకి జరిగిన అవమానాన్ని అప్పన్ చూశాడు. అతడి కళ్లు నీళ్లతో నిండిపోయాయి. బెదురుతూ భయంభయంగా ముఖియావైపు చూశాడు. కానీ చిన్నవాడవటం మూలాన తాను ఏమీ చేయలేని నిస్సహాయుడని అప్పన్‌కి తెలుసు. గుడిసెకి తిరిగి రాగానే అర్ధరాత్రి వరకు అప్పన్ గుండెలవిసేలా ఏడ్చాడు. చలయ్య అతన్ని బుజ్జగిస్తూ ఒళ్లోకి తీసుకోబోయాడు.

అప్పన్ వెంటనే చేతులు విదుల్చుకుని తాత ఒళ్లోంచి దూరంగా జరిగి అన్నాడు “భగవంతుడు దయగలవాడంటావు. ఇదేనా న్యాయం? మనం చేసిన తప్పేంటి? మనం ముఖియాకి ఏం ద్రోహం చేశామని తన తండ్రి వయసున్న నిన్ను కాలితో తన్నాడు? అయినా భగవంతుడు ముఖియాని ఏమీ అనడంలేదు. ఆ భగవంతుడు ముఖియా కాళ్ళు ఎందుకు విరగ్గొట్టలేదు? ” అంటూ ప్రశ్నలు గుప్పించాడు. చలయ్య హృదయం ఆర్ద్రమైంది.

అప్పన్‌ని తన గుండెల కదుముకుని “లేదు బాబూ.. నువ్విలా ఏడవకూడదు. ఇలా ఏడిస్తే భగవంతుడికి నిద్రాభంగమవుతుంది. ఇప్పుడాయన సముద్రంలో నిద్రపోతున్నాడు. నిన్ను ఎవరైనా గట్టిగా కుదిపి నిద్రలేపితే బాధపడతావా లేదా? అలాగే భగవంతుడు కూడా బాధపడతాడు. తెలుసా? మంచి పిల్లలు మెల్లిగా ఏడుస్తారు, గొంతుచించుకుని కాదు” అంటూ సముదాయించాడు తాత.

అప్పన్ ఏడుపు కొద్దిగా తగ్గింది. కానీ వెంటనే ఏదో గుర్తుకుతెచ్చుకుని మళ్లీ బిగ్గరగా ఏడుస్తూ అన్నాడిలా “ఓ రోజు మందులకోసం ఐదు రూపాయలు కావల్సి వచ్చి అమ్మ ముఖియా ఇంటికెళ్లింది. అతను అమ్మని గట్టిగా పట్టుకున్నాడు. అమ్మ పెనుగులాడింది. ముఖియా చేతిని నోటితో కొరికి విడిపించుకుంది. అప్పుడు అతను అమ్మని నానా తిట్లు తిట్టి కాలితో తన్నాడు. అయినా సరే ఆ భగవంతుడు అతనికే దండిగా డబ్బులిస్తాడెందుకు? మరి నాకేమో ఒక్క బొమ్మ కూడా ఇవ్వడు!”

చలయ్య కలవరపడ్డాడు. ‘ఈ పిల్లవాడికి పెద్దల గురించి కొంచెం ఎక్కువగా తెల్సిపోయింది. చిన్నవాడయ్యుండీ పెద్దపెద్ద విషయాలు మాట్లాడుతున్నాడు. వీడి వయసుకి ఇది మంచి పరిణామం కాదు. మాది తరతరాలనుంచి పేదవంశం. మా తాత కూడా పేదవాడు. ఆయన అంటూండేవాడు తన తాతకూడా పేదవాడేనని! మరి ఈ అప్పన్ సంగతేవిటి? వీడు దొరలతో తలపడే స్వభావం అలవర్చుకుంటున్నాడేంటి? ’ అని మనసులో అనుకున్నాడు. మృదువుగా అప్పన్ తల నిమురుతూ “చూడు బాబూ, భగవంతుడు కూడా మనతోబాటే ఏడుస్తాడు. నువ్వు ఏడుస్తున్నావుగా. అందుకే భగవంతుడు కూడా సముద్రంలో ఏడుస్తున్నాడు. అదిగో సముద్రఘోష . మధ్యలో ఓ సన్నటి ఏడుపు శబ్దం వినబడుతోందా? ” అన్నాడు.

అప్పన్ వెంటనే ఏడుపుమాని చెవులు నిక్కబొడుచుకుని వినసాగాడు.

“అదిగో.. అదే భగవంతుడి గొంతు. ఆయన కూడా ఏడుస్తున్నాడు. ఎందుకంటే అప్పన్ ఏడుస్తున్నాడుగా మరి. అదీగాక భగవంతుడికి అతనంటే చాలా ప్రేమ” చలయ్య అప్పన్‌కేసి ప్రేమగా చూస్తూ అన్నాడు.

“భగవంతుడు ఎందుకేడుస్తాడు? ఆయన ముఖియాని ఎందుకు కొట్టడు?

ఏం.. భగవంతుడికి బలం లేదా?" అన్నాడు అప్పన్ సవాల్ చేస్తున్నట్లు.

"బలం లేకపోవడమేంటి బాబూ, ఆయన మహా బలవంతుడు. కాకపోతే ఆయనకి ఓ అన్నయ్య ఉన్నాడు. ఆయన పేరు బలభద్రుడు. ఆయన భగవంతుడికన్నా పెద్ద. బలభద్రుడే ముఖియాకి డబ్బులిస్తాడు. భగవంతుడు అన్నగారి సమక్షంలో మౌనంగా ఉంటాడు. దయాస్వరూపుడు. అదృశ్యంగా మనవెంటే ఉంటాడు. ఆయన మనకి తప్పక సహాయం చేస్తాడు. నువ్వు చూస్తావుగా" అంటూ చలయ్య అప్పన్‌ని అనునయించాడు.

చలయ్యని బంధుమిత్రులనుంచి దూరం చేశాడు ముఖియా. దాంతో అప్పన్ పొయ్యిదగ్గరున్నప్పుడు చలయ్య వేరెవరితోనైనా చేరి హుక్కాపీల్చడం.. లేదా.. పక్కగుడిసెల్లోకి వెళ్లి వాళ్ల మంచిచెడ్డలు విచారించడం ఆగిపోయాయి.

చలయ్యతో వేరెవ్వరికీ గొడవలు లేవు కానీ ముఖియాతో ఎవ్వరూ శతృత్వం కొనితెచ్చుకునేవారు కాదు. నీళ్ళలో ఉంటూ మొసలితో వైరాన్ని ఎవరు కొనితెచ్చుకుంటారు?

చలయ్య ఒంటరితనంతో బాధపడేవాడు. కానీ ఇప్పుడు అతను, మనవడు ఒకరికొకరు తోడుగా ఉండే మంచి అవకాశం చిక్కింది. ఓ రోజు చలయ్య అప్పన్‌కి అర్థమయ్యే విధంగా "చూడు బాబూ, బస్తీ ప్రజలు ముఖియా మాటకు ఎదురుతిరగరు. అయినా మనకిప్పుడు ఏమైంది? ఇంకా మంచే జరిగింది. ఇప్పుడు మనమిద్దరం ఒకరికొకరం తోడుగా ఉన్నాం" అని మురిపెంగా చూస్తూ అన్నాడు.

ఈ మాటలు విన్న అప్పన్ వెంటనే తన చిన్న చేతుల్ని తాత మెడ చుట్టూ వేసి సంతోషంతో ఊగిపోయాడు.


ఎందుకో తెలీదు కానీ ముఖియా మాత్రం రెచ్చిపోయాడు. ముఖియావల్ల ఎదురవుతున్న కష్టాల్ని ఎదుర్కొనే ఉపాయాలను చలయ్య కనిపెడ్తూనే ఉన్నాడు. కానీ అవి కొత్త కష్టాలు తెచ్చిపెట్టసాగాయి.

ఓ రోజు చలయ్యకి అనుకోని సంఘటన ఎదురయ్యింది. వలని భుజంపైన వేసుకుని అప్పన్ చెయ్యిపట్టుకుని సముద్రంనించి తిరిగి వస్తుండగా బస్తీలోని కొందరు పిల్లలు ఎదురయ్యారు. ముఖియా లంచం రూపంలో ఇచ్చిన మిఠాయి తిన్న వాళ్లు ఆ ఇద్దర్నీ చూసి గేలి చేశారు.

ఏ రోజైనా వాళ్లు బస్తీలో ముఖియాకి ఎదురైనపుడు "హరిశ్చంద్రుడి అవతారం వస్తున్నాడు. కనబడ్డంలేదా, పక్కకి జరగండి" అంటూ ముఖియా ఎగతాళి చేయడం, అక్కడవున్న బస్తీవాళ్లు పగలబడి నవ్వడం సర్వ సాధారణమైపోయింది.

ఇవన్నీ చూస్తుంటే చలయ్యకి వెన్నులో వణుకు మొదలైనట్లు, గుండెలు పిండినట్లు అనిపించసాగింది. జారిపోయిన యవ్వనం మళ్లీ తిరిగివస్తే, మునుపటి శక్తి తిరిగి చేకూరితే 'ఓరి నీచుడా, వయసులో నీకన్నా పెద్దవాణ్ణి. అనుభవంలో పండిపోయిన వాణ్ణి..' అంటూ ముఖియా మొహం మీద గట్టిగా ఓ గుద్దు గుద్దాలన్న భావన కలిగేది చలయ్యకి.

ఓ రోజు అతను మౌనంగా తలవంచుకుని నడచి వస్తుండగా ఓ దృశ్యం కళ్ళకు కట్టింది. అతని మెదడులోని పుర్రె బయటికి వచ్చినట్టయింది. అది తన కళ్ల ముందు ఓ మాంత్రికుడి పుర్రెలా నర్తించసాగింది. చలయ్య నుంచి కంకాళం బైటికి వచ్చి చేతులు కట్టుకుని నిలుచున్నట్లు అన్పించింది. అతని ముందు వికటాట్టహాసం చేస్తూ "ప్రభూ! ఆజ్ఞాపించు. ఈ పుర్రె ఇంద్రజాలం చేస్తుంది. నువ్వు శపించు. వెంటనే ఈ పుర్రె ఆ నీచుడి వంశాన్నంతటిని భస్మీపటలం చేస్తుంది" అనసాగింది. కానీ చలయ్య ఆ కపాలాన్ని, కంకాళాన్ని పక్కకి నెట్టివేయగానే అవి మళ్లీ లోనికి



వచ్చి చేరిపోయాయి!

తాము పేదవాళ్ళమని, తమ భగవంతుడు చిన్నన్నయ్య అని, ఆయన తమగురించి కేవలం ఏడ్వగలడని, ఏవిధంగానూ సహాయపడలేడని అప్పన్‌కి మెల్లిగా అర్థమవ్వసాగింది. తాతతో పాటుగా మౌనంగా తలవంచుకుని నడవటం అలవర్చుకున్నాడు.

తన తాతకి రాత్రిపూట కంటి చూపు సరిగా ఉండదని, పైగా అలసివుంటాడని.. రాత్రిపూట వంట అప్పన్ చేస్తాడు. పొయ్యి దగ్గరున్నప్పుడు అప్పుడప్పుడూ తన తల్లితో మాట్లాడుతున్నట్లుగా అప్పన్ భ్రమించేవాడు. బహుశా తోటి పిల్లలు దూరమవడంతో అతని ఒంటరి మనస్సు తనలో తాను మాట్లాడ్డం నేర్చుకున్నట్టుంది. అంతేగాక అప్పన్ తనకు తాను రెండు భాగాలుగా విభజించుకున్నాడు, తొలి అర్ధభాగం అప్పన్ అయితే రెండో భాగం అప్పన్ తల్లి.

"చూడు అప్పన్, ఎవరైనా ఏమైనా అన్నా, నవ్వుకున్నా, నువ్వు కోపం తెచ్చుకో

వద్దు.. మాటకి మాట జవాబు చెప్పవద్దు" అంటూ ఓ రోజు తల్లిగొంతు వినిపించింది.

"కానీ అమ్మా, ఆ భగవంతుడి అన్నయ్య ఇంత అన్యాయం ఏమిటి? ఆయన ముఖియాని ఏవీ అనకపోగా తిరిగి డబ్బులిస్తాడేం? " అన్నాడు అప్పన్.

"ఎందుకంటే భగవంతుడి అన్నయ్య బాగా తాగుతాడు. అందుకే నువ్వు నీ తాతని ఎప్పుడూ తాగనివ్వకు. తాగి తాగి నీతాత కూడా అన్యాయమైపోతాడు, నిన్ను మర్చిపోతాడు" అంటూ తల్లి గొంతు వినిపించింది.

ఓరోజు చలయ్య గుడిసెకి పోలీసులు వచ్చారు. సోదా చేశారు. సోదా చెయ్యటానికి ఆ గుడిసెలో ఏముందని.. కొన్ని బట్టలున్నాయి. ఆ బట్టల్లో లక్ష్మివి కూడా ఉన్నాయి. వెండి కంటె, గాజులు, కడియం, దువ్వెన, అద్దం కూడా ఉన్నాయి.

ఎందుకో మరి చలయ్య వాటిని తన కూతురు లక్ష్మి జ్ఞాపకార్థం దాచి ఉంచాడు. నిజానికి భర్త శంకరన్ మరణించిన తర్వాత కోడలు లక్ష్మి కూతురూ కొడుకూ తనే అయ్యి తన కర్తవ్యాన్ని నెరవేర్చింది. విదేశీ సాంప్రదాయంతో కుట్టిన ఓ చోళీని కూడా చలయ్య ఆమె బట్టల్లో దాచి వుంచాడు. ఆ చోళీని లక్ష్మికోసం శంకరన్ శబరిమల సంతలో కొని తీసుకొచ్చాడు.

"ఓహో ముసలితనం వచ్చినా సరదాలు, కోరికలు వదల్లేదన్నమాట. ఇప్పటికీ మన సంతా చోళీలోనే ఉన్నట్టుంది." అంటూ ఎస్.ఐ ఓ వెటకారపు నవ్వు నవ్వాడు.

తన దగ్గరే నిలబడ్డ అప్పన్ మోహంలో లక్ష్మి కనబడేసరికి.. చిన్న పిల్లాడి ముందు ఎస్.ఐ నిస్సిగ్గుగా మాట్లాడినందుకు కాబోలు చలయ్య కంట్లో నీరు నిండింది. అప్పుడే ఓ పాత సినీ నటి ఫోటో ఒకటి ఎస్.ఐ కంటపడింది. చలయ్య ఆ ఫోటోని అరవై సంవత్సరాలనించి దాచి ఉంచాడు. ఆ ఫోటో ఓ మూకీ సినిమాలో నటించిన సుప్రసిద్ధ అందాల నటిది. చలయ్య యవ్వనంలో ఉండగా ఆ సినిమాని మద్రాసులో చూశాడు. రూపవతి అయిన ఆ హీరోయన్ పట్ల ఆకర్షణ పెంచుకున్నాడు. ఆ ఫోటోని చూసి చలయ్య భార్య చాలాసార్లు కోప్పడి దాన్ని చింపడానికి ప్రయత్నించింది. కానీ అతనందుకు ఒప్పుకోలేదు.

ఎస్.ఐ ఆ ఫోటోని బట్టల మడతల్లోంచి తీస్తూ "దీన్ని చూడు. నీకిష్టమైనది.. ఈ రోజుల్లో పెద్దవాళ్లు పిల్లలకి ఇలాగే చెడ్డ పేరు తీసుకొస్తున్నారు." అని చలయ్యవైపు తీక్షణంగా చూస్తూ అన్నాడు.

ఓరోజు ముఖియా రిస్టువాచీ పోయింది. దాంతో చలయ్యపై పగ తీర్చుకోడానికి పోలీసుస్టేషనులో చలయ్య పేరు రాయించాడు ముఖియా. సోదా చేస్తే లేని వస్తువు ఎలా దొరుకుతుంది?

దాని గురిం చి పోలీసులు విచారిస్తుండగా చలయ్య అక్కడే నిలబడి వున్న ముఖియాతో "దొరా! మేం మీకే అపకారం చేశామని మామీద ఇంత కక్ష కట్టారు? దయచేసి వృద్ధాప్య దశలో మాకింతటి దుర్గతి కలిగించకండి" అంటూ దీనంగా వేడుకున్నాడు.

ముఖియా ఓ వెకిలినవ్వు నవ్వి మీసం మెలేస్తూ "ఇక చూడు హరిశ్చంద్రుని కొడకా, నిన్నేం చేస్తానో.." అన్నాడు.

ఆ రాత్రి చలయ్య తిండి తినలేదు. అప్పన్ కూడా తినకుండానే పడుకున్నాడు. చలయ్య వెక్కివెక్కి ఏడ్చాడు. తనపై మోపిన నిందకన్నా తనలో ఇంతకాలం నిగూఢంగా ఉండిపోయిన విషయం అప్పన్ ముందు బయట పడినందుకు బాగా దుఃఖించాడు.

చలయ్య గురించి బస్తీ వాళ్లందరికీ తెలిసిపోయింది. అతన్ని చూసి అమ్మలక్కలు నవ్వసాగారు. ఆఖరికి ముఖియా ఏదైతే అన్నాడో అదే జరిగింది. రెండువారాలు గడిచిన తర్వాత మళ్లీ పోలీసులు వచ్చారు. ఈ సారి ముఖియా ట్రాన్సిస్టర్ పోయిందని అభియోగం. ఆ ట్రాన్సిస్టర్ చలయ్య గుడిసె చూరునుంచి బయటపడింది! తాను నిరపరాధినని, తనకేమీ తెలియదని, ఆ ట్రాన్సిస్టర్ తన గుడిసె చూరులోకి ఎలా వచ్చి చేరిందో తెలియదని చలయ్య ఎస్.ఐ కాళ్లావేళ్లా పడ్డాడు. కానీ పోలీసులు అతన్ని వెంటనే లాక్కెళ్లారు.

అప్పన్ కళ్లముందు అంధకారం అలముకుంది. భయంతో మెదడు శూన్యమయింది. అతనికి అర్థమయ్యింది ఒకటే.. సముద్రం నిద్రిస్తున్నపుడు గాలులు చల్లబడతాయని, దాంతో తాతకి చలివేస్తుందని. గుడిసెలో ఒక్కటే కంబళి ఉంది. చలిగా ఉన్నప్పుడు తను, తాత ఒకరిమెడలో ఒకరు చేతులు వేసుకుని ఆ కంబళిలో ముడుచుకుని పడుకునేవారు.

అప్పన్ పరుగున వెళ్లి గుడిసెలోంచి కంబళి తీసుకొచ్చాడు.

అప్పటికే పోలీసులు చలయ్యని తీసుకొని కొంతదూరం వెళ్లిపోయారు.

దూరంగా తాత వెళ్లడం చూసి అప్పన్ మనస్సు భయంతో కంపించింది. చీకటి గుయ్యారంలాంటి భయం అతని పేగుల్లో సుళ్లు తిరుగుతూ కళ్లలోకి వచ్చి చేరింది. పరుగెత్తి ఎలాగోలా తాతని చేరుకున్నాడు. ఎస్.ఐ చలయ్యని ఒక్క తోపుతోసి జీపు వెనక ఎక్కించాడు.

"అయ్యా! ఒక్క నిమిషం. ఈ కంబళి.. తాత చలికి తట్టుకోలేడు" అంటూ దుర్బలుడైన అప్పన్ వణికే కంఠంతో అన్నాడు.

"సరే మంచిది" ఎస్.ఐ ఉదారస్వభావంతో అన్నాడు.

బలహీనమైన గొంతులోంచి మాటలు పెగలని చలయ్య.. కంబళి వద్దంటున్నట్టుగా చేతులు ఊపుతుంటే, అప్పన్ దాన్ని తాత ఒళ్లోకి విసిరేశాడు.

జీపు వెనకాలే కొంతదూరం పరుగుతీశాడు. "కంగారుపడకు తాతా. నాగురించి విచారించకు. సాయంత్రం నీకు అన్నం తీసుకొస్తాను" అప్రయత్నంగా అప్పన్ నోటినుంచి మాటలు వెలువడ్డాయి.

చలయ్య తన రెండు చేతుల్లోనూ ముఖం దాచుకున్నాడు. జీపు వేగం పుంజుకుంది. అప్పన్ ఇక పరుగెత్తలేక రొప్పుతూ ఆగిపోయాడు. జీపు వెళ్లిన వైపు చూస్తూ తన శక్తినంతటిని కూడదీసుకొని అన్నాడు "తాతా, నువ్వు నిశ్చింతగా ఉండు. నేను పెద్దవాడినయ్యాను. వల తీసుకుని నావలో సముద్రంమీదకి వెళ్తాను. నువ్వు విడుదలై రాగానే చూడు.. ఎన్ని చేపలు పోగు చేస్తానో" అంటూ పెద్ద గొంతుతో అరిచాడు.

కడుపులోంచి తన్నుకొచ్చే దుఃఖానికి నిదర్శనమా అన్నట్టు అప్పన్ కంఠనాళాలు, దవడలు, కణతలు నొప్పిపెట్టసాగాయి. జీపు కనుమరువవ్వగానే, జరిగిన సంఘటనకి తట్టుకోలేక అతని హృదయం నుంచి తీవ్ర ప్రకంపనలు వెలువడసాగాయి. అంతర్లీనంగా పరుచుకుని ఉన్న దుఃఖపు తరంగాలు ఒక్కసారి పెల్లుబికి కళ్లలోకి రావటానికి ప్రయత్నించాయి.

కానీ ఆ పగిలిన హృదయంలో ఊపిరి పోసుకున్న చిక్కటి చలిగాలి తప్ప కన్నీళ్లు లేనే లేవు.

అప్పన్‌కి గుండెలవిసేలా ఏడ్వాలని ఉంది. కానీ తాత లేకపోవడంతో ఏడుపు.. శబ్దం లేకుండా అతని కళ్లలోకి రాసాగింది. కానీ పగిలిన హృదయంలో నీళ్లు ఇంకిపోయాయి.

ఇప్పుడు సముద్రం మీద నుంచి వీచే గాలి కంటే మనస్సు పొరల్లోంచి వస్తున్న చలిగాలితో అతని అంతరంగం కంపించసాగింది.

అప్పన్‌కి ఇప్పుడు అర్థమవుతోంది భగవంతుడి అన్న ఎవరో! ముఖియానా పోలీసా లేక ఇలాగే వేరొకరా? V

గుజరాతీ కథ

-హిమాంశు జోషి

ఈసారి

అనువాదం : కె. శారద

ఒక సత్యానికి మరో సత్యానికి మధ్య కూడా ఒక తేడా ఉంటుంది. ఆ తేడానే ఒక్కోసారి ఎంతో పెద్ద సమస్యకు దారి తీస్తుంది.

అమెరికా నుంచి అతిమ ఫోన్ చేసింది. ఆమె గొంతు గాభరాగా వినిపించింది. "క్షమించాలి అన్నయ్యగారూ... మీ నిద్ర పాడు చేసినందుకు. ఇప్పుడు అక్కడ రాత్రి మూడు గంటలవుతుండొచ్చు."

"ఏం ఫర్వాలేదమ్మా... విషయం ఏమిటో చెప్పు. ఎందుకింతలా గాభరా పడుతున్నావు? అక్కడంతా కుశలమేగా? "

"ఆc! ఇక్కడంతా బాగానే ఉన్నాం, అన్నయ్యగారూ, కానీ నాకు అక్కడి టెన్షనే పట్టి పీడిస్తోంది. నిన్నట్నుంచి నాన్నకి ఎన్నో సార్లు ఫోన్ చేశాను. కానీ ప్రతిసారి 'ఎంగేజ్డ్' వస్తోంది"

"అందుకు కంగారు పడాల్సింది ఏముంది? 'ఎంగేజ్డ్' మామూలేగా!"

"పొద్దంతా, రాత్రంతా 'ఎంగేజ్డే' ఉంటుందా ఫోను? అమ్మా నాన్న ఇద్దరేగా ఉంటుంది అక్కడ? వాళ్ల ఫోన్ ఎప్పుడూ ఖాళీగానే ఉంటుంది. ఎందుకిలా 'ఎంగేజ్' వస్తుందో నాకర్థం కావడం లేదు..." తడబడుతూ అంది.

"అయ్యో అతి... నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావు. ఫోన్ పాడయినా 'ఎంగేజ్డ్' శబ్దమే వస్తుంది. ఇదేమైనా మీ వాషింగ్టన్, న్యూయార్కా...? ఇక్కడ ఎప్పుడు పడితే అప్పుడు గుంతలు తవ్వుతూ ఉంటారు. కేబుల్ డౌన్ కావడం ఇక్కడ మామూలు విషయమే. మరమ్మతు ఎప్పుడు చేస్తారో ఎవరూ ఊహించలేం" నిదానంగా సర్దిచెప్పాను.

అనవసరంగా కంగారు పడడం, హైరానా పడడం అతియకి అలవాటే. లోగడ బాబాయి రెండ్రోజుల కోసం మీరట్ కు వెళ్ళినప్పుడు కూడా, నాన్న ఏమైపోయాడోనని ఊహించుకుంటూ, ఇలాగే కంగారుపడిపోయింది.

"మీకెలా చెప్పను అన్నయ్యా! గత వారమే ఢిల్లీ నుంచి కృష్ణ ఖర్బందగారు న్యూజర్సీకి వచ్చారు. వాళ్ళ పెద్దమ్మను కలవడానికి, వారే చెప్పారు... సౌత్ ఢిల్లీలో పట్టపగలే ఒంటరిగా ఉన్న వృద్ధుల హత్యలు తరచు జరుగుతున్నాయని. ఇంట్లో పనిచేసే నౌకర్లు, అదను చూసిన దొంగలు వృద్ధులను చంపి దొంగతనాలకి పాల్పడుతున్నారని విన్నాను. ప్రతిరోజు ఢిల్లీ దినపత్రికల్లో ఇలాంటి సంఘటనలు ఏదో ఒకటి ప్రచురితమవుతూనే ఉన్నాయట. ఇలాంటి దోపిడీలు సర్వసాధారణమైనా యటగా ఇప్పుడు. మొన్నీ మధ్య అమ్మకి ఫోన్‌చేసి చెప్పాను కూడా. నౌకరును తీసేసి, కాన్పూర్ నుంచి శీలూ పిన్నిని పిలిపించుకోమన్నాను. ఆ పిన్నిక్కూడా నా అనేవారు ఎవరూ లేరు. ఓ విధవరాలుని చేరదీసినట్టుగా, అమ్మకి



చేదోడువాదోడుగా ఉంటుందని చెప్పాను”

“అయితే అమ్మ నీ మాట వినకుండా పనిమనిషిని తీసేసి ఉండదని. ఆ పనిమనిషి వాళ్ళనేమైనాచేసి ఉంటుందని భయపడుతున్నావా? ” నేను చిన్నగా నవ్వుతూ అడిగాను.

నా మాటలకి ఆమె మరింతగా బెదిరిపోతూ అంది- “ఛ! అదేంటి అన్నయ్యా.. మీరైనా నన్ను అర్థం చేసుకోరేమిటి? . అక్కడ అమ్మా నాన్న ఒంటరిగా ఉండటం, ఇంతదూరాన నేను. నా ధ్యాసంతా ఎప్పుడు అమ్మనాన్నల మీదే ఉంటుంది. కేవలం మీరున్నారన్న ధైర్యంతోనే వాళ్ళను అక్కడుంచాను. వాళ్ళకి ఇక్కడ ‘గ్రీన్ కార్డు’ కూడా వచ్చింది. ఇక్కడే ఉండమని నేనెంతగా పట్టుబట్టినా, వాళ్లు చివరిదశలో పుట్టినగడ్డ మీదే ఉంటామని వెళ్ళారు. నేను వద్దంటే నాన్న ‘ఎమోషనల్’కు గురవుతారు”

“నేను ప్రొద్దున్నే ‘వసంత్ విహార్’కి వెళ్ళి వాళ్ళని చూసి వస్తాను. ఇవాళ రాత్రికి నువ్వు మళ్ళీ ఫోన్ చెయ్యమ్మా...”అన్నాను.

“లేదు. లేదన్నయ్యా... రాత్రివరకు అంటే చాలా ఆలస్యం అవుతుంది. నేను మరో నాలుగయిదు గంటల తర్వాత ఫోన్ చేస్తాను”.

ఆమె ఫోన్ పెట్టేశాక, నేను వెంటనే ‘వసంత విహార్’కు ఫోన్ కలిపాను. నేను కూడా రెండు మూడు రోజులుగా వాళ్లకి ఫోన్ చేయలేదు. బాబాయ్ వాళ్ళ నుంచి కూడా ఫోన్ రాలేదు.

ఫోన్ ఎంతకీ కలవకపోవడంతో నా మనసులో కూడా సందేహం మొదలయింది. కొంపదీసి అతిమ అనుమానం నిజమైందా?

★ ★ ★

నేను ‘వసంత విహార్’కు చేరుకున్నాను. బయటినుంచే పరిస్థితి పూర్తిగా అర్థమైపోయింది. ఇంటి ముందర ఉన్న యూకలిప్టస్ చెట్టు గాలికి విరిగి, వీధి మధ్యలో కొండచిలువలా పడిఉంది. టెలిఫోన్ తీగల స్తంభం కూడా నేలకొరిగింది.

ఇంట్లోకి అడుగుపెట్టాను. పిన్ని పూజగదిలో విష్ణు సహస్రనామం చదువుతోంది. బాబాయి సోఫాలో కూర్చుని హాయిగా పేపరు చదువుకుంటున్నారు.

నన్ను చూడగానే ఆయన చిన్నగా నవ్వారు. “అరె, బీరూ నువ్వా? ఇంత ప్రొద్దున్నే...!”

“అవును బాబాయి. ఇవాళ తెల్లవారుజామున న్యూజెర్సీ నుంచి అతిమ ఫోన్ చేసింది. ఆమె రెండ్రోజులుగా మీకు ఫోన్ చేస్తుంటే కలవడం లేదట. చాలా కంగారుపడుతోంది”.

“పిచ్చి పిల్ల, ఊరకనే హైరానా పడిపోతుంది... అన్నీ తల్లి లక్షణాలే అబ్బాయి... నా బంగారుతల్లి మనస్సంతా మా మీదే ఉంటుంది, ఎప్పుడు” బాబాయి సోఫాలో కుదురుగా సర్దుకు కూర్చుంటూ అన్నాడు. “నేను చాలాసార్లు విన్నాను. అక్కడున్న వాళ్ళకి ఎప్పుడు ఇండియాలో ఏవో దౌర్జన్యాలు, మారణకాండలు జరుగుతున్నట్టు అనిపిస్తూ ఉంటుంది. దేశంలో ఎప్పుడు ఎక్కడో ఒకచోట ఉగ్రవాదులు పెట్రేగిపోవడం, మతకలహాలు చెలరేగడమో వంటి సమాచారం అందుతూనే ఉంటుందిగా. అందుకే తమవాళ్ళు ఎలా ఉన్నారోనని భయపడిపోవడం సహజమే! నిజానికి ఏ దేశం ప్రశాంతంగా ఉంది. ప్రతీదేశంలో ఏదో ఒక సమస్యతో రక్తపాతం జరుగుతూనే ఉంటుంది. అందుకే మేము కూడా ఏ దురాగతానికో, ఏ దౌర్జన్యానికో ఎక్కడ బలయిపోతామెమోనని, మా బంగారుతల్లి భయపడుతూ ఉంటుంది”

“దూరంగా ఉండడం వల్ల, ఏదైనా అయోమయానికి గురవుతూనే ఆదుర్దా పెరిగిపోతుంది, బాబాయ్...” నేనన్నాను.

అంతలోనే పిన్ని పూజగదిలోంచి బయటికి వస్తూ- అంది. “మాకు కూతురైనా, కొడుకైనా అదే. మామీదే ఉంటాయి దాని పంచప్రాణాలు ఎప్పుడూ. ఇంతసేవ శ్రవణకుమారుడు కూడా తన తల్లిదండ్రులకు చేసి ఉండడు. ఇక్కడికి వచ్చిందంటే నన్ను కాలు కింద పెట్టనివ్వదు. వేళకి మందులు ఇవ్వడం దగ్గర్నుంచి అన్నిపనులు తనే చూసుకుంటుంది. నేను ఎక్కడ అలసిపోతాననో, వాషింగ్‌మిషన్, ఇల్లు ఊడ్చే మిషన్, ఇంట్లో ఏ లోటు, లేకుండా అన్ని పరికరాలు సమకూర్చి పెట్టింది...”

నౌకరు టీ తయారుచేసుకుని తీసుకొస్తుండగా నేను వాడికేసి పరిశీలనగా చూసాను. ఇరవై ఏళ్ళలోపువాడే. దేహం బలిష్ఠంగానే ఉంది. ప్రత్యేకంగా వాడి కండపుష్టికేసి నా చూపు సారించాను. ఆనక వాడి పెద్ద పెద్ద కళ్లకేసి చూసాను.

ఎందుకనో, ఇవాళ మొదటిసారి నేను వాడికేసి ఇంతగా తేరిపార ఎందుకు చూస్తున్నానోనని అంతర్మథనం మొదలయింది. ఇలా అనుమానించడం సబబు కాదేమో?

“ఇంతకు ముందు ఎక్కడ ఉండేవాడివి...? ” అని అడిగాను వాణ్ణి.

“నేనా బాబుగారూ...? ”

“ఆఁ, నువ్వే”

“ఫతేపురీ... చాందినీ చౌక్‌లో రాంసూరత్ డాబాలో పనిచేసాను”.

“దగుల్బాజీలతో స్నేహంచేయలేదుగా? ”

వాడికి నా ఆంతర్యం అర్థం కానట్టుంది. అయోమయంగా చూడసాగాడు.

పిన్ని టిఫిన్ ప్లేట్‌లు పట్టుకొచ్చింది.

“మళ్లీ అతిమ దగ్గర్నుంచి ఫోన్‌వస్తే, ఇక్కడంతా క్షేమమనే చెప్పు... ఏం కంగారుపడొద్దను. రేపటికల్లా ఫోన్ కూడా బాగుపడొచ్చు”

టీపాయి మీద మా కోసం టిఫిన్ ప్లేట్లు సర్దిపెట్టి, తనూ ఓ స్టూల్ మీద కూర్చుండిపోయింది.

“ఈ పేపరోళ్ళు కూడా జనాన్ని కంగారు పెట్టేస్తారు. మసాల రుద్ది మరింత ఘాటుగా వార్తలు ప్రచురించడం వారికి అలవాటయిపోయింది. చిలువలు పలువలు చేసి రాస్తారు. స్థానికులకు పలురకాలుగా వాటి ప్రభావం తెలుస్తుంది. కాబట్టి, అంతగా ప్రభావితులు కారు. అయితే విదేశాల్లో ఉండే భారతీయులు వాటిని చదివి, అక్కడ ఇంకేం జరుగుతుందోనని భయపడుతూ, తమ సంబంధీకులు ఏమయిపోతున్నారోనని విలవిలలాడి పోతారు”

బాబాయి ఏదో ఆలోచిస్తూ మళ్లీ చెప్పుకుపోసాగాడు. “నేను కూడా మొన్నీ

మధ్య ఓ ఆంగ్ల పత్రికలో అమెరికాలో జరిగిన ఒక మారణకాండ గురించి చదివాను. పట్టపగలే డబ్బుకోసమో, జాతి వైషమ్యాలతోనో చిటికెలో మనుషుల్ని చంపేస్తారని చదివాను. ఎవరు ఎవర్ని ఎక్కడ ఎందుకు చంపుతారో కూడా అర్థం కాదట"

"అవును నేను కూడా విన్నాను. అక్కడ నల్లజాతి దుండగులు విచ్చల విడిగా ప్రవర్తిస్తారట. అదీ అమెరికా అంతటా కాదులే, ఒకటి రెండు ప్రాంతాల్లో అలాంటి దౌర్జన్యకారులు ఉంటారట. దానికి ఎవరేం చేయలేరట" అంటూ నేను వెళ్ళడానికి సిద్ధపడుతుండగా పిన్ని లోపలి గదిలోంచి ఒక స్వెటర్ తీసుకొచ్చింది "అతిమ నీకోసం పంపిందిరా. ఇప్పుడు చలికాలం రాబోతుందిగా పనికొస్తుంది"

బాబాయి, పిన్ని నా రక్త సంబంధీకులేం కాదు, దూరపు బంధువులం. ఒకే ఊరి వాళ్ళం. అదే ఆత్మీయత కొనసాగుతోంది.

మధ్యాహ్నం అతిమ ఫోన్ రాగానే నేను కొద్దిగా కసురుకుంటూ అన్నాను. "నువ్వు అనవసరంగా కంగారుపడుతున్నావు. ఇక్కడ మీ అమ్మ నాన్న క్షేమంగా ఉన్నారు. ఇక్కడ పరిస్థితులు నువ్వు ఊహించినంత ఘోరంగా ఏమిలేవు. ఏమేమో ఊహించి భయపడకు"

"అన్నయ్యగారూ, వాళ్ళను ఇక్కడకు రమ్మని చెప్పండి. అందరం ఒకే దగ్గర ప్రశాంతంగా ఉండొచ్చు. ఇండియాలో ఎప్పుడు ఏ ఆందోళన చెలరేగుతుందో చెప్పలేం. ఉగ్రవాదులు, నక్సలైట్లు ఎక్కడబడితే అక్కడ బాంబులు పేల్చుతుంటారు. వాళ్ళ గమ్యం ఏమిటో గానీ వాళ్ళ ఘాతుకాలకు ఎవరో అమాయకులు బలైపోతున్నారు. పట్టపగలే ఒంటరి వృద్ధులను దోచుకుని హతమార్చిన సంఘటనలు చదివినప్పుడల్లా నాకు భయమేస్తోంది"

కొద్దిగా ఆగి, మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్టుగా అడిగింది. "ఆc అన్నయ్యగారూ, నౌకరును తీసేశారా, లేదా? "

"లేదు. ఇంకా వాడే ఉన్నాడు. క్రితం సారి వెళ్ళినప్పుడే పిన్ని చెప్పింది, లోగడ రెండుసార్లు ఆ పనివాడి లెక్కచూసి డబ్బులిచ్చి పంపిస్తే, అదేరోజు రాత్రికి తిరిగొచ్చేశాడట. మీ సేవ చేసుకుంటూ ఇక్కడే పడి ఉంటానమ్మా.." అంటూ బతిమాలాడట.

"అయ్యో భగవంతుడా..." ఆమె ఫోన్‌లోనే బిగ్గరగా అరిచింది, ఎటూ తోచని దానిలా. వాడలా మొండికేయడంతో ఏదో కుట్ర ఉండే ఉంటుంది. అదును చూసి ఏదో ఒకరోజు ఏదో అఘాయిత్యం చేసే చూపుతాడు" అంటూ ఆమె ఫోన్ పెట్టేసింది, అశక్తురాలిగా.

ఆ తర్వాత వారం కూడా గడవలేదు. మళ్ళీ అర్థరాత్రి ఫోన్ వచ్చింది. అయితే ఈసారి న్యూజెర్సీ నుంచి కాదు, న్యూ ఢిల్లీ వసంత్‌విహార్ నుంచి. బాబాయి గాభరా పడిపోతూ, వణుకుతున్న గొంతుతో చెప్పారు "న్యూజెర్సీ నుంచి అతిమ పొరుగింటి మిసెస్ ఏనీ ఫోన్‌చేసిందిరా.."

"ఏమని.. అంతా క్షేమమేగా? ప్రాబ్లమేమి లేదుగా? "

"ఘోరం జరిగిపోయిందిరా .." ఆయన గొంతు పెగలడంలేదు. "ఏనీ చెప్పింది విని, నా గుండెలు బద్దలయిపోయాయి. మీ పిన్ని కుప్పకూలిపోయింది. నా కాళ్ళు, చేతులు ఆడడంలేదు. నా బంగారు తల్లి అతిమ న్యూయార్క్ నుండి న్యూజెర్సీకి తిరిగొస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారట. కారులోని వస్తువులన్నీ యధాతథంగా ఉన్నాయట. మరి దుండగులు ఎందుకు హత్యచేశారో అంతుపట్టడం లేదట ఆc!.. పోలీసులు దర్యాప్తు అయితే చేస్తున్నారట... మరి... మ...రి..."

గొంతు పూడుకుపోతూ ఇంకా ఏమి చెప్పలేకపోతున్న బాబాయి చేతినుంచి రిసీవర్ జారి కిందపడిపోయినట్టుంది.

హిందీ కథ

కాళ్ల పట్టీలు

-జైనేంద్ర కుమార్



అనువాదం : గోరంట్ల వాణీదేవి

మార్కెట్‌లోకి కొత్తరకం కాళ్లపట్టీలొచ్చాయి. కాళ్లకు పెట్టుకోగానే వాటి అందం రెట్టింపవుతుంది. ఏ కాలికి పెట్టుకొంటే ఆ కాలికి అందంగా అమరిపోతున్నాయి. చూస్తే కొనకుండా వుండలేరు.

మా ఇరుగుపొరుగు అందరి ఇళ్లలోనూ చిన్నా పెద్దా అందరి కాళ్లకూ అవే.. ఒకరిని చూసి మరొకరు! వాటి ఆకర్షణ నుంచి తప్పించుకొన్నవాళ్లే లేరు.

మా అమ్మాయి నవ్య “నాన్నగారూ, నాకూ పట్టీలు కావాల”ని అడిగింది. నాలుగేళ్లయినా ఉన్నాయో లేదో.. ఈ పిల్లకూ అవి కావాలట!

“ఎలాంటివ”ని అడిగాను.

"లత, గీత పెట్టుకున్నారే.. అలాంటివి"

"సరే" అన్నాను నేను.

"నాకు ఈరోజే కావాలి"

"సరే" అన్నాను మళ్లీ. మధ్యాహ్న సమయానికి వాళ్లత్త వచ్చింది. ఇక అమ్మాయి ఏం చెప్పినా వినేటట్లు లేదు. ఆమెను ఎత్తుకొని అత్త మిఠాయిలు తినిపించింది. "ఆదివారం నీకు పట్టీలు కొనుక్కొస్తాలే" అని నచ్చచెప్పింది.

ఆదివారం మళ్లీ వచ్చింది అత్త. పట్టీలు తెచ్చింది. అమ్మాయి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఇల్లంతా తిరిగింది. లత దగ్గరకెళ్లింది. గీతకూ చూపించింది. అందరూ ఆ చిన్నికాళ్లకు అవెంతో బాగున్నాయంటూ ముద్దుచేశారు. ముచ్చటగా ఉన్నాయవి.

చెల్లెల్ని ఆ పట్టీలతో చూసి మా అబ్బాయి కూడా చాలా సంతోషించాడు. చెల్లెల్ని ఇరుగుపొరుగు అందరిళ్లకూ తీసుకెళ్లి చూపించాడు. పిల్లలిద్దరూ కలిసి ఒకటే నవ్వులూ, కేరింతలూను.

తర్వాత "నవ్యకవి కొన్నారు కదా.. నాకు సైకిల్ కొనివ్వమ"ని మారాం చేశాడు. "నీ పుట్టినరోజుకు కొనిస్తాలే" అని బుజ్జగించింది అత్త. ఆదివారం ఆహ్లాదంగా గడిచింది. సాయంత్రం ఆమె వెళ్లిపోయింది.

పట్టీల మోజు పిల్లలకు కొద్దిసేపే. తర్వాత వాటిని తీసి దాచి పెట్టారు.. పోతాయేమోనని. అవి ఎంతో చక్కగా సుకుమారంగా వున్నాయి కదా.. అందుకని. వాటి ధర కూడా చాలా ఎక్కువ మరి.

శ్రీమతి అంది "చాలా బాగున్నాయి కదండీ ఇవి. నేనూ కొనుక్కుంటానండీ"

"కొనుక్కో. అయినా నాలుగేళ్ల అమ్మాయివి కాదుగా.. కొనిపెట్టటానికి" అన్నాను.

రాత్రి నేను కూర్చుని ఏదో రాసుకుంటూ వుండగా వచ్చింది శ్రీమతి. "మీరు పాప పట్టీలు చూశారా ఎక్కడైనా? " అని అడిగింది. ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాను.

"పట్టీ ఒకటే ఉంది. మరొకటి కనబడటంలేదు. ఏమయిందో ఏమో" అంటూ నా బల్లమీద సొరుగులో ఉన్న కాగితాలన్నీ బైటకి లాగి వెదకటం మొదలు పెట్టింది నా భార్య. బీరువాలోని పుస్తకాలు కూడా వెదకబోతుంటే "అక్కడికెలా వెళ్తందిలే" అంటూ వారించాను నేను.

"ఐతే ఏమైనట్లు? "

"నువ్వే కదా దాచిపెట్టావు. ఎక్కడ పెట్టావో సరిగా గుర్తుచేసుకో"

"వాటిని జాగ్రత్తగా పెట్టెలో పెట్టాను. ఇప్పుడు చూస్తే ఒకటే ఉంది అందులో"

"అయితే ఈ గదిలోకి ఎలా వస్తుంది? నడచొస్తుందా! నువ్వు ఒక్కటే పెట్టి రెండనుకొని వుంటావు. రెండోది ఎక్కడో పోయి వుంటుంది. దొరుకుతుందిలే" అన్నాను.

అంతా విని శ్రీమతి అంది "మీరంతేలే. నిర్లక్ష్యంగా ఉండేది మీరు. పైగా నన్నంటారు. రెండూ పెట్టాను పెట్టెలో!"

"జాగ్రత్తగా పెడ్తే అక్కడా ఇక్కడా ఎందుకు వెదకటం? పెట్టినచోటే వెతుకు. అక్కడ లేకపోతే ఎవరో తీసుంటారు"

"నా ఉద్దేశమూ అదే. గోపీ తీసుంటాడని నాకనిపిస్తుంది. ఎందుకంటే నేనది పెట్టెలో పెట్టేటప్పుడు వాడక్కడే ఉన్నాడు"

"ఐతే వాడినే అడగకపోయావా? "

"వాడు నాకేమీ తెలియదంటున్నాడు"

"ఐతే ఏం చేద్దాం? "

శ్రీమతి బిగ్గరగా అంది. "నేనేం చెప్పను.. మీకేమీ పట్టదసలు! ఆ నౌకరు వెధవను పిలిచి గట్టిగా అడగండి. వాడే తీసి ఉంటాడు"

"సరే, నేనతనితో ఏం చెప్పాలి? పట్టీ తెచ్చి ఇవ్వమనేదా? "

శ్రీమతి విసుక్కొని అంది "మీతో పనైనట్లే. నౌకర్లందరినీ నెత్తికెక్కించుకొన్నారు కదా. ఎప్పుడైనా వాళ్లను కోప్పడ్డారా? ఎవరో ఒకరు దాన్ని పెట్టెలోంచి తీశారు. నాకు పూర్తిగా గోపీమీదే అనుమానంగా వుందంటే మీరసలు వింటున్నారా? "

"గోపీనడిగాను. తను తీసినట్లు లేదు"

శ్రీమతి అంది "నౌకర్ల స్వభావం మీకు తెలియదు. చాలా మోసగాళ్లు. తప్పకుండా వాడే తీసివుంటాడు. లేకపోతే దానికోసం దేవతలేమైనా దిగి వస్తారా"

"మనబ్బాయిని కూడా అడిగావా"?

"వాడు నాతోపాటు తిరిగి వెదుకుతున్నాడండీ ఇల్లంతా. వాడు తీసివుండడు"

"వాడికి గాలిపటాల పిచ్చివుంది కదా"

"ఆ పిచ్చి వాడికి పట్టించింది మీరే కదా. తండ్రంటే బొత్తిగా భయంలేదు. వాడిని అదుపులో పెట్టకపోతే ఇంకా చెడిపోతాడు"

"పట్టీ ఇంట్లో ఎక్కడైనా పడుంటే వాడికి దొరకొచ్చు కదా"

"దొరికితే చెప్పేవాడేనండీ"

మాటల సందర్భంలో.. బాబు ఆ సాయంత్రం గాలిపటం దారపుండ కొనుక్కొచ్చినట్లు తెలిసింది. "గాలిపటాలు ఎగరేసేందుకు మీరేగా వాడిని పురికొల్పింది. రోజంతా అదే పని. ఎప్పుడైనా దగ్గర కూర్చోపెట్టుకొని ఎలా చదువుతున్నాడో చూశారా? "అంది శ్రీమతి.

"రేపు ఉదయం అడుగుతా అబ్బాయిని"

మర్నాడు పిల్చి గంభీరంగా అడిగాను వాడిని "నీకెక్కడైనా పట్టీ దొరికిందా బాబూ? " అని.

వాడు మాట్లాడలేదు. తల ఊపాడు ..కనపడలేదు, తీయలేదన్నట్లుగా. నేనలా అడిగినందుకు వాడికి కోపం వచ్చినట్లుంది.

"నిజంచెప్పు బాబూ, తీసినా నిన్నేమీ అనను"

వాడి మొహం కందగడ్డలా ఉంది. మౌనంగా కూర్చున్నాడు. బాలమనోవిజ్ఞానం తాలూకు ఎన్నో సిద్ధాంతాలు నా మదిలో మెదిలాయి. ప్రేమతో.. దోష భావాన్ని జయించాలి. కోపం, రోషం పనికి రావు. పిల్లల మనస్సు కోమలంగా వుంటుంది. వారితో స్నేహంగా, ఆత్మీయంగా మసలుకోవాలి.. ఇలా ఎన్నెన్నో!

"బాబూ భయపడకు, నిజంచెప్తే నిన్నేమీ అనను"

బాబు మౌనంగా నా మాటలు వింటున్నాడు...నా వైపు చూడటం లేదు. మాటిమాటికీ నొసలు చిట్లిస్తున్నాడు.

"బాబూ నువ్వు తీశావా? "

వాడు తల ఊపి కోపంతో బిగ్గరగా అరిచాడు "నేను తీయలేదు, తీయలేదు . ఏడ్పు వచ్చింది కానీ ఆపుకొన్నాడు. కన్నీరు కళ్లలోనే నిలిచిపోయింది.

"చూడు నవీన్! వెళ్లి వెదుకు. ఎక్కడైనా దొరుకుతుందేమో"

బాబు మరో గదిలోకెళ్లి ఓ మూల నిలబడ్డాడు. కొద్దిసేపలా నిలబడిన తర్వాత, పట్టీ వెతకటంలో మునిగిపోయాడు.

"బాబు నడిగారా..ఏమన్నాడ"ని ప్రశ్నించింది నా భార్య.

"ఇది నౌకరు పనికాదు. మనబ్బాయే తీసుంటాడని నాకన్పిస్తుంద"న్నాను.

"వాడెందుకు తీస్తాడండీ"

నేను మాట్లాడలేదు. ఇలాంటప్పుడు పిల్లవాడిపట్ల ప్రేమగా వ్యవహరించాలి. వాడు దొంగతనం చేశాడంటే 'దానికి బాధ్యులు మేమే'నన్పిస్తుంది నాకు. మా పెంపకంలో లోపమే దానికి కారణమనుకొన్నాను.

బాబును పిలిచి బుజ్జగిస్తూ అన్నాను "మంచి అబ్బాయివి కదూ. సరిగా చెప్పు. నువ్వా పట్టీని చున్నూకిచ్చావు కదూ? "

వాడు మాట్లాడలేదు. మొహంలో రంగులు మారుతున్నాయి. అతికష్టంమీద తలవూపాడు.

నేను ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా అడిగాను "నోటితో చెప్పు నాయనా చున్నూకిచ్చావ"ని.

"ఔను ఇచ్చాను" బాబు నోరు విప్పాడు.

పట్టలేని ఆనందంతో నేను వాడిని ఎత్తుకొని "మా బంగారు తండ్రి"అంటూ వాళ్లమ్మ దగ్గరికి తీసుకెళ్లాను. "మనబ్బాయి నిజం చెప్పేశాడు. పట్టీని వాడు చున్నూకిచ్చాడట" అని చెప్పాను.

విన్న వాళ్లమ్మ సంతోషించింది. కొడుకును ముద్దులతో ముంచెత్తింది. "పట్టీ చున్నూ దగ్గర వుందికదా ..వాడినడిగి తెస్తావా? " అని బాబు నడిగాను. వాడేమీ జవాబివ్వలేదు. నేనెంతో బలవంతం చేశాక అన్నాడు "చున్నూ దగ్గర లేకపోతే వాడెలా ఇస్తాడు"?

"ఐతే ఎక్కడో ఒకచోట ఉండాలి కదా! ఇంతకీ అది నీకెక్కడ దొరికింది"?

"గదిలో"

"దాన్ని తీసుకెళ్లి చున్నూకు చూపించావు కదూ? "

"ఔను"

"వాడు దాన్ని అమ్ముదామన్నాడా"?

"ఔను"

"ఎక్కడ అమ్ముదామన్నాడు"?

"మిఠాయిలు కొందాం.. లేదా.. గాలి పటం కొందామన్నాడు"

"ఐతే పట్టీ చున్నూ దగ్గరే వుంది కదూ. వెళ్లి వాడి దగ్గరినుండి తీసుకురా. అదిస్తే మా నాన్నగారు మంచి బహుమతి ఇస్తానన్నారని చెప్పు"

'వాడికి వెళ్లాలని లేదు. చున్నూ దగ్గర లేకపోతే వాడెలా ఇస్తాడన్నాడు మళ్లీ? ' ఆ మొండితనం చూసి నాకు చికాకు వేసింది.

"ఐతే నువ్వు దాన్ని ఏంచేశావో చెప్పు" గద్దించి అడిగాను.

వాడు నావైపు చూస్తూ ఉండిపోయాడు. ఉలకడూ పలకడూ.

"వెళ్లు. వెళ్లి పట్టీ తీసుకురా. అది తెస్తేనే నిన్ను ఇంట్లోకి రానిస్తాను' '

అబ్బాయి వెళ్లి వరండాలో ఒక మూల ఏడుపుమొహంతో నిలబడ్డాడు. నిజం చెప్పాక బాబు ఇంకా దేనికి భయపడుతున్నాడో నాకు ఎంతకీ అర్థం కావటంలేదు. పిల్లవాడి దగ్గరికి వెళ్లి అనునయంగా అన్నాను "వెళ్లు బాబూ! చున్నూ దగ్గరికెళ్లి పట్టీ తీసుకురా"

పట్టీ చున్నూ దగ్గర లేకపోతే వాడెలా తెస్తాడు? మాటిమాటికీ అదే జవాబు.

"చున్నూ ఎవరికైనా దాన్ని అమ్ముంటే ఆ డబ్బు మనం అతని కిద్దాం, వాడికి చెప్పిరా" అని పంపాను.

"మా అబ్బాయి అలాంటివాడు కాడు. వాడసలు పట్టీ చూడలేద"ని చున్నూ వాళ్లమ్మ అంది. నవీన్‌తో చున్నూ, చున్నూ వాళ్లమ్మా వచ్చారు.

"మీ అబ్బాయి అబద్ధం చెప్తున్నాడు. ఏరా నవీన్! నువ్వు చున్నూకు పట్టీ ఇచ్చావు కదూ? "

ఇచ్చానన్నట్లు తలూపాడు మా వాడు.

చున్నూ కోపంగా "నువ్వెప్పుడిచ్చావు? " అని అడిగాడు.

"నీకిచ్చానుకదా. ఇవ్వలేదని అంటావే? "

చున్నూ వాళ్లమ్మ వాడిని చితకబాదింది. 'వీడి కారణంగా అందరిచేతా మాటలనిపించుకొంటున్నామ'ని వాపోయింది. పిల్లవాడితో పాటు ఆమె కూడా ఏడ్వసాగింది.

ఈ విషయం ఇరుగుపొరుగు అందరి ఇళ్లలో వ్యాపించింది. ఆడవాళ్లు మాట్లాడుకోవటానికి మంచి విషయం దొరికింది.

"చున్నూలాంటిదే వాళ్లమ్మానూ" అంది మా ఆవిడ నాతో.

ఇలాంటి విషయంలో తొందర పనికిరాదని నేనన్నాను. అనవసరంగా గొడవ చేసుకోవటం వల్ల పట్టీ దొరకదు కదా.

శ్రీమతి గొణుక్కొంటూ అక్కడినుంచి వెళ్లిపోయింది.

చున్నూ వాళ్లమ్మ నా దగ్గరకొచ్చి "పట్టీని చున్నూ చూడలేదంటున్నాడండీ. ధరెంతో చెప్తే ఇచ్చేస్తామండీ" అంది.

"ఏదో పిల్లల గొడవ. మనం అంత తొందరపడటం ఎందుకండీ? చున్నూను మీరు నెమ్మదిగా అడిగి చూడండి. నేనూ అడుగుతా" అనగానే ఆమె చున్నూను పిల్చి "నవీన్ దగ్గరనుంచి పట్టీ తీసుకొన్నావా? " అని అడిగింది.

వాడు తల వూపుతూ "లేదు, లేదు. దాన్ని తీసుకోలేదు. నవీన్ దాన్ని గాలి పటాలమ్మేవాడికిచ్చాడు. నేను చూశాను. అది వెండిది" అన్నాడు.

నేను చున్నూ వాళ్లమ్మతో అన్నాను" చున్నూ మొదట దాన్ని చూడలేదన్నాడు. ఇప్పుడేమో బాబు దగ్గర దాన్ని చూశానంటున్నాడు. దాన్ని గాలిపటాలమ్మేవాడికి ఇచ్చాడంటున్నాడు"

"వెధవా! అబద్ధాలు చెప్తావా.. తోలు వలుస్తాన"ంటూ చున్నూను లాక్కొచ్చి ఎడాపెడా బాదటం మొదలెట్టిందామె.

నేను చున్నూను ఇవతలకు లాగాను. వాడక్కడనుండి కదలకుండా నిలబడ్డాడు. ఏడ్వను కూడా లేదు. ఒకపక్క నిలబడి మా బాబువైపు అదోరకంగా చూస్తున్నాడు.

ఈ గొడవల్లో పడి నేను ఆఫీసు కెళ్లడం ఆలస్యమయింది. వెళ్లేటప్పుడు ..బాబును భయపెట్టకుండా ప్రేమగా విషయాన్ని రాబట్టమని మా ఆవిడను పిల్చి చెప్పాను.

నేను ఆఫీసు నుండి రాగానే మా ఆవిడ చెప్పింది "బాబు అంతా చెప్పేశాడండీ.

ఐదు రూపాయలకు గాలిపటాలతనికి ఇచ్చాడట. అతను ఒక రూపాయి ఇచ్చి మిగతాది తర్వాత ఇస్తానన్నాడట. బుజ్జగించీ, లాలించీ వాడినుంచి విషయం రాబట్టాను"

బాబును పిల్చుకురమ్మని గోపీని పంపాను. రాగానే బాబును ఎత్తుకొన్నాను. అందుకు వాడేమీ సంతోషించినట్లు లేడు. వాళ్లమ్మ పొగిడినా వాడేమీ పొంగిపోలేదు.

"నన్నడిగితే రూపాయి ఇచ్చేవాడిని కదా. ఇకనుంచి నీకు డబ్బు కావాలంటే నన్నో, మీ అమ్మనో అడుగు. సరే. పట్టీ తీసుకొని కొట్టతను నీకు రూపాయి ఇచ్చాడా? "

"ఇచ్చాడు"

"ఖర్చు పెట్టేశావా? "

"ఔను.. లేదు"

"సరిగా చెప్పు"

వాడేమీ జవాబివ్వకపోతే చెవి మెలేసి అడిగాను" ఇప్పుడైనా చెప్తావా లేదా? "

బాబు భయంతో బిత్తరపోయాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు. నేను బిగ్గరగా అడిగాను. ఏమీ లాభంలేదు. గోపీని పిల్చి "వీడిని తీసుకెళ్లి గదిలో పెట్టి తాళం వెయ్యమ"ని చెప్పాను. నౌకరు అలాగే చేశాడు.

పదినిమిషాల తర్వాత నవీన్‌ను పిలిపించాను. వాడి మొహం ఉబ్బిపోయి వుంది. పెదవులు అదురుతున్నాయి. గదిలో పెట్టి తాళం వేసినా వాడు ఏడ్వలేదు.

"ఏరా! ఇప్పుడైనా బుద్ధి వచ్చిందా? సరే, గాలిపటాలమ్మేవాడెవరు? సెంటర్లో వున్న మొదటి కొట్టువాడేనా? "

వాడేదో గొణిగాడు కానీ అర్థం కాలేదు.

"ఆ సెంటర్లో వాడేనా? చెప్పు"

"ఔను"

"మీ బాబాయితో వెళ్లు. కొట్టువాడితో అన్ని విషయాలు మీ బాబాయే మాట్లాడతాడు. తెలిసిందా" అంటూ నేను మా తమ్ముడిని పిలిచాను. విషయమంతా చెప్పి అన్నాను "ఒక రూపాయి బాబుకిచ్చి కొట్టతని దగ్గరికి పంపించు. పట్టీ ఇవ్వకపోతే పోలీసులకు పట్టిస్తానని బెదిరించు. బాబూ! వెళ్లు. మీ బాబాయితో వెళ్లు"

వాడసలు నా మాటలు పట్టించుకోలేదు. ఏ మాత్రం చలనంలేదు. బెల్లంకొట్టిన రాయిలా ఉన్నాడు. నోరు విప్పలేదు.

"నువ్వు వెళ్లవా? "

వెళ్లనన్నట్లుగా తలఊపాడు.

నేను వాడికి నచ్చచెప్తున్నట్లుగా అన్నాను- "పట్టీ ఖరీదు చాలా ఎక్కువ బాబూ. కొట్టతనికి రూపాయి ఇచ్చేసి అది తీసుకురా. వాడు ఇవ్వనంటే మిగతా విషయాలు మీ బాబాయి చూసుకొంటాడు. వెళ్లు బాబూ, వెళ్లు"

ఐనా వాడు వెళ్లటానికి సిద్ధపడలేదు. ఆ మొండితనానికి ఇంకా చిరాకేసింది.

'ఇందులో కష్టమేముందీ? ఎంత చెప్పినా అర్థం చేసుకోడూ వినడేమిటి వీడు? '

"ఏరా వెళ్లవా? " అడిగాను.

వెళ్లనన్నట్లు తలూపాడు.

మా తమ్ముడిని పిలిచి "ప్రకాశ్! వీడిని తీసుకెళ్లరా" అని చెప్పాను.

ప్రకాశ్ వాడిని పట్టుకోగానే ప్రతిఘటించాడు. వెళ్లటానికి ఒప్పుకోలేదు.

ఎంతసేపో నచ్చచెప్పి బతిమిలాడిన మీదట మొహం మాడ్చుకొని వాళ్ల బాబాయితో వెళ్లటానికి ఒప్పుకొన్నాడు. ఎనిమిదేళ్లు వచ్చినా ఏమీ తెలియదువాడికి! నా కోపానికి పట్టపగ్గాలు లేవు. ఐనా తమాయించుకొన్నాను. కోప్పడితే పిల్లలు మరింత చెడిపోతారని నాకు తెలుసు.

బాబు వాళ్ల బాబాయితో వెళ్లాక హాయిగా ఊపిరి పీల్చుకొన్నాను. కానీ కొద్దిసేపటికే ప్రకాశ్ తిరిగొచ్చాడు. "బాబు పారిపోయివచ్చాడ"ని చెప్పాడు.

"వాడెక్కడ వున్నా వెళ్లి పట్టుకుర"మ్మన్నాను. వచ్చాక "ఏరా! నువ్వు మొండితనం వదలవా? వెళ్తావా లేదా? " అంటూ లాగి రెండు చెంపదెబ్బలు కొట్టాను. ఒక్క అరుపు అరిచి వాడు ఊరుకొన్నాడు.

మళ్లీ గంటన్నరసేపు గదిలో పెట్టి తాళం వేశాం. నేను చేసేది మంచిపని కాదని తెలుసు. గత్యంతరం లేక అలా చేశాను.

గదిలోకి వెళ్లి చూస్తే బాబు నేలమీద పడి నిద్రపోతున్నాడు. వాడిమీద ఎంతో జాలేసింది. లేపితే గాభరాగా లేచి కూర్చున్నాడు. కాసేపటి వరకు తేరుకోలేదు. తర్వాత విషయం గుర్తొచ్చినట్లుంది. మళ్లీ మొహంలో మొండి పట్టు ప్రతిఫలించింది.

బాబును బైటకు తీసుకొచ్చి లాలించి, బుజ్జగించి చెప్పాను. ఐనా వాడు బిగుసుకొనే వున్నాడు. "బాబూ, ఈ రూపాయి తీసుకెళ్లి ఆ గాలిపటాలమ్మే అతనికిచ్చి పట్టీ తీసుకురా" అని లాలనగా చెప్పాను.

'అతని దగ్గర పట్టీ వుంటేగా ఇవ్వటానిక'ని పాతపాటే పాడాడు.

"అదేంటి బాబూ అలా అంటావు? నువ్వేగా అతనికిచ్చానన్నావు. తోడు కావాలంటే చున్నూను కూడా తీసుకెళ్లు"

వాడు మొహం ముడుచుకోవడం చూసి ఇంకా కోప్పడబోతున్నాను. ఇంతలో వాళ్లత్త వస్తూ కనపడింది. వచ్చి ప్రేమగా వాడి తల నిమురుతూ "బాబూ నవీన్! కోసం బోలెడు మిఠాయిలూ పండ్లూ తెచ్చాను. తిందువుగాని రా" అంది.

"వాడిని వెళ్లనివ్వు అక్కయ్యా" అన్నాను సంగతేమిటని అడిగింది అక్కయ్య.

బాబు పేచీపెట్టాడు. ప్రకాశ్‌ను గోపీని పిల్చి బలవంతంగా బాబును వాళ్లతో పంపాను.

'వాడినెందుకలా సతాయిస్తున్నార'ని అక్కయ్య అడిగింది.

నేనేమీ జవాబివ్వకుండా మొదలుపెట్టాను 'దేశానికే కాదు పేటకూ రాజకీయాలుంటాయి. బరువు బాధ్యతలన్నీ స్త్రీలవే..'

అలాంటి కొన్ని మాటలయ్యాక అక్కయ్య పెట్టె తెరిచి "నువ్వడిగిన కాగితాలివిగో" అంది. పర్సు తెరిచి పట్టీ తీసింది.

పాముని చూసినట్లుగా భయపడ్డాను.

"ఆరోజు పొరపాటున ఈ పట్టీ నాతో వచ్చేసింది!"అంది అక్కయ్య! Ⓥ



తెలుగు కథ

గురుదక్షిణ

-సి.ఉమాదేవి

"అన్నయ్యా, నీకుద్యోగమొచ్చింది" కవరేదో చింపుతూ నాకందకుండా పరుగులు తీస్తోంది చెల్లాయి సుమ. విషయమేదో ముందుగా తనే చదివేస్తుందేమోనని లాంగ్‌జంప్ చేసి కవరు లాక్కుని ఆతృతగా లోపలున్న కాగితం బయటకు లాగాను. అంతే! నా ఉగ్రరూపం చూసి చెల్లాయి చల్లగా జారుకుంది.

"ఏమిటిరా ఆ నరసింహావతారం? !" అమ్మ విస్తుపోతోంది. కాగితాన్ని అమ్మవైపు చూపాను.

'ఏప్రిల్ ఫూల్!' వస్తున్న నవ్వును అమ్మ ఆపుకున్నట్లనిపించినా అమ్మ ముఖంలోనూ దిగులు తొంగిచూసింది. నా నిస్సహాయతే

నన్ను వెక్కిరిస్తోంది. చెల్లాయి తప్పేంలేదు. ఈ అల్లరి సహజం!

"సారీ అన్నయ్యా! ఏదో సరదాకి".. చెల్లెలు భయపడుతూ సంజాయిషీ ఇవ్వబోయింది.

"సర్లేమ్మా! నీ జోక్‌ను స్పోర్టివ్‌గా తీసుకునుండాల్సింది. నామీద నాకే కంట్రోల్ పోయింది. ఎప్పుడో ఒకప్పుడు నాకు జాబ్ వస్తుంది. అప్పుడు నువ్వే ఫీలవుతావు. అన్నయ్యను ఫూలెందుకు చేశానా అని" మామూలు మూడ్‌లోకి వచ్చేసిన నన్ను దీవిస్తున్నట్టుగా చేతిని పైకెత్తింది సుమ.

"ఫూల్, ఫీల్ కాదు. ఉన్న ఊరిలో, ఈ తిరుపతిలోనే ఉద్యోగం కావాలి అనుకుంటే మనల్ని మించిన ఫూల్స్ ఉండరు" చదువుతున్న న్యూస్‌పేపర్ పక్కన పడేసి తన అభిప్రాయం తాను చెప్పి నా సమాధానం ఆశిస్తున్నట్టుగా కళ్లెగరేశాడు నాన్న. నేను అమ్మ వంక చూశా.

"ఏం చందు! అలా చూస్తావ్? నేనేమైనా వద్దని నిన్ను కట్టేశానా? పిల్లలు దగ్గరే వుండాలనుకుంటాం. కానీ మనం గిరిగీసుకుని కూర్చుంటే అవకాశాలు అగుపడవు. మనమే వెతుక్కుంటూ వెళ్ళాలి" అమ్మ ఇలా అన్నది అంటే పచ్చజెండా వూపినట్లే!

నేను ఆలోచిస్తున్నాను. 'నా గమ్యం, దిశ ఎటు? ఏది? '

"నీ ఫ్రెండ్ ఉన్నాడుగా చెన్నైలో, అక్కడ ప్రయత్నించు. నీకు తోడుగా వుంటాడు కూడా"

నాన్న మాటకు నేను సరేననడంతో నా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోయాయి.

★ ★ ★

ఆడపిల్లను కాపురానికి వేరే ఊరు పంపుతున్నట్లు నాన్న కూడా బెంగటిల్లినట్లే వుంది. బయలుదేరే రోజు రానేవచ్చింది. అమ్మ చేసిచ్చిన చిరుతిళ్లు, చిన్న ట్రావెల్ బ్యాగ్‌లో సరిపడా బట్టలు అంతకన్నా బరువు వద్దనుకున్నాను.

ఎక్కడ ఉండాలి అక్కడ? ఎక్కడ ఉన్నా తమిళం కొద్దిగా వచ్చు. చెన్నైలో పి.జి. చేసినపుడు ఫ్రెండ్స్‌తో సరదాగా మాట్లాడి నేర్చుకున్న నాలుగు ముక్కలు అవసరానికి ఆదుకుంటాయి. ఇక ఇంగ్లీషు ఎలాగూ ఉండనే ఉంది. ఇల్లు.. కనీసం ఓ చిన్నగది కావాలన్నా ఆ మహాపట్నంలో మరో తోడుండాల్సిందే. నాన్న అన్నది నిజమే! నాలాగే అక్కడ చదివాడు ఫ్రెండ్ ఆకాష్. పైగా ఉద్యోగమూ అక్కడే సంపాదించాడు. ఆకాష్ నాకేదైనా సాయం చేయగలడేమో అనే ఆశే నన్ను ముందుకు నడిపిస్తోంది. అలా అని వాడిపై పూర్తి భారం మోపలేను. నాన్న ఇచ్చిన ఐదువేలు ఎంతకాలం వుంటాయి?

"ఏంటి చందు పిలిస్తే పలకవు? నీళ్ల సీసా కావాలా? " అమ్మ కుదుపుతోంది.

"వద్దులేమ్మా స్టేషనులో కొనుక్కుంటాను.. అమ్మో! వద్దులే.."

'ఐదు వేలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది' అనుకుని "సరే ఇవ్వు" అన్నాను.

అమ్మ నా తడబాటును వింతగా చూస్తూ నీళ్లసీసా అందించింది.

"నీళ్లెందుకు పట్టావమ్మా, ఖాళీసీసా ఇస్తే అక్కడే పట్టుకునేవాడినిగా"

అమ్మ, చెల్లాయి కళ్లల్లో నీటి చెలమలే!

ఒక్క క్షణం ఆడపిల్లలా బావురుమనాలనిపించింది. 'ప్చ్' మగవాడిగా పుట్టడం కూడా శాపమే. తనివితీరా ఏడవలేం. మనసును తడిపిన చెమ్మ ఆవిరవుతూ సెగలు రేపుతోంది.

"పద చందూ. ట్రెయిన్‌టైం అవుతోంది" నాన్న స్కూటర్ స్టార్ట్ చేశాడు. కనుమరుగయ్యేదాకా అమ్మ, చెల్లాయి చేతులూపుతూనే ఉన్నారు.

సిటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన శ్రద్ధ ఏదో ఒకటి చెప్తూనే ఉన్నాడు నాన్న, స్టేషను చేరుకుని ట్రెయిన్‌లో కూర్చునేదాకా.

ట్రెయిను కదులుతోంది. నాన్న చేతి స్పర్శ అందించిన అనుభూతి వెచ్చగా ధైర్యాన్ని చెప్తూ!

★ ★ ★

స్టేషనుకు వచ్చాడు ఆకాష్. ట్రెయిను లేటయిందని ఆదుర్దాపడుతున్నాడు. వాడి ఆతృత నాకు కాస్త విడ్డూరంగా అనిపించినా, అంత పెద్ద సిటీలో నన్ను వాడి రూం దగ్గర దింపి వాడు మళ్లీ అన్నానగర్ వెళ్లాలంటే మరో గంట.. పాపం వాడి ఆదుర్దాలో అర్థం వుంది. రూం తాళం చేతికిచ్చి, "కావాలంటే తలుపులు తెరచి కూర్చో. బయట ప్రపంచం కనబడుతుంది. లేదంటావా రూం తాళం వేసి ఓ రౌండు కొట్టిరా. లేదా మంచి నిద్ర లాగించెయ్యి. అలాగే ఇదిగో ఈ గిన్నెలలోనివి నీ కోసమే వండాను. నువ్వు తినెయ్యి. నేను ఆఫీసులోనే కానిచ్చేస్తాను" అన్నాడు.

స్నేహితుడి పట్ల కృతజ్ఞతగా చేయందుకుని ఆప్యాయంగా నొక్కాను. అమ్మ ఇచ్చిన చిరుతిళ్లు వాడిముందుంచా.

"ఇవన్నీ సాయంత్రం వూదేస్తా" అని నవ్వుతూ 'బై' చెప్పాడు. వాడెళ్లాక కనబడ్డాయి నాకా నాలుగు గోడలు! నేనొక్కడినే అన్న భావం.. నిరుద్యోగిగా అన్న ట్యాగ్ వెంబడిస్తోంది.

'ఏం చేయాలి? ఎవరిని కలవాలి? ఏయే పేపర్ యాడ్స్ చూడాలి? ఆకాష్‌కు భారం కాకూడదు' ఆలోచనలు నిద్రను దరికి రానివ్వకుండా తరిమి కొడ్తున్నాయి.. ఎప్పుడు నిద్ర గెలిచిందో తెలియదు.

తలుపులు దబదబమన్న చప్పుడు.

'చెల్లాయ్. చూడమ్మా!' అనబోయి తమాయించుకున్నాను.

"ఏరా! అప్పుడే వచ్చేశావ్? " గుమ్మంలో ప్రత్యక్షమైన ఆకాష్‌ను ఆశ్చర్యంగా చూశాను.

"ఆఫీసుకెళ్లాక నీ గురించే చెప్పాను తెలిసినవాళ్లందరికీ. నీ డిగ్రీలు, అదనపు అర్హతలు గురించి చెప్పాక అందరికీ ఆశ్చర్యమే నాతోపాటు" నవ్వాడు.

"నీకే కాదు నాకూ ఆశ్చర్యమే! అదనపు అర్హతలుంటే, తక్కువ జీతమివ్వాలంటే కంపెనీలకూ మొహమాటమే. ఇంతకీ ఏం త్వరగా వచ్చేశావు. వర్క్‌లోడ్ లేదా? " అని అడిగాను.

"త్వరగా తెములు. ఒక చోటికి అర్జంటుగా వెళ్లాలి. గుడ్ గాడ్. అన్నం కూడా తినలేదే" కదలని గిన్నెలవైపు చూస్తూ అన్నాడు.

"నేను స్నానం చేసొస్తా" అంటూ బాత్రూంలో దూరాను.

"ఏమిటంత అర్జంటు? " బాత్రూం నుండి

బయటకు వస్తూ అడిగాను.

"ముందు నువ్వీ అన్నం తిను" అప్పటికే అన్నం, కూర కలిపి ఉంచాడు. వాడంత అక్కరగా కలిపితెస్తే వద్దనలేక గబగబా తినేశా. వాడు అమ్మ ఇచ్చిన సున్నుండను ఆప్యాయంగా కొరుక్కుని తింటున్నాడు.

"ఇప్పుడు చెప్పరా, ఎక్కడికి వెళ్లాలి? " అని అడిగా మరోసారి ఆతృతనణచుకోలేక.

"సస్పెన్స్ కాదులేరా, ముందు నీ సర్టిఫికెట్లందుకో అన్నీ. మా బాస్ ఫ్రెండ్ ఒకరు సుబ్రమణ్యం అని సి.ఇ.ఒ.గా ఉన్నాడు పెద్ద ఐ.టి. కంపెనీలో. ఐ.టి. జాబ్స్ మెరుగుపడుతున్నాయి. అర్హతున్నవాడికి ఢోకా వుండదు. వెంటనే ఆయనను కలవమని అడ్రసు, ఫోను నంబరు అన్నీ ఇచ్చి, దాంతోపాటు నాకు హాఫ్‌డే పర్మిషనిచ్చి పంపాడు.

నేను చేసే కంపెనీలో నీకు సరిపోయే ఉద్యోగం లేదని నాకు తెలుసు. ఉదయం మాటల మధ్యలో బాస్‌తో నీ గురించి చెప్పా. ఆయన స్నేహితుడు సుబ్రమణ్యం చెన్నైవాసే అని చెప్పారు. సమస్యలున్నా, కష్టాలున్నా ఎవరికైనా సరే చేయూతనిస్తాడట. మార్గం చూపించడమే కాదు, ఆ మార్గాన్ని ఓ గురువులా సుగమం చేసే మార్గదర్శిగా కూడా ఉంటారని చెప్పారు. 'నేను నా ఫ్రెండ్ అని చెప్పడం కాదు, మీరే చూస్తారుగా, ఈ రోజే వెళ్లండి' అని ఇలా హాఫ్‌డే పర్మిషను కూడా ఇచ్చేశాడు మా బాస్. ఇక బయల్దేరు" అంటూ తొందర చేయసాగాడు.

"శుభం" అంటూ లేచాను, సర్టిఫికెట్లన్నీ సరిగా ఉన్నాయో లేదో చూసుకుని.

★ ★ ★

సుబ్రమణ్యం గారిల్లు సమీపించాం. ఆకాష్ తెచ్చిన అడ్రసులో వివరాలు మమ్మల్ని శ్రమపడనివ్వలేదు. ఇల్లు కనబడగానే గుండె దడదడలాడింది. తమిళమంత బాగా రాదు. ఆపద్ధర్మంగా ఇంగ్లీషే ఆదుకుంటుందనుకున్నాను. అడ్డపంచె కట్టుకున్న ఓ యాభై సంవత్సరాల వ్యక్తి వరండాలో కుండీలలోనున్న పూలమొక్కలను తడిమి తడిమి చూస్తూ పరామర్శిస్తున్నట్లుంది. మేము గేటు తీసిన శబ్దానికి మావైపు తిరిగారు. మేము ఆయన ఇల్లు చేరుకునేసరికి ఆయనకు ఆఫీసు ముగిసి ఇంటికి వచ్చేసినట్లున్నారు.

"రండి.. రండి" తమిళం వింటానేమో అనుకున్న నాకు తెలుగు వినపడటం.. నా ముఖంలో భావాన్ని చదివినట్లున్నారు.

"మా శ్రీమతిది నెల్లూరు జిల్లా. వి వెర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్! సో.." అంటూ నవ్వేశారు.

"కూర్చోండి" గార్డెన్ కుర్చీలు మా దగ్గరగా జరిపారు.

నా సర్టిఫికెట్లు అందించమని సైగ చేశాడు ఆకాష్. వినయంగా అందించాను నేను. ఒదిగినట్టు కూర్చున్న నన్ను చూసి "బి రిలాక్స్‌డ్, మీరేం ఇంటర్వ్యూకు రాలేదు" అంటే సర్దుకున్నాను రిలీఫ్‌గా.

మాటలు కలబోసుకుంటేనే కదా చనువు ఏర్పడేది. అప్పుడిక బిడియం, భయం తగ్గి, కొత్త పోయి ఆత్మవిశ్వాసం బలపడుతుంది. అదే జరుగుతోంది ప్రస్తుతం. అరగంటలో నేను, ఆకాష్ సుబ్రమణ్యంగారికి ఇష్టశ్రోతలైపోయాము. ప్రశ్నలు, జవాబులు రెండూ ఆయనవే. అయినా మాకు జవాబులు తెలిస్తే కదా చెప్పటానికి! కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా, నాసా నుండి ఖగోళం దాకా అనక్కర్లేదు కానీ ఇంచుమించు అన్ని రాష్ట్రాలలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు, అందులో గెలిచిన వారెందరు? ఓడిన వారెందరు? వారి బయోడేటాలన్నీ న్యూస్ ఛానెల్‌లా వివరిస్తుంటే విస్తుపోయి వింటున్నాం మేము. ఇంత స్టఫ్ వున్న వ్యక్తిని చూడటం నాకదే ప్రథమం. 'టుడేస్ న్యూస్‌పేపర్ ఈజ్ టుమారోస్ వేస్ట్ పేపర్' అని అనేవాళ్లు ఉన్నారు. ప్రతిరోజు



దినపత్రికలు చదువుతారు. మరురోజుకు దినపత్రిక స్థానమేమిటో అందరికి తెలుసు. కాని సుబ్రమణ్యాంగారు.. 'వీరు సామాన్యులు కారు' అని డిసైడ్ అయిపోయా!

మాట్లాడుతూనే నా బయోడేటా వైపు ఓ కన్నేసి చూస్తూనే వున్నారు. ఎందరి బయోడేటాలో ఔపోసన పట్టిన మనిషికి నా బయోడేటా అంతగా తృప్తినిస్తుందో లేదో అనుకుంటున్నాను. మరోసారి సర్టిఫికెట్లన్నీ తీక్షణంగా చూశారు. నావైపు చూశారు. ఆ చూపులో తీక్షణత లేదు 'ఎంత అమాయకుడివిరా!' అన్న భావం స్ఫురిస్తోంది.

"నౌ యు హ్యావ్ కమ్ టు ది రైట్ డోర్, ఐ వెల్ కం యు, అయితే నీకు తగిన ఉద్యోగం నా దగ్గరలేదు" న్యూస్ ఛానెల్‌లో హిచ్‌కాక్ సస్పెన్స్ సినిమా ప్రకటనలా ఉంది.

ఆయన మాటలు విన్న నాకు నా ఆశలన్నీ నీరుకారిపోయాయి. నా ఫోన్ కొరకు ఎదురుచూసే అమ్మ, నాన్న, చెల్లాయి గుర్తుకొచ్చారు.

"ఎప్పుడు జాయిన్ అవుతావు? "

వాడిపోతున్న తీగ, నీరు తగిలి నిటారుగా నిలదొక్కుకున్నట్లయింది.

"ఎక్కడ సర్? " అప్రయత్నంగానే అన్నాను.

"మా బ్రాంచి నుంగంబాకంలో ఉంది. అక్కడ నిన్ను ఇన్‌ఛార్జిగా చేస్తాను. ఆ సీటులో వున్న వ్యక్తి ట్రెయినింగ్ నిమిత్తం అమెరికా వెళ్లాడు. అతడికి ఆ సీటు నుండి ప్రమోషన్ రావచ్చు. అతడి అదృష్టమే నీ అదృష్టం" అంటూ నిండుగా నవ్వారు.

నా శరీరమంతా పక్షి ఈకలా తేలికగా తేలిపోతున్నట్టుంది. మనసులో బరువు దిగడం నా శరీరం గుర్తించినట్టుంది.

నుంగంబాకం బ్రాంచి అడ్రస్సు కనుక్కొని సుబ్రమణ్యంగారి దగ్గర సెలవు తీసుకున్నాక బయటపడటం ఆలస్యం, ఆకాష్‌ను ఆప్యాయంగా హత్తుకున్నాను.

"ఇదంతా నీ ప్రయత్నమే, నేను వచ్చిన రోజే నువ్వింతలా ప్రయత్నించావంటే గ్రేట్ ఫ్రెండ్ యు ఆర్!" అన్నాను.

"కాదు. ఫ్రెండ్‌షిప్ ఈజ్ గ్రేట్!" ఎప్పుడూ అనే మాటే అన్నాడు ఆకాష్.

కొత్త ఉద్యోగమైనా పని నాకు కొత్తగా అనిపించలేదు. పైగా నా నైపుణ్యత మరింత మెరుగుపడే అవకాశం. ట్రెయినింగ్ అయ్యాక ప్రమోషన్ కొరకు ఎదురు చూస్తూనే పదిహేను రోజులు లీవు పెట్టాడు. నాకదృష్టాన్నందించిన నా సీటు ఓనరు. మ్యూజికల్ ఛెయిర్స్‌లో కూర్చున్నట్టుంది నాకు. 'సీటు వుంటుందా? ఆయనొచ్చి కూర్చుంటాడా? ' నా సందేహాలకు తెరపడింది. ప్రమోషనుతోపాటు మరో చోటుకు ట్రాన్స్‌ఫరు వచ్చి నాకు సీటు వదిలితే నేనందులో పాతుకుపోయాను.

అంతా సర్దుకునేసరికి నెల దాటింది. ఆకాష్‌కు శ్రమ తగ్గిస్తూ నేనూ వంట చేస్తూ నా ప్రయోగాలతో వాడిని హింసిస్తున్నాను. ఇక రెండురోజులకొకసారైనా సుబ్రమణ్యంగారింటికెళ్లడం, వారి మాటలు విని 'తలలో మరక మంచిదే, ఉతికి ఆరేసే వాళ్లున్నారు' అనుకోవడం, అన్నిటికన్నా ముఖ్యమైనది ఆఫీసు వర్కులో ఎన్నెన్నో మెలకువలు నేర్పారాయన. ఆయన వక్త, నేను శ్రోత. ఆయన గురువు, నేను శిష్యుడు. ఆయనిచ్చే సలహాలు నేను ఉద్యోగిగానే కాక మనిషిగా ఎదగడానికి ఎంతో తోడ్పడ్డాయి. ఓసారి నాన్న, అమ్మ, చెల్లాయి వచ్చారు. శని, ఆదివారాలు వాళ్లతోనే గడిపాము నేను, ఆకాష్. వాళ్లకు చెన్నైలో చూపాల్సినవి చాలావరకు చూపించాం.

"మీకు అన్నిటికన్నా ఏది నచ్చింది అంకుల్? " అని నాన్ననడిగాడు ఆకాష్.

"చెన్నైలో నాకు బాగా నచ్చింది.." నాన్న ఏం చెప్తారోనని ఆతృతగా చూశా.

"సుబ్రమణ్యంగారు" తడుముకోకుండా జవాబిచ్చాడు నాన్న.

"నిజమే నాన్నా! అలాంటి వ్యక్తిని నా జీవితంలో ఎప్పుడు చూడలేదు. మరి మీరు కూడా సుబ్రమణ్యంగారిని అన్నిటిని మించి ప్రస్తావించారంటే ఆయన విలువ మరింత పెరిగినట్టే"

"అవునంకుల్! అలాంటి వ్యక్తి నాకూ తారసపడలేదు ఇంతవరకూ. సుబ్రమణ్యంగారి పరిచయమయ్యాక, వారు పుస్తకాలు, సీడీల షాపుకు తీసుకెళ్లి మాకవసరమైనవి ఎన్నో తన ఖర్చుతో కొనిచ్చేవారు. వద్దని చెప్పేదానికి పడే కష్టంకన్నా, సరేనని తీసుకోవడం సులభం వారి విషయంలో. ఒకసారి చందుకు జ్వరం వస్తే హార్లిక్స్, పండ్లు, కొబ్బరిబొండాలు తనే మోసుకొచ్చేశారు. మాకేకాదు ఆయనిలా సహాయం చేయడం ఎందరికో అని చందు కొలీగ్స్ చెప్తే విస్తుపోయాం" నా మనసులోని మాటలకు తాత్పర్యం ఆకాష్ చెప్పేశాడు.

"కొందరు ఎవరైనా అడిగితే సహాయం చేస్తారు. సుబ్రమణ్యంగారు ఇతరుల అవసరాలను తానే తెలుసుకుని మరీ సహాయం చేస్తారు. ఆఫీసులో అందరు ఆయనను దేవుడంటారట. ఆయన దైవత్వం మా బ్రాంచిదాకా కూడా పాకింది. నేను ఆయననర్థం చేసుకున్న దిశ కూడా ఇదే. ఆయన దేవుడే! ఉద్యోగానికి కాగడా వేసి వెతికే రోజుల్లో నాకు ఉద్యోగం చూపారంటే పిలిచి పరమాన్నం పెట్టినట్లే" నా గొంతులో విశ్వాసం బొంగురుపోతోంది.

"చందు అన్నయ్యకు ఆయన నీడ దొరకడం గ్రేట్" చెల్లాయి సంబరంగా అంది. అమ్మ ముఖంలో తృప్తి చాలా రోజులకు చూశాను. అయితే నా పెళ్లి చేయాలనే కోరిక మాత్రం తీరక కాస్త అసంతృప్తి ఉంది. అమ్మ కోరిక మన్నించాల్సిందే. తప్పదిక అనుకున్నాను. నాకు, చెల్లాయికి కాస్త వయసు తేడా ఎక్కువే. అందుకే ముందు నా పెళ్లి అని అమ్మపోరు. నేనే సరే అనడం ఆలస్యం, పెళ్లి ప్రతికలవరకు వచ్చేసింది వ్యవహారం!

సుబ్రమణ్యంగారు, వారి శ్రీమతి నా పెళ్లికి రెండ్రోజుల ముందే తిరుపతికి వచ్చి అమ్మకు, నాన్నకు సహాయపడుతున్నారు. వద్దంటే ఊర్కోరు. బాధపడతారు. అమ్మాయి వాళ్లు పెళ్లి తిరుచానూరులో చెయ్యాలని మొక్కుకున్నారట. ఇక పెళ్లి మండపమంతా తనేయై అన్నీ సమకూరుస్తున్న సుబ్రమణ్యంగారిని పెళ్లికూతురి దగ్గర బంధువేమో అనుకుని మా తరపువాళ్లే చాలామంది తమకు కావలసినవి ఆయనను అడిగి మరీ చేయించుకున్నారని ఆ తరువాత తెలిసి నేనే చాలా నొచ్చుకున్నా.

"అరె చందు, మజా అంతా అక్కడే అనుభవించానయ్యా" అని నవ్వేశారు. సుబ్రమ

ణ్యంగారి అండదండలు కలకాలం ఉండాలని దేవుడిని మనసారా కోరుకున్నాను. నేను తలచింది భగవంతుడు కూడా సంకల్పించాలి కదా! అలా జరగలేదు. అలాగే జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది? వరాల పానుపవుతుంది. నేనెప్పుడో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగం తిరుపతిలోనే వచ్చింది. నాన్న తప్ప అందరు అర్థింపులే. ముఖ్యంగా నా శ్రీమతి చెన్నై వాతావరణం తనకు పడదని చెప్పడం అక్కడ ఉద్యోగానికి వీడ్కోలు పలికి తిరుపతిలో చేరమనే. ఆకాష్ కూడా సమర్థించాడు. 'స్వంత ఊరిలో, స్వంత ఇంట్లో అయినవారితో ఉన్న సుఖం సిటీలో దొరకదు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు సైతం మంచి ఆధారం దొరికితే మన గడ్డపైకి రావాలనుకోవడం లేదా? ఇదీ అలాగే' అని చెప్పాక సరేననక తప్పలేదు.

సుబ్రమణ్యంగారికి చెప్పాను, ఆయన అభిప్రాయం నాకు ముఖ్యం, శిరోధార్యం కూడా "ఇన్నాళ్లకు గుర్తించారోయ్ మీ వాళ్లు నీ అవసరాన్ని, గో అహెడ్" అని ఆశీర్వదించారు. వారి శ్రీమతి కూడా భోజనానికుండమని బలవంతం చేసి ఆహారమే కాదు నన్ను ఆప్యాయతతో నింపేశారు. చెన్నై జీవితానికి తెరపడింది.

తిరుపతి జీవితానికి తెరలేచింది. ఈ అంకంలో చెల్లాయి పెళ్లయి కాపురానికెళ్లడం, చెల్లాయి వెళ్లాక అమ్మకు, నాన్నకు తోచడంలేదనే బాధను దూరంచేస్తూ ఒక అల్లరి బాబు, చక్కని పాప మనవడు, మనవరాలుగా అలరించడం హైలైట్స్!

సుబ్రమణ్యంగారు గుర్తుకొస్తూనే ఉన్నారు. కొన్నాళ్ళు ఫోన్‌లో తరచుగా మాట్లాడుకునేవాళ్లం. పనులలో పడి ఈ మధ్య అదీ తగ్గింది. నిజమే! పని రాక్షసులం. మాకు తీరిక తక్కువే అనుకున్నాను. ఆయననోసారి చూసి రావాలనుకున్నా అవకాశం దొరకడం లేదు. అదృష్టం తలుపు తట్టి మా ఆఫీసువాళ్ళే నన్ను చెన్నై పంపాల్సివచ్చింది. అమెరికా నుండి వస్తున్న డెలిగేట్‌ను ఏర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకొని తిరుపతికి తీసుకుని రావాలి. సుబ్రమణ్యంగారిని చూసి రావచ్చు. ఆకాష్‌నీ కలవచ్చు అనుకున్నాను.

ఫ్లయిట్ ఆలస్యం ఒక గంట, ఫార్మాలిటీస్ పూర్తయ్యేసరికి మరో గంట. మొత్తం రెండుగంటలు వృథా అయ్యాయి. అమెరికా నుండి వచ్చిన సంపత్ యుపి. వాసి. చెన్నైలో ఓ రౌండ్ కొట్టాలన్న ఆయన ముచ్చట కాదనలేక ఓ హోటల్‌లో ఆయన సూట్‌కేస్ పెట్టించి, కాసేపు రిలాక్స్ అవమన్నాను. నేనలా వెళ్ళి ఆకాష్‌ను, సుబ్రమణ్యంగారిని కలవాలనుకున్నాను. కుదిరితేనా? యుపి సంపత్‌గారు చక్కెరగెడతో పెనవేసినట్లు పట్టుకున్నాడు. 'ఐయామ్ నాట్ టైయర్డ్, ఐ హ్యావ్ ఎ లిటిల్ షాపింగ్' అన్నాడు.

హతోస్మి! ఇప్పుడేం షాపింగ్? అనుకున్నాను. తరువాత అర్థమైంది. సంపత్ ఇండియా వచ్చాక గిఫ్ట్స్ కొంటున్నాడు. ఇదో రకం ఇంటెలిజెన్స్! స్వేచ్ఛా విపణి పుణ్యం! సాయంత్రమవుతోంది. నా కోరిక తీరే మార్గం మృగ్యమవుతోంది. ఆకాష్‌కు ఫోన్ చేశాను. వాళ్ల ఊర్లో ఉన్నాడట! సుబ్రమణ్యంగారి ఫోను స్విచాఫ్! ఇక తిరుపతికి బయలుదేరే ఫ్లయిట్ ఐదున్నరకు. హోటల్‌కు వెళ్ళి సంపత్‌గారి సూట్‌కేస్ తీసుకుని వెంటనే బయలుదేరాలి. కొన్నవన్నీ సర్దిపెట్టడం మరో పదిహేను నిమిషాలు. నన్ను తొందర చేస్తున్నాడిప్పుడు. ఆటో పిలిపించాను. బేరసారాలకు కూడా టైంలేదు. ఆటో ఎక్కిన నాకు అసంతృప్తి సెగలు చిమ్ముతోంది. ఆటోడ్రైవర్‌తో సంపత్ మాటలే మాటలు. అదేంటి? ఇదేంటి? అంటూ సైట్ సీయింగ్ కానిచ్చేస్తున్నాడు. డ్రైవరే ఆయన గైడ్! సాయంకాలపు చలిగాలులు ఆటోలో లేవు. అయినా తలచుట్టు మఫ్లర్ చుట్టుకున్నాడు ఆటోడ్రైవర్. ఇదీ ఓ వింతే అనుకున్నాను. సంపత్ ప్రశ్నలకు ఆటోడ్రైవర్ చెప్తున్న జవాబులు వింటున్న నాకు ప్రశ్న, జవాబు అన్నీ తానే చెప్పిన సుబ్రమణ్యంగారే గుర్తుకొచ్చారు. అరె! నా అసంతృప్తి సెగల్లో గమనించలేదు కానీ గొంతు, మాట కూడా అదే, ఆయనవే! పైగా ఇంగ్లీషు చక్కగా మాట్లాడుతున్నాడు. సుబ్రమణ్యంగారిలాగే!

ఆటో ఆగింది. ఆటోలో నుండి సూట్‌కేస్ దించి చెయ్యి చాపాడు.

ఆ చెయ్యి.. చాపిన చేతిని ఆదుకున్న చెయ్యి! "సార్! మీరేంటి ఇలా?" బాధ, ఆశ్చర్యంతో నోట మాట పెగలడం లేదు.

"చెప్పండి సార్ ఏమిటిది? ఏమైంది? మీరిలా ఆటో నడపడం ఏమిటి? ..." నా ప్రశ్నలన్నింటికీ చిరునవ్వే సమాధానం.

"చెప్తాలే చందూ. మీరేమి అనుకోకపోతే.." ఆటో నడిపానన్న స్పృహ వచ్చినట్లు నన్ను గౌరవంగా సంబోధిస్తున్నారు సుబ్రమణ్యంగారు.

"మూడు వందలు ఇవ్వగలవా? హాస్పిటల్‌లో నా శ్రీమతి ఎదురు చూస్తూంటుంది. త్వరగా వెళ్ళాలి" ఆటోలో మరెవరో ఎక్కుతున్నట్లుంది.

నా మనసంతా బాధ.. గొంతుక బిగిసినట్టుంది. ఐదువందలు చేతిలో పెట్టాను. నాకు కొబ్బరిబొండాలు మోసుకొచ్చిన చేతులు, అన్నం పెట్టిన చేతులు!

"సార్! ఎక్కడున్నారు? హాస్పిటల్‌లో నేనా? ఫోన్ నంబరు స్విచ్ఆఫ్ వస్తోంది. ఏమైనా మారిందా?" అంటుండగానే ఆటో స్టార్ట్ చేసేశారు సుబ్రమణ్యంగారు. ఆటోడ్రైవరుకు ఐదువందలు ఎందుకిచ్చానా అని సంపత్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

డెలిగేట్స్ వర్క్‌షాప్ అయిపోయింది. మళ్లీ రొటీన్‌లోకి రావాలి. రాలేదు. ఒక రోజు కాదు, రెండ్రోజులు కాదు, రెండు నెలలు ఎడతెగని ఆలోచనలు, నిద్రపట్టని రాత్రులు. ఆకాష్‌కు ఫోన్ చేస్తే తనకన్నా ఎక్కువ ఆశ్చర్యపోయాడు. 'కారణాలు తెలియడం లేదు' అన్న ముక్కొకటీ మాత్రం చెప్పాడు. సుబ్రమణ్యంగారి గురించి తక్కువ ప్రొఫైల్‌లో చివరకు నాన్నకు చెప్పలేకపోయాను. ఎలాగైనా సుబ్రహ్మణ్యంగారిని కలవాలి. ఈ స్థితికి కారణం తెలుసుకోవాలి. వాళ్ల ఆఫీసుకు ఫోన్ చేస్తే, వద్దు ఆయన ముఖతః కాకుండా ఎవరినో అడగడం వద్దు- బాగుండదు. ఆయనే రాజీనామా చేశాడా? ఉద్యోగం నుండి తీసేశారా? అంత తప్పులు చేసే వ్యక్తి కాదే! ఏమీ లేనిదే అంత కష్టం ఎందుకు దాపురించింది? ఆర్థిక మాంద్యమా? సుబ్రమణ్యంగారి విషయంలో అది అమలవదని అందరికీ తెలిసిందే. డబ్బుల విషయంలో తేడాలా? లేక లంచాల్లాంటివి...? ఛా! అలా ఊహించినందుకు లెంపలేసుకున్నాను. ఎవరితోనైనా గొడవ పడ్డారా? అలా ఎన్నటికీ చేయరు. లైంగిక వేధింపులంటూ ఎవరైనా ఎసరు పెట్టారా? అలా అనుకోవడానికి అవకాశమే ఇవ్వరు. స్టాకు ఏమైనా అమ్మేశారా? 'నీకు బుద్ధిలేదు ఇలా ఆలోచిస్తావా' అని నా మనసే నన్ను చీవాట్లేసింది. మరయితే అంత శిక్ష ఎందుకు? వద్దు, మరోలా ఆలోచనే వద్దు. నా దృష్టిలో అతడు దేవుడు. నాకు గురువైన మార్గదర్శి, నన్ను నడిపించిన మానవతామూర్తి. నా మనసులో అతడి రూపం అలాగే ఉండనీ, నాకు సుబ్రమణ్యంగారి పైనున్న భావాన్ని చెరిపివేసే ఏ వివరాలు నాకు వద్దు. నా మనసులో అతడికి గుడి కట్టాను. ఆయన మంచితనమే ఆ గుడిలో మూర్తిమత్వం.

నేనిక ఏ విషయాన్ని తెలుసుకోవాలనుకోను. కానీ నా బాధ్యతగా ఆ దుస్థితి నుండి ఆయనను తప్పించాలి. అదే నేనివ్వగలిగే గురుదక్షిణ. చాలారోజులకు నిద్ర ముంచుకొస్తోంది. V

బల్గేరియన్ కథ -పేలిన్

చెట్టు

అనువాదం : ప్రవల్లిక

ఆ బీద ఇల్లు స్తొ ఇచకోది. ఆ ఇంటి ప్రాంగణంలోనే మొలిచిందా అద్భుతమైన మర్రిచెట్టు! భూమిలోంచి దాని ఐదు కొమ్మలూ పైకి తొంగిచూస్తున్నాయి. ఒక్కో శాఖా బాగా విస్తరించటంతో, పెద్ద పూల గుత్తిలా ఉందది. గొడుగులా ఉండి చుట్టుపక్కలవాటికి అండగా, నీడగా నిల్చింది. సంధ్యాసమయంతో దాని నీడ చిన్న పర్వతంలా ఆ విశాల మైదానాన్ని కప్పింది.

ఆ చెట్టుపైనే చాలా కాలంనుంచీ కొంగల గూళ్లు పన్నెండు ఉన్నాయి. ప్రతి వసంతకాలంలోనూ బైటనుంచి పక్షుల జంటలు వస్తుంటాయి. గుడ్లుపెట్టి ఆ గూళ్ళలోనే పొదుగుతుంటాయి. ఎంతో దూరంనుంచి ప్రయాణం చేసి వస్తాయవి. తాము పెట్టిన ఆ గూళ్ళను మళ్ళీ వచ్చి చూసుకుంటూ ఉంటాయి. ఇదంతా ఆ పేదింటి వాళ్లకి ఎంతో ఆనందం కలిగిస్తోంది.

వసంతకాలం అడుగుపెట్టబోతోంది. పిల్లలు హాయిగా పరుగులు తీస్తూ అడుకుంటున్నారు. ఆకాశం నిర్మలంగా ఉంది. పల్లె సందుగొందుల్లో నీడలు పరుచుకున్నాయి. కారణమేమిటా అని తలెత్తి చూస్తే.. ఆ పక్షులు కన్పిస్తున్నాయి. అవే విశ్రాంతిగా ఆ పల్లెమీద చక్కర్లుకొడ్తున్నాయి. ఒక్కసారిగా ఆకాశంలోకి పైపైకి ఎగురుతున్నాయి. గడ్డి మైదానాలపై వాలి, గుండ్రంగా వేగంగా తిరుగుతున్నాయి. ఆ పక్షులే ఆ ఇంటి మర్రి చెట్టు గూళ్ళమీద వాలాయి. పిల్లలు సంతోషంతో కేరింతలు కొడుతున్నారు. పక్షుల్ని చూస్తూ ఎగురుతున్నారు.

ఆ గోలకి జడిశాయి పక్షులు. వాటి నీడకి కంగారుపడి, కోడిపెట్టలు అటూఇటూ పరుగులుతీస్తున్నాయి. చెత్తకుప్పపై నుంచున్న పుంజులు మాత్రం 'శాంతంగా ఉండమ'ని 'సంకేతాలు' పంపుతున్నాయి. ఈ గొడవంతా వింది ఇంటామె. పిండి కలుపుతున్న ఆ చేత్తోటే బైటికొచ్చి తొంగిచూసింది. "ఏంట్రా బద్మాష్! ఏంటా అల్లరి? " అని పెద్దగా ఊరంతా విన్పడేలా అరిచింది.

కానీ చెట్టుపై వాలిన పక్షుల్ని చూడగానే ఆమె మనసంతా కరిగిపోయింది. "అరె.. మన చుట్టాలు వచ్చేశాయే.. రండి రండి" అని ఆనందంగా భర్తని పిలిచింది. ఆ మాటలు విన్న స్తొ ఇచకో ఉదాసీనంగా చూశాడు. అతని బట్టలపైనా చిరిగిన టోపీపైనా గడ్డి అతుక్కుపోయి ఉంది. "అవిగో.. పక్షులు" అని భర్తకి చూపింది.

"నాన్నా! పక్షులు" పిల్లలు అరుస్తున్నారు.

అతను మాత్రం వాళ్ల అరుపుల్ని పట్టించుకోకుండా ఉన్నాడు. అదో తరహా మనిషి! బండరాయిలాగా ఉంటాడతను. చుట్టూ ప్రపంచం కళకళలాడ్తున్నా, తను మాత్రం ఎలాంటి అనుభూతీ లేకుండా ఉండిపోతుంటాడు. రోజంతా పనీపాటా లేకుండా అలా ప్రాంగణంలోనే పచార్లు చేస్తుంటాడు, లేదంటే కల్లుపాకలో గడిపేస్తాడు! అక్కడి గోలని కూడా నిశ్శబ్దంగా విని ఇంటికి తిరిగి వచ్చేస్తాడు. లోలోపల.. కారంగా ఉండే మిరపకాయలాంటివాడు. భార్య పాపం.. రోజంతా కష్టపడ్తోంది కాబట్టి, పిల్లలు బతికిపోయారు.. లేకుంటే వారి గతి ఆ దేవుడికే ఎరుక.

పిల్లల అరుపుల్తో అతనిలో కాస్తంత కదలిక కలిగింది. నెత్తిన టోపీ తీసేసి, ఆ పక్షుల గూళ్లని అలాగే చూస్తున్నాడు. చాలాసేపు తన దట్టమైన కనుబొమ్మల్ని ఎగరేశాడు. కళ్లు చికిలిస్తూ పరిశీలించసాగాడు. "అరె! ఇది పాముల్ని తినేది" అన్నాడు బిగ్గరగా.

"కాదు, కప్పల్ని తింటుంది" అందుకుంది భార్య.

"కప్పల్ని తినే పక్షి ఇప్పుడెక్కడుంది? చూడు, దాని కాళ్లు పసుపురంగులో లేవూ? కాబట్టి అది కప్పల్ని తినేది కాదు"

"ఆ..అవునవును.. పాముల్ని తినేదే" అందామె.

ఆరోజు అతనింట్లో పండగ వాతావరణం. ఊరంతా కూడా సంబరాలు జరుపుకొన్నారు. ఆ విశాల వృక్షంలో ప్రాణంవచ్చింది. పన్నెండు గూళ్ళలోనూ పన్నెండు పక్షి జంటలు ప్రేమగీతాలు ఆలాపిస్తున్నాయి. ప్రతి చెట్టూ పచ్చగా మెరుస్తోంది. ప్రతి గూటిలోనూ జీవకళ ఉట్టిపడ్తోంది. పగలంతా ఆ పక్షుల అరుపులే! కాసేపు ఎగిరి మళ్లీ రావటం, ప్రణయ లీలలు ప్రదర్శించటం! చెత్తా చెదారం పోగుచేసి అవి తమ ఇళ్లను బాగుచేసుకుంటున్నాయి. ఇదంతా పిల్లల్ని అలరిస్తోంది.

పిల్లల్తో ఆడటానికా అన్నట్లు పక్షులు నేల మీద వాలుతున్నాయి, ప్రాంగణంలో తచ్చాడుతున్నాయి.

ఆ ఇంటి కుక్క కూడా యజమాని లాగానే మొహం వేలాడేసుకుని ఉంది. బద్ధకంగా పడుకుని ఉంది.

ఒకరోజు స్తొ ఇచకో ఇంటి ఆవరణలో కట్టెలుకొడుతున్నాడు. ఎండ తీక్షణంగా ఉంది. పై బనీను విప్పి మరీ పనిచేస్తున్నాడు. ఎండ, చలిలో కూడా దానిని వదలడతను. ఇప్పుడా చొక్కా చెమటతో తడిసి ముద్దయింది. పైగా అతనిదో చిరుగుల టోపీ. పైగా చెమటకంపు! తీసి పడేశాడు.

ఆ చుట్టుపక్కలే ఆ సర్పభక్షక పక్షులు పచార్లు చేస్తున్నాయి. అవి పుల్లా పుడకల సేకరణలో ఉన్నాయి. చెత్తకుప్పల్ని చెదరగొడ్తున్నాయి. అందులో ఒక పక్షి ఆ టోపీని చూసి దగ్గరకెళ్లి, తన ముక్కుతో పొడిచింది. నోట కరుచుకుని రివ్వున గూటి



దగ్గరికి ఎగిరిపోయింది. అది తింటానికా లేక గూట్లో ఉంచటానికా.. దానికే తెలియాలి మరి!

స్తొ ఇచకో దాన్ని చూశాడు. వెంటనే రాళ్లు విసరసాగాడు. ఆ దొంగ పక్షి మాత్రం ఎంచక్కా తన గూట్లో కూచుని, టోపీని ముక్కుతో పొడవసాగింది. "ఉష్..ష్.. సైతాన్! నా టోపీని ఇవ్వవే" అంటూ అతను పెద్దగా అరవసాగాడు. అది మటుకు టక్‌టక్‌మంటూ టోపీని ముక్కుతో పొడిచేస్తోంది.

అతని కోపం తారస్థాయికి అందుకుంది. రాళ్లు విసురుతూనే ఉన్నాడు. పాపం ఆ పన్నెండు గూళ్లలోని పక్షుల జంటలూ భయపడి అరుస్తున్నాయి. దొంగ పక్షి ఆ టోపీని గూట్లోనే వదిలేసి పోయింది.

స్తొ ఇచకో ఇంకా చెట్టుపైకి రాళ్లు విసిరేస్తున్నాడు. గుడ్లకోసం గూళ్లను సిద్ధంచేసుకుంటున్న పక్షులన్నీ భయంభయంగా ఉన్నాయి.

దొంగ పక్షి మళ్లీ వచ్చింది. గూట్లో కూచుని టోపీని తిరిగి ముక్కుతో పొడుస్తోంది.

"ఎంత పొగరే నీకు.. ఇప్పుడే బుద్ధి చెప్తా.." అరవసాగాడతను. గొడ్డలి తీసుకుని చెట్టు బోదెమీద ధనాధనా కొడ్తున్నాడు. ఆ పక్షి కూడా తక్కువేమీ తినలేదు. ఒక కాలితో ఆ టోపీని బలంగా అదిమిపెట్టి, ముక్కుతో పొడుస్తూనే ఉంది. ఇక చూస్కోండి, అతని కోపం నషాళానికి అంటింది. బిగ్గరగా అరిచాడు, బూతులు తిట్టాడు. పట్టనట్లుందా పక్షి. అతన్ని రెచ్చగొడ్తూ తన పని తను చేసుకుపోతోంది! ఎంతకీ బెదరని మొండిదది.

అతనిలో క్రోధం ఎగిసిపడింది. గొడ్డలితో కసితీరా చెట్టుని నరుకుతున్నాడు.

ఎక్కడ్నించో పిల్లలంతా వచ్చిపడ్డారు. అభం శుభం తెలీని పసివాళ్లు. వాళ్లకి అదో ఆనందంగా ఉంది. అరుస్తున్నారు, కేకలు వేస్తున్నారు. "భలే భలే.. నాన్న టోపీని పక్షి ఎత్తుకెళ్లిందోచ్! అని అరుస్తున్నారు వాళ్లు.

ఆ తండ్రికి రోషం ఇంకాస్త ఎక్కువైంది. అగ్నిలో ఆజ్యం పోస్తున్నట్లుంది పరిస్థితి! పిల్లల్ని బైటికి తరిమాడు. తిరిగి గొడ్డలితో చెట్టును తూట్లుపొడుస్తున్నాడు.

పాపం.. ఆ చెట్టు బాధతో వణుకుతోంది. దాని ఐదు శాఖలూ మృత్యువుతో పోరాడుతున్నాయి. అంతులేని బాధ అనుభవిస్తున్నాయి.

పక్షులన్నీ ఆర్తనాదాలు చేస్తున్నాయి. గడ్డి పరకల్ని ముక్కున కరుచుకు పోతున్నాయి. చెట్టుమీద గాభరాగా ఉన్నాయవి. గూళ్లన్నీ చెల్లాచెదురు కావటంతో దిక్కుతోచడం లేదా మూగ ప్రాణులకి.

క్రూరంగా మారిన అతను కళ్లున్న అంధుడయ్యాడు! చెట్టుని నరికేస్తున్నాడు. అంత పెద్ద చెట్టూ నేలవాలింది. కొమ్మలన్నీ వేటికవి విరిగిపోయాయి.

బాధతో అరిచిందా చెట్టు. నెమ్మదినెమ్మదిగా కిందకి వాలిపోయిందది. ధడాల్న నేలమీద కుప్పకూలింది. గూళ్లలోంచి మట్టి ఎగిసిపడ్తోంది.

స్తొ ఇచకో మరింత రగిలిపోతున్నాడు. కొమ్మల్లో దూరి టోపీని వెదుకుతున్నాడు. అది ఎప్పుడో కిందకి పడిపోయింది. దాన్ని వెతికి పట్టుకుని బాగా దులిపాడు. రంకెలేస్తూ వరండాలోకెళ్లాడు.

అతని భార్య చెట్టు పడ్డ శబ్దానికి భయంతో బైటికొచ్చింది. పెద్దగా ఏడుపు మొదలెట్టింది "నువ్వు కూడా వేయి ముక్కలైపోతావు. ఎంత పాపానికి ఒడిగట్టావు? నిన్ను దేవుడు శిక్షిస్తాడు.."

"నోర్ముయ్" అరిచాడతను. ఆమె పరిగెత్తుకెళ్లి తలుపులు మూసుకుంది.

అతను కల్లుపాక వైపు నడిచాడు.

పాపం.. ఆ పక్షులు రెండ్రోజులు అక్కడే తచ్చాడాయి! V

తమిళ కథ

-కాశ్యపన్

జగద

అనువాదం : డింగరి నరహరి ఆచార్య

"ఆగు! రావద్దు! ఒక్కడుగు ముందుకేసినా కొడతాను" అన్న లక్ష్మి మాటలతో పొద్దున్నే నిద్రాభంగం అయింది రాఘవకు. కార్తీకమాసపు ఆ చల్లని ఉదయంలో హాయిగా ముసుగేసి పడుకున్న ఆయనకి ఆ సుఖాన్ని దూరంచేయక తప్పలేదు. లేచి బయటకు వచ్చి ముఖం కడుక్కున్నాడు.

"ఏడు గంటలయింది. ఇప్పడెందుకు వచ్చావ్? ఇల్లు తుడుచుకోవడం, ఊడవడం అన్నీ అయిపోయాయి. కాఫీ తాగే వేళకు వచ్చి నువ్వేం చేస్తావ్? వద్దు.. వద్దు నీ అవసరం లేదు" అంటూ లక్ష్మి చూపుడు వేలుతో బెదిరిస్తూ తీవ్రంగా అంటోంది. ఎదురుగా పదకొండేళ్ళ పనిపిల్ల. భయంగా నిలుచుని వుంది.

ఆ దృశ్యం రాఘవ చూశాడు. "ఆ మాటే మెల్లగా చెప్పరాదూ" అన్నాడు భార్యతో.

"ఆc! మెల్లగా చెపుతా, మీరు చేయబట్టే ఇలా తయారయింది. చూడు దాని ధైర్యం! వారంలో నాలుగు రోజులిలాగే ఆలస్యంగా వస్తుంది. అన్నీ పనులు నేనే చేసుకోవడం, మీకు చెప్పి ఏం ప్రయోజనం? కాఫీ తీసుకోండి!" అంటూ టీపాయ్ మీద కాఫీ కప్పు ఉంచింది. మాట్లాడకుండా రాఘవ కాఫీ తాగాడు. "హు! తాగి దినపత్రిక చదువుకోండి, ఇక టివి కూడా ఉంది కదా? వార్తలు వినండి, అంతా నా దౌర్భాగ్యం. ఇంట్లో అన్ని పనులు నేనే చేసుకోవాలి. స్కూల్లో పిల్లలకి పాఠాలు నోరు నొప్పి పెట్టేట్టు అరచి చెప్పాలి. అంతా కంఠశోష. నా తలరాత. చావే నయం దీని కన్నా" ఇంకేం మాట్లాడలేక పైకి వస్తున్న దుఃఖాన్ని, బాధను దిగమింగుకుంది.

నిజానికి లక్ష్మి తప్పేం లేదు. పొద్దునే ఏడున్నరకల్లా స్కూల్‌కి బయలుదేరి ఎనిమిదిన్నరకల్లా అక్కడ ఉండాలి. అందుకే పనిపిల్ల మీద విసుగు. పనిపిల్ల 'జగద' పాపం అలాగే బయట నిలబడిపోయింది. మెల్లిగా లోపలికి వచ్చి ఇల్లు ఊడవడానికి తయారయింది. ఇది దాదాపు రోజూ జరిగే తంతే. కోపంలో లక్ష్మి ఏవో మాటలు అంటుంది. జగద మౌనంగా పనిలో ఒదిగిపోతుంది. ఇవ్వాళా అదే జరిగింది. కొంతసేపయ్యాక లక్ష్మి కోపం వదలి జగదకు కాఫీ ఇచ్చింది. ఆ కాఫీ చూసి చూడనట్లుండిపోయింది జగద. అది చూసి లక్ష్మి మళ్ళీ కోపంగా "ఏం..ఇవ్వాళ రోషం వచ్చిందా? కాఫీ తాగడంలేదెందుకు? " అంది, జగద మౌనంగా కాఫీ తాగింది.

జగద ఆలస్యంగా వచ్చినప్పుడల్లా లక్ష్మి కోపంగా ఇలాగే అరుస్తుంది. జగద కూడా అలాగే మౌనంగా ఉండిపోతుంది. "ఇలాగే ఆలస్యంగా రా! కొంచెం కూడా సిగ్గులేదు నీకు" అంది లక్ష్మి. ఆ మాటలు వినగానే జగద ముఖంలో దుఃఖం తన్నుకురాసాగింది. అయినా బలవంతంగా అణచుకొని నవ్వు ప్రకటిస్తూనే కాఫీ తాగింది.

జగద! ఈ యింట్లో పాత్రలు కడగడం ఇల్లు ఊడవడం మొదలైన పనులు చేస్తోంది. అది చూడ్డానికి వాళ్ళ బిడ్డకన్నా అందంగా ఉంటుంది. రెండేళ్ళు చిన్నది కూడా. వాళ్ళ బిడ్డ దోమతెర లోపల సుఖంగా, హాయిగా నిద్రపోతోంది.

నడిమింట్లో ఊడవడానికి జగద రాగానే మళ్ళీ "వెళ్ళిపో. ఈ రోజునుండి నీవు రావాల్సిన అవసరంలేదు. వెళ్ళు ఇక్కడి నుండి" లక్ష్మి గట్టిగా అరిచింది. జగద రాఘవవైపు దీనంగా చూడ సాగింది దాని కళ్ళు ఎరుపెక్కి వున్నాయి రాత్రంతా నిద్ర లేనట్టు. అది చూసి "లక్ష్మీ" అన్నాడు రాఘవ, ఇక ఊరుకో అన్నట్లుగా. "మీరూరుకోండి! ఇది రావాల్సిన అవసరం లేదు. నేను భరించలేను. చాలు దాని సహకారం" అని రుసరుసలాడింది.

"చిన్నపిల్ల కదా!" అన్నాడు రాఘవ.

'అలా అనకండి. ఈ పిల్ల నా యింటికి రానవసరం లేదు" అంది. ఆ వెంటనే రాఘవ "జగదా! ఎందుకు ఆలస్యంగా వస్తున్నావ్" అని అడిగాడు. జగద మౌనంగా నిలుచుంది. వెంటనే లక్ష్మి కోపంగా "రాత్రి సినిమా చూడ్డానికి వెళ్ళిందేమో? " అంది.

"ఏం.. సినిమా చూడ్డానికి వెళ్ళావా? " అన్నాడు. జగద మౌనంగా తలవూపుతూ అంగీకారాన్ని తెలిపింది.

"ఒక్క వారంలో మూడు రోజులు సినిమా చూడ్డానికి వెళ్తుందీవిడగారు" వెటకారంగా అంది లక్ష్మి.

"డబ్బు లెక్కడనుండి వస్తాయి నీకు? " అన్నాడు రాఘవ.

"నానమ్మ ఇచ్చింది" అంది.

"అలాగా మీ నానమ్మను ఇప్పుడే తీసుకురా!" అంది లక్ష్మి ఆవేశంగా, తిరిగి రాఘవనుద్దేశించి "చూడండి! ఆ ముసలిది వచ్చినట్లయితే జీతం ఇచ్చి పంపేయండి" అని ఆదేశించింది. జగదతో "వెళ్ళు వెళ్ళు మీ నానమ్మను తీసుకురా" అని మాటలు ఆపేసింది. జగద రాఘవను చూడసాగింది. ఆమె కళ్ళలోంచి నీళ్ళు కారసాగాయి. అమాయక బాలిక చాలాసేపు అలా నిలబడింది. ఆ చూపులు రాఘవ హృదయాన్ని కదిలించివేశాయి. 'జగద చాలా బుద్ధిమంతురాలు. ఆదివారం టీవీలో దూరదర్శన్‌లో సినిమా చూడ్డానికి తప్పక వస్తుంది. చిత్రహార్ కూడా తప్పకుండా చూస్తుంది. అందులో పాత్రలు, పాటలు, వారి నటన అన్నీ విడవకుండా శ్రద్ధగా గమనిస్తుంది. ఇతరులు తెలుసుకోలేని ఎన్నో విషయాలు తెలుసుకుంటుంది. అంత శ్రద్ధ. జ్ఞాపకశక్తి కూడా ఎక్కువే. నిజంగా బడికి వెళ్ళి చదువుకుంటే..కానీ అది అసంభవం, అసాధ్యం' ఇలా ఆలోచిస్తున్నాడు రాఘవ.

పాపం నాలుగేళ్ళ వయస్సులోనే జగద తల్లి చనిపోయింది. తండ్రి గురించి తెలియనే తెలియదు. అప్పటి నుండి నానమ్మే ఆమెకన్నీ. అంతేకాదు వాళ్ళ అన్నయ్యను కూడా వాళ్ళ నానమ్మే పోషిస్తోంది. మధ్యాహ్నం ఆఫీసర్లకు భోజనం తీసుకువెళుతూ డబ్బు సంపాదిస్తూ సాకింది. ఎక్కడో ఊరి చివర చెరువు దగ్గర చిన్న గుడిసె వారి నివాసం. జగద అన్న రిక్షా నడుపుతాడు. ముసలావిడ చూపు మందగించిప్పటి నుండి తన శక్తి సన్నగిల్లింది కనుక ఇంటిపనులు చేయడానికి జగదను రాఘవ యింట్లో కుదిర్చింది.

జగద అన్ని పనులూ బాగా చేస్తుంది.



చిన్నప్పటి నుండే ఆట పాటల్లో గాని, వినోదంగా మాట్లాడడంలో గాని చాలా హుషారైన పిల్ల. కానీ ఎందుకో రెండునెలల నుండి ఇలా ఆలస్యంగా వస్తోంది. ఎన్నో సార్లు ఇలా చెప్పించుకుంది. పాపం అమాయకురాలు, అర్ధరాత్రిదాకా సినిమా చూసి పొద్దున్నే లేవడం ఎలా సాధ్యమవుతుంది? అందుకే ఇలా అవుతోంది. సోమవారం సినిమా చూడ్డానికి వెళ్ళింది. వాళ్ళ అన్నయ్య దానికి డబ్బులిచ్చాడు. మళ్ళీ బుధవారం వెళ్ళింది. నానమ్మ డబ్బులిచ్చింది. శనివారం కూడా ఇదే కథ. పాపం ఆమె ముఖం వాడిపోయింది. నిద్ర లేకపోవడమే కాదు, సినిమా చూడ్డంవల్ల కూడా అలిసిపోయింది. దూరదర్శన్‌లో హీరో హీరోయిన్లు కౌగలించుకున్నప్పుడు జగద ముఖంలో ఒక విశిష్టమైన నవ్వు కనబడుతుంది. ఇదీ కారణం.

సాయంకాలం ఆరుగంటలకు జగద వాళ్ళ నానమ్మను తీసుకొని వచ్చింది. "చూడు పిచ్చమ్మా! ప్రొద్దున్నే ఆరుగంటల కన్న ముందే వాకిలి ఊడవాలి. ముగ్గు వేయాలి. కాని నీ మనుమరాలు అంతా అయ్యాక వస్తుంది. అన్ని పనులూ నేనే చేసుకోవాలి. ఇక దీనికెందుకు జీతమివ్వాలి. ఇదేం బాగుండలేదు" అంది లక్ష్మి.

"అమ్మా! అట్టంటే ఎట్టా తల్లీ! అదెక్కడికి పోవాలి? అది మీబిడ్డ వంటిదే. చిన్నపిల్ల కదా.." అని ముసలిది దీనంగా అంది.

"ఎక్కడికి పోతుందో నాకేం తెలుసు, ఆదంతా నాకెందుకు? "

"ఏం చెయ్యాలమ్మా! దాని ఖర్మ, నిద్ర లేదు కనుక అలా అవుతోంది"

"ఎందుకు నిద్రలేదు... ప్రతిరోజూ సినిమా చూశాక ఇలాగే వుంటుంది"

మాటల మధ్యలో రాఘవ వచ్చి "చూడమ్మా! ఈ చిన్నపిల్లను రోజూ సినిమా చూడ్డానికి ఎందుకు పంపుతున్నావ్? " మందలింపుగా అన్నాడు. ఆ మాటలు వినగానే ముసల్దాని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆపుకోలేక పైకే ఏడవసాగింది. " పిచ్చమ్మా! ఇలా ఏడవడం వల్ల లాభమేముంది? జీతం తీసుకో..వెళ్ళు. నీ అవసరం లేదు మాకు" అని లక్ష్మి కటువుగా మాట్లాడింది.

తిరిగి ముసల్ది ఏడుస్తూ "నేనేం చెయ్యాలమ్మా! నా మనవడికి ఈ మధ్యనే పెళ్ళయింది. గుడిసెలో ఒకే గది. దాంట్లోనే అడ్డుగా తెరగట్టి వాళ్ళు పడుకునేందుకు ఏర్పాటు చేశా. ఇంతవరకు ఈమెతోపాటు నేను బయట ఉండేదాన్ని. ఎక్కడో అక్కడ ఓ మూల ఒదిగి రాత్రులు గడిపే వాళ్ళం. ఇప్పుడేమో వర్షాకాలం. బయట పడుకునేట్టు లేదు. అయినా నేను ఎక్కడో ఓ మూల ఒదిగి రాత్రి గడుపుతున్నాను. ఇదా.. చిన్నపిల్ల! నిద్ర ఆపుకోవడం వల్ల కాదు. అందుకే ఇతర పిల్లలతోపాటు రెండో ఆట సినిమాకి రెండురోజులకోసారైనా పంపిస్తున్నాను. అంతకన్నా ఏం చేయలేకపోతున్నా" అంది సిగ్గుతో చెప్ప లేక చెప్పలేక బాధపడుతూ.

స్త్రీ హృదయం గల లక్ష్మికి ఇంకేమి అనడానికి నోట మాట రాలేదు. పనికి రాలేదన్న కోపమే గానీ జగద అంటే ఆమెకు ప్రేమే. లక్ష్మిది సహజంగా జాలి గుండె, పని ఒత్తిడితో అలా అంది. ఈ పరిస్థితి తెలిశాక ఇక ఏమీ అనలేకపోయింది. "సరే వెళ్ళండి!" అని అంగీకారం తెలిపింది.

ఆ రాత్రి లక్ష్మి రాఘవ గుండెలపై తల పెట్టి "జగదా జగదా" అని బాధపడింది.

"అయ్యో! ఏమిటిది లక్ష్మీ! ఎందుకేడుస్తున్నావ్? రేపటి నుండి ఇంటిపనికి రమ్మని చెప్పావుకదా!" అనునయించాడు రాఘవ. 'జగద కూడా రేపు ఓ రిక్షావాడిని చేసుకుంటుంది. మొగుడితో సహా రిక్షాలో సినిమా చూడ్డానికి వెళ్తుంది. ఆ రోజు ఎప్పుడు వస్తుందో' అని ఆలోచిస్తూ రాఘవ కూడా నిద్రలోకి జారుకున్నాడు.

బెంగాలీ కథ

-నరేంద్రనాథ మిత్రా

పావులీటరు పాలు

అనువాదం : అచ్యుతుని రాజ్యశ్రీ

భర్తకోసం రోజూ ఓ పావులీటరు పాలు తీసుకుంటోంది లతిక. అందులో కొంత.. రెండున్నరేళ్ల పిల్లకి విడిగా తీస్తోంది. కేవలం సగ్గుబియ్యం, బార్లీ నీటితో పిల్ల పొట్ట నింపలేదు కదా. దాని పాలలో కొంత మళ్లీ చాయ్ కోసం ఉంచుతుంది.

ఉదయమూ సాయంత్రమూ పాలపొడి టీ తాగి వినోద్‌కి విసుగెత్తింది. అందుకే పాలవాడు వచ్చినప్పుడు "కాస్త రెండు చెంచాల పాలు నా చాయ్‌లో వెయ్యి" అన్నాడు.

మొహం చిటపటలాడిస్తూ అంది లతిక "బాగుంది సంబడం! ఎంతో పొదుపుగా పిల్లదానికే ఇస్తుంటేనే సరిపోవటంలేదు. ఇక అందులో కాస్త తీసి మీ చాయ్‌లోకి వాడితే ఎలా? "

'సరే తల్లీ! పాలు లేకపోతే మానె.. నువ్వు గొంతు చించుకు అరవకు"

రెండ్రోజులు శాంతంగా గడిచాయి. భర్త వైపు చూసింది లతిక. రోజంతా కష్టపడ్తున్న అతని ఒళ్లంతా ఎముకలు వెళ్లుకొచ్చాయి. ముప్ఫైరెండేళ్ల అతను ముసలివాడిలా కన్పడసాగాడు ఒళ్లంతా ముడతల్తో! మూడోరోజు విరిగిన కప్పునిండా పాలుపోసి భర్త ముందుంచింది.

"పాప పాలన్నీ నాకిచ్చేశావా? " అడిగాడు వినోద్.

"ఉహు.. మీ కోసం వేరే తీసుకున్నా. కాస్త పాలు తాగండి. మీ ఒళ్లంతా ఎలా గుల్లలా మారిందో చూడండి.."

పాలసముద్రం పొంగుతున్నంత అనుభూతి పొందాడతను! భార్య ప్రేమ పాలలా పొంగిపొర్లుతోందా? పన్నెండేళ్లక్రితం నవవధువు లతిక మొహం ఇప్పుడతని కళ్ల ముందు కదలాడసాగింది. "మరి ఖర్చు పెరగదూ? "

"పెరగనీండి. సంపాదించేది మీరు. మీకోసం కాస్తఖర్చు ఎక్కువైతే ఏం? "

పాలు పెదాల దగ్గర పెట్టుకున్నాడతను.

కొద్దిదూరంలో చాపపై కూర్చుని సునీల్ స్కూలు పాఠాలు వల్లెవేస్తున్నాడు. తొమ్మిదేళ్లవాడి తర్వాత పాప! వాడి ఐదోక్లాసు ఫీజు కట్టాలంటేనే బ్రహ్మప్రళయంగా ఉంది.

నాన్న.. పాలు తాగటం చూసి వాడికి సిగ్గుగా అన్పించి గొంతెత్తి బిగ్గరగా చదవసాగాడు.


"ఏరా? కాసిని పాలు తాగుతావా" లతిక అందుకుంది.

"నాకేం అక్కర్లేదు" అన్నాడు వాడు.

"మీరు తాగండి. ఇంకోరోజు వాడికోసం అట్టిపెడ్తా. వాడి పరీక్షల టైంలో రోజూ కొంటా"

ఇంతలో "ఒరేయ్! ఎంతసేపు బట్టీకొడ్తావురా? "అంటూ వచ్చాడు వినోద్ తమ్ముడు విజన్. "వదినా! చాయ్ గీయ్ ఏమన్నా ఇస్తావా? "అడిగాడు.

బి.ఎ. పాసై ఉద్యోగం వేటలో ఉన్నాడు విజన్. రెండేళ్లబట్టీ ఖాళీగా ఉం



టూ రోడ్లన్నీ తిరుగుతున్నాడు.

"నీకు ఇవ్వకుండా మేమెప్పుడన్నా చాయ్ తాగామా? " అంది లతిక.

"ఏంలేదులే! అన్నయ్య దగ్గర కప్పు ఉంటేనూ.. అలా అనుకున్నా"

అతను ఎగతాళి చేస్తున్నాడా?

వినోద్ కాస్త సిగ్గుపడ్తూ "చాయ్ కాదురా కాసిని పాలు తాగా" అన్నాడు.

"అంటే దొంగతనంగా అన్నయ్యపాలు తాగుతున్నాడన్నమాట!"

"రేపు వాడికి కూడా ఓ కప్పు పాలివ్వు లతికా!" అన్నాడు వినోద్.

"నేనసలు పాలు తాగనని తెల్సుగా వదినా? చాయ్ ఉంటే ఇవ్వు"

లతిక రెండు కప్పుల్లో టీ ఇచ్చింది. ఆ మర్నాడు చాలా జాగ్రత్తగా ఎవరూ చూడకుండా భర్తకి కప్పుతో పాలు అందిస్తే, దొంగతనంగా వినోద్ తాగసాగాడు.

కొడుకు సునీల్ ఈ రోజు ఆరోగ్యాన్ని గూర్చిన పాఠాన్ని వల్లెవేస్తున్నాడు. "పాలు ఆరోగ్యానికి ఎంతో మంచివి" అంటూ.

విజన్ పళ్లు తోముతూ వదినెతో మాట్లాడుతున్నాడు.

వినోద్ నెమ్మదిగా చప్పుడు చేయకుండా పాలు తాగేశాడు. కొన్నాళ్లుగా దొంగచాటుగా మొహమాటపడ్తూ పాలు తాగుతున్నా, ఆ సంకోచం పూర్తిగా తొలగిపోయింది అతనికి. పాలు చేతికివ్వటం కొంచెం ఆలస్యం అయితే చాలు "ఇంకా పాలు రెడీ చేయలేదా? త్వరగా వెళ్లాలి" అని అరుస్తాడు.

ప్రూఫ్‌రీడర్‌గా పనిచేస్తున్నాడు వినోద్. మధ్యలో ట్యూషన్లు చెప్తుంటాడు. ఓ బీమా ఏజెన్సీలో కూడా పనికి వెళ్తొస్తుంటాడు. కానీ పెద్దగా సంపాదించలేకపోతున్నాడు. అతను పాలు తాగటం మొదలుపెట్టి మూడువారాలు గడిచిపోయాయి.

భర్త 'ఇంక పాలుచాలు, ఇవ్వకు' అంటాడని ఎదురుచూస్తోంది లతిక. కానీ అతనసలు ఆ ఊసే ఎత్తందే!?

ఓ నెలతర్వాత పాలవాడు పాల బిల్లులో ఏడున్నర రూపాయలు ఎక్కువేశాడు. ఆ డబ్బు ఎలా కట్టాలో తెలీక పాపం లతిక అతలాకుతలం అవసాగింది. "ఇప్పుడిచ్చే పావులీటరు పాలు ఎక్కువ. ఈ నెలనుంచి వద్దులే. మొదట పోసినట్లుగానే పోయి.. చాలు" అంది.

గదిలో కూచుని ప్రూఫ్ చూస్తున్న వినోద్ ఈ మాటలు వింటూనే బైటికొచ్చి "ఊహు.. ఈ నెలలో కూడా పావులీటరు ఎక్కువ ఇవ్వు. అవి చాలా బాగున్నాయి. కాస్త నా ఒళ్లు కూడా బాగుపడింది"

"మీ బుర్ర పాడైందా ఏంటండీ? ఈనెల పాల ఖర్చు ఎక్కువైంది కదా? ఎక్కడ్నించి డబ్బు తేగలను? "అంది భార్య.

అతనికి కోపం ముంచుకొచ్చింది. "డబ్బు నువ్వేమైనా ఇస్తున్నావా? ఖర్చుగురించి ఎందుకాలోచిస్తున్నావు? రోజంతా నేను కష్టపడి పనిచేస్తున్నా ఓ చుక్కపాలివ్వడానికి నీకు ప్రాణం పోయిందా? "

"ఓ పావులీటరేం ఖర్మ! కావాలంటే ఓ శేరు తాగు. మీ జీతమంతా మీరే మింగండి. పాలు, మాంసం, పలావు అన్నీ మీరే పుచ్చుకోండి. మా ఖర్మాన మేం పడుంటాం"

"నా డబ్బు, నా ఇష్టం. ఇందులో నీదేంటి బోడిపెత్తనం? "

పొద్దున్నే వినోద్ పాలు తాగకుండా తిరగ్గొట్టినా, రాత్రి మాత్రం ఆ వేడిపాలు తాగకుండా ఉండలేకపోయాడు. పాలు తాగని ఆ పగలంతా.. తనసలు ఏమీ తాగనట్లు, తిననట్లు, అసలు జీవితంలోనే ఏదో పోగొట్టుకున్నట్లు ఫీలవ్వసాగాడు.

ఆ నీళ్లలాంటి పాలని అమృతంలా తాగేశాడు. పైన కొద్దిగా మీగడ తరక ఉంటే తినేశాడు. "రేపట్నుంచి నాకు రాత్రిళ్లే పాలు తెచ్చివ్వు" అని పురమాయించాడు.

కానీ ఆ రాత్రి పళ్లెంలో కేవలం రొట్టెలే కానీ పాలగ్లాస్ లేకపోవటంతో "పాలేవీ? " అని అడిగాడు.

"సునీల్‌కిచ్చా . తింటానికివ్వాళ ఓ చేప ముక్క కూడా లేకపోవటంతో, వాడు గొడవచేస్తే పాలు ఇచ్చా" బదులిచ్చిందామె.

కొన్ని రోజులు గడిచిన తర్వాత.. ఓ రోజు అతని కంచం దగ్గర పాలు పెట్టలేదు. "మరిది చేతికిచ్చా పాలు. జాబ్ కోసం వెళ్లి అన్నానికి చాలా లేటుగా వచ్చాడు. ఒట్టి అన్నం ఏం తినగలడని పాలలో కొద్దిగా పొడి నానేసి ఇచ్చా. అంటే కాస్త అన్నం తినగలిగాడు."

"సరే! వాడికి ఉద్యోగం దొరికిందా? "

"ఊహు.."

"ఇంకేం.. పాలు, ఆ తిండీ అంతా మింగబెట్టు. దొరుకుతుంది ఉద్యోగం!" అనేసి కూర, రొట్టెని కంచంలో వదిలేసి లేచిపోయాడతను.

మర్నాటినుంచి వినోద్‌కి పాల కప్పు పెడ్తోందామె.

"అబ్బ! సునీల్ మరీ దొంగ వెధవై పోతున్నాడండీ! చాటుగా పాలు తాగేస్తున్నాడు" అందో రోజు లతిక.

వాడ్ని వాయించేశాడు వినోద్. ఇక పాల జోలికెళ్లడనుకున్నాడు.

ఇంకొన్ని రోజులు గడిచాయి. కంచం దగ్గర పాలగ్లాసు మళ్లీ కన్పించకపోవటంతో "ఇవ్వాళ సునీల్ మళ్లీ దొంగతనంగా పాలు తాగాడా? దెబ్బలు తిన్నా సిగ్గులేదా? " అని అడిగాడు వినోద్.

మొహానికి కొంగు అడ్డం పెట్టుకుని నవ్వుతూ "ఊహు.. పక్కింటి తెల్ల పిల్లి తాగింది" అందామె.

కోపంగా అరిచాడతను "పక్కింటి పిల్లి పాలు తాగిపోతే నీకు నవ్వు వస్తోందా? ఇంత ఖరీదైన పాలు జాగ్రత్తగా దాచలేవూ? అవున్లే.. నువ్వేమన్నా డబ్బు సంపాయిస్తుంటే కదా విలువ తెలిసేది? "

ఇంకా బిగ్గరగా నవ్వుతూ అంది లతిక

"ఎన్నో రోజులనుంచి నాకు వంట్లో నలతగా ఉంటోంది. మధ్యాహ్నం వాంతి కూడా అయింది. సాయంత్రం బాగా ఆకలేసింది. పక్కింటి పిన్ని పాలు తాగమంది. నేనింకా తాగనేలేదు. ఇంతలో సునీల్ స్కూలు నించి వస్తూనే 'అమ్మా! నువ్వు దొంగతనంగా ఏం చేస్తున్నావు? అని అడిగాడు. వాడికీ కాస్త ఇచ్చా"

"సరే ఏదో ఏడ్చావులే. మరి పిల్లి తాగిందని అబద్ధాలెందుకు చెప్పావ్? "

తను పాలు తాగానని చెప్తే, భర్త కాస్త

హాస్యమాడ్తాడని అనుకుంది. కానీ అతను మండిపడటంతో, ఆమె రెచ్చిపోయింది "ఏం.. మీరు నెలలో ముప్పైరోజులూ తాగటంలేదూ? నేను ఒక్కసారి కూడా తాగకూడదా? "

వినోద్ చేతులు కడుక్కుంటూ అదోలా నవ్వాడు "నేను కాసిని పాలు తాగుతున్నానని నీకు కుళ్లు బుద్ధి"

"మీకు అస్సలు సిగ్గు శరం ఉందా? ఇంట్లో అందరి ముందూ పాలు మీరొక్కరే కుడితిలా తాగటం లేదూ? ఒక్కరోజు పాలు ఇవ్వకపోతే చిందులేస్తారా? "

"ఏం? నీ అబ్బ సొమ్ము పెట్టి పాలు తాగుతున్నానా? నా డబ్బుతో కొన్నవే తాగుతున్నా"

"అబ్బ! ఇంత రాత్రిపూట ఏంటి మీ కొట్లాట? " విజన్ అడిగాడు.

"మీ అన్నయ్య గిల్లికజ్జాలు విన్నావుగా? ఆకలేసి మధ్యాహ్నం కాస్త పాలు తాగినందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు"

"అబ్బ.. గొడవాపి వెళ్లి పడుకో వదినా!"

భార్యాభర్తలిద్దరూ ఆ రెండు చుక్కల పాలకోసం ఆ రాత్రంతా మూతి ముడుచుకునే ఉన్నారు.

"హు.. ఈ కొంపలోకి వచ్చిపడ్డాక నాకో అచ్చటా ముచ్చటా? చీరెలా? నగలా? తిండీ తిప్పలు లేక పడున్నా అడిగే నాథుడు లేడు" అని ఆమె గొణిగింది.

"ఇంకెంతసేపు నీ దరిద్రపు ఏడ్పు! ఒక్క నిముషం నన్ను ప్రశాంతంగా నిద్రపోనివ్వవా? " అని అతను అదిలించటంతో ఆమె ఏడ్పులంకించుకుంది.

తర్వాత ఆమెని కాస్త దగ్గరికి లాక్కుని "కాస్త పాల కోసం రాద్ధాంతం చేస్తావా? " అని బుజ్జగించబోయాడు.

"ఇంక చచ్చినా పాలు ముట్టను" అని శాంతపరిచాడు.

ఆ మర్నాడు పాలవాడు తెచ్చిన పాలు గబగబా కాచి భర్త ముందు పెట్టింది "ఇవాళ్టికి తాగండి. రోజంతా ఈ పాలకి కాపలా కాయలేను. ఎవరు ఎప్పుడు పాలని గుటకాయ స్వాహా చేస్తారో తెలీదు"

ఎడంచేతిని భార్యపై వేసి నవ్వుతూ ఆమె పెదాలకి పాలగ్లాసు అందించాడతను.

"నాకేం వద్దు"

"వదినా! టీ చేయటం ఇంత లేటా? " అంటూ గదిలోకొచ్చిన విజన్ తల తిప్పుకొని బైటికి పరిగెత్తాడు.

"ఇదిగోనోయ్ పాలు తాగు!"

"వద్దు వదినా! నువ్వు తాగు"

"ఉహూ తీసుకో"

మాట్లాడకుండా పాలకప్పుతో బైటికెళ్లాడు విజన్.

సునీల్ చాపమీద పుస్తకాలు పరుచుకు కూచున్నాడు. దొంగచూపులు చూస్తున్నాడు. అమ్మ, నాన్న, బాబాయి మాటలు విన్పడుతున్నాయి వాడికి.

ఫ్రెండ్ ఫటిక్ కూడా వాడితో కంబైండ్ స్టడీ చేస్తున్నాడు.

విజన్ వరండాలోకి వచ్చి సునీల్‌కి సైగ చేసి పిలిచి, పాల కప్పుని వాడి చేతికి అందించాడు.

"నువ్వు తాగులే బాబాయ్. నువ్వసలు ఎప్పుడూ పాలే తాగలేదుగా? "

"అరె తాగరా బుడిగి వెధవా! నువ్వు తాగితే నేను తాగినట్లే!" అంటూ సునీల్‌కి పాల కప్పు ఇచ్చాడు.

అంతలో..

పాపం.. నల్లగా, సన్నగా, ఎముకలు కన్పడ్తున్న ఫటిక్‌ని చూస్తూనే సునీల్‌కి జాలేసింది "ఒరే ఫటిక్! నోట్సు తర్వాత రాసుకుందువు. ముందు ఈ పాలు తాగు" అంటూ కప్పు అందించాడు.

వాడు బిడియంతో "నాకొద్దు లేరా! నువ్వే తాగు" అన్నాడు.

"పిచ్చాడా! నేను రోజూ తాగుతారా. ఈ రోజు నువ్వు తాగు. నువ్వు తాగితే నేను తాగినట్లే!" అన్నాడు సునీల్.

అమెరికన్ కథ

-ఎర్నెస్ట్ హెమింగ్వే

వంతెనపై వృద్ధుడు

అనువాదం : తెలుగుదాసు

స్టీల్‌ఫ్రేమ్ కళ్లజోడుతో ఉన్నాడా ముసలివాడు. మురికి దుస్తుల్లో ఉన్న అతను ఓ రోడ్డువార కూచున్నాడు.

నదిపైన వంతెన, దానిమీదనుంచే ట్రక్కులు, ఇతర బళ్లు పోతున్నాయి. స్త్రీలు, పురుషులు, పిల్లలు కూడా ఆ వంతెనపై నుంచే సాగిపోతున్నారు ముందుకి.

వంతెన దాటేక, నదికి బాగా ఏటవాలు ఒడ్డున కంచరగాడిదల బండ్లున్నాయి. అవి కష్టంమీద ఎత్తు ఎక్కుతున్నాయి. వాటితో ఉన్న సైనికులు బలం ఉపయోగించి, చక్రాలు ముందుకి కదలడానికి సాయపడుతున్నారు. ట్రక్కులు మాత్రం ఎటువంటి ఇబ్బందీ లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి.

వృద్ధుడు మాత్రం బెల్లంకొట్టిన రాయిలా ఏ కదలికా లేకుండా అక్కడే కూచొని ఉన్నాడు. బాగా డస్సిపోయి, ముందుకు సాగలేని స్థితిలో ఉన్నాడతను.

వంతెనమీద పచార్లుచేయడం నా బాధ్యత. వంతెన అంచుల్ని తనిఖీచేస్తున్నాను. శత్రువులు ఎంత ముందుకి చొచ్చుకు వస్తున్నదీ దృష్టి సారిస్తున్నాను. ఇక వంతెన పైనుంచి వెనుతిరిగాను. ఇప్పుడక్కడ ఎక్కువ బండ్లు లేవు. కాలినడకన వెళ్లేవారూ తక్కువమందే ఉన్నారు.

కానీ ముసలివాడు మటుకు కదలక మెదలక అక్కడే కూచున్నాడు.

"ఎక్కడ్నుంచి వచ్చేరు మీరు? " అడిగాను.

"సాన్‌కార్లోస్ నుంచి!" ముక్తసరిగా జవాబు చెప్పి ముసిముసిగా నవ్వాడు.

బహుశా అది ఆయన తండ్రికి సంబంధించిన నగరం అయివుంటుంది. అందుకే నగరం పేరు చెప్పడానికి ఎంతో సంతోషించేడు. పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "అక్కడ నేను పశువుల్ని మేపుతూ ఉండేవాణ్ని" అన్నాడు.

"ఓహో.. అలాగా" పూర్తిగా అర్థంచేసుకోకుండానే అన్నాను.

"పశుపోషణ గురించిన వ్యాపకంతోనే అక్కడ ఆగాను. ఆ నగరాన్ని విడిచిపెట్టిన చివరి వ్యక్తిని నేను!"

ఆ వృద్ధుడు మాత్రం పశుపోషకుడుగానో పశువుల కాపరిగానో కనిపించడం లేదు నాకు. ఒంటిమీద మాసిపోయిన ముతక దుస్తులున్నాయి. మొహంనిండా మట్టి. కళ్లకి మాత్రం స్టీల్‌ఫ్రేమ్ కళ్లద్దాలు. తనని చూసి అడిగేను "ఏం పశువులవి? "

"రకరకాల పశువులు" అన్నాడు. "నేను వాటిని విడిచిరావాల్సి వచ్చింది"

నా దృష్టి వంతెనమీదే వుంది. అక్కడ క్రమంగా కోలాహలం పెరుగుతూ వస్తోంది. అనుకోని సంఘటన ఏ క్షణం లోనయినా జరగవచ్చు.

ముసలివాడు మాత్రం అక్కడే కూర్చుని ఉన్నాడు.

"ఏయే పశువులుండేవి? " మళ్లీ ప్రశ్నించాను.

"ముచ్చటగా మూడు" చెప్పాడతను. " రెండు మేకలు, ఒక పిల్లి, నాలుగు జతల పావురాలు కూడా ఉన్నాయి."

"నువ్వు వాటిని అక్కడే విడిచివచ్చావన్న మాట"

"అవును! మరఫిరంగి సైన్యమే కారణం. ఆ సైన్యం కెప్టెన్ మమ్మల్ని పారిపొమ్మన్నాడు.. తరిమేస్తూ"

" నీకేం ఫర్వాలేదా? " దూరంగా వంతెనమీద దృష్టిని నిలిపి అడిగానతణ్ణి.

కొన్ని చివరి బండ్లు ఒడ్డునున్న అంచువేపు త్వరగా దిగిపోతున్నాయి.

"లేదు" అన్నాడా ముసలివాడు. "పశువుల గురించే నా చింత! ఫర్వాలేదు, పిల్లి బాగానే ఉండి ఉంటుంది, తన ఏర్పాటు అది చేసుకోగలుగుతుంది. మిగతావి ఎలా ఉన్నాయో నాకు తెలీదు"

"నువ్వే పార్టీ వాడివి? " అడిగాను.

"నాకే పార్టీ లేదు" అన్నాడు ముసలివాడు. "డెబ్బయ్ ఆరేళ్లు వచ్చాయి. పన్నెండు కిలోమీటర్లు నడిచి వచ్చేను. ఇహ నడిచే ఓపిక నాకు లేదు"

"ఆగడానికి ఇది అనువయిన చోటు కాదు" అన్నాను. " ఓపిక తెచ్చుకుని మీదకి వెళ్లు. అక్కడనుంచి తోర్తోసాకి వెళ్లే రోడ్డు రెండుగా చీలిపోతుంది. నీకు ట్రక్కు దొరుకుతుందక్కడ"

"కాస్సేపు ఆయాసం తీర్చుకుంటాను" అన్నాడు ముసలివాడు. "తర్వాతే బయలుదేర్తాను. ఇంతకీ ట్రక్కు ఎంతవరకూ వెళ్తుంది? "

"బార్సిలోన్ " అన్నాను.

"అక్కడ నాకెవ్వరూ తెలీదు" అన్నాడు ముసలివాడు. "కానీ.. మీకు మరీ మరీ


ధన్యవాదాలు"

ముసలివాడు అలసి సొలసిన రీతిలో నిరాశగా నావేపు చూశాడు. తర్వాత తనలో తానే.. కష్టంధ్వనించే కంఠంతో గుసగుసలాడాడు "పిల్లి ఎలాగో సంబాళించుకుంటుంది. ఆ నమ్మకం నాకుంది. దాని గురించి చింతేం లేదు నాకు. కానీ మిగతా పశువుల గురించి మీ అభిప్రాయం ఏమిటి? "

"ఎందుకు? బహుశా అవి కూడా ఈ ఇబ్బందినుంచి బయటపడవచ్చు"

"మీరింకా అలా ఆలోచిస్తున్నారా? "

"ఎందుకు కాకూడదు? " ఆ అంచువేపు





చూస్తూ అన్నాను. అక్కడ ఒక్క బండి కూడా లేదు.

"నన్ను తరిమేశారంటే కారణం.. ఫిరంగిశాలే. మరిఅక్కడే ఆ ఫిరంగిశాల దగ్గరే ఆ పశువులెలా ఉంటాయ్? "

"అయితే మీరు ఆ పశుశాలనో లేదా పంజరాన్నో తెరిచి ఉంచేసి వచ్చేశారా? " అడిగాను నేను.

"అవును"

"అప్పుడవి ఎగిరిపోయివుంటాయి కదా!"

"అవును, ఎగిరిపోయి ఉంటాయి. అయితే మిగిలినవో? వాటి గురించి ఆలోచించకపోవడమే మంచిది" ముసలివాడు అన్నాడు.

"మీరు తేలిగ్గా గాలి వీల్చుకుంటున్నారు కదూ. మరైతే నేను వెళ్ళిరానా? " అడిగాను. "లేచి మెల్లగా నడిచే ప్రయత్నం చేయండి " అని కోరాను.

"ధన్యవాదాలు!" అనేసి ముసలివాడు లేచి నిలబడ్డాడు. తన ఆధీనంలో తను లేడు కాబట్టి తిరిగి ఇసుకలోనే చతికిలబడ్డాడు. "నేను పశువుల్ని మేపే వాణ్ని మాత్రమే!" తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా అన్నాడు.

అంతకుమించి నేను చేసిందేమీలేదు.

తనకెలాంటి సాయమూ అందలేదు. ఈస్టర్ సండే రోజు. ఫాసిస్టు సైన్యం ఇబరో దిశగా సాగిపోతోంది. వాతావరణం మసకమసకగా ఉంది. తేలికపాటి మేఘాలున్నాయి ఆకాశంలో. వారి షిప్ ముందుకి సాగటం లేదు.

అవి.. ఆ పిల్లులు? తమ మంచి చెడ్డల్ని అవే చూసుకోగలవు లెండి!

అదృష్టం! పరిస్థితి ముసలివాడికి అనుకూలంగానే ఉంది.

V

తెలుగు కథ -జోసెఫ్



కడిగిన ముత్యం

శీతాకాలం.

పొద్దు పొడిచినట్టుగానే ఉంది.

అయినా.. సూర్యోదయం కనిపించడం లేదు.

ఆకాశంలోని తెల్లటి మేఘాలన్నీ భూమ్మీదే వాలినట్టుగా అక్కడి పరిసర సర ప్రదేశమంతా దట్టమైన పొగమం చుతో కప్పి ఉంది.

ప్రకృతి దేవతని ప్రస్తుతిస్తూ పాడే 'ప్రభాతగీతం' కాబోలు.. అక్కడక్కడ పక్షుల గుంపులు పల్లవులు అందుకొంటు న్నాయి. ఆగి ఆగి వినవస్తున్నా.. రిహా ర్సల్స్ చేసే 'గాయక బృందగానం'లా వాటి అరుపులు లయబద్ధంగా, వీనుల విందుగా ఉన్నాయి.

అప్పుడే విచ్చుకున్న అడవి మల్లెలు కొన్ని.. 'మాకూ ఉన్నాయి.. దరహాసాలు' అన్నట్లు తమలో తామే నవ్వుకొంటు న్నాయి.

ఇలాంటి ఉషోదయాలు ఎంతో ఆహ్లాద కరంగా ఉంటాయి.

ఎంతటి బరువైన మనసులనైనా ఇట్టే తేలికపరుస్తాయి.

బహుశా అతని మనసు అదే కోరుకుం దేమో.

అందుకే అతడు ఇటువైపు వచ్చాడేమో.

ప్రస్తుతం అతడు ప్రకృతి ఒడిలోనే సేద దీరుతున్నాడు.

అతడు ఒక పూరిగుడిసెలో పడుకొని ఉన్నాడు. మెలకువ వచ్చి చాలాసేపే అయినా.. అతడింకా కళ్లు తెరువలేదు. నిజానికి అతడీ సమయంలో గాఢనిద్రలో ఉండాల్సినవాడు. రాత్రి నాలుగోజాము దాకా వంగతోటకు, వరిమళ్లకు నీళ్ళుకట్టి బాగా అలసటమీదున్నాడు. అయినా.. పడుకున్న రెండు గంటలసేపయినా కంటి నిండా నిద్రపోయింది లేదు. ఆ మాట కొస్తే.. గత మూడురోజులుగా అతడి పరి స్థితి ఇలాగే ఉంది. అందుక్కారణం.. పొలానికి నీళ్లు పెట్టడం కాదు.. అతని మనసంతా విచారంతో నిండి ఉండటం. మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన ఒకటి అతని మనసుని కకావికలం చేసింది. అతని ఆలోచనలన్నీ ఆమె చుట్టే పరిభ్రమిస్తున్నాయి. పడుకున్నా, లేచినా అతడికి.. సిరి ఒళ్లే గుర్తుకు వస్తోంది.

★ ★ ★

రాత్రి పన్నెండు గంటల నుండి నిరాటం కంగా నీళ్ళు కొడుతున్న పంపుసెట్టు ఉన్న ట్టుండి ఆగిపోవటంతో అతడికి మౌన భంగం కలిగినట్లయింది. 'సమయం ఆరు గంటలు అయ్యిందనే' స్పృహ తట్టగానే అయిష్టంగానే పైకి లేచాడు.. నులకమం చంలో నుండి. తను కప్పుకొన్న కంబళితో పాటు అలాగే మంచం దిగి, ఒక బలహీ నమైన ఆవలింపుతో పూరిగుడిసెలో నుండి బయటికి నడిచాడు. పొగమంచుతో నిండి ఉన్న ఆ చిత్రమైన వాతావరణం అతడి మనస్సును ఆకర్షించలేక పోయింది. వంగ తోటని, వరిమళ్లని కలియతిరిగి చూశాడు.

'పంపుసెట్టు నీళ్ళు నిండుగా కొట్టకపోయినా పొలాన్ని కావాల్సినంత తడిపింది' అనిపించి తృప్తిగానే వెనుదిరిగాడు. గుడిసె దగ్గరికి వచ్చి అక్కడున్న పాకెట్ రేడియో, టార్చిలైటు చేతుల్లోకి తీసుకుని ఊరివైపు నడక ప్రారంభించాడు. రాత్రంతా అతన్నే అంటిపెట్టుకుని ఉన్న పెంపుడు కుక్క అతన్ని అనుసరించింది. అలా కాస్తదూరం వెళ్ళగానే అతని పాదాలు పూర్తిగా తడిసిపోయాయి. దారెంట పచ్చికబయళ్ళని అంటి పెట్టుకుని ఉన్న మంచు బిందువులు అతని అడుగుల తాకిడికి చిట్లిపోతున్నాయి.

"సెంద్రం బాబూ"- ఉన్నట్టుండి ఎవరిదో గొంతు వినిపించింది. అప్పటికి ఆన్ చేసి ఉన్న రేడియో వాల్యూమ్ కాస్త తగ్గించి చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు.

"ఆగబ్బయా... నేనూ వొశ్చాండా" - మాటలు వినిపిస్తున్నాయి గాని మనిషి కనిపించడంలేదు.

దట్టమైన పొగమంచులో సుబ్బయ్యను పోల్చుకోలేకపోయాడు రామచంద్రం. అతనికి కాస్త ఆశ్చర్యమనిపించింది. 'ఇంతటి పొగమంచులో తను మాత్రం నన్నెలా గుర్తుపట్టగలిగాడు?' అనిపించింది. అదే విషయం అడిగాడు.. అతడు దగ్గరగా వచ్చాక.

"పాకెట్టు రేడియో ఎంటేస్కొని దిరిగే మడిసి నువ్వుగాక ఇంకెవరుండారబ్బయా మన ఊర్లా?"- రామచంద్రానికి ఉన్న ప్రత్యేకతని ఎత్తిచూపాడు సుబ్బయ్య.

"అవునూ ఎన్నడూ లేంది నీవేందబ్బయా.. ఇట్లా పొలం గట్లెంబటవడి తిరుగుతాండవు ఆశ్చెరియంగా ఉండాదే!?" అప్పుడే అంటించిన బీడీ పొగని గుప్పు గుప్పున వదులుతూ అన్నాడు సుబ్బయ్య.

"నాన్నకి ఒంట్లో బాగోలేదంటేను తోటకి నీళ్లు గట్టేదానికి వొచ్చినాలే సుబ్బయా" - ముక్తసరిగా సమాధానమిచ్చాడు రామచంద్రం.

"ఏందబ్బయా నీవనేది? మీ నాయినకు ఒళ్ళు సెడినాదా? ఇది మరీ ఆశ్చెరియంగా ఉండాదే!?" చలికి ఒణుకు పుడుతున్నా నవ్వడానికి ప్రయత్నించాడు సుబ్బయ్య.

అతని మాటల్లో కాస్త వ్యంగ్యం ఉన్నా.. నిజం కూడా లేకపోలేదు. రామచంద్రం తండ్రి గట్టయ్య పేరుకు తగ్గ మనిషే, తన ఈడు వారందరికీ ముసలితనం మీద పడినా.. తను మాత్రం ఇంకా గట్టిగానే ఉన్నాడు. ఒళ్లు మెత్తబడటం, వెంట్రుకలు తెల్లబడటం లాంటి శారీరక మార్పులేవీ ఇంకా అతనిలో చోటుచేసుకోలేదు.

"అది సరేగాని.. అబ్బయా.. నీవేమీ అనుకోనంటే నిన్నోటి అడుగుతాను సమాధానం సెప్తావా?" విషయమేదో రాబట్టాలనే ఆసక్తి అతని మాటల్లో ధ్వనించింది.

ఒక చేతిలోని టార్చిలైటు మరొక చేతిలోకి మార్చుకొంటూ.. "ఏందది.. సిరి గురించేనా?" సూటిగా అడిగాడు రామచంద్రం.

"నిజంగా నువ్వు తెలివైనోడివేనబ్బయా.. ఎదుటోళ్ల మనసుని ఇట్టే పసిగట్టేశ్చావు" విప్పారిన కళ్లతో ప్రశంసాపూర్వకంగా ఉన్నాయి అతని చూపులు.

కానీ, సిరివల్లి గురించి మాట్లాడటం రామచంద్రానికి ఎందుకో ఇష్టంలేదు. నిజానికి అతడు మాట్లాడాలి. తనేంటో తనకు సిరివల్లికి ఉన్న సంబంధం ఎలాంటిదో ఒక్క సుబ్బయ్యకు మాత్రమే కాదు ఊరి జనానికందరికీ తెలియాలి. కులమతాల పట్టింపులు లేకుండా, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఊరు ఊరంతా తనమీద చూపించే ప్రేమాభిమానాల కోసమైనా తను మనసు విప్పి మాట్లాడాలి. ఊర్లో ఉన్న సందేహాలను, సంశయాలను తొలగించాలి. అది అతని కనీసబాధ్యత కూడా. కానీ, మొన్న జరిగిన సంఘటన ప్రభావమేమో అతని మనసు మూగవోయింది.



“ఆ విషయం ఇప్పుడెందుకు అడుగుతావులె సుబ్బయా” నిరాసక్తిగా అన్నాడు రామచంద్రం.

సుబ్బయ్యకు నోటమాట రాలేదు. అది అతడు ఊహించని సమాధానమే. ఎందుకంటే, అడిగితే చాలుగానీ ఏవిషయన్నైనా కప్పిపెట్టే మనిషి కాదు రామచంద్రం. అతని మీదున్న ఆమాత్రం నమ్మకంతోనే చొరవ తీసుకున్నాడు సుబ్బయ్య.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

రామచంద్రం ఇంకా ఆ బాధలోనుండి తేరుకోలేదనిపించింది సుబ్బయ్యకు. బయటికి చూడటానికి బాగానే ఉన్నా లోలోన మాత్రం నలిగిపోతున్నాడనిపించింది. ఎందుకో తనకు తెలియకుండానే అతనిపై జాలి లాంటి భావమేదో ఏర్పడింది.. సుబ్యయ్య మనసులో. అంతేకాదు ‘సిరివళ్ళిని అతడు అనుమానిస్తున్నాడేమో’ అనే సందేహం కూడా కలిగింది. జరిగిన విషయం అలాంటిది మరి.

ఆ ఆలోచన తట్టగానే సుబ్బయ్య మనసు చలించిపోయింది. చివరి దమ్ము గట్టిగా లాగి బీడిముక్కను పడేశాడు సుబ్బయ్య. రామచంద్రానికి ఏదో చెప్పాలనిపిస్తోంది. సిరివళ్ళి గురించి రెండుమాటలు మాట్లాడాలనిపిస్తోంది. కానీ, ఏం చెప్పాలో ఎలా చెప్పాలో పాలుపోవడం లేదు.

అయినా అతడు తన మనసుని కట్టిపెట్టలేదు. ధైర్యంచేసి మరింత చొరవ తీసుకోక తప్పలేదు.

“సర్లే అబ్బయా.. నీకు ఇష్టం లేకపోతే సెప్పొద్దులే. కానీ, అబ్బయా.. ‘ఈ మొరటోడు నాకేంది సెప్పేది’ అనుకోనంటే నేనే ఓ మాట సెప్తాను”- అంటూ అతని సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండానే తన ‘మాటల మూట’ను విప్పాడు సుబ్బయ్య.

“అబ్బయా.. మీ గురించి నాకేమి తెలియదనుకోకండి. తెలుసును. అంతా తెలుసును. సిరివళ్ళి మీంద తమరు మనసుబడినారని తెలుసును. ఆయమ్మికోసం తమరొక సమయంలో పేణాలివ్వడానిక్కూడా సిద్దపడినారని తెలుసును. కానీ, ఆ ఎంగ్రెడ్డి న్నాయాల జేసిన నిర్వాకానికి తమరి మనసు ఇరిగిపోయినాదని కూడా నాకు తెలుసును. అందుకే సెప్తాండానబ్బయా.

అబ్బయా.. మీకు మల్లే నేను నాలు గాకులు సదివినోన్ని గాకపోవొచ్చును. నాలుగు దిక్కుల దిరిగినోన్ని గాకపోవొచ్చును. కానీ, అబ్బయ్యా.. ఎంత ఏలిముద్రగాళ్ళమైనా.. మాకూ ఇంత మనసనేది ఉండాది. మంచి సెడులను ఇచారించుకొనే గ్యానం ఉండాది.

అబ్బయా.. మొదట్ల మీ గురించి ఇన్నప్పుడు అందరిలానే నేనూ ఒగింత ఆశ్చెరియపడినాను. ‘అందరూ ఒగ బాటెంట నడుస్తా ఉంటే ఈయనేంది ఇంగోబాట వట్టినాడు’ అనుకొన్యా. ‘ఇన్ని సదువులు సదివినోడు ఒక పల్లెటూరి పిల్లకోసరం ఇంతగా పడి సచ్చుడేంది? ’ - అని నాలో నేనే నవ్వుకొన్యా. కానీ అబ్బయా మీ గురించి కాసింత నిలకడమీంద దెలుసుకొన్యా. ‘మీకు మర్లు బుట్టింది మాములు పల్లెటూరిపిల్ల మీంద కాదు, అచ్చు.. సీతామాలచ్చిమంటి గుణమంతురాలిమీంద’ అనే నిజం దెలుసుకొన్యా.

అబ్బయా.. మీ మనుసు గొప్పది. మీ తెలివి గొప్పది. మీకు జెప్పేటంతటోన్ని గాదు నేను. కానీ, అబ్బయా.. అట్లాంటి అమ్మణ్ణి తమరు ఎక్కడ ఎడబాస్తారోననే దిగులుకొద్దీ సెప్తా ఉండ. అబ్బయా.. ఆయమ్మిని వొదలకండి. ఆయమ్మి సేయి ఇడువకండి. అట్లాంటి అమ్మణ్ణి ఇంతవరకు నేను ఎక్కడా సూడలేదు. అట్లాంటి నిఖార్సైన ఆడపడుచు ఈ సుట్టుపక్కల ఊర్లల్లా యాడా నాకంటవడలేదు. మడిసి మాత్రమే గాదబ్బయా.. ఆయమ్మి మనసు గూడా కడిగిన ముత్యమే.

అబ్బయా.. ఆయమ్మి గురించి తమరు ఎట్లాంటి దిగులెట్టుకోకండి. ఆయమ్మి తమరిదే. తమిరి కోసమే బుట్టినాది. అంతేగాదబ్బయా.. ఆయమ్మి మనసులో గూడా తమరే ఉండారు. మనసులో గాదబ్బయా.. ఆయమ్మి పంచపేణాలన్నీ మీ మీందనే ఉండాయి. అబ్బయా.. నిన్న జరిగిన సంగతే సెప్తాను ఇనండి..

నిన్న మధ్యాన్నపుటేల అటేపెల్లిన. ఆళ్ళ నాయినతో సిన్న పని బడిండేలే. ఆయమ్మి పొయికాడ గూకోని సుట్లూ అవీ ఏస్తా ఉండె. “ఏందమ్మీ సిరివళ్ళీ.. ఏం జేశ్చుండావేంది? ” అంటా లోనికి తొంగి జూస్తి. నన్ను సూడంగనే ఆయమ్మి మొగం ఎలిగిపాయ.

“రా సిన్నాయినా.. ఏందే ఇటేపు రాడమే మానేసినావు. మమ్ముల మరిసినావా ఏంది? ” అంటా.. బేగినె లేసి ఆ పక్కనున్న సెక్కకుర్సీ దెచ్చి కూసోమనె. అప్పటికే సగానికి పైన నిండిన సుట్లబుట్టలకెల్లి ఓటి దీసి రుచిసూడమన్నట్లు నా సేతికందించె. ఎందుకో అబ్బయా.. ఉన్నట్లుండి అప్పుడు నీవే గుర్తుకొచ్చినావు. ఆయమ్మి మనసేందో సూద్దామనిపించి నేనోమాటంటి.

“ఎంత అదురుష్టమంతురాలివమ్మీ నీవు.. నీ పాటి అదురుష్టెం నీ తోటోళ్ళకు ల్యాకపాయ గదా!” అంటి.. సుట్లముక్కల్ని నములా్త. అందుకాయమ్మి ఎంటనే.. “ఎందుకు.. ఎనకాముందు ఎవురూ లేకండా ఏకాకిగా పుట్టినందుకా? ” అనె.

అబ్బయా.. ఆయమ్మి ఏం మాట్లాడినా అట్లానె ఉంటాది. సూటిగా ఉంటాది. అచ్చం ఆలమ్మ మాట్లాడినట్లే ఉంటాది. పాపం.. ఆ మహాతల్లి రాజెమ్మ బతికుంటే

ఈయమ్మికిట్లా కష్టాలుండనిచ్చేది గాదు. ఈయమ్మి సదువు మధ్యల్నె ఆగనిచ్చేది గాదు. మీ అంత గాకపోయినా గొప్పగానే సదివించుకొనేది. అబ్బయా.. ఆయమ్మెప్పుడూ ఒగ మాటంటా ఉండేది.. "మన బతుకులు మారాల్నంటే.. మన జీవితాళ్ళ ఎలుగు రావాల్నంటే.. మన పిల్లల్నైనా.. బడిలో సేర్పించాలా. 'అది ఆడపిల్లా ల్యాక మొగపిల్లోడా' అంటా తేడాలే సూడొద్దు" - అంటా ఉండేది. ఆయమ్మ బతికుంటే.. ఈయమ్మిని మహారాణిలా సూసుకొనేదనుకో. ఇట్లా.. కొడువండ్లు సేతవట్టి సేలంబట సెలకలెంబట ఎల్లే ఖర్మం వట్టేదిగాదు. సూరయ్యను గూడా పటేండ్ల సేతి కిందా ఉండనిచ్చేది గాదు. అబ్బయా.. కులానికి తక్కువగావొచ్చును గానీ.. ఆయమ్మకున్న గుణం యాకాపులకి ల్యా, యా కర్ణాలకీ ల్యా. అచ్చు ఆయమ్మ గుణమే ఈయమ్మికి అబ్బినాదనుకో.

"ఎవురూ ఉంటే ఏంది లేకుంటే ఏందమ్మీ.. రామసెంద్రం ఒక్కడుంటే సాలదా నీకు? " అంటి కాస్త బెయపడతానె. అప్పుడాయమ్మి వాలకం సూడాల.. సేతిలో ఉన్న సుట్లపావుని ఠపీమని న్యాలకేసి గొట్టి.. నావొంక గుర్రుగా జూస్తా..

"సంతోషించినాములే. అందుకే గదూ.. ఆ ఎంగ్రలెడ్డిన్నాయాల నా సెయ్యిబట్టి ఈయాల్టికి మూడొద్దులైనా.. ఇంగా అన్ని నిలదీసేదానికి లేకండా ఉన్నేడు. రామసెంద్రమంట రామసెంద్రం" - అంటా.. సగం దాంక కాలిన కట్టెల్ను కోపంగా పొయిలకు ఎగదోస్తా.. మల్లా ఇట్లనె.. "మనిషన్నంక ఇంత మానం మర్యాదల నేయి ఉండాల. అట్లా మొగం సాటేస్కోని దిరగడం గాదు" అంటా రుసరుసలాడె.

"కనీసం.. నా కోసం ఎదురుజూసె ఒక ఎర్రిబాగుల్డి ఉండాది. అదెట్లా ఉండాదో సూద్దామనె ద్యాస గూడా లేకండా ఉన్నేడు సూడు" అంటా.. తల దించుకొని మొవునం దాల్చె.

"అతడు మాత్రం ఏం జేశ్చాడమ్మీ.. నీకు తాళిగట్టినోడా, నీ ఏలువట్టి నడిసినోడా. కనీసం.. నీ కులపోడన్నా గాకపాయ. నిన్నెట్లా ఎనకేసుకొంటాడు? " అంటా సెప్పాలనిపించె. గాని.. నోటి దాంక వొచ్చిన మాటను బెయిటికి గక్కలేక పోతిని.

ఇంతట్లా.. ఉన్నట్లుండి ఆయమ్మి వాలకంలా షానా తేడా వొచ్చె. మాటామంతి లేకండా.. మరింత మొవునంగా కూసుండిపాయ. ఏందో ఆలోచించేదానిలా ఎదురుంగున్న గోడకేసి సూశ్చా ఉండిపాయ. ఆయమ్మి కండ్లు ఎర్రంగా మారిపాయ. మొగమంతా కందినట్లుగా మారిపాయ. కండ్ల నిండా నీళ్లు దిరిగి సెక్కిండ్ల మీందకు జారుతా ఉండాయి.

అబ్బయా.. ఆయమ్మిని నేనెప్పుడూ అట్లా సూసి ఎరగను. ఇంతట్లా.. ఆయమ్మి రయ్యిన లేసి నా కాళ్ళమీంద వాలిపోయి బిగ్గెరిగా ఏడుపందుకొనె..

"ఎట్లా ఉన్నాడే ఆడు? యాడ ఉన్నాడె నా రామసెంద్రుడు? ఆన్నొకసారి నా కంట్లవడమని సెప్పవే.. నీకు దండంబెడతాను. అయ్యో.. నేనెంత పాపిష్టిదానిరా భగవంతుడా. మా అయ్య జెప్పిన మాట ఇనకపోతిని. ఆ మొదనష్టపు ముండాగొడుకుల సెలకండ్లకు ఎల్లొద్దంటే మానకపోతిని. కూలి గింజలకు ఆశపడి ఆ రాక్షసుని కంట్లవడితిని. ఆడి సెయ్యిదగిలి మైలవడితిని. అయ్యో.. నా కెట్లాంటి రాత రాసినావుగదరా దేవుడా. నా రామసెంద్రున్ని నాకు గాకుండా జేసినావుగదరా దేవుడా. నా రామసెంద్రున్ని నాకు ఎడబాపినావు గదరా దేవుడా. ఇంగ నేనెవరి కోసం బతకాలె. ఎందుకోసం బతకాలె? " అంటా.. బిగ్గెరిగా ఏడుస్తా ఉండాది.

సంటిపిల్ల మాదిరి ఏడుస్తా ఉండాది. నా కండ్లంబట నీళ్లుగారడం ఎప్పుడు



మొదలైనాదో నాకు దెలిసినాది గాదు. ఆయమ్మికి సెప్పేదానికి లేకండా, ఓదార్సే దానికి లేకండా నేను గూడా ఆయమ్మితో బాటు ఏడుస్తా ఉంటి.

ఈ మాటలు అంటున్నప్పుడు రామచంద్రం కళ్ళల్లో నీళ్ళు తిరగడం సుబ్బయ్య గమనించలేదు.

చెమ్మగిల్లిన కళ్ళని తడుముకొంటూ దగ్గ స్వరంతో సుబ్బయ్య ఇంకా ఇలా అంటున్నాడు..

"అబ్బయా.. నేను సెప్తాండ. నీ తండ్రి లాంటోన్ని సెప్తా ఉండ. అబ్బయా.. ఆయమ్మి నిప్పు. ఆయమ్మి బంగారం. ఆయమ్మి దేవత. అబ్బయా.. ఆయమ్మిని ఇడువకు. ఎట్లాగైనా ఆయమ్మిని నీ దాన్ని జేసుకో. నీ ఇంటిదాన్ని జేసుకో. ఈ మాట

నా ఒక్కందే గాదబ్బాయా.. ఊరి జనమం దరి మనసుల్లోనూ ఇదే ఉండాది. మీరి ద్దరూ ఒక్కటైతే సూడాలని ఉండాది. అందరూ అదే కోరుకొంటాండరు. అబ్బాయా.. జరిగిందంతా మర్సిపో.. ఆయమ్మిని నీదాన్ని జేసుకో అబ్బాయా.. ఆయమ్మి నీ కోసమె ఎదురుజూశ్చా ఉండాది. ఎయ్యికండ్లతో ఎదు రుజూశ్చుండాది. పాపం తల్లిలేని పిల్ల. ఒక్కసారి ఆయమ్మి కంట్లవడు. ఆయ మ్మిని బాధవెట్టకు. నీవు బాధవడకు. అబ్బాయా.. నేనేమన్నా తప్పుగా మాట్లా డుంటే, నీ మనసుకి కష్టెం కలిగించి ఉంటే మన్నించాల" -అంటూ సుబ్బయ్య తన దారిన తను వెళ్ళిపోయాడు.

★ ★ ★

సుబ్బయ్య సుదీర్ఘమైన మాటలకు అవాక్కైపోయాడు రామచంద్రం.

అతని మనసు ద్రవించిపోయింది. సుబ్బయ్య తన గురించి ఇంత ఆలోచన కలిగి ఉంటాడని అనుకోలేదు రామ చంద్రం. ఊర్లో ఎప్పుడైనా ఎదురువడి కని పిస్తే.. 'ఏందబ్బాయా ఎట్లా ఉండావు? పట్నం కాన్నించి ఎప్పుడొచ్చినావు?' అని పలకరింపుగా మాట్లాడేవాడు. ఒకసారి మాత్రం 'ఏందబ్బాయా.. ఇంగా ఎంత కాల మని అట్లా సదువుతావోతారు? అక్కన్నే పట్నంలో మంచి గుంటని జూస్కొని పెండ్లి జేసుకోండబ్బాయా. ఏ వొయిసులో జరగాల్సిన ముచ్చట ఆ వొయిసులో జర గాలంటారు గదా?' అంటూ.. కాస్త చనువు చూపించాడు. ఆ తర్వాత అతనె ప్పుడు రామచంద్రంతో కల్పించుకొని మాట్లాడింది లేదు. ఉన్నట్టుండి తన గురించి ఇంత చనువుగా, ఇంత ఆత్మీ యంగా మాట్లాడుతాడని అస్సలు ఊహిం చలేదు రామచంద్రం. ముఖ్యంగా.. సిరివళ్ళి గురించి ఇంత గొప్పగా, ఇంత నమ్మకంగా, ఇన్ని మాటలు మాట్లాడుతా డని బొత్తిగా ఊహించలేదు.


బహుశా.. సిరివళ్ళి మీద తనకున్న నమ్మకాన్ని మరింత బలపరిచాడేమో సుబ్బయ్య.. ఉన్నట్టుండి రామచంద్రం ముఖంలో కొత్త తేజస్సు వెల్లివిరుస్తోంది.

పొగమంచుని చీల్చుకుని వస్తున్న భానుడి బంగారు కిరణాలు అతని ముఖ వర్చస్సుని మరింత కాంతివంతం చేస్తు న్నాయి.

వెచ్చటి సూర్యకిరణాల తాకిడికి ఆవిరై పోతున్న పొగమంచులాగే.. అతనిలో అంతదాకా ఉన్న అల్లిబిల్లి ఆలోచనలన్నీ.. మెలమెల్లగా అదృశ్యమైపోతున్నాయి.

అతని మనసు నెమ్మది పడుతోంది.

హృదయం కుదుటపడుతోంది.



అంతిమ ఘడియలు

అనువాదం : కర్నాటి నాగభూషణం

కాశీ నగరం నుండి తిరిగొచ్చాక నేను అవ్వ ఇచ్చిన రెండుఖాళీ పోస్టుకార్డులు బయటికి తీశాను. వాటిపై అవ్వ మరణించిన తేదీతో పాటు, ఇకనుండి ఆమె కోసం డబ్బు పంపాల్సిన అవసరం లేదని కూడా అవ్వ కొడుకులకు సమాచారం రాశాను. అంతేకాదు, అది రాసేటప్పుడు వాళ్ళ తల్లికి నేనే తలకొరివి పెట్టానని కూడా వివరించాను.

అవ్వ ఇద్దరి కొడుకుల పేర్లమీద రాసిన ఆ కార్డుల్ని పోస్టుబాక్స్‌లో వేశాక, నాడైరీ తెరిచాను. అప్పటికి మేమింకా భయం భయంగానే ఉన్నాం. భూముల ఆందోళనకి సంబంధించిన దస్త్రాలకట్ట మాదగ్గర ఉంది. దాన్ని గమ్యం చేర్చాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే అవ్వ మాకు పరిచయం అయింది.

పోలీసు కానిస్టేబుళ్లు మమ్మల్ని వెంటా

డుతూనే ఉన్నారు. బాగా ఇరుకు సందుల్లో మమ్మల్ని మేము కాపాడుకుంటూ పరుగు పెడుతూనే ఉన్నాం. వీధి మలుపులు ఇరుకుగా ఉండడంతో పోలీసులకు పరిగెత్తడంలో ఇబ్బంది వుండి మమ్మల్ని పట్టుకోలేక పోతున్నారు. అయినా మాలో భయం పెరుగుతూనే ఉంది.

ఒక ఇంటి మాటున దాగి, ఇంకా పోలీసులు మమ్మల్ని వెంటాడుతున్నారా, లేదాని గమనించాలనుకున్నాం. ఆ వీధి సందులో వాళ్ల అడుగుల ధ్వని వినిపించడం లేదు. అయినా పోలీసుల కుయుక్తులకి బాగా అలవాటు పడిన మేము ఏ మాత్రం ఏమరుపాటుకు తావివ్వొద్దని, చెవులు మరింతగా రిక్కించి అప్రమత్తంగానే వున్నాం.

కొద్దిసేపు ఆ ఇంటి గోడ చాటునే నిలబడి కొంచెం ఊపిరి తీసుకున్నాం. ఆ చోటునుంచి వీధిలోకి తిరిగొద్దామనుకుంటుండగానే, ఎదురుగా ఉన్న ఇంటి తలుపు తెరుచుకుంది. ఒక ముసలామే వంగిపోయి నడుస్తూ ఖాళీ బిందెతో బయటికి వచ్చింది. సరిగ్గా గుమ్మంకెదురుగా మమ్మల్ని చూసి గభాల్న అక్కడే ఆగిపోయి, వణుకుతున్న గొంతుతో అడిగింది. “ఎవరు మీరు? ఇక్కడెందుకు నిలబడ్డారు? ”

“అవ్వా, మేము దారి మరిచిపోయాం. మాది ఈ ఊరుకాదు. మా పెద్దమ్మ ఇక్కడే ఎక్కడో ఉంటుంది. ఆమె ఇల్లే వెతుకుతున్నాం. చీకటిపడిందిగా. ఇప్పుడు ఎలా వెతకడమాని ఆలోచిస్తున్నాం”

“అలాగా..అయితే ఈ రాత్రికి నా ఇంట్లోనే ఉండండి. తెల్లారాక ఆమె ఇల్లు వెతుక్కోవచ్చు. ఇంత చీకట్లో ఎక్కడని వెతుకుతారు? పక్కనే ఉన్న కొళాయి నుంచి నీళ్ళు పట్టుకొస్తాను. కావాలనుకుంటే నా ఇంట్లోకి వెళ్ళి కూచోండి.”

“అవ్వా, నీళ్ళు ఎక్కడ్నుంచి పట్టుకు రావాలో చెప్పు. మేం తీసుకొస్తాం.”

మేము అవ్వ చేతిలోంచి బిందె తీసేసుకున్నాం. అయితే ఆమె చూపించిన దారి, ఇంతకుముందు మమ్మల్ని పోలీసులు వెంటాడుతూ వచ్చిన వీధిలోనే ఉందా కొళాయి. కొంపదీసి వాళ్ళింకా అక్కడే కాపుకాస్తూ ఉండొచ్చు. మేము ఏ సందులోంచయినా బయటపడొచ్చని. అలాంటప్పుడు మేము సులభంగా పట్టుబడిపోతాం. ఆ ఊహ మమ్మల్ని భయకంపితుల్ని చేసింది.

బిందె మా చేతికిచ్చి, అవ్వ ఇంట్లోకి వెళ్ళింది. తలుపు మా కోసం తెరిచే ఉంచింది. కొద్దిసేపు అక్కడే నిల్చుని ఆలోచించసాగాం. ఆ వీధి మలుపు తిరిగి నీళ్ళ కోసం వెళ్లదలుచుకోలేదు. మరి ఎక్కణ్ణించి వస్తాయి. మేం ఆలోచించాం. రెండు మూడు ఇళ్ళు దాటి ఏ ఇంటి తలుపయినా తట్టి నీళ్ళు అడుక్కురావాలని అనుకున్నాం. అదే పనిచేసి నీళ్లు తీసుకొచ్చాం. అవ్వ ఒక గిన్నెలో బియ్యం కడుగుతోంది. పక్కన కిరోసిన్ స్టవ్ ఉంది. ఆ గదినంతా పరికించి చూశాం. గది మామూలుగానే ఉంది. రెండు వైపుల పెద్ద పెద్ద కిటికీలు ఉన్నాయి. ఒకటి వాకిలి వైపు, మరొకటి పేరటి వైపు ఉన్నాయి. వాకిలి కిటికీ దగ్గర కుక్కి మంచం వేసి ఉంది

“ఆ కిటికీ దగ్గర పక్క పరచుకోండి. అన్నం వండుతున్నాను. తిని పడుకుందురు” అని చెప్పింది అవ్వ.

“మేం నీకేమయినా సహాయపడాలా, అవ్వా? ” మాట వరసకి అడిగాను.

“మీరు నా కొడుకుల్లాంటివారు. నేను వాళ్ళతో కూడా ఎప్పుడు ఏ సహాయం పొందలేదు. మీతో ఏం పనిచేయించనూ? అయినా ఒక్కపూటకి మీరు నాకేం సహాయపడ్తారులే? నేను ఒంటరిగానే మిగతా జీవితాన్ని గడపాలి” అని చెబుతుంటే

అవ్వ గొంతు వణకసాగింది.

మేమిద్దరం అవ్వ దగ్గరకు చేరుకున్నాం. స్టవ్ మేమే వెలిగించాం. పళ్ళాలు కూడా కడిగాం. కుతకుత ఉడికే అన్నం గంజి వాసన మా నోళ్ళలో నీళ్ళు ఊరించింది.

అవ్వ మా కోసం అన్నం రెండు పళ్లాల్లోకి వడ్డించింది. తను ఓ గుండ్రటి గిన్నెలో తినసాగింది.

“ఒకసారి మా పెద్ద కొడుకు వచ్చినపుడు రెండు పళ్ళాలు, రెండు గ్లాసులు తీసుకొచ్చాడు. నేనెప్పుడూ వీటిని వాడలేదు. నాకు ఈ గిన్నెలో తినడమే ఇష్టం. ఇంకా భగవంతుడు నన్ను ఎన్నాళ్ళు పరీక్షిస్తాడో, ఎప్పుడు తీసుకెళ్తాడాని ఎదురు చూస్తున్నాను”

తిన్న తర్వాత చాలాసేపటి వరకు ఆవిడ తన జీవితపుటలని తిరగేయసాగింది. ఆమె తన ఇల్లు కోల్‌కతాలో ఉందని, రోడ్డుప్రమాదంలో ఆవిడ భర్త దుర్మరణం చెంది పదేళ్ళయిందని చెప్పింది. ఆయన పెన్షన్‌తోనే జీవితాన్ని ఈడ్చుకొస్తోంది. కొడుకులు బతుకు తెరువుకు వలసపోయారు. మొదటి మూడేళ్ళు కొడుకులతోనే ఉంది. కోడళ్ళు వచ్చాక మెల్లమెల్లగా ఇంటి వాతావరణం మారసాగింది. దాంతో ఒకరోజు ఆమె హఠాత్తుగా కాశీ నగరంలో నివాసం ఏర్పాటు చేసుకోవాలని నిశ్చయించుకుంది. కొడుకులు తనను అడ్డుకుంటారని, ఎట్టి పరిస్థితిలోనూ కాశీలో తనను ఒంటరిగా ఉండనివ్వరేమోననుకుంది. అయితే అలాంటి అభ్యంతరం ఏదీ వాళ్ళ నుండి ఎదురవ్వలేదు. కొడుకులు సంతోషంగానే మూట ముల్లే సర్ది తల్లిని కాశీకి వెళ్ళే రైలు ఎక్కించి వచ్చారు. కోడళ్ళు పిల్లలకి హోంవర్క్ చేయించాలన్న నెపంతో ఇంటి దగ్గరే ఉండిపోయారు.

కొడుకులకు తెలుసు, అమ్మ కేవలం తన జీవితంలోని ఆటుపోట్లను మరిచిపోవడానికి, శేష జీవితాన్ని నిశ్చింతగా గడపడానికి కాకుండా.. కోడళ్ళతో పొసగక అశాంతికి గురికాకుండా ఉండడానికి ఆ నిర్ణయం తీసుకుందని. అందులోనూ కాశీ పుణ్యక్షేత్రంలో కన్నుమూస్తే నేరుగా స్వర్గానికి వెళ్తానని ఆమె అభిప్రాయం.

ఇక్కడికి వచ్చి ఏడేళ్ళు గడిచాయి. ప్రతి నెల వంతుల వారిగా, ఇద్దరు కొడుకులు ఆమెకు చేతి ఖర్చుల నిమిత్తం మనియార్డర్ పంపుతున్నారు. అంత ఎక్కువ కాదు, మరి తక్కువ కాకుండా, ఎంతో కొంత పంపుతూ ఉంటారు. మరి చేతినిండా డబ్బులు ఉండేలా పంపితే తల్లి ఆయువు ఎక్కడ పెరిగిపోతుందేమోనని కొడుకుల ఆలోచన కాబోలు.

మొదట్లో ఏడాది రెండేళ్ళకోసారి కొడుకులు చుట్టపు చూపులా వచ్చి పోయేవారు. రాను రాను వాళ్ళ బాధ్యతలు పెరుగుతున్నకొద్దీ తల్లి దగ్గరకు వెళ్ళాలన్న ఆలోచన కూడా చేయడం లేదు.

ఆమెక్కూడా ఇక్కడ ఒంటరితనం అలవాటయిపోయింది. కొడుకులు వాళ్ళవాళ్ళ పిల్లలు ఆమెకు తరుచు గుర్తుకు వస్తూంటారు. ఒకోసారి నిద్రలో ఉలిక్కిపడి లేచి, బయటికి వచ్చి ఆ చీకట్లో తడబడుతూ నడిచివెళ్ళి గంగానది తీరంలో కూచుండిపోతుంది. సూర్యోదయం వరకు నది తీరంలో ఉన్న మెట్లమీదే కూచుండిపోయి గలగల పారే గంగానది ధ్వని వింటూ ఉండిపోతుంది.

మూడేళ్ళుగా తల్లిని చూడ్డానికి ఎవరు రాలేదు. చివరిసారిగా చిన్నకొడుకు వచ్చినప్పుడు రెండు ఖాళీ పోస్టుకార్డులు ఇచ్చి వెళ్ళాడు. వాటి మీద ఇద్దరు అన్నదమ్ముల చిరునామాలు రాసి ఉన్నాయి. వెళ్తూ చెప్పాడట ‘చనిపోయేముందు వీటిని ఎవరి చేతనయినా పోస్టు చేయించు. ఇక నువ్వు లేవని మాకు అర్థమయిపోతుంది. అప్పట్నుంచి మేము మనీయార్డర్

పంపడం మానేస్తాం..'

"నేను ఆ పోస్టు కార్డులు జాగ్రత్తగా దాచిపెట్టాను. కన్ను మూసేముందు ఇరుగుపొరుగు ఎవరికైనా వాటిని అప్పగిస్తాను. నేను చావగానే వాటిని పోస్టు చేయమని చెబుతాను."

"ఎక్కడున్నాయి ఆ పోస్టుకార్డులు. మాకు చూపిస్తావా? "

మేం అడిగాం. తల దిండుకింద ఉన్న ఒక పుస్తకం పేజీల్లోంచి రెండు పోస్టుకార్డులు తీసి ఇచ్చింది అవ్వ. నల్ల సిరాతో వాటిపై కొడుకుల చిరునామా రాసి ఉంది. అప్పటికి అర్ధరాత్రి కావస్తోంది. పోలీసుల్ని తప్పించుకుంటూ దినమంతా పరుగు దీసినందున మాకు అలసటతో కాళ్లు బాగా లాగుతున్నాయి. ఆ అలుపుతో ఇప్పుడు కళ్లు మూతలు పడుతున్నాయి.

తెల్లవారుఝూమున ఐదుగంటలకు మాకు గభాల్న మేలుకువ వచ్చింది. లేచి కూచున్నాం. మంచమ్మద ముడ్చుకు పడుకున్న అవ్వకి ఊపిరి తీసుకోవడం కష్టమయి పోతోంది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఛాతీ ఎగిసి పడుతోంది. ఆయాసం తట్టుకోలేక లేచి కూర్చునే ప్రయత్నం చేస్తోంది.

ఆవిడ శరీరమంతా గజగజ వణుకుతోంది. మేం భయపడిపోయి అవ్వ తలదగ్గర మంచమ్మీద కూర్చుండిపోయాం. అవ్వ గుండె నొప్పితో విలవిలలాడిపోతూ, ఆయాసంగా వగర్చుతోంది. అతి కష్టంగా కళ్లు తెరిచి, గోముగా మా వంకా చూస్తూ చెప్పసాగింది "నాకు అంతిమ ఘడియలు వచ్చేసినట్టున్నాయి. మీరెవ్వరో నాకు తెలియదు. చివరి దశలో నా దగ్గరకు చేరారు నా బిడ్డల్లా. నన్ను మీరే కడతేర్చండి. మీరే తలకొరివి పెట్టండి.."

"అవ్వా! అంత మాటనకు. నీకేం కాదు. నిన్ను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తాం. నీ కొడుకుల్ని పిలిపిస్తాం."

"వద్దు బాబూ.. వాళ్లు వచ్చేదాక నా ఊపిరి ఆగదు. నన్ను కడదేర్చే తీరిక వాళ్ళకు లేదు. ఈ సమయంలో మిమ్మల్నే నా కొడుకుల్లా భావిస్తున్నాను. ఆ దేవుడు మిమ్మల్ని అందుకే నా దగ్గరకు చేర్చాడు... మీరే నన్ను కడదేర్చండి బాబూ, కాదనకండి... ఆ.. గుర్తుంచుకోండి, నా అంత్యక్రియల తర్వాత నా కొడుకులకి పోస్టుకార్డులు తప్పకుండా పంపండి. వాళ్ళ డబ్బు వృధా కాకుండా చూడండి. వాళ్ళ ఇబ్బందులు వాళ్ళకి ఉంటాయిగా, పిల్లల చదువులు, కుటుంబ బాధ్యతలు ఎప్పుడు ఉండే ఉంటాయిగా."

ఆవిడ గొంతుక పూడుకుపోతూ గద్గద స్వరంతో వణికిపోయింది. ఒక చెంబులో నీళ్ళు తీసుకొచ్చి పూడుకుపోతున్న అవ్వ గొంతులో కొన్ని నీటిచుక్కలు వదిలాం. నాలుక, పెదవులు తడిశాయి. ఆమె నీళ్ళు మింగుతుండగా వెక్కిళ్ళుపడి కొంత నీరు బయటికి వచ్చేసింది. ముడుతలు పడ్డ ఆమె చెంపల మీదుగా జారుతున్న నీటి బిందువుల్ని నా చేతులతో తుడిచాను. అవ్వ అంతిమ ఘడియలు నా ఒడిలో గడుస్తున్నాయి. మేం కళ్లప్పగించి చూస్తుండగానే అవ్వ కన్నుమూసింది.

మేం అవ్వ అంత్యక్రియలు 'సత్య హరిశ్చంద్ర ఘాట్'లో ఎంతో నిష్ఠగా నిర్వహించాం. ఆ తతంగం పూర్తయ్యేవరకు మేమెవరమో, మా పేర్లేమిటో కూడా మాకు గుర్తుకురాలేదు. జీవితంలో ఇంత నిష్ఠా నియమాలు ఎప్పుడు ఎక్కడా పాటిస్తామన్న నమ్మకమూ లేదు.

కాశీలో అవ్వ మరణం ఆమెకు స్వర్గం దారి చూపిందో లేదో నాకు తెలియదు. కానీ ఆ తెల్లవారు ఝూమున అవ్వ నా ఒళ్ళో కళ్లుమూస్తూ ఉంటే.. ఆ స్వర్గమే నా ఒళ్ళోకి దిగి వచ్చినట్టు, దేవదూతలే నన్ను స్పృశించినట్టు అనుభూతి కలిగింది.

ఇద్దిష్ కథ

-లియోనా కేంప్‌బెల్

ఎవరికి దొరికితే వారిది

అనువాదం : లిపి

నా ఇద్దరమ్మాయిలు మూడు, నాలుగు క్లాసుల్లోకి వచ్చాక .. నేను వాళ్ళని ఎప్పుడైనా వాతావరణం బావుంటే.. ఇంటినించి స్కూలుకి, స్కూలునించి ఇంటికి నడవడానికి అనుమతిస్తున్నాను. తక్కువ దూరం కాబట్టి వారికి శ్రమ ఉండదు. మా ఏరియా కూడా సేఫ్.

ఓ వెచ్చని శీతకాలం ఉదయం స్కూలు నించి వారిద్దరూ నడిచి వస్తుంటే, ఓ మిత్రుడు వాళ్ళని అనుసరించి వచ్చాడు. వారు మా ఇంటికి తీసుకువచ్చిన ఇతర మిత్రులకన్నా ఈ 'మిత్రుడు' వేరు. నేను చూసిన అతి అందమైన కుక్కపిల్ల అది! బూడిద రంగులో, పొట్టిగా, విశాలమైన చెవులతో ఉన్న అది నన్ను చూసి తోకాడించింది.

"ఎవరిది ఇది? " అడిగాను.

"తెలీదమ్మా. దారిలో కనిపించింది. మా వెంట వస్తూంటే వద్దని ఎలా చెప్తాం? దానికి ఇష్టమయ్యేగా వచ్చింది" ఇద్దరూ సమర్ధించుకున్నారు.

"బావుంది కదమ్మా? " అడిగింది మొదటిది.

"బావుంది" ఒప్పుకున్నాను.

"మనం ఉంచేసుకుందామమ్మా" రెండోది కోరింది.

"ఇది ఎవరిదో వాళ్ళొచ్చి అడిగితే? " ప్రశ్నించాను.

"అప్పటిదాకా మనతో ఉంచుకుందాం" ప్రతిపాదించారు ఇద్దరూ.

సాయంత్రం ఆఫీసునించి మావారు ఇంటికి వచ్చాక పెద్దమ్మాయి దాన్ని ఆయనకి పరిచయం చేసింది. మావారు దాన్ని పరిశీలనగా చూసి నాతో చెప్పారు. "ఇది బీగిల్ జాతికి చెందిన పిల్ల. దీని వయసు పది-పన్నెండు వారాలు ఉండచ్చు."

అది మా వారిని ఇష్టపడింది. ఆ రాత్రి భోజనం అయ్యాక మా వారు ఎప్పటిలా సోఫాలో కూర్చుని టి.వి. చూస్తూంటే, అది నిర్భయంగా వెళ్ళి ఆయన ఒళ్ళో కూర్చుంది. అప్పటికే అది మా ఇద్దరు పిల్లలకి కూడా మాలిమి అయింది.

